సత్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ

మహారాష్ట్ర జీవనప్రభాతము

కాకినాడ, 1927.

Record no. 85

Satyanārāyaṇamūrti, Jonnalagaḍḍa

Mahārāṣṭra jīvanaprabhātamu

Kākināḍa, 1927.

Record no. 85


Bibliographic Record Target

సత్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ
మహారాష్ట్ర జీవనప్రభాతము (1, 2 భాగములు) / జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారిచే రచియింపబడినది. - కాకినాడ : స్కేప్ అండ్ కో., ముద్రాక్షరశాల, 1927.
4, 2, 2, 288 p. ; 19 cm.
Record no. 85

Satyanārāyaṇamūrti, Jonnalagaḍḍa
Mahārāṣṭra jīvanaprabhātamu (1, 2 bhāgamulu) / Jonnalagaḍḍa Satyanārāyaṇamūrti gāricē raciyimpabaḍinadi. - Kākināḍa : Skēp aṃḍ kō., Mudrākṣaraśāla, 1927.
4, 2, 2, 288 p. ; 19 cm.
Record no. 85

మహారాష్ట్ర జీవన
ప్రభాతము

జొన్నలగడ్డసత్యనారాయణ
మూర్తి



సరస్వతీగ్రంథమాల, కాకరపర్తి. 12, 13 పుష్పము.
సంపాదకుడు.
కాకరపర్తి సత్యనారాయణ.

మహారాష్ట్ర జీవన ప్రభాతము.

1, 2, భాగములు.

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారిచే
రచియింపఁబడి

సరస్వతీగ్రంథమాలవారిచేఁ
బ్రచురింపఁబడియె.

కాకినాడ;
స్కేప్ అండ్ కో., ముద్రాశాలలో
కె. సుబ్బారాయసోదరులచే ముద్రింపఁబడియె.

1927.

ఫ్రైటు. వెల 1—0—0.

మహారాజపోషకులు

1 మ,, రా,, రా,, శ్రీశ్రీ రాజా వెంకటాద్రియయ్య అప్పారావు బహదర్ జమీందార్ వారు మీర్జాపురం ఎస్టేట్సు నూజవీడు,

2 మ,, రా,,రా, శ్రీశ్రీరాజా వెంకటాద్రి అప్పారావుబహాదర్ జమీందారువారు, వుయ్యూరు ఎస్టేట్సు నూజవీడు.

3 మ,, రా,, రా,, శ్రీశ్రీ కర్రి చినవెంకటరెడ్డిగారు. రంగూన్ జనరల్ మర్చంటు అండు కమీషన్ ఏజంటు కాకినాడ.

4 మ,, రా,, రా,, శ్రీశ్రీ సత్తి వెంకయ్యగారి కుమారుళ్ళు కామిరెడ్డిగారు మారిటేరు.

రాజపోషకులు

—:o:—

1 " శ్రీరాజా బొమ్మదేవర సత్యనారాయణవరప్రసాద్ బహాదర్ జమీందారువారు ఆఫ్ సౌత్ వల్లూరు,

2 " శ్రీజంపన సుబ్బరాజుగారు ప్రొప్రైటర్ చినఎండ్రికొలనుఖండవల్లి,

3 " శ్రీపెనుమెత్స సీతారామరాజుగారు ల్యాండులార్డు ఆలమూరు.

4 " శ్రీమత్ తిరుమల వెంకట శ్రీనివాసాచార్యులుఅయ్యవార్లంగారు సీనియర్ ప్రొప్రైటర్ పెంటపాడు.

5 " శ్రీమత్ కిలాంబి శ్రీనివాస వెంకట వరదాచార్యులయ్యవార్లంగారుసీనియర్ ప్రొప్రైటర్ లింగాల అగ్రహారం పెంటపాడు.

6 " శ్రీమత్ యం. యస్. అవతారంగారు ల్యాండులార్డు పెంటపాడు.

7 " శ్రీపెనుమెత్స సీతారామరాజుగారు ల్యాండులార్డు అజ్జరం.

8 మ॥ రా॥ రా॥ శ్రీ కొమ్ము కిరీటిగారు ల్యాండులార్డు ఏలూరు.
9 " శ్రీ భారతం సూర్యనారాయణగారు. ఎల్. ఎమ్. పి. ఖండవల్లి.
10" శ్రీ ఆనిమిళ్ళ చినవెంకటశాస్త్రిగారు. ల్యాండులార్డు కాకరపఱ్ఱు.
11 " శ్రీ కోనాల బ్రహ్మన్నగారు ల్యాండులార్డు పెనుగొండ,
12 " శ్రీ నందికోళ్ళ గోపాలరావుగారు, కాకినాడ
13 " శ్రీ పినిశెట్టి లక్ష్మణస్వామినాయుడుగారు మేనేజింగు ప్రొప్రైటర్. మారుతీ సినీమా పాలకొల్లు.
14 " శ్రీ సముద్రాల చెంచయ్య అండ్ సన్సువారు. జనరల్ మర్చంట్సు పాలకొల్లు.
15 " శ్రీ ఓసూరి నారాయణస్వామిగారు జనరల్ మర్చంట్సు నర్సాపురం
16 " శ్రీ కానుమిల్లి సర్వారాయుడుగారు తాలూకాబోర్డు ప్రెసిడెంటు కొవ్వూరు.
17 " శ్రీ అల్లూరి చినసత్యనారాయణరాజుగారు. అప్పనపల్లి

పోషకులు

1 " శ్రీ వేపా కామేశంపంతులుగారు తహసిల్ దారు, చింతలపూడి
2 " శ్రీ మోతే గంగరాజుగారు. } విస్సన్నపేట
3 " మోతే నారాయణరావుగారు } గుండేపల్లి
4 " మోతే నరసింహారావుగారు. } జమీందార్లు-ఏలూరు
5 " మోతే కృష్ణారావుగారు. }
6 " గుడిమెట్ల వీరారెడ్డిగారు. మర్చంటు మార్టేరు.
7 " గుత్తా వెంకయ్య చౌదరిగారు. మేనేజింగు ప్రొప్రైటర్ శ్రీ పాండురంగ సినీమా. ఏలూరు.
8 " శ్రీ డాక్టరు కోకా అహోబలరావుగారు మసూలా.

9 మ॥ రా॥ రా॥ చింతా చినసోమిరెడ్డిగారు ల్యాండులార్డు, మార్టేరు
10 " జవ్వాది వెంకయ్యగారి కుమాళ్ళు లక్ష్మయ్యగారు. యూనియన్ బోర్డు ప్రెసిడెంటు పెనుగొండ
11 " తాడిమేటి విశ్వనాథంగారు. డాక్టరు పెనుగొండ
12 " సి. హెచ్. వెంకటసుబ్బారెడ్డిగారు మార్టేరు
13 " మునమర్తి శోభనాద్రిగారు. మర్చంటు ఆచంట
14 " చిర్ల సుబ్బిరెడ్డిగారు. మునసబు మార్టేరు
15 " మానెం కృష్ణమూర్తిగారు, పెనుగొండ
16 " పెన్మెత్స రాజగోపాలరాజుగారు ల్యాండులార్డు అజ్జరం
17 " కాకర్ల సత్యబ్రహ్మానందరావుగారు. నర్సాపురం
18 " యర్రా చినరామయ్యగారి కుమాళ్ళు వీరరాఘవరావుగారు ల్యాండులార్డు ఉప్పులూరు
19 " కలిదిండి వెంకట్రామరాజుగారు. ల్యాండులార్డు శృంగవృక్షం
20 " కొచ్చెర్లకోట వెంకటాద్రయ్యగారు. ల్యాండులార్డు కలవలపల్లి
21 " చుండూరి పానకాలరావుగారు మర్చంట్సు పాలకొల్లు
22 " రేపాక సత్యనారాయణగారు. మర్చంటు. పాలకొల్లు
23 " కొల్లేపర మాణిక్యంగారు, జనరల్ మర్చంట్సు రాపాక
24 " కొవ్వూరి భాస్కరరెడ్డిగారు. ప్రొప్రైటర్ రైస్‌మిల్లు. నిడదవోలు
25 " వి. వి. నారాయణమూర్తిగారు సిద్ధాంతం
26 " కలిదిండి వెంకట్రాజుగారు ల్యాండులార్డు వెదురేశ్వరం
27 " వనారస గోవిందరావుగారు. మేనేజర్ సురభికంపెని పోలసానపల్లి
28 " కాకరపర్తి సుబ్బారావుగారు. కమీషన్ ఏజంటు తీపర్రు
29 " పేరాబత్తుల నాగన్నగారు అంబాజీపేట

30 మా॥రా॥రా॥ చిట్టూరి ఇంద్రయ్యగారు, ప్లీడరు. నర్సాపురం
31 " గుడిమెట్ల వెంకటరెడ్డిగారు. ల్యాండులార్డు వెలగలేరు
32 " చిర్ల జగ్గిరెడ్డిగారు. మేనేజర్ రైస్‌మిల్లు మార్టేరు
33 " కాశవరపు వెంకటచలంపంతులుగారు తహసిల్‌దారు పెంటపాడు

సహాయులు:

1 " నల్లపరాజు వెంకట్రాజుగారు ప్రెసిడెంటు పంచాయితీకోర్టు శృంగవృక్షం
2 " మద్దిర లక్ష్మీనరసింహంగారు క్లార్కు-సబ్‌రిజిష్ట్రార్సు ఆఫీసు ఉండి
3 " కోడూరి సూర్రాజుగారు క్లాత్ మర్చంట్సు పెనుగొండ
4 " వరదా పైడన్నగారు గోల్డు స్మిత్ పెనుగొండ
5 " వై. సన్యాసిరాజుగారు సాల్ట్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం
6 " మన్నే సత్యనారాయణ మూర్తిగారు ల్యాండులార్డు కోడమంచిలి
7 " కొండూరి నారాయణరావుగారు మర్చంటు. ఏలూరు
8 " భోగవల్లి సీతన్నగారు. తీపర్రు
9 " టి. జి. బంగారుస్వామి సెట్టిగారు. రాజమండ్రి
10 " కఠానేని సూరయ్యశాస్త్రిగారు, వెలగదుర్రు,
11 " తాడి వెంకటస్వామిగారు. ల్యాండులార్డు పెనుగొండ
12 " ఎల్లైన సత్యనారాయణరావుగారు. సబ్‌రిజిస్ట్రారు. పాలకొల్లు
13 " జి. నాగభూషణంగారు. సబ్‌రిజిస్ట్రారు. నర్సాపురం
14 " కొల్లూరి సత్యనారాయణగారు. ల్యాండులార్డు పల్లంకుర్రు
15 " చేకూరి జగన్నాధరాజుగారు. నిడదవోలు

The Dawn of Maharatta Life.

Of all the cart-loads of Indian Histories that, with their letters of molten gold, invite the curiosity of the reader, very few, written with a clear perception and genuine appreciation of the lofty ideals that as so many beacon lights led the heroes of India into the demesne of glory, appear—A certain class of Historians, professing pretentions to consummate knowledge of India's past, did not demur to transcend the purlieus of decorum and decency and go the length of painting the lives of the great with sable and sombre hues. Forsooth those chroniclers took immense pains to escort Sivaji among the rugged declivities and majestic peaks of the Western Ghats as into the sweet-meat basket, that had a romantic escape from the coils of Moghal autocracy, but they could not pursuade themselves to sound the depths of that heroe's greatness. Suraj Doula was another who shared the fate of Sivaji.

Put a question to the average school boy—"Who was Sivaji". Immediately comes the—answer, "Why, he was a mountain rat." No comment is necessary upon this remark. But any person, not dead to feelings of self-respect and not demurring to claim himself to be the country-man of Sivajee cannot help expressing his indignation against him that vouchsafed the designation of **Mountain-rat** to the **Lion** among all. It is an insult not only to the great hero, but to the whole nation.

This unpardonable travesty of historical perception appears, when a non-Indian comes forward to teach the Indians the history of their Country——But "the old order changeth yielding place to new." The Indian people now began to—as the current of nationalism gradually surges into their house—hold—probe deep into what appears to be the 'All about India'—It is a relief to learn that educated India, opening its eyes to the mischief wrought by concoction, has been taking pains to do historical research and to give genuine account of the greatness of the East.

Romes Chandra Dutt, an eminent Historian and distinguished educationist of Bengal, was the original author of this great book. With his remarkable insight into truth, Mr. Dutt showed the hero that was in Sivajee and knocked down the hideous ideas entertained about the movements of that great Maharata Readers of this book will not fail to comprehend that the character of Sivajee was absolutely unimpeachable; that the end of his life was not bliss or self-aggrandisement; and that, fortified in the impregnable citadel of his will, he raised, being the child of freedom, the worshipper of the cow, the Brahmin and the chastity of woman, and being one that sought to translate into action the idealism which, the deep cogitations of the soul-entrancing panoramic view of India's past replenished his mind with, the cudgel against Moghal imperialism and dashed to ground the hopes of the xerxes of India.

Long residence in Bengal rendered my humble self an adept in the language of that Province of idealism. Cognizant as I was of all the humiliation heaped by apocryphal writers upon the fair name of Sivajee, I undertook with ardour and alacrity to interpret Mr. R. C Dutt, whose name the Andhra world heard already, taking the latitude of incorporating into the book necessary modifications, with the sanguine belief that the rising generation will be inoculated with the dynamic and idealism of Sivaji even as Sivaji' was inoculated with the idealism and dynamic of the great heroes of Indian Epics.

To boot the succession of historic scenes strung together, the book abounds in details connected with the hymenial knot of Raghunathjee and speaks eloquently of the immaculate and sacrosanct chastity of Indian womanhood embodied in Lakshmi Bai.

In conclusion, I thank the learned Editor for publishing my historical work and thus enriching the literary field.

Calcutta,
3-2-1927.

J. SATYANARAYANA MURTY,
64 Rutton Sircar Garden Street,
Bara Bazaar, P. O. CALCUTTA.

పీఠిక.

భారతేతిహాసములను లిఖించిన భారతేతరులందనేకులకు భారతప్రాచీనౌన్నత్యము హృదయశూలమైయుండెను. భారతశూరులలో ననేకులీ యితిహాసలేఖకులవలనఁ బెక్కుతెఱంగుల దూషింపఁబడిరి. వారలలో శివాజీయొక్కఁడు. భారతస్వాతంత్ర్యమును, గోబ్రాహ్మణారాధనంబును నారీపూజయు శైశవమాదిగ నేమహాత్ముని మహదుద్దేశ్యములై యుండెనో, పాలనాపయోధిపుం దేవ్రిపిముల ప్రతిభావంతుని ధ్రువతారగా నెంచుకొని పల్వురుతేఁడులు తమశాసనపత్రణిని నడపుకొనిరో, యేమహనీయగుణగరిష్ఠుని పవిత్రనామము వినినంతనే ప్రతిభారతీయుండును, ముఖ్యముగఁ బ్రతిమహారాష్ట్రుండును భక్తిరసపూర్ణహృదయుకరంబుఁడగునో, యేమహాత్ముని ప్రతిమ నేఁడు మహారాష్ట్రభూమిం గల ప్రతిమందిరమందజస్రమారాధింపఁబడుచుండెనో, ఆయుశస్త్రిలకుఁ డాభవానీభక్తుఁ డాభారతమాతృగర్భసంజాతుఁడు శ్రీశివాజీదేవుండు శ్వేతచరిత్రకారులవలన శైలమూషికమను బిరుదమును బడసెను. రిపుల విపులచమూస్తోమములఁ దారుకొనునవసరమునఁ గుధరపార్శ్వములందును, యుపత్యకతలములందును అపూర్వసామరికప్రథఁ జూపినను, పౌరుసంబాతఁడు మ్రొచ్చనియు, చరియలందుఁగల బొరియలలోఁ జరియించు చోరనాయకుండనియు మనమూతని వచింపరాదు.

పైనుదహరించిన విధంబున మహాత్ముండగు శివాజీ పవిత్రనామధేయంబునకుఁ గళంకము నాపాదింపదొరకొను దొరల దురూక్తిమహీధ్రమును ఛేదింపఁగడంగు వజ్రాయుధమోయన మహారాష్ట్రజీవనప్రభాతమను యుద్గ్రంథమును లిఖించి, భారతచరిత్రకారులలో నగ్రగణ్యుండగు శ్రీరమేశచంద్రదత్తు యుత్తరహిందూస్థానమందనర్ఘమగు కీర్తిని సంపాదించెను. ఆంధ్రులకుఁగూడ నీపొత్తము భృశంబు ప్రయోజనకారిగా నైయుండునని విశ్వసించి యీగ్రంథమును బ్రచురించినాఁ

డు. వీరపూజాధురంధరుఁడగు ప్రతిభారతీయుఁడును, నీయుద్గ్రంథమును జదివి శివాజీచాటిన స్వాతంత్ర్యమహామంత్రము నశ్రాంతముజపియించి రఘునాథజీ ప్రియంవదల పవిత్రప్రణయంబును, లక్ష్మీభాయి చంద్రారావుల ప్రవిమలానురాగమును, రఘునాథజీ,లక్ష్మీభయిల నిరుపమానస్నేహంబు ననుకరించి యనూనంబగు మేలు నందుదురుగాక.

ఈపుస్తకమును రచించి మాగ్రంథమాలకొసంగి భాషాభివృద్ధికై తోడ్పడిన శ్రీయుత జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తికి కృతజ్ఞతా పూర్వకముగ వందనంబు లాచరించుచున్నవాఁడ.

ఇట్లు,
సంపాదకుఁడు.

ఉపోద్ఘాతము

):o:(

ఈగ్రంథ మాంధ్రులకుఁ గడునుపయుక్తముగ నుండునని దలంచి యయిదేండ్లకుఁబూర్వమే నాకొలంది కొలఁది దీనినాంధ్రీకరించినాఁడ. కాని కొన్నిచిక్కులకతన దీనినింతవఱకు ముద్రణాయంత్రమున నధిరోహింపఁజేయఁజాలనైతిని. ఈపుస్తకము ముద్రణాభారమును దమపైఁ బూర్తిగవహించి, దీనిని తమ గ్రంథమాలయందొక సుమముగఁజేకొనిన భాషాభిమానులగు సుహృద్వరులు శ్రీయుత కాకరపర్తి సత్యనారాయణగారికి సదాకృతజ్ఞుండనై యుందును.

ఇట్లు విన్నవించు
విద్వజ్జన విధేయుఁడు
జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

కలకత్తా
11—10—26

మహారాష్ట్ర జీవన ప్రభాతము.

మొదటి ప్రకరణము

జీవనయూష.

క్రీస్తు శకము పదవశతాబ్దానంతరమున మహమ్మదు ఘోరి ఆర్యావర్తప్రదేశమును స్వాధీనపఱచుకొనెను. బలశాలియైన యాతని యధికారమున ముసల్మానులందఱు విపులధనసంపన్నులై యొకశతాబ్దమువఱకు స్థిరముగనుండిరి ; వింధ్యాచలనర్మదానదములను విశాలప్రాచీనపరిఖలనతిక్రమించి దక్షిణసీమను జయింప వారలేమియుద్యమము సలుపలేదు. కాని పదమూడవ శతాబ్దావశేషమున ఢిల్లీనగరమున యువరాజైయుండినఅలావుద్దీను ఖిల్జీ యెనిమిదివేలసైనికులఁగొని నర్మదానదమునతిక్రమించి హిందూ రాజధానియైన దేవగరనగరమును సమీపించెను. దేవగరరాజపుత్రు లనేకవాహినులఁగూడి యలావుద్దీను నాక్రమించిరిగాని తత్సమయమున జరిగిన తుములసంగ్రామమందు హిందూసేనలన్ని యునీగిపోయెను. దానిం జేసి హిందూ రాజినుపురసహితముగ మిక్కుటముగధనమును ముసల్మానుల కొసఁగి సంధిగావించుకొనియెను. తదనంతరమున నలావుద్దీను ఢిల్లీసామ్రాజ్యాధిపతి కాగనే యతనిసేనానియగు మాలికాఫరు ముమ్మారు దక్షిణదేశమునకు దాడివెడలి నర్మదాతీర కన్యాకుమారి యగ్రమధ్యస్థప్రదేశములఁదనయిచ్ఛవచ్చిన తెఱఁగునఁగొల్లఁగొట్టెను. అది మొదలు దేవగరనగరము మొదలైన హిందూపురపతులందఱు ఢిల్లీశ్వరునకుఁ బూర్తిగ లొంగియుండిరి.

పదునాలుఁగవ శతాబ్దమున మహమ్మదుటోగ్లకు ఢిల్లీ రాజ్యాభర్తయై రాజధానిని ఢిల్లీనుండి దేవగరమునకుఁ బరివర్తన మొనర్ప జతనము సలిపి, తనయభీష్టమును నెఱవేర్చుకొని దేవగరనామమును మార్చి తత్పురమునకు దౌలతాబాదను పేరొసంగెను. కాని దక్షిణసీమయందలి హిందూముసల్మానులందఱు విరక్తులై నృపునకు ప్రతికక్షులుగ నుండి విరుద్ధాచరణముల సలుపుచుండిరి. హిందువులందఱు విజయనగరమున నూతనరాజధానిని స్థాపించి యొకవిశాలసామ్రాజ్యమును బ్రతిష్ఠించుకొనిరి. అటులనే ముసల్మానులందఱు దౌలతాబాదునందు స్వతంత్రమహమ్మదీయరాజ్యమును స్థాపించుకొనిరి. కాలక్రమమున, విజయనగరదౌలతాబాదులు దక్షిణసీమాభ్యంతరమున రెండు ప్రధానరాజ్యములై నిలచెను. రమారమి మూఁడుసంవత్సరములవఱకు ఢిల్లీపతులేరును దక్షిణదేశమును హస్తగత మొనరించుకొనుటకేమియు జతనముల నొనర్పలేదు.

కాని ఢిల్లీ యుపద్రవమునుండి విముక్తులైనను, దక్షిణమున హిందువులు విపదశూన్యులు కాలేదు. హిందువులు తమగృహమధ్యమున దౌలతాబాదు స్వరూపమున నున్న ముసల్మానుతేనికి స్థానమొసంగిరి. ఆసమయమున హిందువులు జాతీయజీవనము క్షీణమై యవనతిశీలమైయుండెను. విజయులైన ముసల్మాను లున్నతస్థితియందుండిరి. దానింజేసి వారలన్యోన్యధ్వంససాధనములఁ గావింపఁదలఁచుచుండిరి. కాలక్రమమున దౌలతాబాదురాజ్యము విస్తీర్ణమై పిదప నైదు ఖండములుగ విభక్తమయ్యెను. అందుచే గోలుకొండ, విజయపురము, అహమ్మదునగరము లనుమూఁడుముసల్మానురాజ్యములు దక్షిణమున నేర్పడెను. పిదప ముసల్మానులందఱేకస్థులై క్రీస్తుశకము 1564వ సంవత్సరమున తాళికోటయుద్ధమున విజయనగరపతి నపజయముఁగావించి హిందూరాజ్యమును స్వాధీనపఱచుకొనిరి. ఈవిధముగ దక్షిణసీమయందు

హిందూస్వాధీనత విలుప్తమయ్యెను. విజయపురము, గోలుకొండ, అహమ్మదునగరములు మూఁడును యప్పటినుండియు దక్షిణమున ప్రబలమైయుండెను. కర్నాట ద్రావిడరాష్ట్రాధిపతులుకూడ క్రమక్రమముగ విజయపుర గోలుకొండల యధీనత స్వీకరించుకొనిరి.

క్రీస్తుశకము 1590 సంవత్సరమున అక్బరుచక్రవర్తి దక్షిణసీమను మరల ఢిల్లీసామ్రాజ్యాధీనముఁ జేయయత్నించెను. దానింజేసి యతఁడు మృతినొందుటకుఁ బూర్వమట్టి యాశయము చాలవఱకు ఫలించెను. అహమ్మదునగరరాజ్యమందలి యధికాంశము ఢిల్లీ సైన్యహస్తగతమాయెను. పిమ్మట నతని పౌత్రుఁడైన షాజహాను 1636 సంవత్సరమున అహమ్మదు రాజ్యమునంతను దనయధీనముఁ గావించుకొనెను. అందుచే మనయాఖ్యాయికావివృతకాలమునకు విజయపుర గోలుకొండ రాష్ట్రములు రెండును మాత్రమే పరాక్రాంత స్వాధీనముసల్మానురాజ్యములై యుండెను.

ఈ రాజ్యవిప్లవములనడుమ మహారాష్ట్రుల యవస్థ యెటులున్నదో మనమెఱుంగవలయును. ముసల్మానురాష్ట్రములైన అహమ్మదునగరము విజయపురము గోలుకొండ నగరముల యధీనమున నున్న హిందువులస్థితి యోగ్యముగనే యుండెను. ముసల్మానుల దేశశాసనకార్యములు చాలవఱకు మహారాష్ట్రుల బుద్ధిబలమూలముగనే పరిచలితములగుచుండెను. రాజ్యసీమయంతయు బరగణములుగ విభజింపఁబడెను. విభక్తప్రదేశములందు గదాచిత్కముగ ముసల్మాను శాసనకర్తలు నియుక్తులగుచుందురు. కాని పెక్కుసమయములందు మహారాష్ట్రీయకర్మచారులే గప్పములఁగొనుచు విశేషాధికారమును బొందియుండిరి. మహారాష్ట్రదేశము పర్వతసంకులమై యుండెను. శైలశిఖరములందనేకములైన దుర్గములు నిర్మింపఁబడెను. ముసల్మాను సుల్తానులా పర్వతదుర్గములను మహారాష్ట్రుల హస్తగతముఁగావింప సంకుచితులుగాకుం

డిరి. అంతియగాక మహారాష్ట్రీయ "కిల్లాదారులు" కడాచిత్కముగ జాగీరులను బొందుచు విశేషాదాయములఁ గొనుచు దుర్గరక్షణార్థమై యావశ్యకీయవ్యయముల నెలుపుచుండిరి. ఈ "కిల్లాదారులే" గాక యనేక హిందువులు "మన్సవదారులుగ" నియోజితులై శతమాది సహస్రమున కెక్కుడుగన శ్వదళపతులై యుద్ధసమయములందు బోరుసలుప సంసిద్ధులైయుండిరి. సైన్యవేతనముకొఱకును అవశ్యకీయవ్యయములకొఱకును వారలుకూడ తగుమాత్రపు జాగీరులీయఁబడిరి.

విజయపురసుల్తాను అధీనమున చంద్రరావనునతఁడు ద్వాదశసహస్రపదాతులకు సేనాపతిగనుండెను. సుల్తాను యాదేశానుసారముగ నతఁడు నీరావర్ణానదులమధ్యప్రదేశములనన్నింటిని సామ్రాజ్యాధీనముఁగావించెను. సుల్తానుపరితుష్టుఁడై యాప్రదేశములందు గొన్నిటిమాత్రము తనస్వాధీనమందుంచుకొని మిగిలినవానిని చంద్రరావునకు జాగీరులుగ నొసంగెను. అంతియుఁగాక చంద్రరావు సంతానసంతతియందు సమస్తపురుషపర్యంత మావిశాల జాగీరులను స్వచ్ఛందముగ ననుభవించునట్లుతఁడొక శాసనమును లిఖించి యతనికొసఁగెను. ఈవిధముగ నారావువంశస్థులు పురుషానుక్రమముగ ఫల్తన్ దేశమున కధిపతులై ప్రజాపాలన మొనరించుచుండిరి. ఇట్టి కఠినప్రదేశమందీశిలాసంకులసీమయందు భిన్నభిన్నపరాక్రాంత మహారాష్ట్రీయవంశజులు వసించుచుండిరి, వారలచట పురుషానుక్రమముగ విజయపురసుల్తానుని కార్యసాధనములఁ గావించుచు సమయసమయములందుఁ దమలోఁదాము తుముల సంగ్రామములు గావించుకొనుచుండిరి. జ్ఞాతివిరోధముపగిది విరోధము మరియొకటిలేదు. దానంజేసి పర్వతసంకుల కంకణమహారాష్ట్ర సర్వస్థానములందు సమస్తకాలములందు వసించుచు యున్నతవంశజుల నడుమ నాత్మవిరోధములు గన్పట్టుచుండెను. విశేషముగ శోణితపాతములైనను నాప్రదేశములు కులక్షణములుగాక సులక్షణములైయే

యుండెను. పరిచాలనమువలన మనశరీరములెట్లు సంబద్ధములై దృఢీకృతములగునో, కార్యోపద్రవవిపర్యలవలన జాతీయబలజీవనములట్లే రక్షితములై పరిపుష్టములుగనుండును. ఈతీరుగ మహారాష్ట్రీయజీవన యుపారశక్తిమయచ్చట శివాజీమహావీరుని యావిర్భావమునకు బహువత్సరములపూర్వమే భారతాకాశమును రంజితముఁ గావించెను.

అహమ్మదునగరసుల్తాను యధీనమున యాదవరావు భోంసులాలను యిరువురు మహారాష్ట్రవంశజులుండిరి. పశ్చిమప్రదేశమున యాదవరావుజ్ఞాతులవగిది పరాక్రాంత మహారాష్ట్రవంశజులు మఱేరునులేరు. వివేచనమొనరించి చూచినచో దేవగరమందలి ప్రాచీనహిందూవంశమునుండియె యాదవరావువంశము సముద్భూతమైయుండెనని యెఱుఁగకపోము. భోంసులావంశము యాదవరావు సంతతిభాతి యున్నతముగాకున్నను మహారాష్ట్రమందు జాలవఱకు ప్రధానమై బలసంపన్నమై యుండెననుటకేమియు సందియములేదు. యాదవరావువంశమునుండి శివాజీమాతయు భోంసులాసంతతినుండి యతనిపితయు సముద్భూతులైరని మాత్రము మేమీసందర్భమున మాపాఠకులకుఁ దెలుపవలయును.

రెండవ ప్రకరణము.

రఘునాథజీయోధుఁడు.

కంకణప్రదేశమున సాధారణముగ వర్షకాలమందలి ప్రకృతి భీషణరూపమును దాల్చియుండును. 1768 సంవత్సరమున వసంతకాలమున నొకనాఁటి సంధ్యాసమయమున నట్టిఘోరదృష్టి గన్పట్టెను. దినకరుఁడింకను యస్తమింపలేదు. కాని యాకసమంతయు దీర్ఘవిలంబితకృష్ణమేఘరాశిచే నావృతమైయుండెను. నలుకెలంకులందును పర్వత

శ్రేణులును గహనసీమలును నిబిడాంధకారాచ్ఛన్నములై యుండెను. శైలకాననసీమలందుగాని భూనభోంతరాళములందుగాని శబ్దమేమియు లేదు. అచిరకాలములోఁ బ్రచండవాతాహతితాడితమగుదునని యెఱిఁగియే కాఁబోలు జగమంతయు భయముచే స్తబ్ధమై యుండెను. నికటస్థ పర్వతోపరిభాగములందలి పథములొకించుక గన్పట్టుచుండెను. దూరస్థవిశాలపాదపావృత పర్వతములు కృష్ణవర్ణముఁ జాల్చెను. అధోభాగమందలి కొండలోయ లంధకారాచ్ఛన్నములై యుండెను, గిరిపార్శ్వములనుండి ప్రవహించు జలధారలొక్కచో రౌప్యగుచ్ఛములవలెఁ గన్పట్టుచు మఱొక్కచో నంధకారమున లీనములై శబ్దమాత్రముననే తమయునికినిఁ దెలుపుచుండెను.

ఆపర్వతోపరిభాగమునుండి యొక యాశ్వికుఁడు వడివడిగఁ దనహయమును నడపించుచుఁ బోవుచుండెను. తురగముయొక్క కాయమంతయు ఫేనపూర్ణమై ఘర్మసిక్తమై యుండెను. అశ్వారోహకుని వేషమంతయు కర్దమమయమై యుండెను. చూచినమాత్రమున నతఁడు చాలదూరమునుండి వచ్చుచుండెనని తోచకమానదు. అతని దక్షిణహస్తమున నిడివియైన కోదండమును, స్కంధభాగమున నమ్ములపొదియు, వామకరమున డాలును, కటిప్రదేశమున దీర్ఘనిశితకరవాలమును విరాజిల్లుచుండెను. ఆతనివేషము లతఁడు క్షత్రియకులసంజాతుఁడనియు, రాజస్థానవాసి యనియుఁ దెలుపకనే తెలుపుచున్నవి. ఆశ్వికుని వయసు పదునెనిమిదేండ్లుండును. అవయవములున్నతములై గౌరవర్ణము గలిగియుండెను. కాని పరిశ్రమవల్లను రౌద్రోత్తాపమువలనను యీవయసునందే యతని ముఖమండలమందలి యుజ్జ్వలవర్ణ మొకించుక కృష్ణవర్ణమై యుండెను. శరీరము సుబద్ధముగను దృఢీకృతముగను, లలాటమున్నతముగను, చక్షుర్ద్వయము జ్యోతిఃపూర్ణముగను నుండెను. ముఖమండలమౌదార్యవ్యంజకమై యతిశయ తేజఃపూర్ణమై యుండెను. ఘోటకమున కొకించుక

విశ్రమమొసఁగుటకై యువకుఁడు భూమిపై లంఘించి కోదండము నొక పాదముపైనుంచి యమ్ములపొదిని వృక్షశాఖకు వ్రేలాడఁజేసి కరద్వయముచే లలాటమందలి ఘర్మబిందువులను మోచనముఁ గావించి దననిబిడకృష్ణకేశగుచ్ఛమును వెనుకకు సవరించి క్షణకాల మంబర దిక్కుగ నిరీక్షింపసాగెను.

ఆకసముయొక్క యాకృతి యతిభయానకమై యుండెను. అచిరకాలములోఁ దుముల మారుతము వీచుననుట కేమియు శంక లేదు. మందమంద వాయువు వీవఁదొడంగెను. అనంతపర్వతపాదపశ్రేణులనుండి గభీరశబ్ద ముత్పన్నమయ్యెను. ఒకించుక సేపటిలో మేఘగర్జనము వినవచ్చెను. యువకుని యోష్ఠముపై నొకటి రెండు వర్షబిందువులు పతితమయ్యెను. ఇపుడు పోవుటకు సమయము కాదు, ఆకసము పరిష్కారమగునంతదనుక నెచటనైన నుపేక్షఁ జేయుటుచితము. కాని యువకునకు చింతించుటకేమియు నవకాశము లేదు. అతఁడు పోవు కార్యమునందు విలంబన మాచరింప నాయువకున కిచ్ఛ లేదు. అతఁడే ప్రభువునొద్ద నుండెనో యతఁడు యువకునికడఁ బ్రమత్తతఁ గాంచ లేదు. నిర్లక్ష్యమునుగాని, యాలస్యమునుగాని జేయుట యతని యభ్యాసము కాదు. అందుచే నతఁడు భూరుహశాఖాలంబిత కోదండ శిలీముఖములనుఁ గొని హయము నారోహించెను. ముహూర్తానంతరమున నతఁడంబరము దిక్కుగ నిరీక్షించెను, మరల వేగముగ నశ్వాచలన మొనరించి యానిశ్శబ్ద పర్వత ప్రదేశముల సుప్తప్రతిధ్వనిని జాగరితముగావించి వెడలెను.

క్షణకాలములో భయానకమైన మారుతము వీవఁదొడంగెను. ఆవేసమందొక దిక్కునుండి మఱొకవైపు వఱకును విద్యుల్లత చమకితముగాఁ దొడంగెను. మేఘగర్జన మాయనంత పర్వత ప్రదేశమున నూఱుమాఱు లెక్కుడుగ శబ్దితమగుచుండెను. అచిరకాలములో

కోటి రాక్షసబలమున విద్రావమొనరించుచు, భీషణ గర్జన మాచరించుచుఁ, బ్రచండ పవనమాయున్నత శైలమును సమూలముతో గంపింపఁ జేయునట్లు జివ్వు జివ్వున వీచుచుండెను. పర్వత పార్శ్వములందున్న యసంఖ్యపాదపశ్రేణులనుండి కర్ణవిదీర్ణ మొనరించు శబ్దముత్పన్నమయ్యెను. జలప్రపాతములును, పర్వతతరంగిణులును గిరిపార్శ్వములందు నలుకెలంకులందును వికీర్ణములై ప్రవహించుచుండెను. విద్యుదాలోకమున బహుదూరము వఱకును ప్రకృతియొక్క యీ ఘోరవిప్లవము గన్పట్టసాగెను. నడుమ నడుమ వజ్రశబ్దమువలన జగమంతయు గంపించుచు స్తబ్ధమగుచుండెను. త్వరలో నేనుఁగుతొండముల వడువున వర్షధారలు పడుచు గొండ లోయలను, సరోవరములను, స్రవంతులను బూర్తిగ నిండింపఁ జేసెను.

ఆశ్వికుఁడో యించుకైనను ప్రతిరుద్ధుఁడుగాక జాగరూకతతో ముందునకు సాగుచునే యుండెను. సమయసమయములం దాశ్వికుఁడు తురఁగముతో వాయువేగమున పర్వతమునుండి క్రిందికి నిక్షిప్తుఁడగునట్లు దోఁచుచుండెను. వాయుపీడిత తరుశాఖల యాఘాతముచే నాశ్వికుని యుష్ణీషము ఛిన్నమైపోయెను. అతనిలలాటమునుండి యొకటి రెండు రుధిరబిందువులు పతితమగుచుండెను. అయిన నతఁడే కార్యమున నిరతుఁడయ్యెనో దానినొనర్ప నపేక్షించుట దుస్సాధ్యము. దానంజేసి యువకుఁడు ముహూర్తమాత్రమైనను చింత సలుపక సాధ్యమగునంత దనుక సతర్కభావమున నశ్వాచలన మాచరించుచుండెను. వర్షము కుంభ వృష్టిగా గురిసిన పిదపఁ గ్రమక్రమముగ నాకాశము పరిష్కారముఁగా నారంభించెను. అచిర కాలములో వృష్టి యాఁగిపోయెను. అస్తాచలచూడమునఁ గ్రుంకు నాదిత్యుని కిరణాలోకమున పర్వత రాశిపై సొంపుగ నిలచియున్న నవస్నాతసాలసమూహముల చమత్కారశోభ మన తెరువరి కనిర్వాచ్యమైన ప్రమోదము నొదవఁజేసెను.

యువకుఁడు దుర్గమును సమీపించి తురఁగము నొక పూతాపివైచి, సిక్త కేశ గుచ్ఛమును మరల దన సుందరప్రశాంతలలాటమునుండి యపసృతమొనరించి, నిమ్నదిక్కునకు వీక్షించెను. వీక్షించిన కొలఁదియు రెండుమూఁడు వేల యున్నతపర్వతశిఖరములు శోభాయమానములై గన్పట్టుచుండెను. గిరిసమూహ పార్శ్వములందును, శిఖరములందును, నలుకెలంకులను నవస్నాతనిబిడహరిద్వర్ణయునంత పాదపశ్రేణు లాదిత్యాలోకమున మిలుమిట్లు గొలుపుచుండెను. మధ్య మధ్య జలధారలు విశాలమగుచు వర్ధితములైతిమని యుప్పొంగుచు శృంగాంత రాళములఁ బడి నృత్యముఁగావించుచు సూర్యుని సువర్ణరశ్మిలో మిగుల సుందరముగఁ గ్రీడ సలుపుచుండెను. పర్వత శిఖరములపై సూర్య రశ్మి నానావర్ణములతో శోభిలుచుండెను. సెలయేరులపై నింద్రధనువు నాట్య మాడుచుండెను. నభమందా ప్రకాండకోదండము నానావర్ణములతో రంజితమై యుండెను. బహుదూరమున వాయుతాడితములై మేఘరాశులు వృష్టిరూపమునఁ గలితము లగుచుండెను.

యువకుఁడు క్షణమాత్ర మీశోభయందు ముగ్ధుఁడై నిలచెను. పిదప రవినవలోకించి దుర్గము నధిష్ఠింపసాగెను. అచిర కాలములో నతఁడు దుర్గమందుఁ బ్రవేశించెను. అపుడుసూర్యుఁ డస్తాద్రినిఁ గ్రుంకెను. ఝణఝణ శబ్దముతో దుర్గద్వారము రుద్ధము గావింపఁబడెను.

ద్వారరక్షకులు కవాటమును బంధించి, యువకుని వీక్షించి యిట్లనిరి. "సత్వరమే చేరలేకపోతివి. ఇంకొక ముహూర్తమాత్రము విలంబమైనచో నేఁటిరాత్రి ప్రాచీర బహిః ప్రదేశమున కాలమతివాహితముఁ గావింపవలసి వచ్చెడిదే"

యువకుఁడు— "ఇంకొక ముహూర్తము విలంబమెట్లగును? ప్రభుసాన్నిధ్యమున నే సేవప్రతిజ్ఞఁ గావించితినో, భవానీప్రసాదమున

దానిని నేను పాలనముఁ గావించెదను. నేఁడే కిల్లాదారుని సమక్షమున ప్రభు యాదేశమును తెలిపెదను."

ద్వారరక్షకుఁడు—"కిల్లాదారు కూడ మీకొఱకు ప్రతీక్షించుచుండెను."

యువకుఁడు తత్క్షణమే కిల్లాదారుని ప్రాసాదమున కరిగి, వినయమున నతని కభివాదన మొనరించి నిజకటి ప్రదేశమున బంధింపఁబడియున్న కాగితములను వెలుపలకు దీసి, వానినతని కొసంగెను. కిల్లాదారు మావళీజాతీయుఁడై శివాజీ యోధులలో ముఖ్యుఁడై ప్రభు విశ్వాసమునకుఁ బాత్రుఁడై యుండెను. అతఁడా పత్రములను ప్రతీక్షించుచును, దూతవైపు చూడకయే యేకాగ్రచిత్తుఁడై వానినిఁ జదువుచుండెను.

ఢిల్లీశ్వరునితో యుద్ధారంభము, సమరముయొక్క యోధుని కావస్థ, యేవిధముగఁ గిల్లాదారు శివాజీకి విశేషసహాయముఁ జేయనిచ్చు, యే యేవిషయములందు శివాజీ యాదేశ యవశ్యకత, మొదలుగాఁగల సమస్తవిషయములకు నతఁ డవగతుఁడయ్యెను. లేఖను పూర్తిగ జదివి యవశేషమునఁ గిల్లాదారు పత్రవాహకుని తేరిచూడసాగెను. అష్టాదశవర్షీయుఁడై యా యువకుని బాలకోచితయుదార ముఖమండలమును, ఆనయనావలంబితమైన నిబిడకృష్ణకేశగుచ్ఛము నుఁదిలకించి కిల్లాదా రొక మాఱు చకితుఁడయ్యెను. అతఁడు పత్రముల వైపుఁజూచి, మరల బాలునిపై మర్మభేదతీక్ష్ణదృక్కులఁబఱపెను. పిదప నతఁడా యువకు నుద్దేశించి, "యోధుఁడవా? నీపేరు రఘునాధజీయా? నీవు రసపుత్రకుల వంశజుఁడవా" యని నుడివెను.

రఘునాధజీ వినీతభావమున శిరమును వాంచి యాప్రశ్న కుత్తరము నొసఁగెను.

కిల్లాదారు—"నీవు ఆకృతి వయసులందు మాత్రము బాలుఁ

డవు. కాని వివేచన మొనరించి చూడఁ గార్యకాలమందు పరాఙ్ముఖుఁడవుగావు"

రఘునాధజీ—"ప్రయత్నము మాత్రము మనుష్యసాధ్యము. దేవర నాయత్నమువలం దేలోటును జూడఁబోరు. కాని సిద్ధి భవానీదేవి యిచ్ఛాధీనముకదా!"

కిల్లాదారు—"నీవు సింహగరమునుండి తోరణ దుర్గమున కింత యచిరకాలమందే యెట్లు రాఁగలిగితివి?"

రఘునాధజీ—"ప్రభుసాన్నిధ్యమున నట్లుప్రతిజ్ఞ గావించితిని" కిల్లాదా రీ యుత్తరువువలనఁ బరితుష్టుఁడై, యొకించుక మందహాస మొనరించి, యిట్లనియెను. "అడుగుట యందవశ్యక మేమియు లేదు. కార్యసాధనమందీ వెట్టినిరతుఁడవో నీయాకృతియే చెప్పుచుండెను." రఘునాధజీయొక్క సమస్తవసనములును శరీరమును యింకను సిక్తములయ్యేయుండెను. లలాటమందలిగాయ మొకించుక గన్పట్టుచుండెను.

పిమ్మట గిల్లాదారు సింహగర పూనాల సమస్త యవస్థయు, మహారాష్ట్రీయ, మొగలు రాజపుత్ర వాహినుల స్థితియు, సంఖ్యయు, నాత్రముతో వానినడుగ సాగెను. రఘునాధజీ తనకు సాధ్యమగునంత వఱకు నుత్తరము నొసఁగెను.

కిల్లాదారు—"అట్లైనచో రేపటి యుదయమున నాకడకు రమ్ము, నాపత్రముల నన్నిటిని సిద్ధముగనుంచెదను. నీవు శివాజీ ప్రభువుకడ కరిగి నేను పలికిన ట్లతనితో నీవిషయము కార్యమందే తరుణవయస్కయోధుని యుక్తము గావించెనో, యతఁడు కార్యమునందు నుపయుక్తుఁడు కాఁడని చెప్పుము.

ప్రశంసా సందర్భమున రఘునాధుఁ డుత్తమాంగమును వంచి కృతజ్ఞతా స్వీకారముఁ గావించెను.

రఘునాథుఁడు సెలవుఁగొని యటనుండి వెడలి పోయెను. కిల్లాదారు శివాజీ కడ కతిశయగూఢమంత్రిణమును బంప నిశ్చయించి, రఘునాథు నిట్లు పరీక్షింపసాగెను. అతని యుద్దేశ మింతియే, ఆరహస్యవార్త్తలను లేఖామూలమున వ్యక్తీకరింపరాదు. అట్లొనర్చినచో పత్రములు రిపుహస్తములఁ బడవచ్చును. రఘునాథుఁడా వార్త్తలను వాక్యరూపముగనే శివాజీ కెఱిఁగింపఁగలఁడా? లేఁడా? యర్థబలమునఁగాని, లేక మఱే యుపాయమునఁగాని, శత్రువుల వశవర్తియై గూఢవార్త్తలను యరివీరుల నికటమునఁ బ్రకాశముఁ జేయ రఘునాథుఁడు సమ్మతించునాయని యెఱుఁగుటకై కిల్లాదారతనిని పరీక్షించెను. రఘునాథుఁడు నయన పథమునుండి బహిర్భూతుఁడైన పిదప కిల్లాదారుఁ డొకించుక మందహాసముఁ గావించి యాత్మగతమున నిట్లనుకొనియెను. "శివాజీ యీవిషయమున నసాధారణ పండితుఁడు, యుపయుక్త కార్యమందు యథార్థముగ నతఁడుపయుక్త వ్యక్తినిఁ బంపియుండెను."

మూఁడవ ప్రకరణము.

ప్రియంవద

కిల్లాదారునికడ సెలవుఁగొని రఘునాథుఁడు భవానీమందిరాభిముఖముగా జనెను. ఈదుర్గజయానంతరమునఁ గొలఁదిదినములైనపిదప శివాజీ భవానీవిగ్రహము నొకదానిని ప్రతిష్ఠిత పఱచి, యన్వారదేశీయుఁడైన యొక యుచ్చకులోద్భవ బ్రాహ్మణుని నాహ్వానించి యతనిని దేవసేవయందు నియోజితుఁగావించెను. యుద్ధకాలమందీదేవికి పూజయొనర్చినఁగాని యతఁడు మఱే కార్యమునుఁగాని దలపెట్టఁడు.

రఘునాథుఁడు యౌవనోచిత యుల్లాసమునఁ దన కృష్ణకేశము

లను సవరించుకొనుచు సహజమృదుస్వరమున నొక యుద్ధగీతముఁ బాడుచు, మందిరాభిముఖముగఁ బోయెను.

అతఁడు మందిరమును సమీపించుతరి సంధ్యాసమయ మాసన్నమాయెను. పశ్చిమాకాశ స్థిమితాలోకమున శ్వేతమందిర మతిసుందరముగఁ గన్పట్టుచుండెను. మందిర పార్శ్వవర్తియైన యొక యారామ మంధకారావృతము గాఁదొడంగెను. మందిర పురోహితుఁ డపుడు సదనమున లేఁడు. అందుచే రఘునాథుఁ డుద్యానవనమందలి యొక ప్రస్తరముపై నుపవసించి క్షణకాలము విశ్రమము తీసికొనుచుండెను.

సంధ్యాసమయమున నాయుద్యానవనమున కొక బాలిక పుష్పముల కొఱకై చనుదెంచెను. రఘునాథుఁ డొకించుక విస్మితుఁ డయ్యెను.

ఏలనన బాలిక యీదేశీయురాలు కాదు. ఆమెవసనములఁ గాంచి యతఁడామె రసపుత్రబాలికయని గ్రహించెను. బహుదినానంతరమున నొక స్వదేశీయ బాలను చూచినతోడనే రఘునాథుని హృదయమాహ్లాదపరిపూర్ణమయ్యెను. బాలికనికటమునకుఁ బోయి యామెతోఁ బరిచయ మొనర్ప రఘునాథుఁడాతురుఁడైయుండెను. కాని యతఁడా యిచ్ఛను దమనముఁ గావించి, వృక్షతలమందా ప్రస్తరముపై నుపవిష్టుఁడైయుండి బాలికను బరీక్షింపసాగెను. చూచినకొలఁది యువకుని హృదయము మఱింత యావైపునకాకృష్టముగాఁదొడంగెను.

బాలికవయస్సు రమారమి పదమూఁడు వత్సరములుండును; ఆమె కేశసువినిందితసుమార్జితకృష్ణకేశపాశమారమణి గండస్థలమందును, పృష్ఠదేశమందును లంబితమైయుండి, యామెయుజ్జ్వలముఖమండలమును, భ్రమరవినిందితనయనయుగళమును గించిత్తావృత మొనరించుచుండెను. ఆకాంతభ్రూయుగళముఁ జిత్రకారుని తూలికచే దిద్దినట్లుండెను. అవివక్రములై యారమణీలలాటశోభను మఱింత యెక్కుడు

జేయుచుండెను. ఆమె యోష్ఠద్వయము సూక్ష్మమై, రక్తవర్ణముగ నుండెను. ఆబాలికకరములు కోమలములై, కంకణాదిసువర్ణాభరణములతో సుశోభితములై యుండెను. కన్యాలలాటమం దంబరమందలి రక్తిమచ్ఛటపతితమై, ఆతప్తకాంచనవర్ణమును సమధికయుజ్జ్వలము గావించుచుండెను. ఈషదున్నతమైన యామెవక్షస్థలముపై నొకకంఠమాల దోదూల్యమానమైయుండెను. రఘునాథుఁడనిమేషలోచనుఁడై ఆసాయంకాలస్తిమితాలోకమున నారసపుత్త్రకన్యయొక్క యపూర్వసుందరమూర్తిని వీక్షింపసాగెను. అతని హృదయ మనుభూతానందపోత్రితముచే సిక్తముగాఁదొడఁగెను. వలయాకుసుమములను తుంపికొని కన్యానిలయములోనికిఁ బోవనుపక్రమించెను. అట్టితఱి యామె యనతిదూరమున నొకదీర్ఘకాయుఁడైన రాజపుత్త్రయువకుఁడు తనవైపునకే నిమేషలోచనుఁడై వీక్షించుటఁగాంచెను. కెంజెములజ్జచేకన్యాముఖమురంజితమయ్యెను. ఆమె వదనమునవనతముగావించెను. మరలనొకించుకదానినెత్తి యువకునివీక్షించెను. రఘునాథుఁడపుడును నిలచియేయుండెను. గుచ్ఛకృష్ణకేశములు యువకుని యున్నతలలాటమును, జ్యోతిఃపూర్ణనయనద్వయము నావృతముగావించెను. అతని కటిప్రదేశమునఁగృపాణమును, దక్షిణహస్తమునఁ గోదండమును విరాజిల్లుచునేయుండెను. అపుడుకూడ యువకుఁడు ఱెప్పపాల్పకయే యామెపైఁ దనదృక్పరంపరలఁ బఱపసాగెను. చిరకాలానంతరమున నొకదేశీయయోధు నీమహారాష్ట్రదుర్గమున వీక్షించి రసపుత్త్రబాలిక ప్రథమమున నవిస్మితయయ్యెను. యువకుని యుజ్జ్వలసౌందర్యాకృతినిఁ గాంచి యామెచకితయై, నతముఖమండలయై, పుష్పపల్లీరమునుగొని నిలయాభ్యంతరమునకుఁజనెను.

అపుడు రఘునాథుఁడొకించుక చైతన్యుఁడైపోయెను. మందిర పురోహితుని దర్శనమొసర్పఁ జింతితభావమున మెల్లమెల్లగానతఁడు

మందిరమధ్యమునఁ బ్రవేశించి పురోహితునికొఱకై యపేక్షించుచుండెను. ఈసందర్భమున మేము పాఠకులకుఁ బురోహితునిఁ గూర్చి యొకించుక దెలుపవలయును.

పురోహితుఁడన్వర దేశీయ యుచ్ఛకులోద్భవ రాజపుత్త్ర బ్రాహ్మణుఁడని మేముపూర్వమే యెఱింగించితిమి. అతఁడు జనార్దనశర్మ యనుపేరఁ బఱగుచుండెను. అన్వర దేశమునఁ బ్రసిద్ధిఁగాంచినతేడ్డైఁవ జయసింహునికడ నతఁడాస్థానపండితుఁడుగ జిరకాలముండెను. పిదప శివాజీ యనురోధమున జయసింహుని యనుమత్యనుసారమున నతఁడామహారాష్ట్రనాయకుని సర్వాపేక్షితమవిజితతోరణదుర్గమున కేతెంచెను. అతనికి సంతానమేమియు లేదు. కాని స్వదేశత్యాగ మొనరించిన యచిరకాలమునకుఁబూర్వమందే, యతఁడొక రసపుత్త్రకన్యను బెంచుచు నామెనల్లారుముద్దుగాఁ జూచుచుండెను. కన్యతండ్రి జనార్దనశర్మకు శైశవమిత్త్రుఁడై యుండెను. కన్యతల్లి జనార్దనునిభార్యతో నక్కసెల్లెండ్ర న్యాయమునమెలఁగెడిది. కన్యయొక్క మాతాపితృలు కాలధర్మమునొందిన తదనంతరమున సంతానరహితులైన జనార్దనుడును, అతనిగృహిణియు నాక్షత్త్రియబాలికకు లాలనపాలనమొనర్చుభారమును తమపైవైచుకొని తోరణదుర్గమున కడకరుగుదెంచి యపత్యనిర్విశేషమున నాకన్యను బెంచుచుండిరి.

పిదప జనార్దనునకు పత్నీవియోగము సంభవించెను. దానింజేసి ప్రియంవదతక్క వృద్ధునివాత్సల్య పాత్త్రిలింకొకరేరును లేరు. ప్రియంవదజనార్దనశర్మను తండ్రియనిసంబోధించుచు, నతనినిమిక్కుడుగఁ బ్రేమించుచుండెను. కాలక్రమమునఁ బ్రియంవదనిరుపమలావణ్యవతియాయెను. అందుచే దుర్గమందలి జనులందఱు శాస్త్రజ్ఞభూసురుఁడైన జనార్దనుని కణ్వమునియనియు నతనిచేఁ బెనుపంబడుచు సౌందర్యతిలకమైయున్న, క్షత్త్రియబాలికను శకుంతలయనియు పరి

హసించుచుండిరి, కన్యయొక్క సౌందర్యానురాగములవలన జనార్దన శర్మ పరితుష్టుఁడై రసపుత్రసీమ నిర్వాసనదుఃఖమును పూర్తిగమఱచి పోయెను.

దేవాలయమున రఘునాథుఁడొకించుక యుపేతుఁగావించిన పిదప జనార్దనశర్మ దేవమందిరమును ప్రవేశించెను. అతని కేబది యేండ్లప్రాయముండెను. అవయవములు దీర్ఘములై, బలిష్ఠములై యుండెను. నయనద్వయము శాంతిరసపూర్ణమై యుండెను. వక్షస్థలము విశాలముగను, బాహుద్వయము దీర్ఘముగను బలిష్ఠముగను యుండెను. అతని శరీరచ్ఛాయ గౌరవర్ణముగ నుండెను. స్కంధభాగము నుండి యజ్ఞోపవీతము లంబితమై యుండెను. ఆపూజకుని పవిత్రమనమును, సరళహృదయమును, అతనిముఖమునుగాంచినవాఁడనే బోధగమ్యమగుచుండును. జనార్దనశర్మ మెల్లమెల్లగా మందిరమునఁబ్రవేశించెను. అతనిఁగాంచి రఘునాథుఁడు ససంభ్రమమున నాసనత్యాగముఁ గావించి మస్తకన్యస్తహస్తుఁడై నిలచెను.

సంక్షేపమున నిష్టాలాపమైన యనంతరమున నుభయులును, ఆసనగ్రహణముఁగావించిరి. జనార్దనుఁడు పిదప శివాజీనిఁ గూర్చి కుశలప్రశ్న వేయసాగెను. సాధ్యమగునంతదనుక రఘునాథుఁడు యుద్ధవిషయములను వివరణముగ విశదీకరించి, శివాజీప్రణామము లతని కెఱింగించి, పూజకుని కరమందుఁ గొన్ని సువర్ణముద్రలనుంచి యిట్లనియెను. "ప్రభువిపుడు మొగలులతో సమరము సలుపుచుండెను. మీరతని జయనిమిత్తమై భవానీదేవినికటమున పూజయొనర్పుఁడని శివాజీ మిమ్ములను ప్రార్థించెను. దేవీప్రసాదములేనిది మనుష్యప్రయత్నము వృథాకదా?"

జనార్దనశర్మ తన నైసర్గికస్థిర గంభీరస్వరమున నిట్లనియెను. "సనాతన హిందూధర్మరక్షార్థమై మావంటివారము చిరకాలము విధేయులై యత్నించుచుందుము. ఆధర్మము యొక్క ప్రహారిస్వరూపుఁడైన శివాజీ జయనిమిత్తమై యవశ్యముగఁ బూజఁగావించెదను. ఆ విషయమున నేమియుఁ ద్రుటిసలుపనని మహాత్మున కెఱిఁగింపుము."

రఘునాథుఁడు—దేవిపదమున ప్రభువుగారి యీవేదనమింకొకటికలదు. అతఁడు ఘోరతర యుద్ధమునఁ బ్రవృత్తుఁడగును. ఒకించుక పూర్వమందే దానిఫలమెఱుఁగ నతఁడాతురుఁడై యుండెను. భవాదృశులైన దూరదర్శదైవజ్ఞులీవిషయమున నవశ్యముగ నతని మనస్కామనమును పూర్ణముగావింపఁగలరు.

జనార్దనుఁడు క్షణకాలము చక్షులను ముద్రితముగావించి పిదప గంభీరస్వరముననిట్లనియెను. "నేఁటియర్ధరాత్రమున దేవీపదసమక్షమున శివాజీకోరికఁ దెలిపెదను, ఎల్లి ప్రాతఃకాలమున నీవు ప్రత్యుత్తరమును బడయఁగలవు."

రఘునాథుఁడు ధన్యవాదమొనరించి సెలవుఁగొనుట కుద్యుక్తుఁడైయుండ జనార్దనశర్మ యతనినుద్దేశించి "ఇతిపూర్వమున నిన్నెపుడీ దుర్గమునఁగాంచి యుండలేదు. ఇచటకు నీవేతెంచుటకిదియే ప్రథమ పర్యాయమా యేమి?" అని ప్రశ్నించెను.

రఘునాథుఁడు "ఇదియే ప్రథమపర్యాయము."

జనార్దనశర్మ—"దుర్గమందొరులేరితోనైనఁ బరిచయమున్నదా? నేఁడుండుటకు స్థానముండెనా?"

రఘునాథుఁడు—"నాకీక నిచటొరులేరితోను పరిచయములేదు. కాని యెట్లనో యీరేయిఁగాలముపుచ్చి, రేపటి ప్రత్యూషమందే వెడలిపోయెదను."

జనార్దనశర్మ—"అనర్థకక్లేశము నెందులకు సహించెదవు?"

రఘునాథుఁడు—ప్రభువుగారి యనుగ్రహమున నేమియుఁ గ్లేశ

ముండదు. సర్వదా మేమిటులే రాత్రిల నతివాహిత మొనరింపవలయును."

జనార్దనశర్మ—"వత్సా! రణసమయమందుఁ గ్లేశ మనివార్యము. కాని నేఁడు క్లేశసహనముఁగావింప నవశ్యకత యేమియు లేదు. నాయీ దేవమందిరముననుండుము. నానుకుమారకన్య భోజనాదివిషయముల నీకుఁదగు నదుపాయ మొనర్చును. ఈరాత్రి సుఖముగనిచట విశ్రాంతి మొనరించి, రేపటిప్రాతఃకాలమున శివాజీనికటమునకు దేవియాజ్ఞను గొనిపొమ్ము."

రఘునాథజీయొక్క హృదయముప్పొంగెను. ఆతనియెదయం దేదో తీవ్రముగ నాఘాత మొనరించినట్లాయెను. ఇదియాతనయా? లేక నానందోద్వేగమా? జనార్దనశర్మచేఁ బాలితమగుచున్న కన్య యెవరు? ఆకన్య యతఁడు ద్యానమునఁగాంచిన యందములరాశి యేనా యేమి? ఆబాలిక రఘునాథుఁడు కుసుమోద్యానవనమునఁగాంచిన కుసుమాంగి యేనా యేమి?

నాలుఁగవప్రకరణము

కంఠమాల

రాత్రి ఝామగడచిపోయెను. తండ్రియాదేశమునఁ బ్రియంవద యతిథిసత్కారార్థమై బహుసన్నాహములొనర్చి భక్ష్యభోజ్యలేహ్యచోష్యములెన్నిటినో గావించెను. విందారగింప రఘునాథుఁడాసనమునను పవిష్టుఁడయ్యెను. ప్రియంవద వెనుకనిలచియుండెను. నేఁటి వఱకు మహారాష్ట్రదేశమందాహ్వాతవ్యక్తిని విందారగింపఁ జేయుటకై నిలయమందలి రమణియొకర్తుక నియోజింపఁబడవలయునను నాచారముగలదు.

రఘునాథుఁడు భోజన మొనర్ప నుద్యుక్తుఁడయ్యెను. కానియతని హృదయము నేఁడు చంచలపరిపూర్ణమై, యస్థిరమైయుండెను. బహుప్రయాసపడి ప్రియంవద యనేకవిధముల పిండివంటలను పచించెను. కానిరఘునాథుఁడు నేఁడేమి తాఁదినునో నెఱుఁగలేకుండెను. జనార్దనశర్మ యౌత్సుక్య సహకారమున రాజస్థానముఁగూర్చి యనేకవిషయముల నతనినడుగఁజొచ్చెను. రఘునాథుఁడు సమయసమయములందుత్తరువులనిచ్చుచుండెను. కాని యతఁడన్యమనస్కుఁడయ్యెయుండెను.

భోజనము ముగిసిపోయెను. శ్వేతప్రస్తర వినిర్మితమైన యొక సుందరపాత్రితోఁ బ్రియంవద "షర్బతును" గొనివచ్చి రఘునాథునకొసంగెను. సోద్వేగచిత్తమున యువకుఁడు పాత్రధారిణివైపునకుఁ జూచెను. ఆదృక్కులతోఁగూడ నతనిహృదయముకలిసి బాలికవైపునకుఁ బరువిడిపోయెను. నేత్రద్వయములొండొంటితోఁ గలిసిపోయెను. ప్రియంవద ముఖములజ్జచే నొకించుక రక్తవర్ణమైపోయెను. వదనమండలమవనత మొనర్చి యామె మెల్ల మెల్లగాఁ గొంచెము ప్రక్కగనొత్తిగిలెను. రఘునాథుఁడుకూడ బహులజ్జితుఁడై యధోవదనముఁగావించెను.

హస్తముఖప్రక్షాళనార్థమై ప్రియంవద సలిలముఁగొని యువకునకొసంగెను. రఘునాథుఁడు మూర్ఖుఁడుకాఁడు. అతఁడింకను ముఖమునవనతముఁగావించి ప్రియంవదయొక్క సుందరసువర్ణవలయ విజడితసుకోమలకరపల్లవములనుమాత్రము గాంచి యొక దీర్ఘనిశ్వాసమును విడచెను.

రఘునాథుని శయ్యారచనమయ్యెను. అతఁడునిద్రించలేదు. గృహకవాటమును మెల్లగఁదెరచి పుష్పోద్యానవనములోనికిఁబోయి నక్షత్రాలోకమున నిటునటుఁ బచారిచేయఁ దొడంగెను.

ఆగభీరాంధకారమున నక్షత్రవిభూషితనైశనభమువైపుగ స్థిరదృష్టిఁగావించుచు నల్పవయస్కయోధుఁడేమి చింతించుచుండెను? నిశాఛాయ క్రమక్రమముగ గభీరతరము గాఁదొడఁగెను. ఆసుస్నిగ్ధ ఛాయయందు మనుష్య, జీవజంతు మొదలగు సమగ్రజగత్సంతానము సుప్తమైయుండెను. దుర్గమందు శబ్దమాత్రమే లేదు. నడుమనడుమ మాత్రము ప్రహరులకంఠధ్వని యొకించుక వినవచ్చుచుండెను. ఝాముఝామున ఘంటారవ మానిస్తబ్ధదుర్గమున నలువైపులఁగల ధరాధరీ ద్వారములందు ప్రతిహతమగుచుండెను. ఈగంభీరాంధకారనిశి యందు రఘునాథుఁడనిద్రితుఁడై యేమిచింతించుచుండెను?

తానాదినమున నాయుద్యానమందెందులకుఁ బదాచరణ మొనరించుచుండెనో రఘునాథుఁ డెఱుఁగ లేకుండెను. ఇంతదనుక నతఁడు బాలుఁడైయుండెను. నేఁడతని శాంతనీల జీవనాకాశమున నొక నూతనాలోక ముదితమైనట్లయ్యెను. అతనిసుప్తచింతయు వేగవతియైనమనమును నేఁడకస్మాత్తుగ జాగరితములయ్యెను. ఆరసపుత్రబాలికయొక్క యానందమయమూర్తి యనేకమాఱులతని మనోదర్పణమునఁ బ్రతిబింబితముఁగాఁదొడంగెను. "ఆయాలేఖ్యలిఖిత భ్రూయుగళము! పుష్పవినిందిత మధుమయయోష్ఠము!! ఆసుకోమలకరద్వయము!!! ఆ యాయత ప్రేమపూర్ణనయనములు !!!! ఆచిత్తహారయుతులలావణ్యము !!!!! ఆహా ! వర్ణనాతీతములుగదా ! ! రఘునాథుఁడా ! యీసుందరి నీదియగునా? నీవొక సామాన్యయోధుఁడవుమాత్రమే ! జనార్దనశర్మ యతియుత్కృష్టకులోద్భవుఁడు. అతనిచేఁ బెనుపఁబడు కన్య యున్నతపదవులందు రసపుత్రులకుమాత్రమే ప్రార్థనీయము! ఏలనీవు వృథాగానీహృదయమును వ్యథితము గావించుచుంటివి? రఘునాథుఁడా! ఈవృథాతృష్ణచే నీయెద నేలదహింపఁజేయుచుంటివి?

కాని యౌవనకాలమున నాశ బలముగనుండును. సత్వరమున మనమనములందు నైరాశ ముదయముకాదు. అసాధ్యమైనదానిని కూడ సాధ్యమైనదిగనే దలఁచుచుందుము—అసంభవము సంభవమువలె గన్పట్టును. రఘునాథుఁడంబరము వైపునకుఁ జాలసేపుదిరిగి తారామండలము వీక్షించివీక్షించి యాత్మగతమున నేదియో దలపోయుచుండెను. కొలఁదిసేపైనపిదప నతఁడులేచి నిలువంబడి హృదయముపై దన బాహుద్వంద్వమును స్థాపించి క్షణకాల మటులనే నిలచియుండి యిట్లు భావింపఁదొడంగెను. "భగవానుఁడా ! నాకు తోడ్పడుము. అవశ్యముగఁ గృతకార్యుఁడనగుదును. యశ, మానఖ్యాతి మొదలగు మనుష్యసాధ్యము లేల నాకసాధ్యములగును ? నాశరీరమితరుని కాయముకంటె క్షీణమైనదా? నాబాహువు లన్యుని కరములకంటెదుర్బలములా? దేవగణములారా ! నాకు సహాయముకండు. రణమందేను పితృనినామము రక్షించెదను. రసపుత్రోచిత సమ్మానలాభమును బొందెదను. తదుపరి కృతకార్యుఁడనైతినేని ప్రియంవదా ! నేను నీకయోగ్యుఁడను కాను. అపుడు ప్రియంవదా! యిపుడు నామనమందలి యాందోళనమంతయు నాసర్వప్రయత్నములను నీకు సవిస్తరముగఁ బూసఁగుచ్చినట్లెఱింగించెదను. అపుడు నీసుందరకరద్వయమును నాయాకంపిత హస్తద్వంద్వమందు స్థాపనమొనరించెదను. అపుడు నీలావణ్యమయ దేహలత నాయుద్విగ్నహృదయముపై వానికొనియెదను. నీవపుడు నీసుందరవిశ్వవినిందిత యోష్ఠద్వయమును" రఘునాథా ! రఘునాథా ! ! ఉన్మత్తుఁడవుగాకుము !

రఘునాథుఁడపుడు హృదయము నొకించుక శాంతముఁగావించుకొని గృహములోనికి మగుడిచనెను. రఘునాథుని శయ్యామందిరముకడ కంఠమాల యొకటిపడియుండెను. ఆముక్తాహారమునకు నడుమనడుమ పగడములుండెను. రఘునాథుఁ డామాలనుగుర్తించెను.

పూర్వదినమున సంధ్యాసమయమం దాహారమును ప్రియంవద తనకంఠమున ధరించెను. దానినతఁడామె వక్షఃస్థలమునఁగాంచెను. అజాగరూకతచే నామె యామాల నచటఁ బాఱవైచియుండును. రఘునాథుఁ డాకసమువైపుఁ దిలకించి “భగవానుఁడా! నాయాశ పూర్ణమగుటకా యేమిపూర్వలక్షణముగ దీనినినాకు దానముఁగావించితి?” యనిపలికెను.

రఘునాథుఁ డాహారమును నిజకంఠమందుధరించి కడునాతురుఁడై దానిననేకమాఱులు ముద్దిడుకొని పిదప నిద్రించెను. మఱుచటి దినమునఁ బ్రత్యూషకాలమం దే మేల్కాంచి యతఁడు జనార్దనశర్మకడకుఁ జని భవానీయాజ్ఞ నెఱిఁగెను. “మ్లేచ్ఛులతో జరగు సమరమున జయప్రాప్తి గలుఁగును. స్వధర్మ్మలతో నొనర్చురణమందు పరాజయమొదవును.”

దుర్గమునువిడచి పోకపూర్వము రఘునాథుఁ డొకమాఱు ప్రియంవదనుగాంచెను. పూలనిమిత్తమై ప్రియంవద కుసుమోద్యానవనమునకుఁ బోయినపు డతఁడటకుఁబోయెను. హృదయోద్వేగము నొకించుక దమనముఁగావించి కంపితస్వరమున నతఁడాకన్యనుద్దేశించి చేతహారముఁగొని “బాలికా! నిన్నటి నిశిసమయమందీ కంఠమాల గృహమందొకచోఁబడి యుండఁదీసితిని. దానిని నీకిచ్చుటకై వచ్చితిని. అపరిచితుఁడనయ్యు నీతోఁ బ్రసంగింప సాహసించినందులకు మన్నింపు” మనియెను.

ఈవినీతవాక్యములనువిని ప్రియంవద యుత్తమాంగము నెత్తియువకునిఁ దేరిచూచెను. ఆకమనీయ యుదారముఖమండల, మాకేశావృతయున్నతలలాట, మాయుజ్జ్వలనయన, మాతరుణవయస్కయోధుఁడు ప్రియంవద దృక్పథమునఁ బడినతోడనే యారమణి గౌరముఖమండలము రక్తవర్ణమైపోయెను.

రఘునాథుఁడుమరల మెల్లమెల్లగా నిట్లుపలుకసాగెను. “దయయుంచి యనుమతి నొసంగినచో నీసుందర ముక్తాహారమును దాని యభ్యస్తస్థానమున నుంచివైచెదను! నాయందీమాత్రపు యనుగ్రహమును జూపుము. భగవానుఁడు నీకు సుఖమొనఁ గూర్చును.”

ప్రియంవద సలజ్జనయనములతో నొకమాఱు రఘునాథుని వీక్షించెను. ఆవిశాలాయతనయనముల క్షణదృష్టిమాత్రమున రఘునాథుని హృదయము కంపితమయ్యెను. రంజితముఖయైన ప్రియంవద లజ్జచేనపుడుమరల నేత్రములను ముదితముగావించెను. సమ్మతిలక్షణమునుగాంచి రఘునాథుఁడు మెల్లగ నాహారమును ప్రియంవద కంఠమున వైచెను. అతఁడు కన్యయొక్క పవిత్ర శరీరమును స్పృశింపలేదు.

క్షణకాలమైనపిదప రఘునాథుఁడు మెల్లగనిట్లనియెను. “అటులైన యతిథికిసెలవిమ్ము”

ఈపర్యాయము ప్రియంవద లజ్జాయుద్వేగములను సంయమముగావించి రఘునాథు నొకించుక దిలకించి మరల దనచూడ్కులు భూమిపైఁబరపి యతిమృదు, వస్పష్టస్వరమున నిట్లనెను. “మీనికటమం దనుగృహీతురాలనైతిని. తామమరల దుర్గమునకు వచ్చునెడల మాయీమందిరమం దే విడసి యుందురని యాశించుచుంటిని”

పిపాసార్త్తమైన వానకోవిలకు—ప్రథమవర్షబిందువువగిది, పథభ్రాంత పథికునకు—వుషారక్తి మచ్ఛటకరణి ప్రియంవదా ప్రథమోచ్చరిత యమృతవాక్యములు రఘునాథున కమృతపూరములై యతనిహృదయము నానందలహరియందుఁ బ్లావిత మొనర్చివైచెను. అపుడతఁడిట్లు ప్రత్యుత్తర మొసఁగెను. “బాలా! నేను పరదాసుఁడను; యుద్ధమే నాయుద్యోగము; మరలనెపుడు రాగలనో, లేక మరలనిటకు రాఁగలుగుదునో లేదో యెఱుఁగఁజాలను. కాని నాకంఠమున ననువులు

న్నంతదనుక నీదేవనిందిత సుందరమూర్తిని ముహూర్తమాత్రమైనను మఱువఁజాలను."

ప్రియంవద యుత్తరమీయలేకపోయెను. ఆబాలిక నయనయుగళమునుండి రెండశ్రుబిందువులు నేలపైరాలెను. రఘునాథుఁడదిగాంచెను. యువకుని నేత్రములుకూడ బాష్ప పరిపూర్ణములయ్యెను.

అ యి ద వ ప్ర క ర ణ ము.

సయస్తఖాను.

కతిపయవత్సరములనుండి శివాజి యెచటకుఁబోయినను జయప్రదుఁడగుచున్నను, క్రమక్రమముగ నతనిరాజ్యము విశాలమగుచున్నను, దుర్గముల సంఖ్యదినదినమును వృద్ధియగుచున్నను 1662వ సంవత్సరమునకుఁ బూర్వము ఢిల్లీశ్వరుఁడతనిని వశీభూత మొనరించుకొనుటకేమియు జతనములు సలుపలేదు. ఆసంవత్సరమున సయస్తఖాను అమీరుకిల్ వుమరాయను బిరుదునుబొంది దక్షిణదేశమందు శాసనకర్తృపదమున నియుక్తుఁడై శివాజీ నొకేమారుగా జయింప ఢిల్లీశ్వరునుండి యాదేశమునుబొందెను. సయస్తఖానా వత్సరమందే పూనా, చాకనదుర్గ మొదలుగాగలఁ గొన్నిటిని స్వాధీనపఱచుకొనెను. మఱుచటివత్సరమున—లేక మసకథజరగు కాలమున శివాజీని తుదముట్టించుటకై దృఢసంకల్ప మొనరించుకొనెను. ఢిల్లీశ్వరుని యాదేశానుసారమున యశవంత సింహుఁడను ప్రతీతికెక్కిన మార్వారుపురాధీశుఁడీవత్సరమందే (1663) బహు సైన్యసమేతుఁడై సయస్తఖానును కలిసికొనెను. దానంజేసి శివాజీకిరానున్న విషాద మనిర్వాచ్యమైయుండెను. రాజపుత్ర మొగలాయీల సేనాదళములు పూనానగరనికటమందు శిబిరము లేర్పఱచుకొని యుండెను, సయస్తఖాను దాదాజీకనయిదేవు

నిగ్రహమందు—అనఁగా యేనిలయమందు శివాజీ తనశైశవమందు మాతాసహితుఁడై వసించెనో యచటనే దనవిడిదిఁగావించుకొనెను. శివాజీ చతురుఁడని సయస్తఖాను బాగుగ నెఱుఁగును. అందుచే నతఁడేమహారాష్ట్రుఁడుగాని యనుమతి పత్రముచు బడసినఁగాని పూనానగరమునుఁ బ్రవేశింపరాదని తనభృత్యుల కాదేశ మొసఁగెను. సమీపమందే సింహగరమను నొకదుర్గమందు శివాజీసైన్యసమేతుఁడై వసించుచుండెను. మహారాష్ట్రులాకాలమందు సమరశిక్షయందు విశేషనేర్పరులుగారు, ఢిల్లీపతి వాహినులతో సమ్ముఖయుద్ధ మొనరించుట వారికెపుడు సంభవముకాదు, దానింజేసి కౌశలముతక్క స్వాధీనమునుగాపాడుటకును హిందూరాజ్యవిస్తారముఁ గావించుటకును శివాజీకి మఱేయన్యోపాయమును లేదు.

చైత్రమాసానంతరమున నొకనాఁటిసాయంకాలమున మొగలుసేనాపతియైన సయస్తఖాను తనమంత్రిగణముల నాహ్వానించియొక సభఁగావించెను. ఏరీతిని శివాజీని పరిభవింపవలయునోయని వారలుచింతించుచుండిరి. దాదాజీకనయి దేవునినిలయమందు సభాగృహమున నీసభసన్నివేశమయ్యెను. నలుదిక్కులందును నుజ్జ్వలదీపావళి జ్వలించుచుండెను, గవాక్షమార్గములనుండి సాయంకాల శీతలమారుత ముద్యానవనమందలి పుష్పగంధమును గొనివచ్చి యందఱిని పులకితులుగ నొనర్చుచుండెను. ఆకాశమంతయు నంధకారాచ్ఛన్నమైయుండెను. ఒకటిరెండునక్షత్రములుమాత్రము గనుపించుచుండెను.

సయస్తఖాను నిస్తోత్రపాఠకులలో నొకఁడైన యన్వారీ యనునతఁడు లేచి యిట్లనియెను. "అమీరు సేనాసమ్ముఖమున మహారాష్ట్రియ వాహినులు ఝంఝామారుతోద్ధూతమగు శుష్కపత్రముచాడ్పున నాకసమువైపున కెగసిపోవును. లేకున్న భీతినొంది భూమిలోఁ బ్రవేశించును."

కతిపయ వత్సరములనుండి మహారాష్ట్రుల బలవిక్రమములఁగాంచుచున్న చందాఖానను నతఁడు లేచి, "ఈ రెండు పనులనుయొనర్చుటకు వారికీదగుపాటు సమర్థతయున్నదని తలఁచెద"నని యందులకుత్తరు విచ్చెను.

సయస్త ఖాను—అదెట్లు?

చందాఖాను—గతసంవత్సరమునఁ గతిపయపర్వతీయ మహారాష్ట్రులు చాకనదుర్గమును ప్రవేశించినపుడు, మనసైన్యమంతయు రెండుమాసముల పటుకెట్టియత్నముల సలిపినను, వారలనుబహిష్కృతముఁగావించి దుర్గజయ మొనరించుటకు మన మెట్టికడగండ్లఁగుడువవలసి వచ్చెనో దేవరవారి కెఱుకయయ్యేయుండెను, ఒకదుర్గమును మాత్రమే స్వాధీన మొనర్చుటకొనర్చిన ప్రథమప్రయత్నమందే యనేక మొగలాయిలు విగతజీవులైరి. ఇంతియఁగాక యీవత్సరమున నన్నితావులందును మనసైన్యములున్నను, నితాయిజీ జవోపేతముగ నారంగాబాదువఱకుఁబోయి దేశమంతను యెట్టులఁగొల్లఁగొట్టెనో మనమెఱిఁగియేయుంటిమి గదా!

సయస్త ఖాను—చందాఖానిపుడు ముదుసలి యగుచుండెను. అతఁడిపుడు పర్వతమూషక మన జాలవెఱచుచుండెను. పూర్వమున నతనికిట్టి భయముండెడిది కాదు.

చందాఖానునిముఖమండల మరక్తమైపోయెను. కానియతఁడు నిరుత్తరుఁడై యుండెను.

అన్వారీ—ఏలినవారు మంచిమాట సెలవిచ్చిరి. మహారాష్ట్రులందఱు మూషకముల పగిదివారే. పర్వతమూషకముల భాతివారురంధ్రములందు దాఁగియుండఁగలరు. సేనావిషయము నొప్పకయుండలేదు.

చందాఖాను—గిరిమూషకము పూనానగరరంధ్రమందుఁజొచ్చి వెలువలకురానిచో మనముచేయవలసినదేమి?

సయస్త ఖాను—ఇపుడు ఢిలీశ్వరుని వరాయుధమార్జాలములిచట నున్నవి. మూషకము లేవియు సాహసించి యేమియొనర్పఁగలవు?

సభాసదులందఱు "సత్యము సత్యమ"ని సేనాపతివాక్యముల ననుమోదించిరి.

మహారాష్ట్రులను గుఱించి యీచర్యలైనపిమ్మట, నేరూపమున యుద్ధమాచరింపవలయునో యని వారలు భావించుచుండిరి. చాకనదుర్గము హస్తగతమైనప్పటినుండి, మఱేదుర్గమునుగాని యాక్రమించుకొనుట దుస్సాధ్యమని సయస్త ఖాను తలఁచెను. పిదపనతఁడిట్లనియెను. "ఈప్రదేశమంతయు దుర్గపరిపూర్ణమైయుండెను. ఒకదాని వెనుకనొకటి చొప్పున దుర్గములన్నిఁటిని స్వాధీనపఱచుకొనవలెనన్న నెన్ని దినములలో ఢిల్లీశ్వరుని కార్యసిద్ధి కాఁగలదు? అధిపుడగునవి మనముస్థిరపఱుఁపఁజాలము."

చందాఖాను—స్వామీ! దుర్గములే మహారాష్ట్రులబలము. వారలు సమ్ముఖమునసనిలచి పోరుసలుపరు. లేక రణమందు వారలు పరాజితులైనను, వారలకేమియునష్టము లేదు. ఏలనన; నీప్రదేశమంతయుఁ బర్వతమయమైయుండెను. వారలసేన యొకస్థానమునుండి పలాయనమై యేదోయొకత్రోవఁబట్టి మఱొకతావుఁజేరును; వారలజాడలపుడు మనకెఱుకరావు. కానిదుర్గములన్నిటి నొకదాని తరువాత నొకటిని హస్తగతముఁగావించుకొనినచో, మహారాష్ట్రులు నిశ్చయముగ ఢిల్లీయధీనతను స్వీకారముఁగావించుకొనవలయును.

సయస్త ఖాను—ఏల? మహారాష్ట్రులు బవరమందుపరాజితులై పలాయనమొనర్చినచో మనము వారిని తరుమలేమా? మనకడనశ్వారోహులు లేరా? వెనువెంటఁజని మహారాష్ట్రసేనను పూర్తిగధ్వంసముఁగావింపలేరా?

చందాఖాను—యుద్ధమైనచో నవశ్యముగ మొగలులకు జయము చేకూరును. పట్టుగలిగినచో మనము మహారాష్ట్రీయ సేననంతను వినాశముఁగావింపఁగలము. అందులకేమియు సంశయము లేదు. కాని యీపర్వతప్రదేశమందు మహారాష్ట్రీయ యశ్వారోహకులను తరిమి పట్టుగల హయారోహకులు హిందూస్థానమందు లేరు. మనతురంగములన్నియు మిగుల పెద్దవి. అశ్వారోహకులు కవచధారకులు. బహుఘోటకసమన్వితులు. సమభూమియందును, సమ్ముఖక్షేత్రమందును వారల బలము దుర్దమనీయము. వారల గతియప్రతిహతము. కాని యీశైలప్రదేశమందలి క్లిష్టపథములలో వారలకు వ్యాఘాతములు చాల గలుఁగును. మహారాష్ట్రుల క్షుద్రాశ్వములు ఛాగముల చాడ్పున తుంగశృంగములందు లంఘించుచు హరిణముల కరణికొండలోయలయందు దుముకుచుఁ దృటిలోఁ బలాయన మొనర్చును. ఏలినవారు నేఁ బలికినట్లొనర్చుఁడు. సింహగరమందు శివాజీయుండెను. వైళంబ మన మాప్రదేశము నవరోధింపవలయును. ఒకటి రెండుమాసములలో దుర్గములన్నిఁటి నాక్రమించుకొనఁగలము. శివాజీ మన కరగతుఁడగును. ఢిల్లీశ్వరునకు జయము చేకూరును. లేకున్న నీప్రదేశమందే మహారాష్ట్రులకొఱకై యుపేక్షించియున్నచో నేమి మేలుచేకూరును? వారలను దరుమయత్నించినను యేమి లాభమొదవును? నితాయిజీ యనాయాసముగ మన సమీపమునుండి యేపోయి అహమ్మదునగరు యరంగాబాదులను కొల్లఁగొట్టలేదా? రుస్తుమఖానతనిని తఱిమి యొనరించిన దేమి?

సయస్తఖానపుడు సక్రోధమున నిట్లనెను. "రుస్తుమఖాను విద్రోహాచరణముఁ గావించెను. ఇచ్ఛాపూర్వకముగనే యతఁడు నితాయిజీని పలాయనముఁగా నిచ్చెను. నేనతనిని సముచితరూపమున దండించెదను. చందాఖానుఁడా! నీవు సమ్ముఖయుద్ధవిరుద్ధముగ వాచరింపుమని పలుకుచుంటివి. ఢిల్లిశ్వరుని సేనాగణము లందెవఁడును శూరుఁడే లేఁడా?

ప్రాచీనయోధుఁడైన చందాఖానుని ముఖమండలము మఱింత యరక్తవర్ణమైపోయెను. ముఖమును వెనుకకుఁద్రిప్పియతఁడొక యశ్రుబిందువును తుడిచివైచి, పిదప సేనాపతి వైపునకుఁ దిరిగి మెల్లమెల్లగ నిట్లనియెను. "నాహీనస్వానుభవమునుబట్టి నేను పలికితిని. మీరు పలికిన చొప్పున గావించినచోఁ గార్యసాధనము చేకూరదు. సేనాపతి మహాశయా! యుద్ధప్రణాళిని స్థిరపఱుపుఁడు. దేవరయాజ్ఞానుసారముగ నీభృత్యుఁడేమి యొనర్చుటకును పరాఙ్ముఖుఁడు కాఁడు."

ఈసమయమందొక భృత్యుఁడటకు వచ్చి, సింహగరమునుండి మహాదేవన్యాయశాస్త్రీజీయను నొక బ్రాహ్మణదూత యచటకే తెంచి క్రిందవేచి యుండెనని పలికెను. సయస్తఖానతని కొఱకై ప్రతీక్షించియుండి వానిని సభాభవనములోనికిఁ గొనిరమ్మని సేవకునకు ముదల నొసంగెను. సభాసదులందఱాదూతను వీక్షించుటకై యుత్సుకులై యుండిరి.

క్షణకాలములో మహాదేవ్రజీ న్యాయశాస్త్రి సభామందిరమునఁ బ్రవేశించెను. శాస్త్రీజీవయసింకను యిరువదినాలుఁగు వత్సరముల నతిక్రమించి యుండలేదు. మహారాష్ట్రీయులపగిదినే యతని యవయవములొకింతక ఖర్వములై కృష్ణవర్ణము గలిఁగియుండెను. కాని యాపుడమిఱేని ముఖమండలము సుందరమై యుండెను. వక్షస్థలము విశాలముగను—బాహుయుగళము దీర్ఘముగను—నయనద్వయము గభీరబుద్ధివ్యంజకముగను యుండెను. అతని లలాటమందు దీర్ఘతిలకచందనముండెను. స్కంధమందు యజ్ఞోపవీతము లంబితమై యలరారుచుండెను. తులానిర్మితమైన యంగిచే నతని శరీరమావృతముఁ గాఁబడెను, దానిం జేసి యతని గఠనము స్పష్టముగా గన్పట్టుటలేదు. అతని మస్తకమున మిగులఁ బ్రకాండమైన శిరోవేష్టముగలదు. అందుచే నతని వదనమండల మాయుష్ణీషచ్ఛాయ యందావృతమైపోయెను. సయస్తఖాను

సాదరముగ దూత నాహ్వానముఁ గావించి తనకు సమీపమున నొక యాసనమున నుపవసింప నతనిని వేఁడెను.

నయస్తఖాను పిదప నతని నుద్దేశించి "విప్రవర్యా, సింహగర వార్త లేమి?" యని ప్రశ్నించెను.

మహాదేవజీయొక సంస్కృత శ్లోకమును చదివెను.

"సన్తినద్యో దండకేషు తథా పంచవటీవనే,
సరయూవిచ్ఛేదశోకం రాఘవస్తు కథం సహేత్"

అనఁగా, "దండకారణ్యమున పంచవటీవనమందు నదులెన్ని యున్నను, వానిని గాంచి రాఘవుఁడు సరయూనదీవిచ్ఛేద దుఃఖమును మరువఁగలిగెనా? సింహగర ప్రభృతములైన దుర్గములన్నియు నిపుడు శివాజీ యధీనమందే యున్నను, పూనా తన హస్తగతమై నపుడా సంతాపము నతఁడు మరువఁగలఁడా?" యని.

నయస్తఖాను పరితుష్టుఁడై యిట్టులనియెను. "ప్రధానదుర్గమును స్వాధీనముఁ గావించుకొంటిననియు నిపుడతఁడు రణమొనరించినను ఫలమేమియు లేదనియు, సత్వరముగ నతఁడు ఢిల్లీశ్వరుని యధీనతను స్వీకారముఁ గావించినచో యతని కొకించుక యాశ యుండుననియు పోయి మీరు శివాజీ కెఱింగింపుఁడు."

పాఱుఁడు మందహాసముఁ గావించి మరల నొక సంస్కృత శ్లోకమును పఠించెను—

"నశక్తోపి హి స్వాభిలాషం జ్ఞాపయితుంచ చాతకః।
జ్ఞాత్వా తు తత్ వారిధర స్తోషయతి హి యాచకమ్॥"

అనఁగా "వానకోవిల మాటలాడి తన యభిలాషను, మేఘమునకుఁ దెలుపఁజాలదు. కాని జలధర మాయభిలాష నెఱిఁగి దయాపూర్వకముగ దానిని పూర్ణముఁ జేయును. మహాజనులు యాచకులకొసఁగు

యీవియిట్టిదియే. శివాజీప్రభు విపుడు పూనా చాకనదుర్గములను గోల్పోయి, సంధిప్రార్థనఁ గావించుటకు లజ్జించుచుండెను. కాని భవాదృశులైన మహాపురుషు లతనియభిలాషము నెఱింగి యనుగ్రహపూర్వకముగ నీదుర్గముల రెంటిని యిచ్చివైచినచో నతఁడు వానిని సంతసపురస్సరముగఁ బరిగ్రహించు"నని.

నయస్తఖాను తన యానందమును సంవరణగావించుకొనలేక యిట్లనెను." పండిత్జీ, మీపాండిత్యముచే నేనెంతవఱకుఁ బరితుష్టుఁడనైతినో. వచింపలేకుంటిని. మీసంస్కృతభాష యెంత సుమధురమైనది! యెట్టి భావపరిపూర్ణమైనది!! యథార్థముగ శివాజీ సంధిఁగావించుకొనుట కిచ్ఛగించుచుండెనా?"

మహాదేవుజీ మఱియొక శ్లోకము నుచ్చరించెను—

"కేసరిణః ప్రతాపేన భయవిదగ్ధచేతసః
త్రాహి దేవ త్రాహి రాజన్ ఇతి బ్రువంతి భూచరాః"

అనఁగా "ఢిల్లీశ్వరుని సైనికుల దోర్దండప్రతాపముచే భయవిహ్వలచిత్తులమై—విపర్యస్తవ్యతివ్యస్తులమై—"త్రాహి త్రాహి" యని మాత్రము మేమంగలార్చుచుంటి"మని.

నయస్తఖా నీపర్యాయము తన యాహ్లాదమును సంవరణము గావించుకొనలేక యిట్లనియెను.—"భూసురేంద్ర! శాస్త్రమందుఁ దమకుఁగల యద్భుతపాండిత్యమునన్ను మిగుల నానందము గావించెను. తా మిపుడు సంధిరాయబారులై యేతెంచినచో మిమ్ములను శివాజీ నియుక్తపఱచినట్లు నిదర్శనమును గొనివచ్చితిరా?"

పాఱుఁడపుడు గంభీరభావమున వసనాభ్యంతరమునుండి నిదర్శనపత్రమును వెలికిఁదీసి ఖానుచేతికొసంగెను. నయస్తఖాను పత్రమును చాలసేపటి దనుకఁ జూచి "బాగుగనున్నది. నిదర్శనపత్రమును జూచి

సంతుష్టాంతరంగుఁడనైతిని, ఇపుడా చరింపవలయు ప్రస్తావనము నెఱింగింపుఁడ"ని పలికెను.

మహాదేవుజీ—ప్రప్రథమముననే మీకు జయము చేకూరిన పిదప నిఁక యుద్ధమొనరింపవలసిన యగత్యమేమియు లేదని మా ప్రభువు నుడివెను.

సయస్తఖాను—శబాస్ ! బాగుగ నున్నది.

మహాదేవుజీ—సంధికొఱకై యతఁ డుత్సుకుఁడై యుండెను.

సయస్తఖాను—బాగుగ నున్నది,

మహాదేవుజీ—ఇప్పు డేయేనియమముల ననుసరించి ఢిల్లీశ్వరుఁడు సంధికొఱకై సమ్మతించునో తాము తెలుపవలయును. అవెఱిఁగినచో వాని ననుసరించి ప్రవర్తించుటకతఁడు యత్నించును,

సయస్తఖాను—ఢిల్లీపతి యధీనతాస్వీకార మొనరింపవలయును. అందులకు మీ ప్రభువు సమ్మతించునా?

మహాదేవుజీ—అతని సమ్మతి కాని యసమ్మతిగాని తెలుపుటకు నాకేమియు నధికారము లేదు. మహాశయులైన తాము నుడివిన దంతయు మాతేని కెఱింగించెదను. అతఁడు మీవాక్యము లన్నిఁటిని వివేచనముఁ గావించి సమ్మతి యగునది కానిది తమకుఁ బిమ్మటఁ దెలిపెదరు.

సయస్తఖాను—బాగుగనే యున్నది. ప్రథమనియమ మేమన? అతఁడు ఢిల్లీ భర్త యధీనమును స్వీకార మొనరింపవలయును. ద్వితీయ నిబంధన మేమన; చక్రవర్తి సీన లేయేదుర్గముల నాక్రమించుకొనెనో, యవన్నియు ఢిల్లీశ్వరుని స్వాధీనమందే యుండవలయును. తృతీయనియమ మేమన; సింహాగరు మొదలగు మఱికొన్ని దుర్గములను మీరు వదలివేయవలెను.

మహాదేవుజీ—అవేవేవి ?

సయస్తఖాను—ఆవిషయము నొకటి రెండు దినములలోఁ బత్రము ద్వారా తెలిపెదను. చతుర్థనియమ మేమన; అవశిష్టములైన దుర్గములను దేశమును శివాజీ తన యధీనమందుంచుకొన వచ్చును. కాని యతఁడు ఢిల్లీశ్వరుని యాజ్ఞకు బద్ధుఁడైయుండి, వానిని జాగీరుల రూపముగనే యెంచుకొనుచు యట్లొక పత్రమును లిఖించి చక్రవర్తికి సమర్పింపవలయును. ఈవిషయములన్నియు మీరు మీ ప్రభువున కెఱింగించి, యిందుల కతఁడు సమ్మతించునది లేనిది నాకు మూఁడు నాలుఁగు దినములలోనే తెలుపవలయునని పలుకుఁడు.

మహాదేవుజీ—మీయాదేశాను సారముగ వర్తించెదను. మన సంధిప్రస్తావన జరుగుచున్నది గదా ! అది స్థాపనమగు నంతదనుక యుద్ధమాగి పోవచ్చునా ?

సయస్తఖాను—అట్లది యాగుట వలనుపడదు, మహారాష్ట్రులు ధూర్తులని నేనెఱుఁగకపోను. కపటాచారులైన వారిని విశ్వసింపరాదు. వారి కసాధ్యమైన దుష్కృత్యమేమియు లేదు. సంధిస్థాపనము పూర్తిగాఁ గానంతవఱకు రణము జరగుచునే యుండవలయు. యుద్ధమొనరించుచు మీకుఁజాల యనిష్టఁ గావించెదము. చేతనైనచో మీరుకూడ నట్లే యాచరింపుఁడు.

“ఏవమస్తు” అని విప్రుఁడు సెలవుఁదీసికొనెను. అతని నేత్రములనుండి యగ్నివిస్ఫులింగములు బహిర్గతము లగుచుండెను.

అతఁడు మెల్లమెల్లగాఁ బ్రాసాదమునుండి యవతీర్ణుఁడై, ప్రత్యేక ద్వారమును, ప్రతిగృహమును బాగుగఁ బరీక్షించి మెల్లగ వెలుపలకుఁ బోయెను. మొగలాయి ద్వారరక్షకుఁడదిగాంచి, యొకించుక విస్మితుఁడై. “దూత మహాశయా! యేమి మీరు చూచుచుండి” రని ప్రశ్నించెను.

"ఈగృహములందు మాశివాజీ ప్రభువు బాల్యకాలమున గ్రీడల సలిపెను. అందుచే వీనిని వీక్షించుచుంటిని. ఇది మీ హస్తగతమైపోయెను. ఒకదాని వెనుక నొకటి చొప్పున మాదుర్గములన్నియు మీకు స్వాధీనమగును కాఁబోలు! హా భగవానుఁడా!! కాలగతి యెట్లుమాఱెను!!!" అని మహాదేవుజీ యాభృత్యున కుత్తరు వొసఁగెను.

భృత్యుఁడు మందహాసముఁ గావించి "అందుకొఱకై వృథాగా ఖేదపడిన మాత్రమేమి ప్రయోజనమున్నది? నీకార్యము నీవు చూచుకొమ్మ"ని నుడివెను.

తోడనే యాబాపఁడు బహుజనాకీర్ణమైన పునానగరరాజపథముగుండా చని క్షణములో నంతర్హితుఁడై పోయెను.

ఆరవప్రకరణము.

శుభకార్యపురోహితుఁడు.

బ్రాహ్మణుఁడు పూనానగరమందలి చాల పథముల నతివాహనమొనరించి పోవు ప్రదేశముల నన్నిఁటిని బాగుగఁ బరీక్షింపుచుండెను. అతఁడు పూనానగరబజారునకుఁ బోయి యచట యంగడుల యొద్దనిలచి పురమందలి నానావిషయముల నెఱిఁగి పిదప రాజపథము నుండి బహిర్గతుఁడై యొకసందులోఁ బ్రవేశించెను. దీపములన్నియు నిర్వాణమగుటచే నాపథమంతయు నంధకారబంధురమైయుండెను. నాగరికులందఱు తమతమ గృహకవాటములను బంధించుకొని సుషుప్తిమగ్నులైయుండిరి.

విప్రుఁడేకాకియై బహుదూరముచనెను. ఆకసమంతయునంధకారమయమైయుండెను. ఒకటి రెండుతారలుమాత్రము మిణుగు_మిణుగుమనుచు గన్పట్టుచుండెను. నాగరికులందఱు నిద్రించుచుండిరి. జగమంతయు నిస్తబ్ధముగనుండెను. పాఱునఱఁదన వెనుక నేదో పదశబ్దమగుచున్నట్లు సందియముఁగలిగెను. అతఁడకస్మాత్తుగనిలచిపోయెను. కాని ఆపదశబ్దమిఁక వినరాకుండెను.

అతఁడు మరల నడువసాగెను. క్షణకాలమైనపిదప మరల తన్ననుసరించి యెవరోవచ్చుచున్నట్టు లతనికిశంకగలిగెను. బ్రాహ్మణుని హృదయ మొకించుకచంచలమయ్యెను. ఈగభీరనిశీథమందెవరతనిని యనుసరించివచ్చుచుండిరి? శత్రువులేరైన నతనినిగుర్తించిరా యేమి? ఉద్వేగపరిపూర్ణహృదయమున నతఁడుక్షణకాలము చింతించి నిశ్శబ్దముగఁ జులానిర్మితమైన యొరనుండితననిశిత కరవాలమును వెలికిఁదీసి, పథపార్శ్వమునందు నిలచి గభీరాంధకారములోనికి క్షణకాలము నిరీక్షణమొనరించుచు నటులనే నిలువఁబడియుండెను. ఏమి? ఎవరును లేరే! అందఱును నిద్రించుచునేయుండిరి. నగరముశబ్దశూన్యమై నిస్తబ్ధమైయున్నది.

సందిగ్ధమనస్కుఁడైన యాపుడమిఱేఁడు లోకపూర్ణమైన బజారులోనికిఁ దిరిగిపోయెను. నానాజాతులవారుసుయింకను నచటిదుకాణములకడ క్రయవిక్రయములను గావించుచుండిరి. వారలలోఁగలిసి వెడలిపోవుట కతఁడు యత్నించెను. మరలనచటనుండి వైళంబ నతఁడొక క్షుద్రపథమందుఁ బ్రవేశించి, పిదప నన్యమార్గములగుండా బోయి నగరాభ్యంతరమును సమీపించెను. అతఁడు నిశ్శబ్దముగనచట శ్వాసరుద్ధముఁ గావించి నిలచిపోయెను. శబ్దముమాత్రము లేదు. నలువైపులను పథములగుపడుచుండెను. కుటీర సౌధములాది ప్రదేశములన్నియు నిస్తబ్ధముగ నుండెను. దుర్భేద్యాంధకారముచే నైశగగనము సమస్తజగము నావృతముఁ గావించివైచెను. అపుడకస్మాత్తుగా నేదోయొక చీత్కారశబ్దము విననయ్యెను. బ్రాహ్మణుని హృదయము కంపితమై పోయెను. అతఁడట్టులె నిలువఁబడిపోయెను,

క్షణకాలమైనపిదప నాశబ్దము మరల వినవచ్చెను. మహాదేవుజీ భయరహితుఁడయ్యెను. ఆపురపహారావాండ్రు గస్తీఁదిరుగుచుండిరి. దుర్భాగ్యవశమున మహాదేవుఁ డేపథమున నుండెనో యందే యానైశ ద్రిమ్మరులుఁ బ్రవేశించిరి. మార్గ మతిసంకీర్ణమై యుండెను. విప్రుఁడు తనకృపాణమును మరల వెలికిఁదీసి యాదుర్భేద్యాంధకారమున నిలచి యుండెను.

ప్రహరులలో నొకఁడు మెల్లమెల్లగ నటునిటు జూచుచు నాతావుఁ జేరెను. మహాదేవుజీ నిలచియున్నప్రదేశమువైపుగ నతఁడు జూచెను. విప్రునిహృదయము కంపింపసాగెను. శ్వాసమును రుద్ధపఱచివైచి కరమున కరవాలముధరించి యతఁడటులే నిలచి యుండెను.

ప్రహరుఁడంధకారమున నేమియుఁగాంచలేక నాపథమునుండి వెలుపలకుఁ బోయెను. మహాదేవుజీ మెల్లమెల్లగా నచటనుండి బయటకు వెడలిపోయి లలాటమందలి స్వేదబిందువులను మోచనముగావించుకొని పిదపనచటకు సమీపమునయున్న యొకద్వారమును తట్టెను. నయస్తఖానునకు సంబంధించిన మహారాష్ట్రీయ సేనాని వెలుపలకు వచ్చెను. ఆయిరువురు వ్యక్తులు నతిసంగోపనమున నగరమధ్యమందు గోపనీయమై మనుష్యాగమ్యమైన యొందుతావుఁ జేరి యటఁగూరుచుండి తమలోఁదామిట్లు ప్రసంగించుకొనిరి.

విప్రుఁడు—అన్నియు నమరినవా?

సేనాని—అమరినవి.

విప్రుఁడు—అనుమతిపత్రమును పొందితివా?

సేనాని—పొందితిని.

మరలనస్పష్టశబ్దము వినవచ్చెను. మహాదేవుజీ యీపర్యాయము క్రోధముచే రక్తనయనుఁడై ఖడ్గహస్తుఁడై ముందునకరిగి, యంధకారమునఁ జాలసేపు చూచెను. ఏమియు నతనికిగనుపడలేదు. మెల్ల

మెల్లగా వెనుకకువచ్చి సేనానితో నిట్లనియెను. "రిక్తహస్తుఁడవై వచ్చితివా?"

సేనాని కటిదేశమునుండి కరవాలమును వెలుపలకుఁదీసి మహాదేవునకుఁ జూపెను. విప్రుఁడదిగాంచి యిట్లనెను. మంచిది. సతర్కుఁడవై యుండుము. వివాహమెప్పుడగును?

సేనాని—రేవతి దినముననే.

విప్రుఁడు—అనుమతిని పొందితివా?

సేనాని—ఆఁ. పొందితిని.

విప్రుఁడు—ఎందఱు మనుజులకు?

సేనాని—వాద్యకరులు పదిమందికిని యస్త్రధారులు ముప్పదిమందికిని మించి యనుమతిఁ బొందలేకపోతిని.

విప్రుఁడు—వారలే చాలును. ఏసమయమున?

సేనాని—రాత్రిఝాము పొద్దుపోయినపిదప.

విప్రుఁడు—మంచిది. ఈవైపునుండియే పెండ్లి యూరేగింపు ఆరంభము కావలయును.

సేనాని—అవునది నాకుజ్ఞాపకమున్నది.

విప్రుఁడు—భజంత్రీలు వాద్యము నెక్కుడుగ సలుపవలయును జుమీ?

సేనాని—ఆవిషయమున మీరు తెలిపినదికూడ నాస్మరణమందున్నది.

పుడమితేఁడపు డోకించుక మందహాసముఁ గావించి యిట్లనియెను. "నేనాశుభకార్య పురోహితుఁడను. ఆశుభకార్యఘటనమే సమస్తభారతవర్షమును యుత్సహింపఁ జేయవలయును.

అపుడకస్మాత్తుగ నెటనుండియో యమ్మొకటి వాయుపథము

గుండావచ్చి బ్రాహ్మణుని వక్షస్థలమునకుఁ దగిలెను. ఆయమ్మువలనఁ బ్రాణనాశము గలుఁగుట నిశ్చయము. కాని అది విప్రుని యంగీకిదగిలి క్రిందఁబడిపోయెను.

మరలనొక క్షుద్రకుఠారము పాఱునిపైఁ బడియెను. దాని యాఘాతముచే నతఁడు భూమిపైఁ బడిపోయెను. కాని దుర్భేద్యమైన యతని కవచము భిన్నము కాలేదు. భూసురుఁడు లేచెను. నిష్కోషితాసిహస్తుఁడై యొక దీర్ఘకాయ మొగలాయియోధుఁడు సమ్ముఖమున నిలచెను. అతఁడు చందాఖాను.

నేఁడేసభయందు సేనాపతియైన సయస్తఖాను చందాఖాను భీరుఁడని వచించెను.

చందాఖానుని కేశపాశము శుక్లమైపోయెను. ఇట్టియపవాదనెపుడును యెవండును నతనిపై మోపలేదు. అతఁడు మనమందే మర్మాంతిక వేదనము ననుభవించి యదన్యులకు దెలుపఁబనిలేదనియుఁ గార్యరూపముననే దనయపవాదమును తొలగించి వైచుటకు బ్రయత్నింపవలెననియు లేకున్న నీద్వంద్వయుద్ధమందే దనతుచ్ఛప్రాణముల వదలుదుననియు దృఢనిశ్చయముఁ గావించుకొనియెను.

బ్రాహ్మణుని యాచరణములనుఁ గాంచినతోడనే ఖానునకు సందేహముఁ గలిఁగెను. అతఁడుశివాజీని బాగుగ నెఱుఁగును. శివాజీయొక్క యసాధారణశక్తి, అతనియసంఖ్యములైన దుర్గములు, యపూర్వద్రుతగాములైన యశ్వారోహకులసేన, అతని హిందూరాజ్య స్థాపనేచ్ఛ, హిందూస్వాధీనతా స్థాపనదృఢ ప్రతిజ్ఞ మొదలగు విషయములన్నియుఁ జందాఖానున కగోచరములు కావు. మొగలాయీలతో సమరమారంభించిన తోడనే శివాజీ పరాజయస్వీకార మొనరించి సంధి యాచనమాచరించుట కేమియు సందియములేదు. కాని యీబ్రాహ్మణుఁడు

శివాజీయొక్క నిదర్శనపత్రమునుచూపెను. ఈబాపఁడెవఁడు? ప్రచ్ఛన్నవేషుఁడైన యీతఁడెవండై యుండును?

విప్రుని వాక్యములవలన చందాఖానునకు శంకదోఁచెను. మహారాష్ట్రనిందను వినినపు డతనినయనములు ప్రజ్వలిత మగుటఁ గూడ ఖానుచూచి యుండెను. ఈసందేహములను గుఱించి యతఁడు సయస్తఖానున కేమియు నెఱింగింపలేదు. సత్యమువచించి యతఁడు మరలనెందుకు తిరస్కరింపఁ బడవలయును? కాని యీకపటదూతను బట్టవలయునని యతఁడు మనమందు సంకల్పించుకొనెను. అప్పటినుండి యతఁడు దూతననుసరించి వచ్చుచు ప్రతిపథమందును యదృశ్యభావమున నడచుచు నతనిజాడలనన్నిఁటి నెఱుంగుచుండెను. ముహూర్తకాలమైనను బ్రాహ్మణుఁడు చందాఖానుని నయనములనుండి బహిర్భూతుఁడు గాలేకపోయెను. సేనానికిని విప్రునకును జరగినసంభాషణముగూడ జందాఖాను వినెను. తీక్ష్ణబుద్ధిగల యీయోధుఁడంతయు గ్రహించి, యీదూతను వధించి సేనాని సయస్తఖాను కడకుఁగొనిపోయి యతనికిఁదగు శాస్తినొసఁగ దృఢనిశ్చయముఁ గావించుకొని యాత్మగతమున నతఁడిట్లనుకొనియెను. "సయిస్తఖానుఁడా! భండనోద్యోగమున నేసికేశములను వృథాగా శుక్లముగావింపలేదు. నేనుభీరుఁడనుగాను. ఢిల్లీశ్వరుని విరుద్ధాచరణుఁడనుగాను. నేనీగూఢయంత్రముల నన్నిటిని నీకడఁ బ్రకాశముఁ గావించినపిమ్మట నీప్రాచీనదాసుని వాక్యములను నీవునిర్లక్ష్యము చేయఁజాలవు." కాని యాశ మాయావినికదా!

మహాదేవుఁడు భూమినుండి లేచుచుండఁగాఁ దనయమ్ముకుఠారములు వ్యర్థములై పడియుంటఁగాంచిన చందాఖానతనిపైఁబడెను. విప్రుని కవచఖడ్గములతనికపుడు తగుల ఖానునేలపైఁ గూలెను, కాని యామొగలాయి త్రుటిలో లేచి భండనమాచరింప సాగెను.

"ధూర్తుఁడా! నీవా నన్ననుసరించుచుంటి" వని మహాదేవుజీ తనకృపాణము నెత్తి దానినాతనిపై ఝుళిపించెను. నిమేషములో నాని శిత కరవాలము చందాఖానుని వక్షస్థలమునఁ జొచ్చిపోయెను. మొగలాయుని మృతదేహము ధరాతలమునఁ గూలెను.

బ్రాహ్మణుఁడపుడు తనయధరోష్ఠముపై దంతస్థాపనముఁ గావించెను. అతని నయనములనుండి యగ్నివిస్ఫులింగములు వెలువడుచుండెను. మెల్లమెల్లగా నతఁడు ఖడ్గమును ఖానువక్షస్థలమునుండి వెలికిఁ దీసి దానినిదాచిపైచి యిట్లనియెను. "నయస్తఖానుఁడా! మహారాష్ట్రులను నిందించినందుల కొదవిన ప్రథమఫలమిది. భవానీ యనుగ్రహమున ద్వితీయఫలమెల్లి గన్పట్టును."

యోధకర్తవ్య కార్యనిరతుఁడైన చందాఖాను జీవనదానమొనరించినపుడు సేనాపతియైన నయస్తఖాను సుఖనిద్రఁజెందుచు శివాజీని వశీకరణముఁ గావించుకొనినట్లు సుఖస్వప్నమును గాంచుచుండెను.

మహారాష్ట్రీయ సేనాని యీ ఘోరఘటనముఁగాంచి కడువిస్మితుఁడై యిట్లనెను. "ప్రభూ! యేమి గావించితిరి? రేపీవిషయమై చాల కోలాహలము జరుగును. మనసముదయ సంకల్పనలన్నియు వృథలగునేమోగదా!"

భూసురుఁడు—ఏమియుభయము లేదు. నేఁడు సభామధ్యమున చందాఖా నవమానితుఁడగుట నేనెఱుఁగుదును. కతిపయదినములవఱకు నితఁడు సభకుఁ బోకున్నను యేరును సందేహింపరు. ఈమృతదేహము నీగభీరకూపమున నిక్షేపముఁగావింపుము. రేపటిరాత్రి ఝాముపొద్దుపోవునపుడుజ్ఞాపకమున్నదా?

సేనాని—ఆఁ, జ్ఞాపకమున్నది—రాత్రిఝాముగునరికే!

పిదప బ్రాహ్మణుఁడు పూనానగరమునుండి వెడలిపోయెను. మూఁడునాలుఁగుతావులందు ప్రహరులతనినిఁ బట్టుకొనిరి. అతఁడు నయ

స్తఖానుని స్వాక్షరిత యనుమతిపత్రమును వారలకుఁజూపి, నిరాపదుఁడై పూనానుండి బహిర్గతుఁడై చనెను.

ఏఁడవప్రకరణము

రాజాయశవంతసింహుఁడు.

రాత్రి రెండుఝాములైనపిదప రాజపుత్రుఁడైన యశవంతసింహుఁడేకాకియై నిజశిబిరమందువసించియుండెను. హస్తమును గండస్థలమున నిడికొని యాగభీరనిశీథమందతఁడేదియో చింతించుచుండెను. సమ్ముఖమున నొకప్రదీప ముజ్వలించుచుండెను. శిబిరమందు నేఁడొరు లేరునులేరు. అపుడు మహారాష్ట్రీయ దూతయొకఁడు తేనిదర్శనమాచరింపవచ్చెనని యొకభృత్యుఁడతని కెఱింగించెను. యశవంతుఁడతనిని లోనికిఁగొనిరమ్మని ముదల నొసఁగి దూతయాగమనార్థమై ప్రతీక్షించియుండెను.

మహాదేవన్యాయశాస్త్రిజీ శిబిరమునఁబ్రవేశించెను. యశవంతుఁడతనినిసాదరముగ నాహ్వానించి యటనొక యాసనముపై నుపవసింపుఁడనిపలికెను. ఉభయులును నుపవిష్టులైయుండిరి.

యశవంతుఁడేదియో చింతించుచు క్షణకాలము నీరవుఁడైయుండెను. మహాదేవుఁడు నిస్తబ్ధముగ రాజపుత్రునిపై సుతీక్ష్ణదృక్కులను బఱపుచుండెను. పిదప యశవంతుఁడిట్లనియెను. నేను మీప్రభువుగారిపత్రము నందుకొంటిని. అందులవిషయములకుఁ బూర్తిగనవగతుఁడనైతిని. అదిగాక నీక యితరప్రస్తావన మేమైననున్నదా?"

మహాదేవుఁడు—ఏప్రస్తావనమునుగాని తమ కెఱింగించుటకు మాప్రభువునన్నుఁ బంపలేదు, ఖేదపడుటకు మాత్రమతఁడు నన్నిటకుఁ బనిచెను.

యశవంతుఁడు—పూనాచాకనదుర్గములు మాత్రము మాహస్తగతములైనవి. వీనికొఱకే నా ఖేదపడుట?

మహాదేవుఁడు—దుర్గనాశమునకతఁడువంతఁజెందుట లేదు. అతనికసంఖ్యములైన దుర్గములున్నవి.

యశవంతుఁడు—మొగలులతోఁ భండన మాచరింపవలయుననియు విషాదమందుఁ బతితుఁడనగుదుననియా యతఁడుదుఃఖించుట?

మహాదేవుఁడు—విషాదమందు పడినపుడు దుఃఖించుట యతని యభ్యాసము కాదు.

యశవంతుఁడు—అటులైన నతఁడువంతఁజెందు టెందులకు?

మహాదేవుఁడు—పురుషసింహుఁడుహిందూరాజతిలకుఁడై వెలింగెనో, యేమహానీయుఁడు క్షత్రియకుల వతంసుఁడో, యేపుణ్యాత్ముఁడు సనాతనధర్మరక్షకర్తయై యుండెనో, అతఁడు నేఁడు మ్లేచ్ఛులదాసుఁడగుటఁగాంచి మా ప్రభువు ఖేదపడుచుండెను.

యశవంతసింహుని ముఖమండల మీషద్రక్తమైపోయెను. మహాదేవుఁడది చూచీచూడనట్లభినయించి మరల గంభీరస్వరముననిట్లు పలుకఁదొడంగెను. "ఉదయపూరురాణావంశతిలకమైన రమణిని యేపుణ్యాత్ముఁడు వివాహమాడెనో, మార్వార రాజచ్ఛత్రమెవని హస్తకముపైధృతమైయుండెనో, సిప్రాతీరమున నెవని బాహువిక్రమమును గాంచి యౌరంగజేబు భయకంపితకాయుఁడై విస్మయచిత్తుఁడయ్యెనో, సమగ్రభారతవర్షమే వీరుని సనాతన హిందూధర్మస్తంభమని దలంచెనో, సీమసీమలందును, గ్రామగ్రామములందును, మందిర మందిరములందును యేమహాత్ముని జయనిమిత్తమై భూసురేంద్రులును సర్వవర్ణహిందువులును జగదీశ్వరుని నికటమునఁ బ్రార్థనఁగావించిరో; అట్టిపూజనీయుఁడు నేఁడు ముసల్మాను పక్షావలంబియై హిందువులతోఁ బవరమాచరింపయత్నించుటఁగాంచి మా ప్రభువు క్షుబ్ధుఁడైపోయెను. రాజేంద్రా! నేను

సామాన్యదూతమాత్రుఁడను. నేనేమివచించుచుంటినో యెఱుఁగఁజాలను. నాయందపరాధమున్నచో మన్నింపవేఁడుచున్నాఁడను. కాని యీసమరసన్నాహ మెందులకు? ఈసేనానీకము లెందులకు? ఈవిజయపతాకములన్నియు నెందులకు నెలకొల్పఁబడినవి? స్వాధికారము నభివృద్ధిఁజేయుటకా? లేక క్షత్రియోచితయశోలాభార్థమాయేమి? తాము క్షత్రియకులభూషణులు. మీరే విచేచనముఁగావించుకొనుఁడు. నాకేమియు బోధపడుట లేదు."

యశవంతుఁడధోవదనుఁడై యుండెను. మహాదేవుఁడు మరలనిట్లు పలుకసాగెను. "మీరు రాజపుత్రులు. మహారాష్ట్రులు, రసపుత్రపుత్రులు, పితాపుత్రులకు రణముజరగుట యసంభవము; భవానీదేవి స్వయముగ నీయుద్ధమును నిషేధముఁగావించెను. తామాజ్ఞాపింపుఁడు; మేముదానినిఁ బాలనమొనరించెదము. రసపుత్రులగౌరవమే యనాథభారతవర్షమున కేకమాత్రపు గౌరవము. రాజపుత్రుల యశోగీతములను మారమణీమణులింకను పాడుచునేయుందురు. రసపుత్రుల యుదాహరణములననుసరించి మా బాలకగణములు శిక్షితులగుచుందురు. క్షత్రియకులతిలకమా! రాజపుత్రశోణితమందు మాకృపాణములు రంజితములుఁ గాకపూర్వమే మహారాష్ట్రులనామము విలుప్తమైపోవుగాక! మహారాష్ట్రులరాజ్యము ధ్వంసమగుఁగాక! మేము కరవాలకోదండములను బూర్తిగఁద్యజించివైచి మరల హాళికులమైచరింతుముగాక!"

యశవంతసింహుఁడపు డుత్తమాంగము నొకించుకనెత్తి మెల్లగ నిట్లనియెను. "దూతప్రవరా! నీవాక్యము లతిమధురములైయున్నవి. కాని నేను ఢిల్లీశ్వరుని యధీనుఁడనై యుంటిని. మహారాష్ట్రులతోఁ బోరు సలుపుదునంచువచించి యిటకరుదెంచితిని. మహారాష్ట్రులతో రణమాచరింపవలయును."

మహాదేవుఁడు—అటులైన నూరులకొలఁది స్వధర్ములను నాశన మొనరింపుఁడు. హిందువుల మస్తకచ్ఛేదన మొనరింపుఁడు. బ్రాహ్మణుల వక్షములందుఁ గృపాణములను గ్రుచ్చివైచుఁడు. క్షత్రియులశోణితస్రోతమున క్షత్రియశోణితస్రోతమును కలిపివేయుఁడు. శేషమున మ్లేచ్ఛులకు సంపూర్ణజయము చేకూరును.

యశవంతుఁడు నిర్విణ్ణుఁడైపోయెను. ఉద్వేగమును సంవరణముఁ గావించుకొని యతఁడాలోకించుక కర్కశభావమున నిట్లనియెను. "ఢిల్లీశ్వరుని జయార్థముకొఱకే రణమాచరింపను. నేను నీప్రభువుతోనే తిరుగ మైత్రిసలుపుదునా? శివాజీవిద్రోహాచారి. చతురుఁడైన యామహారాష్ట్రుఁడు నేఁడొనరించిన యంగీకారమున కెల్లి విరుద్ధముగ నాచరించును."

ఈపర్యాయము విప్రునినయనములు ప్రజ్వలితములయ్యెను. అతఁడుమెల్లగనిట్లనియెను, "మహారాజా! సావధానుఁడవై యాలింపుము. అలీకనిందనేరును భరింపఁజాలరు. హిందువుల నికటమందుపలికి దాని కివ్యతిరేకముగ శివాజీ యెపుడాచరించెను? విప్రులయొద్దఁగావించిన వాగ్దానమును, క్షత్రియులకడ నొనరించిన ప్రతిజ్ఞను, యెపుడాతఁడు మఱచెను? దేశమందు శతశతగ్రామములున్నవి. శతశతదేవాలయము లున్నవి. ఈతావులన్నిఁటి ననుసంధానముఁగావించి సత్యపాలన మొనరించుటయందును, బ్రాహ్మణులకాశ్రమ మొసఁగుటయందును, హిందువులకుపకారముఁ గావించుటయందును, గోవత్సాదులను రక్షణమొనర్చుటయందును, దేవదేవులకు పూజలుఁగావించుటందును శివాజీయెపుడు పరాఙ్ముఖుఁడైయుండెనో తెలుపుఁడు. సరే; యిఁకముసల్మానులతోఁ సలుపుపోరా! జేతావిజితాదులమధ్య యెపుడైన నేదేశమందైన సఖ్యత యుండెనా? పక్షినాథుఁడు సర్పమును ధారణముఁగావించుకొనునపుడది మృతతుల్యమైయుండును. అట్లనిమనమది మరణించినదని భావించి

సర్పమునుఁ బట్టినమాత్రముననే జర్జరితశరీరమున నాగరాజుపైకెగఁబ్రాకి సమయముఁజూచి దంశన మొనరించును. ఇది విద్రోహాచరణమా? లేక స్వభావరీతియా? శునకము శశమును బట్టఁబ్రయత్నించినపుడది ప్రాణరక్షణార్థమై యెన్నియో జతనములనుసలిపి యొకదిక్కుగాఁబలాయన మొనరింపయత్నించి యకస్మాత్తుగా నన్యదిక్కుగాఁ బరువెత్తునుగదా? ఇది చాతురమా? లేక స్వభావరీతియా? యావజ్జీవములకుఁ బ్రాణరక్షణార్థమై యనేకయుపాయయత్నములను నేర్పిన జగదీశ్వరుఁడు మనుజులకు వానిని నేర్పియుండలేదా? మనప్రాణమునకంటె నెక్కుడై, జీవనములకంటె మిన్నయైన స్వాధీనతను శతశతవత్సరములనుండి హరణముఁగావించుచు హృదయశోణితసన్నిభములైనబల, మాన, దేశ, గౌరవ, ధర్మములను వినాశనమొనరించుముసల్మానులతోనా మనసత్య సంబంధసఖ్యతలు? వారలయొద్దనుండి యేయుపాయమున మనజీవన స్వరూపమైన స్వాధీనతను, జాతిగౌరవస్వధర్మములను రక్షణముఁగావింపయత్నించుచుంటిమో ఆయుపాయము చతురతయా? ఆయుపాయము నిందనీయమా? జీవరక్షార్థపలాయన పటుమృగశీఘ్రగతి విద్రోహమా? శాబకములను బ్రదికించుకొనుటకై వానినన్యస్థలమునకుఁ గొనిపోవు శకుంతలముయొక్క జతనము నిందనీయమా? క్షత్రియకులవతంసమా! అనుదినమును ముసల్మానులనికటమున మహారాష్ట్రియుల చతురతానిందను వినుచునేయుంటిమి. కాని హిందూప్రవరా! హిందూజీవన రక్షార్థమైయున్న యేకమాత్రపుయుపాయమును నిందింపకుఁడు. శివాజీని దూషింపకుఁడు." మహాదేవుజీయొక్క జ్వలంతనయనద్వయము బాష్పవారిచేఁ బ్లావితముఁగాఁదొడఁగెను.

బ్రాహ్మణుని చక్షులందశ్రుబిందువులఁ గాంచినతోడనే యశవంతుఁడు ఖిన్నుఁడైపోయెను. అతనిహృదయమందు వేదనముత్పన్నమాయెను. అపుడతఁడిట్లనియెను. "దూతప్రవరా! నేనుమీకు శ్రమ

నీయఁదలఁచుట లేదు. నేనువచించినదానిలో నపరాధము లేమైనను న్న
చో మన్నింపుఁడు. రసపుత్రులుకూడ స్వాధీనతారక్షణముఁ గావించుకొ
నుచుండిరి. కానివారలు సాహసమును సమ్ముఖరణమును గాక నన్య
యుపాయముల నెఱుంగరు. మహారాష్ట్రులుకూడ నాయుపాయము నే
యవలంబనముఁగావించి ఆవిధముగనే ఫలప్రాప్తినొందరా యని
మాత్రము నేనంటిని.

మహాదేవుఁడు—రాజేశ్వరా! రసపుత్రులకుఁ బురాతనస్వాధీన
తయున్నది. విపులార్థమున్నది. దుర్గమపర్వతములును మరువేష్టితదేశ
ములును యున్నవి. సుందర రాజధాని యున్నది. సహస్రవత్సరయసా
ధారణ శిక్షయున్నది. మహారాష్ట్రులకు వీనిలో నేమియున్నది? వారలు
దరిద్రులు—చిరపరాధీనులు. వారలకిదియే ప్రథమ రణశిక్ష. మీదేశ
ము నేరైన నాక్రమణముఁ గావించుకొనినచో, పురాతనరీత్యనుసార
ముగ మీరు ఖండన మాచరించెదరు, పురాతన దుర్ధర్ష తేజో విక్రమ
ములనుఁ బ్రకాశముఁ జేయుదురు. అసంఖ్యాక రసపుత్రవాహినుల స
మ్ముఖమున ఢిల్లీశ్వరుని సేనలు పలాయన మగును. మాసీమయాక్ర
మింపఁ బడినచో మేమేమి యొనరింపవలయును? పూర్వరీతిగాని, రణ
శిక్షగాని లేదు. అసంఖ్యాసైన్యములు లేవు. ఉన్న సేనానీకు లెపుడును
రణమును జూడలేదు. కాబూలు, పాంచాలము, అయోధ్య, విహారము
మాల్వా మొదలగు దేశముల నుండియు, వీరప్రసవినియైన రాజస్థాన
భూమినుండియు ఢిల్లీశ్వరుఁడు సహస్ర సంఖ్యాకులైన యోధులను,
యద్వితీయరణ నిపుణులను ప్రేరేపించి, యున్నతములైన రణాశ్వము
లను, మదించిన భండనేభములనుఁ బురికొల్పి, కోదండ, కృపాణ, పా
రుద, కుఠారములాది భిన్నభిన్న సమరాయుధములను, రౌప్యముద్ర
లను, స్వర్ణనాణెములను సహస్రసంఖ్యాలైన శకటములందు రాశీకృత
ముఁ గావించినచో, దరిద్రమహారాష్ట్రులేమి గావింపఁగలరు? వారల

కట్టి యసంఖ్యాకములైన యుద్ధనిపుణ వాహినులు లేవు. అట్టిగజ
తురగములు లేవు. అట్టివిపులార్థము లేదు. పర్వతయుద్ధ త్వరితగతులు
గాక వారలకేక నన్యోపాయ మేమిగలదు? క్షత్రియకుల తిలకమా!
జీవనప్రారంభమందే దారిద్ర్యము ననుభవించు వారలకీ యాచరణము
గాక నేకవేఱుపాయ మేమిగలదు? జగదీశ్వరుని కరుణచే మహారాష్ట్ర
జాతి దీర్ఘజీవియగుగాక! వారల యర్థమును యుద్ధాయోజనోపాయ
మును సంస్థాపనములైనచో, యిన్నూరు మున్నూరు వత్సరముల రణ
శిక్ష యైనచో, వారలుకూడ రసపుత్రుల యసాధారణ గుణములనను
కరణముఁ గావించెదరు.

ఈవాక్యములన్నియు విని, యశవంత సింహుఁడు వ్యాకులాకుల
స్వాంతుఁడై కరమందు లలాటము నిడికొని యేకాగ్రచిత్తుఁడై యేది
యో చింతింపఁ దొడంగెను. మహాదేవుఁడు తనవాక్యములు నితాంత
నిష్ఫలములు గాకుండుట గ్రహించి మరల నిట్లు వచింపఁ దొడంగెను.
“తాము హిందూశ్రేష్ఠులు. హిందూగౌరవ సాధనార్థమై సందేహించె
దరేల? హిందూధర్మజయము నవశ్యముగఁ దామిచ్ఛగించిరి. శివాజీకి
కూడ నింతకుమిన్న యితరేచ్ఛ యేమియు లేదు. ముసల్మాను శాసన
ధ్వంసకరణము, హిందూమత గౌరవ సాధనము, స్థానస్థానములందు
దేవాలయముల స్థాపనము, సనాతనధర్మ గౌరవవృద్ధి, హిందూశాస్త్ర
లోచనము, భూసురప్రవరులకా శ్రియదానము, గోవత్సాదుల రక్షా
కరణము—యివిగాక శివాజీ కన్యయుద్దేశ్య మేమియు లేదు. ఈవిషయ
ములందుఁ దామతనికి సహాయ మొనరించుటకు విముఖులైనచో స్వ
హస్తశక్తిచేతనే యీకార్యసాధనముఁ గావింపుఁడు. మీరీదేశముయొక్క
రాజత్వమును గ్రహణముఁ గావింపుఁడు; ముసల్మానుల యుక్కడగిం
పుఁడు; మహారాష్ట్రసీమయందు హిందూస్వాధీనతను నెలకొల్పుఁడు;
మీరాదేశ మొసఁగినచో దుర్గద్వారములన్నియు నీక్షణమందే యు

ద్ఘటితములగును. ప్రజలందఱు దమకుఁగప్పములఁ జెల్లింతురు; మీరు శివాజీకంటె వేయిమడుంగుల బలముగలవారు. అతనికంటె మేధాసంపన్నులు, దూరదర్శులు, శివాజీకంటె సహస్రమడుంగు లుపయుక్తులైనవారు, శివాజీ సంతుష్టచిత్తమున మీయధీనమున నొకసేనాపతియై ముసల్మానులను ధ్వంస మొనరించును. వారినిఁ దునుమాడుటకంటె నతని కన్యేచ్ఛ యేమియు లేదు."

ఈప్రస్తావన వినఁగనే యుచ్చాభిలాషియైన యశవంతుని నయనము లానందముచే నుత్ఫుల్లములయ్యెను. అతఁడు చాలసేపాలోచించెను. కాని యవశేషమున మెల్లగ నిట్లనియెను. మార్వారునకు మహారాష్ట్రము కడుదూరముననున్నది. ఆరెండును యొకేయేలిక యధీనమున నుండుటఁగష్టము.

మహాదేవుఁడు—అటులైనచోఁ దమకుఁదగు ప్రాయముగల పుత్రుఁడున్నచో నతనికి మహారాష్ట్రమునిచ్చి వేయుఁడు. లేకున్న దానిని మీకాత్మీయుఁడైన యోధునకొసఁగుడు. శివాజీ క్షత్రియనృపుల యధీనమునఁ గార్యమొనరించును. కాని యెప్పుడును క్షత్రియులతో భండనమాచరింపఁడు.

యశవంతుఁడు—ఈసమయమం దౌరంగజేబుతోఁ బవరమాచరించి యీదేశమును రక్షించుకొనగలిగిన యాత్మీయుఁడు లేఁడు.

మహాదేవజీ—క్షత్రియసేనాని నెవనినైన నియుక్తుఁ జేయుఁడు హిందూధర్మస్వాధీనతలు రక్షింపఁబడినచో శివాజీయొక్క మనస్కామనము పూర్ణమగును. సానందచిత్తమున శివాజీ రాజ్యపరిత్యాగముఁ గావించి వానప్రస్థావలంబన మొనరించును.

యశవంతుఁడు—అట్టి సేనాపతి యెవఁడును లేఁడు.

మహాదేవజీ—అటులైనచో నెవఁడీ మహాత్కార్యసాధనము గావింపఁగలఁడో యతనికిఁ దోడ్పడుడు. మీసహాయమువలననుతమయా

శీర్వాదఫలముచేతను, శివాజీ నిక్కువముగ స్వదేశస్వధర్మములగౌరవసాధనముఁ గావింపఁగలఁడు. రసపుత్రకులశిరోభూషణమా! క్షత్రియరాజా !! క్షత్రియయోధునకు సహాయ మొనరింపుఁడు, ఈవిషయమున ప్రశంసావాద మొనరింపనట్టియుఁ దమకు ధన్యవాదముఁగావింపనట్టియు హిందువుఁడు భారతవర్షమునఁగాని, దేవత, యాకాశమునఁగాని గానవచ్చుట యసంభవము.

యశవంతుఁడు—ద్విజవరా! మీతర్కమలంఘనీయము. కాని ఢిల్లీశ్వరుఁడు నాతో మైత్రినలిపి, నన్ని కార్యమందు నియుక్తుఁగావించెను. నేనేతీఱున నీయాచరణము నొనరింపను ? అదిభద్రోచితమా ?

మహాదేవజీ—హిందువులను కాఫరులని సంబోధించి ఢిల్లీశ్వరుఁడు వారలపై జిజియాపన్నును స్థాపించుట భద్రోచితమా ? దేశదేశములందునుగల హిందూమందిరములను జొచ్చి హిందూదేవదేవుల నవమానముఁ గావించుట భద్రోచితమా ? వారణాసిపురపవిత్రమందిరమును చూర్ణముఁగావించి దానిప్రస్తరఫలకములతో నాపుణ్యధామమున మశీదు నిర్మాణముఁ గావించుట భద్రోచితమా ? యశవంతసింహుఁడపుడు క్రోధకంపితస్వరమున నిట్లనియెను. "ద్విజవరా! ఇఁక మీరేమియు విశదీకరించి పలుకనక్కఱ లేదు; యథేష్టముగా వచించిరి! నేటినుండియు శివాజీ నామిత్రుఁడు; నేను శివాజీ మిత్రుఁడను! నేఁడు మొదలు శివాజీ ప్రతిజ్ఞయు, నా ప్రయత్నము నభిన్నములు! హిందూ విరోధుఁడైన నాఢిల్లీంద్రుని విరుద్ధమున నింత కాలము పోరు సలిపిన యామహాత్ముఁ డెచట నుండెను ? ఒక మాఱతని నాలింగనమాచరించుకొని, నాయెదయందలి సంతాపమును వాపికొనియెదను."

విప్రవేషధారియైన యాదూత యపుడు తన బ్రాహ్మణవేషమును త్యజించి వైచెను. పాఱుని శిరోవేష్టముక్రింద యోధశిరస్త్రాణముదృష్టమయ్యెను. తులానిర్మితమైన యంగీక్రింద లోహనిర్మితమైన

కవచము ప్రకాశితమయ్యెను! మహారాష్ట్రీయవీరుఁడల్లన నిట్లనెను. "రాజచంద్రమా! ప్రచ్ఛన్న వేషధారుఁడనై తమ సమక్షమునకు వచ్చినందులకు నాపై దోషారోపణ మొనరింపకుఁడు. ఈదాసుఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. మహారాష్ట్రీయ క్షత్రియుఁడు; పేరు మహాదేవుజీ కాదు; దాసుని పేరు శివాజీ!"

యశవంతసింహుఁడు విస్మితుఁడై—హర్షోత్ఫుల్లలోచనుఁడై—చకితుఁడై—ఆ ఖ్యాతనామ మహారాష్ట్రీయ మహాశూరుని—ఢిల్లీశ్వరుని ప్రతిద్వంద్విని—దక్షిణాత్య వీరశ్రేష్ఠుని—శివాజీయశస్తిలకునిఁ గాంచి తనదృక్పరంపరల నట్టె యతనిపైని గుడించియుండెను. క్షణకాలమైన పిమ్మట నా రాజసింహుఁడు లేచి సానందముగ—సజలనయనములతో నొప్పుచు నా పరమశత్రువు నాలింగనముఁ గావించుకొనియెను. శివాజీ కూడ సమ్మానప్రణయపురస్సరముగ ఖ్యాతివడసిన నా రసపుత్రవీరునిఁ గౌఁగిలించుకొనెను

వారలా రాత్రియంతయు బ్రసంగముచే గడపివైచిరి. యుద్ధవిషయములన్నియు స్థిరమయ్యెను. పిదప శివాజీ సెలవుఁగొనియెను. సెలవుఁ దీసికొను సమయమున నతఁడు "మహారాజా! యనుగ్రహించి తా మేరూపముననైన నెల్లి పూనానగరమునుండి కతిపయక్రోసుల దూరమం దుండుట యుత్తమమని పలికెను.

యశవంతుఁడు—ఎందువలన? రేపు మీరు పూనానగరమును హస్తగతముఁ గావించుకొన యత్నించెదరా?

మహారాష్ట్రీయవీరుఁడు మందహాసముఁ గావించి యిట్లనియెను. "కాదు కాదు. రేపటిదినమున నొక వివాహమహోత్సవము జరుగును. మహారాజులు సమీపమందున్నచో శుభకార్యమునకు వ్యాఘాతము కలుఁగవచ్చును."

యశవంతుఁడు—మంచిదటులైన నట్లే గావించెదను. వివాహ

కార్యమంత్రములు న్యాయశాస్త్రమహాశయునకింకను జ్ఞప్తియందున్నవా?

శివాజీ—నిశ్చయముగ జ్ఞప్తియందున్నవి! నాశాస్త్రవిద్యఁ గాంచి, ఢిల్లీసేనాపతియైన సయస్తఖాను విస్మితుఁడైపోయెను. శేషాఖానుగారు మఱొకవిధమైన విద్యఁ జూచెదరు.

యశవంతసింహుఁడు, ద్వారము వఱకు నతనిని సాగనంపుటకై పోయి యతఁడు సెలవుఁగొను సమయమున మరల నిట్లనియెను. "అటులైనచో యుద్ధవిషయమున నెట్టిప్రసంగమైనదో దానిననుసరించి కార్య మొనరింపుఁడు."

శివాజీ—ఆవిధముగ నాచరింపుఁడని ప్రభువులైన శ్రీశ్రీశివాజీగారితో విన్నవించెదను!

యశవంతుఁడు—అవునవును—మఱచితిని. ఆరీతిగ నాచరింపుఁడని మీ ప్రభువుగారికెఱిఁగింపుఁడు.

ఇట్లు పలికి చిరునగవు నగుచు యశవంతసింహుఁడు శిబిరాభ్యంతరమున కరిగెను.

ఎనిమిదవ ప్రకరణము.

శివాజీ.

అరుణోదయమగుతఱికి బ్రాహ్మణవేషధారియైన శివాజీ సింహగరమునఁ బ్రవేశించెను. శిరోవేష్టమును, తులానిర్మితమైన యంగీని యతఁడు తీసి పాఱవైచెను. ప్రాతఃకాలాలోకమున నతని మస్తకము నవిరాజిల్లు శిరస్త్రాణమును, కాయముపైఁగల కవచమును తళతళమని మెఱయఁజొచ్చెను. స్కంధమునుండి లంబితమైన కోదండమును కటిప్రదేశమున విరాజిల్లు "భవానీ" యనఁబరగు ప్రసిద్ధఖడ్గమును చూచ

ఱుల మనముల భయ మొదవఁ జేయుచుండెను. అతని వక్షస్స్థలము విశాలమైయుండెను. శరీర మొకించుక ఖర్వమైయున్నను, బలిష్ఠమైయున్నది. అమ్ములపొది యతని పృష్ఠభాగమున నొకించుక లంబితమై యుండెను. అతఁడు ద్వారమును సమీపించిన తోడనే మురేశ్వరుఁడగు మహారాష్ట్రుఁడతనిని సమీపించి, యానందపురస్సరముగ నతని నాహ్వానించి యిట్లనెను, "భవానికి జయము చేకూరుగాక! మీరుమరల సదనమునకు రాఁగలిఁగితిరి."

శివాజీ—మీయాశీర్వాదఫలమున నేనే విపాదమునుండియుద్ధారము పొందలేకపోతిని ?

మురేశ్వరుఁడు—అంతయు స్థిరమైనదా ?

శివాజీ—అంతయు నయినది.

మురేశ్వరుఁడు—నేఁటి రాత్రియేనా వివాహము ?

శివాజీ—అవును. నేఁడే.

మురేశ్వరుఁడు—నయస్తఖానున కేమియుఁ దెలియలేదా? తీక్ష్ణబుద్ధియైన చందాఖానుకూడ నేమియు నెఱుఁగఁజాలకపోయెనా?

శివాజీ—భీతిఁజెందిన శివాజీ యొద్దనుండి, నయస్తఖాను సంధిప్రార్థనమును ప్రతీక్షించుచుండెను; యోధుఁడైన చందాఖాను చిరనిద్రయందుండెను. అతఁడిఁక యుద్ధమొనరింపఁడు.

మురేశ్వరుఁడు—రాజా యశవంతసింహుఁడేమి యొనరించును?

శివాజీ—మీరు పత్రమందుఁజూపిన యుక్తులన్నియు నతనిమనమును విచలితముఁగావించివైచెను. నేను పోవునరికతఁడు కింకర్తవ్యవిమూఢుఁడైయుండెను. దానింజేసి నా కనాయాసముగఁగార్యసిద్ధియొదవెను.

మురేశ్వరుఁడు—భవానీ కృప యిట్టిదియే! మీరేకాకిమై పోయి యొకరాత్రియందొనరించిన కార్యమును వేయిమంది మనుజులొ

నర్పుట కశక్తులగుదురు. మీరు ప్రవృత్తులైన యసమసాహసమైన కార్యమును గూర్చి తలంచినచో నిపుడుకూడ హృదయముకంపించును. ప్రభూ! యిట్టికార్యమందిఁకెపుడును నిరతులుఁ గాకుండుఁడు. తమకమంగళము వాటిల్లినచో మహారాష్ట్రులగతి యేమగును.?

శివాజీ—మురేశ్వరా! విపాద భయము నాకున్నచో నేనిపుడొక జాగీరుదారునిగనే యుండెడివాఁడను. విపాదమువాటిల్లునని వెఱపొందినయెడల నీమహోద్దేశ్య మెటుల ఫలింపఁగలదు? యావజ్జీవనముగూడ నేను విపాదములందుఁ బతితుఁడనైనను, భవానీ కరుణచే, మహారాష్ట్రదేశమునకు స్వాధీనత రావలయును.

మురేశ్వరుఁడు—వీరశ్రేష్ఠా! మీజయమనివార్యమైనది. భవానీదేవి స్వయముగ మీకుఁ దోడ్పడును. కాని యర్ధరాత్రసమయమున శత్రుశిబిరమున నేకాకులై, ప్రచ్ఛన్నవేషమ్మున—?

శివాజీ—ఇది శివాజీ కభ్యాసమైన కార్యమే. కాని నేఁడు యథార్థముగ మఱియొక మహావిపాదమందుఁబతితుఁడనైతిని.

మురేశ్వరుఁడు—అదేమి ?

శివాజీ—నావంటి మూర్ఖునకుకూడఁ దాము సంస్కృతశ్లోకములను బోధించిరి. తన నామమును దాను లిఖింప శక్తిలేని మనుజుఁ డాశ్లోకములను జ్ఞప్తియందుంచుకొనఁగలఁడా?

మురేశ్వరుఁడు—ఏమి? ఏమిజరిగెను?

శివాజీ—మఱేమియులేదు. నయస్తఖానునిసభకుఁబోయి న్యాయశాస్త్రి మహాశయులు సమస్తశ్లోకములను మఱచిపోయిరి.

మురేశ్వరుఁడు—తదుపరి?

శివాజీ—రెండుమూఁడుమాత్రము జ్ఞప్తియందున్నవి. వానివలననే కార్యసిద్ధియయ్యెను.

శివాజీతో మనకిదియే ప్రథమపరిచయము. ఈసందర్భమున

దతని పూర్వవృత్తాంతమును మనమొకించుక యెఱుఁగవలయును. ఇతిహాస పాఠకులిచ్ఛగించినచో నీప్రకరణ మందలి యవశిష్టయంశమును వదలివేయ వచ్చును.

శివాజీ క్రీస్తుశకము 1627 సంవత్సరమున జన్మించెను. దానిం జేసి మనకథ జరగు కాలమునకతనికి ముప్పదియైదువత్సరముల ప్రాయముండును. అతనితండ్రి పేరు షాహాజీ; పితామహుని పేరు మల్లజీ. ప్రథమాధ్యాయమందు మేము పుత్తనుదేశమునఁ బ్రసిద్ధివడసిన నింబలవంశజులనుగూర్చి యొకించుక దెలిపితిమి. ఆవంశమందుద్భవించిన యోగపాలుఁడైన రావునాయకుని సోదరియైన దీపాభాయిని మల్లజీవివాహమాడెను. కాని యతనికిఁ జాలకాలమువఱకును సంతానము లేకపోవుటచే నహమ్మదునగరవాసియైన షాహాషరీఫను నొకముసల్మాను ఫకీరుకడకు మల్లజీపోయి యతనికావిషయ మెఱింగించి సంతానప్రాప్తియగుటకేదైన నుపాయ మెఱుఁగఁజేయ నతనినిఁ బ్రార్థించెను. పిదప మల్లజీఫకీరులిరువురు కలిసి ప్రార్థనాదికర్మలను జాలఁగావించిరి. తదనంతరమునఁ గొలఁదిమాసములలో దీపాభాయి గర్భవతియై పిదప నొకపుత్రునిఁగనెను. మల్లజీ యపుడానందభరితుఁడై ఫకీరు నామానుసారముగఁ బుత్రునకు షాహాజీ యనునామమిడెను.

ఆసమయమున యాదవరావను ప్రసిద్ధివడసిన సేనాపతియొకండు అహమ్మదునగరమున వసించుచుండెను. అతఁడుపదివేల యశ్వారోహకులకు నాయకుఁడై విస్తారమైన జాగీరు ననుభవించుచుండెను. 1599 సంవత్సరమున హోళీదినమున మల్లజీతనపుత్రుఁడైన షాహాజీని వెంటనిడుకొని యాదవరావుగృహమున కరిగెను. షాహాజీవయసపుడైదువత్సరములు మాత్రమేయుండును. యాదవరావుపుత్రిక ప్రాయము మూఁడునాలుఁగు వత్సరములకంటె నెక్కుడుండదు. బాలకబాలికలిరువురత్యంతానందమునఁ గలసిమెలసి యాడుకొనుచుండిరి. అదిచూచి

యాదవరావు మిగులసంతసించి నిజపుత్రికనుపిలచి యిట్లనెను. "అమ్మా! నీవీబాలునిఁ బెండ్లాడెదవా?" పిదప నతఁడితరులవైపునకుఁదిరిగి "ఇరువురకును యీడుజోడు లెటులొకుదిరెనో!" యనిపలికెను. ఆసమయమందు షాహాజీజీజీ లిరువురు నొకరినొకరుజూచుకొని మందహాసముఁగావించిరి. అదిగాంచి యచటివారలందఱుఁ గడువుబ్బనవ్విరి. అపుడు మల్లజీలేచినిలువంబడి యిట్లనియెను. "చుట్టలారా! యాదవరావు నావియ్యంకుఁడనగుదునని నేఁడు వాగ్దానమొనరించెను. ఇందులకు మీరలందఱు సాక్షులై యుండవలయుఁజుడీ." అందఱు నందులకియ్యకొనిరి యాదవరావు యుచ్ఛవంశోద్భవుఁడు. అతఁడు తనపుత్రికనుషాహాజీకొసఁగి వివాహము గావింపవలెనని యెపుడును యిచ్ఛగింపలేదు. కాని మల్లజీయొక్క యీచతురతనుగాంచి యతఁడు కడువిస్మితుఁడయ్యెను.

మరుచటిదినమున యాదవరావు మల్లజీని తనగృహమునకు రమ్మని వేఁడెను. కాని యాదవరావు తనకు వియ్యంకుఁడనగుదునని యొప్పుకొనినఁగాని యతని సదనమునకు రాఁజాలనని మల్లజీ సార్త్తనంపెను. యాదవరావందుల కియ్యకొనలేదు, దానింజేసి మల్లజీ యతని యగారమునకుఁబోలేదు. యాదవరావుకంటె నతని భార్యకు వంశమర్యాదయందు నధికాభిమానముఁగలదు. యాదవరావు తనదుహితనుషాహాజీకొసఁగి పాణిగ్రహణమాచరించెదనని రహస్యముగఁబలికిన నివినియామె మిగులఁగోపించి, యట్లొనర్పవలదనియామెనొక్కి వక్కాణించెను, మల్లజీసుతుని వెంటనిడుకొని యటనుండిఁబోయి యొండుగ్రామము... కరిగి భవానీదేవి సాక్షాత్కరించి తనకు విపులముగ ధనమొసంగెనని యచటివారల... కడఁ బ్రకాశముఁగావించెను. భవానీ యీసమయమున మల్లజీకిట్టిది విధముగఁదెలిపె... మహారాష్ట్రులింకను జెప్పుకొనువాడుకగలదు. "మల్లజీ! నీవంశజుఁడొకఁడు త్రేఁడు కాఁగలఁడు అతఁడుశంభుశివునపునగుణాన్వితుఁడగును. అతఁడుమహారాష్ట్రదేశమున

న్యాయవిచారమును పునఃస్థాపన మొనరించి బ్రాహ్మణద్వేషులనుదేవా లయశత్రువులను దూరీభూతముగావించును. అతని కాలమునుండి కాల గణనమారంభమగును. సప్తవింశపురుషపర్యంతర మతని వంశజులు సింహాసనారూఢులైయుందురు"

అదెట్లున్నను మల్లజీకీసమయమున విశేషధనప్రాప్తిగలిగెన నుటకేమియు సందియము లేదు. తద్ధనద్వారా యతఁడాత్మోన్నతి నొన రించుటకు జతనములు సలిపెను. ఈవిషయమందతనిస్యాలకుఁడైన యోగపాలుఁడతనికి జాలసహాయ్యమొనరించెను. అచిర కాలములోనే అహమ్మదు నగరసుల్తాను యధీనమున మల్లజీయైదువేల యశ్వారోహ కులకు సేనాపతిగా నియమింపబఁడెను.

పిదపనతఁడు రాజనిరుద్ధాంకితుఁడై సువర్ణచాకనదుర్గములకును వానినికటమందున్న సీమకును యధిపుఁడయ్యెను. పూనా, సోపానగరము ల నతఁడు జాగీరురూపముగ బొందెను. అప్పుడిఁక యాదవరావున కేమియు సంశయము లేదు. దానింజేసి 1604 సంవత్సరమున మహాసమారోహ మున షాహాజీ జీజీలకు పాణిగ్రహణమాయెను. అహమ్మదునగరసుల్తా ను స్వయముగ నావివాహమహోత్సవముఁ జూడనేగెను. అపుడు షా హాజీప్రాయము పదిసంవత్సరములు మాత్రముండును. కాలక్రమమున మల్లజీ కాలధర్మమునొందెను. తదనంతరమున షాహాజీపైతృకపద, జా గీరులను పొందెను.

ఈసమయమున ఢిల్లీశ్వరుఁడైన అక్బరుషాహా అహమ్మదు నగర రాజ్యమును దనయధీనముఁ గావించుకొనుటకై పోరుసలుపుచుండెను. అక్బరుషాహా కొంతవఱకు జయలాభమునుపొందెను. అక్బరుషాహా మృతినొందినపిదపఁగూడ జహాంగీరుకూడ నాయుద్యమమునందే వ్యాపృ తుఁడయ్యెను. ఈయుద్ధకాలమునషాహాజీసుషుప్తిమగ్నుఁడైయుండలేదు. 1620 సంవత్సరమున (జహాంగీరు శాసనకాలమందే) నతఁడహమ్మదు

నగరప్రధానసేనాపతియైన మాలికాంబరు యధీనమందుండి, యొక ఘోరరణమందుఁ దన సాహసవిక్రమములను ప్రకాశముఁ గావించి స ర్వజనసమ్మానభాజనుఁడయ్యెను. జహాంగీరు మరణానంతరమునషాజహా ను షాహాజీని యైదువేల గుఱ్ఱపుదళములకు నాయకునిఁజేసి యతనికనే కజాగీరుల నొసఁగెను చాదిచక్రవర్తులనేటి యనుగ్రహమెల్లియుండుట కల్ల. మూడు సంవత్సరములు గడచినపిదపఁ జక్రవర్తి షాహాజీయొక్క జాగీరులను మరల దన యధీనములోనికిఁ దీసికొని పోయెను. షాహాజీ విరక్తుఁడై విజయపురసుల్తాన్ పక్షావలంబియై మృత్యుపర్యంతమతని యధీనమందే కార్యము సలుపుచుండెను.

పతనోన్ముఖమైన అహమ్మదునగరరాజ్యస్వాధీనార్థమై షాహాజీ ఢిల్లీసేనలతో ననేకమారులు యుద్ధముఁగావించెను. సుల్తాను శత్రుహ స్తములఁ బతితుఁడు కాఁగానే షాహాజీ యతని వంశజునియొకనిసుల్తా నుగఁజేసి యతనినిసింహాసనమందుఁబ్రతిష్ఠితుఁగావించెను. పితపనతఁడు మేధావులైన కొందఱు విప్రులసహాయమున దేశశాసనమునుయుక్తము గ స్థాపనమొనరించి, బహుసంఖ్యాకములైన దుర్గములను స్వాధీనపఱచు కొని సుల్తానుపేరిట ననేకసేవలఁ గూర్పసాగెను.

ఇదంతయుఁగాంచి చక్రవర్తియైన షాజహాను యాగ్రహించి షా హాజీని అతనికిఁ బుత్రువడపున మెలఁగుచున్న విజయపురసుల్తానును ద మనమొనరింప ననేక తురగారోహకులను పదాతులను ప్రేరణము గావించెను. ఢిల్లీశ్వరునితో వైరమాచరించుట విజయపురసుల్తానునకు గాని షాహాజీకిగాని సాధ్యముకాదు. కతిపయవత్సరములు పోరు జరిగిన పిదప సంధిస్థాపనమయ్యెను. అహమ్మదునగరరాజ్యము విలుప్తమయ్యె ను (1637) షాహాజీ విజయపురపుతేని యధీనమందే జాగీరు దారు గను సేనాపతిగను నుండి సుల్తాను యాదేశానుసారమున కర్ణాటదే శమందలి చాలభాగమును స్వాధీనముఁ గావించుకొనెను. దానింజేసి వి

జయపురమున కుత్తరమున పూనా నికటమున నతనికిట్టి జాగీరులుకలవో దక్షిణకర్నాటక దేశమునకూడ నట్టి జాగీరులనేకములుకలవు.

జీజీభాయికి శంభూంజీ శివాజీలను నిరువురు పుత్రులుకలిగిరి. జీజీభాయి తండ్రియగు యాదవరావు పురాతన దేవగిర హిందూరాజుల వంశీయులని జనులుచెప్పుకొను వాడుక కలదని చరిత్రలు తెలుపుచున్నవి. ఈవృత్తాంతము యథార్థమైనచో శివాజీ ఆపురాతనరాజవంశోద్భవుఁడగుట కేమియు సందియములేదు. 1630 వ సంవత్సరమున షాహాజీ టుకాభాయి యను మఱొక కన్యను వివాహముఁ గావించుకొనెను. అభిమానవతియైన జీజీభాయి యందులకుఁగసుగినిసి భర్తృసంసర్గముత్యజించి పుత్రుఁడైనశివాజీని వెంటనిడుకొని పూనాజాగీరునకుఁబోయి యట గాపురముండెను. షాహాజీ టుకాభాయిని వెంటఁగొని కర్నాటమున వసించెను. పిదప నామెగర్భవతియైయొకపుత్రునిఁగనెను. అతఁడు వెంకాజీ యనుపేరఁ బరగుచు దలిదండ్రులచే నల్లారు ముద్దుగఁ బెనుపంబడుచుండెను.

షాహాజీకడ విలక్షణ కర్మచారులైన నిరువురు బ్రాహ్మణమంత్రులుకలరు. వారలతనికి విశ్వాసపాత్రులై మెలఁగుచుండిరి. వారుభయులలో దాదాజీకనయిదేవుఁడనునతఁడుపూనాజాగీరు విషయములనుజక్కఁబెట్టుచు జీజీభాయి శివాజీల నతిభద్రముగ జూచుచుండెను.

1627 సంవత్సరమున సువర్ణదుర్గమున శివాజీ జన్మించెను. ఈ దుర్గము పూనాకు రమారమి 25 క్రోసుల దూరమున నుత్తరమందున్నది. శివాజీ మూఁడేండ్ల ప్రాయము వాఁడైయున్నపుడు షాహాజీ టుకాభాయిని పరిణయమాడెను. దానింజేసియే యతనికి జీజీభాయితో విచ్ఛేదము సంభవిల్లెను. జీజీపుత్రునితో పూనా యేతెంచి దాదాజీకనైదేవుని రక్షణాపేక్షణమున వాసముఁజేయసాగెను. శివాజీవాసార్థమై దాదాజీపూనా నగరమున నొక విశాలభవనమును నిర్మాణముఁగావిం

చెను. మనమితిపూర్వమందే యాగృహమున సయస్తఖానును చూచితిమి.

మాతాపుత్రులిరువు రానిలయమందే వసించుచుండిరి. బాల్యకాలమునుండియు శివాజీ దాదాజీనికటమందే శిక్షితుఁడుగాఁదొడఁగెను. అతఁడెపుడును నిజనామమునైన లిఖింప నేర్చుకొనలేదు. కాని యల్పవయఃకాలమందే యతఁడు ధనుర్బాణప్రయోగము, ఖడ్గచాలనము, సాముగరిడీలాదిగాగల సమరవిద్యలందారితేరి యశ్వారోహణమందసమానప్రజ్ఞుఁడయ్యెను. మహారాష్ట్రియజాతివారు తురగారోహణమందు తత్పరులు. వారలలో శివాజీ విశేషఖ్యాతిని గడియించెను. ఇట్టి వ్యాయామయుద్ధశిక్షలచే బాలకుని దేహ మతిశీఘ్రకాలమున సుదృఢము కాఁజొచ్చెను. అతఁ డతిబలిష్ఠుఁడయ్యెను.

కాని శివాజీ కేవల మస్త్రవిద్యయందే కాలమతివాహిత మొనరించలేదు. తరుణము దొరికినపుడతఁడు బాబాజీచరణోపాంతమున నుపవిష్టుఁడై రామాయణ మహాభారతమందలిశూరులయనంతవీరత్వమును సూచించుకథలను వినుటయం దత్యంతాభిలాషియైయుండెను. ఇతిహాసములను వినినకొలఁదియు బాలుని హృదయమందు సాహసోద్రేకముదయించెడిది. హిందూధర్మమందలి యాస్థదృఢీభూతమయ్యెడిది. పూర్వకాలీన వీరులవీరత్వము ననుకరింపవలయునను నిచ్ఛ ప్రబలమయ్యెడిది; ధర్మవిద్వేషులైన ముసల్మానులపై విద్వేషముదయించెడిది. బహువత్సరములైనపిదప శివాజీ విస్తీర్ణమైన రాజ్యమును సంపాదించి యశవంతుఁడైన పిమ్మటగూడ నెచటనైన నెట్టిదూరప్రదేశమందైనను బురాణకాలక్షేపముగాని వీరచరిత్రపఠనముగాని జరగుచున్నదని వినినచో నతఁడట్టి కష్టములకునైన లోనగుచు నెంతటివిషాదములందైనఁ బడుచు బోవుటకు శక్తివంచనలేక ప్రయత్నించుచుండెననువిషయమే, యామహామహునకు భారతరామాయణేతిహాసములను వినుట యందున్న యాతృత నెఱుఁగఁజేయును.

ఈవిధముగ దాదాజీయత్నమువలన శివాజీ యల్పకాలములోనే స్వధర్మానురక్తుఁడును మసల్మాన విద్వేషియు నయ్యెను. షోడశవర్షప్రాయమందే యాతఁడు సర్వస్వాతంత్ర్యుఁడగుటకు బహుభంగుల యత్నింపఁదొడంగెను. తనవంటి యుత్సాహులైన యువకులను బోగుచేసి వారలందఱిలోను సంఘీభావ మొదవఁజేయుచుండెడివాఁడు. పశ్చాత్పరిపూర్ణకంకణదేశమందతఁడు వారలఁగూడి సర్వదా సంచరించుచుండెడివాఁడు. ఆగిరులనుల్లంఘించుటెట్లు, యెచ్చటమార్గములున్నవి, యేపథముందేదుర్గమున్నది, యేయేదుర్గములు దుర్గమములో యేలీల నాదుర్గముల నాక్రమించుకొనవలయునో లేక వాని నెట్లు రక్షింపవలయునో యనుచింతలవలనే బాలకుఁడు దినముల నతివాహితములుగావించుచుండెను. అప్పుడపుడా బాలుఁడు కతిపయ దినములవఱకు దుర్గద్వారములందును పర్వతలోయలందును కాలముఁ బుచ్చుచుండెడివాఁడు. శివాజీ యెఱుఁగనిదుర్గముగాని పథముగాని లోయగాని మహారాష్ట్రదేశమునఁ గన్పట్టదు, ఏవిధాన నొకటి రెండు దుర్గములను స్వాధీనము గావించుకొనవలయునో యని యతఁడు దలఁచుచుండును.

బాలకునిచర్యలన్నియుఁ గాంచుచుండిన దాదాజీ కను భీతిల్లుచుండెను. అతఁడు చోరపథమునుండి దప్పించి పితృప్రదత్తమైనజాగీరును జాగరూకత నొనరించుటకై ప్రయత్నించి యావృద్ధుఁ డనేకరీతుల శివాజీకిబోధించెను. కాని శివాజీ హృదయపీఠమందంకురించినవీరత్వబీజముత్పాటితముగా లేదు. బాలుఁడు దాదాజీని పితృతుల్యునిగ సన్మానించుచుండెను; కాని యతఁడేపథమునఁ బ్రవేశించెనో దానిని పరిత్యజింపఁజాలకుండెను.

మావులీజాతీయులు కష్టసహిష్ణులును విశ్వాసయోగ్యులనియు నెఱిఁగి శివాజీ వారినెక్కుడుగ బ్రేమించుచుండెను. అతని సముపయున్న సుహృద్వరులలో యశజీకంక, తన్నజీమాలశ్రీ, బాజీఫాసల్‌కర్ లను

ముగ్వురగ్రగణ్యులై యతనికి బ్రియతములై యుండిరి. పరిశేషమునవీరల సహాయముచే శివాజీ 1646 సంవత్సరమున తోరణదుర్గ కిల్లాదారుని దనకు వశవర్తినిగఁ జేసికొని యాదుర్గమును తాను స్వాధీనముఁ జేసికొనియెను. ఈయాఖ్యాయిక ప్రారంభమున మేము తోరణదుర్గమును వర్ణించితిమి. ఈప్రథమవిజయమైనపుడు శివాజీకి బందొమ్మిదేండ్లు వయసుకంటె నెక్కుడు లేదు. ఆమరుసటివత్సరమే తోరణదుర్గమునకు మూఁడుమైళులదూరమున దక్షిణపూర్వదిక్కున నొకనూతన దుర్గనిర్మాణముఁ గావించి దానిని రాజగరమని బిలుచుచుండెడివాఁడు.

విజయపురసుల్తాను శివాజీచర్యలన్నిటి నెఱిఁగి షాహాజిపైకడుఁగినిసి యతని సుతుఁ డొనరించు కార్యముల కారణమేమి యని యడిగెను. విజయపురమునకు విశ్వాసపాత్రుఁడై మెలఁగిన షాహాజీకీ విషయములందలి బిందువిసర్గమైనను దెలియలేదు. దానిం జేసి యతఁడీవిషయమున దాదాజీకడకొక పత్రమునంపి శివాజీచర్యలకు గారణమేమో దెలుపవేడెను. దాదాజీకనయి దేవుడు మరల శివాజీనిపిలిచి యిట్టి చర్యలవలన సర్వనాశనమగునని యతనిని మందలించి యాతనితండ్రియగు షాహాజి విజయపురసుల్తాను యధీనమందుండి విజయప్రయత్నముచే విపులార్థమును జాగీరులను సంపాదించి శక్తిమంతుఁడై సమ్మానింపఁబడుచున్న విషయమును బహుభంగుల బాలునకు దెలిపెను. పితృసదృశుఁడైన దాదాజీకి శివాజీ ప్రత్యుత్తరమేమి యొసఁగును? మధురవాక్యములచే నతనికి నుత్తరమొసఁగి మరల నెప్పటి యట్ల దనకార్యమందు నిరతుఁడుగాఁదొడంగెను. ఇదిజరగిన కతిపయదినములకు దాదాజీ పరలోకగతుఁడయ్యెను. మరణించుటకుఁ బూర్వమతఁడు శివాజీని తనకడకు బిలచెను. వృద్ధుఁడెప్పటి చందముననే యతనిని మందలించునని శివాజీ యతనికడ కరిగెను; కాని దాదాజీ పలికినవచనముల కతఁడతి విస్మితుఁడయ్యెను. మృత్యుశయ్యయందు దాదాజీ దివ్యచక్షుస్సులున్మీలితముల

య్యెను. వాత్సల్యపురస్సరముగ నతఁడు శివాజీతో నిట్లని పలికెను. "వత్సా! నీవొనరించు ప్రయత్నముకంటె మహత్తరమైన జతనము మఱియొకటేదియు లేదు, ఈయున్నతపథము ననుసరించి యేచనుము; దేశస్వాధీనతను గడియించుకొనుము; బ్రాహ్మణగోవత్సాదులను రక్షింపుము; దేవాలయ కలుషితకారులకుఁ దగుశాస్తిఁ గావింపుము; ఈశ్వరుఁడు నీకుఁ జూపిన యున్నతపథము ననుసరించియే చనుము;" బాలునితో నిటుల వచించి యా వృద్ధుఁడు చిరనిద్రనొందెను. ఈదివ్యోపదేశమును పొందినతోడనే యుతని యుత్సాహసాహసములు పదిమడుంగులధికములయ్యెను. అపుడు శివాజీ ప్రాయమిరువదివత్సరములు మాత్రమే.

ఆసంవత్సరమే చాకనకొండానదుర్గముల గిల్లాదారులను వశీభూతముగావించుకొని వారలకు ధనమొసంగి యారెండుదుర్గములను శివాజీ తనయాక్రమణములోనికిఁ దీసికొనిపోయెను. పిదప నతఁడు కొండానదుర్గమునకు సింహాగరమను పేరిడెను. మనకథయందు చాకనసింహాగరదుర్గములగురించి యిదివఱలోఁ గొంతవివరించితిమి. శివాజీ సవతి తల్లియైన టుకాభాయి సోదరుఁడగు బాజీ సోఫాదుర్గమును దనయధీనమందుంచుకొనియెను. ఒకనాఁటియర్ధరాత్రి సమయమున శివాజీ తన మావలీసైన్యమును వెంటనిడుకొని యాదుర్గము నకస్మాత్తుగహస్తగతముఁగావించికొనియెను. నిజమాతులకెట్టి హానియుఁ జేయక యతనిని శివాజీ కర్ణాటమున వసించుచున్న తనతండ్రికడకంపివైచెను. పురందర దుర్గాధీశ్వరుఁడు మృతిఁజెందినపిదప నతనిపుత్రులలో భ్రాతృకలహములుత్పన్నములు కాగా శివాజీ వారలందలి కనిష్ఠభ్రాతృలిరువురకు సాహాయ్యముఁగావించి తానాదుర్గము నాక్రమణముఁగావించుకొనియెను. ఈయాచరణముఁగాంచి యాసోదరులు మువ్వురుకడుగినిసిరి; కాని శివాజీ దేశస్వాధీనరక్షణార్థమై దనమహోదుద్దేశమును వారలకువ్యక్తీకరించి దనయుద్దేశ్యసాధనార్థమయ్యె సోదరుల మువ్వురనుండి సాహాయ్యతను గోరి యట్లొనర్చితి ననిపలుక, నాభ్రాతృత్రయముకడు సంతసించియతని

మహోదుద్దేశ్యఫలార్థమై వారలుకూడ బాటుపడెదమని వచించి శివాజీ యధీనమందుండియే కార్యమొనరించుటకు స్వీకృతులైరి.

ఈవిధముగ శివాజీ యొకదానితరువాత నొకటిగ ననేకదుర్గముల నాక్రమించుకొనియెను. వానిపేరులనిటవివరించి మాకథనుముగింప మేమిచ్చగింపము. 1648 సంవత్సరమున ఆబాజీ యను శివాజీ కర్మచారియొకఁడు స్వర్ణదేవ కల్యాణ దుర్గములను స్వాధీనము గావించి కల్యాణీప్రదేశము నాక్రమణమొనరించెను. ఈచర్యలన్నియుఁ గాంచుచున్న విజయపురసుల్తాను కడుంగినిసి షాహాజీని కారాబద్ధునిఁగావించి నియమితసమయములోపుగ శివాజీ తనయధీనమును స్వీకారముఁగావింపకున్నచో యావజ్జీవమును యతనితండ్రి ఖైదీగనుండునని యాదేశమొనరించెను. శివాజీ ఢిల్లీశ్వరుని నికటమున నావేదనమొనరించి తండ్రిప్రాణమును గాపాడెను; కాని నాలుగు వత్సరముల కాలముషాహాజీ విజయపురమందు ఖైదీవిధముగనే యుండెను.

జౌలీఱేఁడగు చంద్రారావును శివాజీ స్వపక్షమునకుఁగొనివచ్చి ముసల్మానుయధీనతాశృంఖలమును ఖండించుటకై యత్నిం తనయుద్దేశ్యమునతనికిఁ దెలియఁజేసెను.

కాని చంద్రారావందులకు దన యస్వీకారముఁ దెలియఁజేయఁగా శివాజీ యతని సోదరుని హతమొనరించి యర్ధరాత్రమున నకస్మాత్తుగ నతని దుర్గము నాక్రమణముఁ గావించి దానిని హస్తగతమొనరించుకొనియెను. అతఁడు సమస్తజౌలీ ప్రదేశమునను యధికారియై, యావత్సరమందే ప్రతాపగరమను నొకదుర్గమును నిర్మాణము గావించెను. రెండు సంవత్సరములు గడచిన వెనుక శివాజీ మురేశ్వర, త్రిమలాపింగళుల నిరువురను మంత్రులఁగావించి, కంకణప్రదేశమునంతను జయమొనరించుటకై యనేకవాహినులను గూర్చెను.

ఈపర్యాయము విజయపురసుల్తాను శివాజీని పూర్తిగ ధ్వంసము గావింప దృఢనిశ్చయుఁడై 1659 సంవత్సరమున నబులుఫజుల్ అను నొకప్రసిద్ధ యోధుని 500 యశ్వారోహకులతోను 7000 పదాతులతోను, యనేక రణసంభారములతోను పోయి శివాజీపై దాడివెడల నాజ్ఞాపించెను. వేఁపులేక విద్రోహములను నలుపు యాభూర్తును శృంఖలాబద్ధుఁజేసి, యచిరకాలములో నేసుల్తానుచరణసమ్ముఖమునకుఁ గొనిపోవుదునని గర్వితభావమున నాతురకసేనాని ప్రకాశముఁ గావించెను.

ఇట్టి మహాసైన్యముతో సమ్ముఖయుద్ధ మొనరించుట యసంభవము; కావునం జేసి శివాజీ సంధిగావించుకొన నిశ్చయించెను. అబుల్ ఫజుల్ గోపీనాథుఁడను బ్రాహ్మణు నొకనిని శివాజీ సదనమున కంపెను. ప్రతాపగరదుర్గ సమీపమందు సభామధ్యమున శివాజీకిని దూతకును సమావేశము కాఁగా వారలిరువురు చాలవఱకుఁ బ్రసంగముఁ గావించుకొనిరి. రాత్రియగుటకై శివాజీ గోపీనాథుని కొఱకొక సురక్షితస్థానమును నిర్దేశించి యాతనినటకుఁ గొనిపోయెను.

నడిరేయి కాఁగనే శివాజీ గోపీనాథుని దర్శింప నతఁడుండు యెడ కరిగెను. శివాజీ ! కసాధారణవాక్పటుత్వముఁ గలదు; అతఁడనేకరీతుల గోపీనాథున కిట్లు బోధించెను. "అయ్యా! తామ భూసురులు నాకంటె శ్రేష్ఠులు. కాని నేను విన్నవించు దానిని యనుగ్రహముంచి వినుఁడు. నేను గావించుచున్న దంతయు హిందూధర్మార్థమే యని యెఱుంగుఁడు. హిందూమతోద్ధారణ మొనరించుటకు నేను బద్ధకంకణుఁడనై యుంటిని. భవానీ దేవి స్వయముగ నన్ను బ్రాహ్మణగోవత్సాదుల రక్షణార్థమై యుత్తేజనము గావించెను. హిందూదేశదేవాలయనిగ్రహకారులను దండింపు నాజ్ఞ యొసఁగెను. మీరు విప్రులు, భవానీ యీదేశమును సమర్థనము గావింపుఁడు; తమ జాతీయ శ్రేణులనడుమ స్వచ్ఛందముగ వసింపుఁడు."

గోపీనాథుఁడీ వచనములను విని మిగుల సంతసించి, శివాజీకి సహాయ మొనరించెదనని పలికెను. పిదపఁ గార్యసిద్ధికొఱకై శివాజీ యబుల్ ఫజుల్ నేదేనియొక ప్రదేశమునఁ గలిసికొనుట యావశ్యకమని నిర్ధారణముఁ గావించెను.

కతిపయదినానంతరమున శివాజీ ఫజులులకు ప్రతాపగరదుర్గమునకు సమీపమందే సమావేశమయ్యెను. అబుల్ ఫజుల్ యొక్క డైను వేల సేనాదళము ఆ దుర్గమునుండి కొంచెము దూరమందుండెను. అతఁడొక సహచరుని మాత్రము వెంటనిడుకొని శిబికారోహణమున నిర్దిష్టగృహము కడకరుగుదెంచెను. ఆనాఁటి ప్రత్యూషమందే శివాజీ లేచి భక్తిపురస్సరముగ స్నానపూజాదులను గావించి, ప్రేమమయియైన మాతకడకరిగి యామెచరణములకు సాగిలపడి యామె యాశీర్వాదమును గొనెను. తులానిర్మితమైన యంగీకని, శిరోవేష్టమునకును క్రిందనుక్కుక వచనమును శిరస్త్రాణమును దొడిగికొని యావేషమున దుర్గమునుండి యవతీర్ణుఁడై తన బాల్యసహచరులైన తన్నాజీ మాలశ్రీలను వెంటఁగొని యబుల్ ఫజులున్న యెడకుఁబోయి, బిరాన నామునసల్మాను నాహ్లాదపూర్వకముగ నాలింగన మాచరించుకొనునట్లభినయించి తన నిశితకరవాలముచే నతని వక్షమునఁ బొడిచి నిమేషములో ఫజుల్ గారిని భూతలశాయులుగ నొనరించెను. తత్క్షణమే శివాజీ సేనల బుల్ ఫజుల్ వాహినులపైఁబడి వానిని పారఁదోలెను. శివాజీ యపుడనేక దుర్గముల నాక్రమించుకొని విజయపురద్వార పర్యంతముపోయి యచటి దేశమును లుంఠనము గావించివైచెను.

విజయపురసుల్తానుతో యుద్ధము మఱిమూఁడు సంవత్సరముల వఱకు జరుపఁబడెను. కాని యతఁడు విశేషజయలాభము నేతీరుననైనను పొందలేదు. పిదప 1662 సంవత్సరమున షాహాజీ మధ్యవర్తియై విజయపురసుల్తాను శివాజీల నడుమ సంధిస్థాపనముఁ గావించెను. షాహా

జీ శివాజీని చూచుటకై యేతెంచినపుడు శివాజీ తన పితృభక్తి పరాకాష్ఠమును జూపెను. తానశ్వము నవరోహించి, తండ్రికి రాజతుల్యసమ్మానముం గావించెను. పితృని శిబికము వెంట పాదచారియైచనియతండు కూర్చుండుమని పలికినను శివాజీ పితృసమ్ముఖమున నాసనగ్రహణ మొనరింపలేదు, కతిపయదినములు సుతుని కడనుండి షాహజీ మిగుల నానందించి విజయపురమునకుం బోయి సంధిస్థాపన మొనరించెను. పితృకర్తృకసంస్థాపితమైన నీసంధికి శివాజీ విరుద్ధముగ నాచరింపలేదు. షాహజీజీవితకాలమందు శివాజీ విజయపురమునకుం బరోక్షమున రణ మొనరించలేదు. తదుపరికూడ సమరము సంభవించినను, శివాజీ యాక్రమణకారి కాలేదు,

1662 సంవత్సరమున సంధిం గావింపంబడెనని యింతకుముందే దెలిపి యుంటిమి; ఈసంవత్సరమందే మొగలాయిలతో యుద్ధారంభమయ్యెను. మన యాఖ్యాయిక యీసమయమునుండియే యారంభమయ్యెను. మొగలులతో భండనమారంభమగు నప్పటికి శివాజీ కంకణదేశమునంతను యధికృతముం గావించుకొనెను. శివాజీకడనాసమయమున నేడువేల యశ్వారోహులును యైదులక్షల పదాతులును యుండిరి. అపుడతని వయసు ముప్పది యైదువత్సరములు మాత్రమే.

తొమ్మిదవప్రకరణము.

శుభకార్యనిర్వాహణము.

భానుఁడస్తాద్రి శిఖరమును సమీపించెను; సింహగరదుర్గమందలి సైనికులు నిశ్శబ్దముగ సన్నాహములను గావించుకొనుచుండిరి. దుర్గాభ్యంతరమున జరగుచున్న దేమిటో వెలుపలి వారలకుంగూడ దెలియుటకసాధ్యముగఁ దోఁచునంతగ నందంతయును శాంతముగనుండెను.

దుర్గమందొక యున్నతస్థానమునఁ గొందఱు మహాయోధులు నిలువంబడి యుండిరి. దుర్గశిఖరమునుండి నలుకెలంకుల మనోహరమైన దృశ్యము గన్పట్టుచుండెను. పూర్వదిక్కునందు సుందరమైన నీరానది కలకలరవముతోఁ బ్రవహించుచుండెను. శైలాభ్యంతర ప్రదేశములు నానారాగవిలసితకుశాగ్రములతోను నవపుష్పపత్రములతోను సుశోభితములై, కన్నులపండువొనర్చుచుండెను. ఉత్తరపుదిక్కున బహువిస్తృతసుందరహరిద్వర్ణక్షేత్రములు సూర్యాలోకమున సుజ్వలములై కాన్పించుచుండెను. కడుదూరమున విస్తీర్ణమైన పూనానగరము భాసమానమగుచుండెను. యోధులావైపునకే జూచుచు నేటిరేయి యట జరుగు విషమఘటనమును గుఱించి చింతించుచుండిరి.

దక్షిణపశ్చిమ దిక్కున (   ) పర్వతపరంపరలు, దృక్పథమునఁ బడుపంటదనుక దినకరుని సంధ్యాకిరణములందు శోభిల్లుచుఁ స్వర్ణగిరులచాడ్పున గన్పట్టుచుండెను. కాని మన యోధాగ్రేసరు లీచమత్కారపర్వత దృశ్యముఁ గాంచి యానందించుచుండుట లేనట్లు దోఁచుచుండెను—వార లేదో యన్యచింత యందభిభూతులై యుండిరి.

ఏరణమందు లేక యే యసమసాహసికకార్యమం దొకేమాఱుగ బహుకాలవాంఛిత ఫలప్రాప్తియో, లేక నొక్కుమ్మడిగ సర్వనాశనమో గానైయుండెనో, ఆరణమగుటకుం బూర్వమొక ముహూర్తకాలము దనుక నతిశయసాహసికుఁడైన యోధుని యెదగూడఁ జింతాపూర్ణమై యుండును. నేడు మొగలాయిసైన్యసమేతుఁడైన సయిస్తఖాను పరాభూతుఁడై విఫలమనోరథుఁడైనను కావలయును, లేక మహారాష్ట్రసూర్యుఁడొకే మాఱుగ చిరాంధకారమున నస్తమించిపోవలయునను చింతతో యోధుల హృదయము లుద్రేకితములుగాఁ దొడంగెను. ఏరు నీచింతనువ్యక్తీకరించలేదు; కాని నిశ్శబ్దముందా యోధులొకరి నొకరు నిరీక్షణముఁ గావించుచున్నతరి వారి మనోగత

భావములు దాఁగియుండలేదు. ఇరువది లేక నిరువదియైదుగురు సైనికులను మాత్రము వెంటనిడుకొని శివాజీనేఁడు శత్రువాహినులనుజొచ్చి కార్యసాధనమొనర్పవలయును.—ఇట్టి భీషణకార్యమందు శివాజీ యంతకు మున్నెన్నఁడు లిప్తుఁడైయున్నట్లు తోఁచదు. దానింజేసియే యోధుని లలాటము ముహూర్తమాత్రము, చింతామేఘాచ్ఛన్నము గాకయుండును?

ఆవీరమండలి మధ్యమున దూరదర్శియైన మురేశ్వరమంత్రి గూడ నుండెను. అల్పవయస్కుఁడై యున్నపుడే యతఁడు షాహాజీయధీనమందు సమరోద్యోగమున లిప్తుఁడై యుండెడివాఁడు. పిదపనతఁడు శివాజీ సంరక్షణమందుండి ప్రతాపగర-చమత్కార దుర్గమును నిర్మాణముఁగావించెను, నాలుఁగు వత్సరములనుండి, యతఁడు మంత్రిపదవియందుండి దానలంకరించిన స్థానమందు యోగ్యుఁడై నిలచి యెల్లరను హర్షింపఁజేయుచుండెను. అబుల్ ఫజుల్ శివాజీ కరములందు హతుఁడైన పిదప, మురేశ్వరుఁడే యతని సేనలను చెల్లాచెదరముఁ గావించివైచెను. పిదప మొగలాయీలతో ఖండనమారంభము కాగనే యతఁడు పదాతికసైనికుల కధ్యక్షుఁడైయుండెను. యుద్ధకాలమున సాహసుఁడును, విపత్కాలమందు స్థిరచిత్తుఁడును, ఆలోచనయందు బుద్ధిమంతుఁడును దూరదర్శియు, కార్యదక్షుఁడైన కర్మచారియుఁ బ్రకృతబంధుఁడునైన పురుషుఁడు శివాజీకి మురేశ్వరుఁడుగాక నితరుఁ డెవఁడును లేఁడు.

ఆశివాజీ స్వర్ణదేవుఁడను యొక విప్రుఁడుకూడఁ గడుదూరదర్శియై శూరత్వమునందును బుద్ధియందును మురేశ్వరునకు ద్వితీయుఁడై యుండెను. నేఁడతఁడుకూడ మన యోధులనడుమ నుండెను. అతని ప్రకృతనామము నీలపంథస్వర్ణదేవుఁడు; కాని ఆశివాజీ పేరుననే యతఁడు విఖ్యాతిఁగాంచెను. 1548 సంవత్సరమున నతఁడు కల్యాణదుర్గమును సమస్తకల్యాణసీమను హస్తగతముఁ గావించుకొని, ప్రస్తు

తము రాయగరమందు ప్రసిద్ధ దుర్గమొండు నిర్మాణమొనరింప నారంభించెను.

ప్రతిభవడసిన యన్నాజీదత్తుకూడ నేఁడు సింహాగరమందే యుండెను. నాలుగువత్సరములఁ బూర్వమే యతఁడు పవనగరమునాక్రమణముఁ గావించెను. శివాజీ కర్మచారులలో నతఁడు గూడ నొకప్రధానకార్యదక్షుఁడై యుండెను.

అశ్వారోహకుల యధిపతియైన నేతాయిజీ సింహాగరమందు లేఁడు. అతఁడు మొగలాయి సైనికుల సమ్ముఖము నుండియే పోయి యౌరంగాబాదు అహమ్మదు నగరములనుఁ గొల్లగొట్టిన విషయమును మనము సయస్తఖానుని సభయందు చందాఖానువలన వినియుంటిమి. సింహాగరమందా సమయమున నల్పసంఖ్యాకులైన యశ్వారోహులు మాత్రము కర్తాజీగుజ్జరుఁడను నొక నీచస్థసేనాని యధీనమందుండిరి.

శివాజీకి బాల్యసుహృద్వరులైన ముప్వురు మావులీలుండిరని మేము పూర్వాధ్యాయమందుఁ దెలిపి యుంటిమి. వారలలో బాజీఫాసల్కరను నతఁడు మూఁడు వత్సరములకుఁ బూర్వమే మృతిఁజెందెను, తన్నజీమాలశ్రీయశజీకంక లిరువురు నేఁడు సింహాగరమునకు వచ్చియుండిరి. బాల్యకాల సౌహార్దమును యౌవనకాల విషమసాహసమును వారలింకను మఱువలేదు. వీరలు శివాజీని ప్రాణసమముగఁ బ్రేమించుచు దమమావులీసైనికుల వెంటఁగొని యనేకమాఱు లనేక పర్వతదుర్గములను, యర్థరాత్రములందు శివాజీ వెనువెంటఁ దిరిగి, యాక్రమించుకొనిరి.

సూర్యుఁడస్తమించెను. సంధ్యాఛాయతరతరములుగ జగమున నవతీర్ణమగుచుండెను. అపుడుగూడ నాయోధవరులు దుర్గశృంగముపై నిశ్శబ్దముగ నిలువంబడియుండిరి. అట్టితరి శివాజీ యటకరుగుదెంచెను. అతనిముఖమండలము గంభీరమై, దృఢప్రతిజ్ఞావ్యంజకముగనుండెను

అందు లేశమాత్రమైన భయచిహ్నము గన్పట్టుట లేదు. వనాభ్యంతరమున నతఁడు కవచాస్త్రములను ధరించియుండెను. నేఁడు నిశియందొనర్పనున్న భీషణకార్యముకొఱకై యిపుడతఁడు సంసిద్ధుఁడై వచ్చెను. యోధుల నయనము లుజ్జ్వలము లయ్యెను. యవిచలితదృక్కులను మహారాష్ట్రనాయకులపైఁ బఱచుచు వారలు నిలువంబడియుండిరి.

శివాజీ యపుడు మెల్లగ నిట్లనియెను. "అంతయుఁ బ్రస్తుతమైయున్నది. మిత్రులారా! నాకు సెలవొసంగుఁడు,"

మురేశ్వరుఁడు—నేఁటి నిశియందు స్వర్ణదేవునిగాని, యన్నజీని గాని, నన్నుగాని మీ వెంట రానీయకుండుటే స్థిరపఱచితిరా? మహాత్మా! విపత్కాలమున మేమెప్పుడైనను మీతోడ నుండక నుండఁగలిగితిమా?

శివాజీ—మంత్రివరా! క్షమింపుఁడు. ఇఁక నన్ను నురోధింపకుఁడు. మీ మీ సాహసవిక్రమవిజ్ఞతలు నాకవిదితములుఁ గావు. కాని నన్ను నేఁడు మీరు మన్నింపవలయును. భవానీ యాదేశమున నేఁడే నొకవిషమప్రతిజ్ఞఁ గావించితిని, నేనొక్కరుండనే యీకార్యసాధన మొనరింపవలయును. లేకున్న యకించిత్కరమైన యీప్రాణమును విసర్జనముఁ గావించివైచెదను. జయలాభమగుగాకంచు నన్నాశీర్వదింపుఁడు. కాని యమంగళమాసన్నమై, నేఁటికార్యము విఫలమైనచో, మీరు మువ్వురు వెనుకనున్నచో మహారాష్ట్రమునకంతయు నున్నట్లే. మీరలుఁగూడ నాతోఁగూడి మృతిఁజెందిన యెడల యేరిబుద్ధిబలమున—నేరిశక్తిచే—దేశము నిలచును? ఏరిబాహువిక్రమముచే స్వాధీనత యుండఁగలదు? హిందూగౌరవము నెవరు రక్షింపనోపుదురు? యాత్రకాలమందిఁకఁ బ్రార్థింపకుఁడు.

ఇఁక ననురోధించినందువలన నేమియుఁ బ్రయోజనము లేదని మురేశ్వరుఁడు దెలిసికొని మాఱుపలుకక యూరకుండెను. అపుడపే

క్షాకృతమృదుస్వరమున శివాజీ మురేశ్వరునుద్దేశించి యిట్లనియెను. "మంత్రివరా! తాము పితృనికటమందుఁ గార్యమొనరించియుండిరి; మీరు నాకుఁ బితృతుల్యులు; నేఁడు నాకు జయమొదవుగాకంచాశీర్వాదముఁ గావింపుఁడు. పూజ్యుల యాశీర్వచనమవశ్యముగ ఫలించును. ఆవాజీ! అన్నజీ! మీరలుఁగూడ నన్ను దీవింపుఁడు. ఇఁకఁ గార్యసాధనార్థమై పోయెదను."

మురేశ్వర, యావాజీ, యన్నజీలు మువ్వురు, సకలనయనములతో నా మహారాష్ట్రవీరుని యాశీర్వదించిరి. పిదప శివాజీ తన మావళీ సుహృద్వరులైన తన్నజీ యశజీల నిరువురను సంబోధించి యిట్లనెను. "బాల్యమిత్రులారా! సెలవొసంగుఁడు."

తన్నజీ—ప్రభూ! ఏయపరాధకతమున మీరు మమ్ములఁ దమ్మనుగమింప నిషేధించుచుండిరి? ఏదేశవ్యాపారమందైన, నేదుర్గజయసమయమందైన మేము దేవర నికటమందుండకుంటిమా? కంకణదేశమునంతను తమ్మనుగమించి భ్రమణమొనరించిన దెవరో మీరాలోకించుక స్మరణముగావించుకొనుఁడు. శైలశిఖరములందును, గిరిపథములలోను, బర్వతగహ్వరములందును, తరంగిణీతీరములయందును, బవలనక నిశియనక యేరు మీతో సంచరించుచుండెడివారు? రాత్రులందేరు మీ పదతలమునఁ గ్లిష్టపథముల శయనించుచుండెడివారు? ఎవరు దుర్గజయసమయమున నాహ్లాదితులగుచుండువారు?—యశజీయును, మృతుఁడైన బాజీయును, దాసుఁడైన యీతన్నజీయును కదా! బాజీ ప్రభుకార్యమందు హతుఁడయ్యెను. అంతకుమించి మాకుఁగూడ మఱేకోరికయు లేదు. మేమీదినమున ప్రభుని వెంట వచ్చుటకనుమతినొసంగుఁడు. జయప్రాప్తియైనచో దేవరతోఁ గలసి యానందవార్ధి నోలలాడుదుము. ప్రభునకేదైన కీడువాటిల్లినచో, మేమిటజీవించి యుండుటవలనఁ బ్రయోజనమేమియు లేదు, రాజకార్యమందెట్టి సహాయముఁ గాని యొనరిం

చుటకుఁ దగుబుద్ధిబలము మాకు లేదు. మీశైశవమిత్రులను వంచింప కూఁడదు. మాయందు నిర్దయులై యుండకూఁడదు.

తన్నజీనేత్రములనుండి బాష్పవారి ప్రవహించుచుండెను. శివాజీయది గాంచి ముగ్ధుఁడై తన్నజీ, యశజీల నాలింగన మాచరించుకొని యిట్లనియెను. "సోదరులారా! మీయందే నెందులకు నిర్దయుఁడనై యుందును? సమర సన్నాహముల నొనర్చి సైనికులను గొనిరండు."

తదనంతరమున శివాజీ యంతఃపురమునఁ బ్రవేశించెను. దుఃఖిని యగు జీజీ యేకాకినియై, యొకతుదప్రగృహమం దుపవిష్టురాలై చింతించుచు పుత్రుని నేటివిషాదమునుండి రక్షింపుమని భవానినిఁ బ్రార్థించుచుండెను. అట్టితరి శివాజీయట కేగి, "మాతా! ఆశీర్వాదముఁ గావింపుము. సెలవుఁ గైకొనెద"ననియెను.

జీజీ ప్రేమపూర్ణవచనముల నిట్లనెను. "తండ్రీ! రమ్ము. నిన్నొకమారాలింగన మాచరించుకొనెదను. నీయీవిషాదములన్నియు నెపుడు శేషించునో గదా! ఎపుడీదుఃఖిని యగచాట్లంతరించునో కదా !!

శివాజీ—తల్లీ! నీయాశీర్వాదఫలముచే నెపుడీవిషాదమునుండి యుద్ధారుఁడఁ గాలేకపోతిని? ఏరణమందు జయప్రదుఁడనుగా లేకపోతిని?

జీజీ—"వత్సా! దీర్ఘజీవిగమ్ము. ఉమాదేవి నిన్ను రక్షించుఁగాక. ఇట్లు పలికి మాత వాత్సల్యపురస్సరముగ శివాజీమస్తకమునఁ దనకరము నుంచెను. ఆయమ నయనయుగళమునుండి యశ్రువారి బొటబొటగారి యామెశీర్ణవక్షస్థలముపైఁ బడసాగెను.

అందఱికడను శివాజీ సెలవుఁ దీసికొనియెను. ఇంతదనుక నతని దృష్టిస్థిరమై, స్వరమకంపితమైయుండెను. ఇఁకనతఁడు సంవరణము గావించుకొనలేకుండెను. అతని చక్షుర్ద్వయ మశ్రుజలపూరితమయ్యెను. ఉద్వేగకంపితస్వరమున నతఁడిట్టులనియెను. "ప్రేమమయివైన జననీ! నీవే నాయుమాదేవివి. చిరకాలమును భక్తిపురస్సరముగ నీకుఁ బూజ గావింపనాకనుమతి నొసఁగుము. నీయాశీర్వాదమహిమచే నన్ని విషాద

ములను తుచ్ఛములుగ భావించెదను."

వృద్ధజీజీ చాల సేపంగలార్చి, తనయుఁడు సెలవుఁ గొనుతరి నిట్లనెను. "వత్సా! హిందూధర్మ జయసాధన మాచరింపుము. దేవరాజైన శంభువు నీకు సహాయ మొనరించును. నాపితృకులుఁడు దేవగర యధిపతి గనుండెను; హిందూధర్మావలంబియై యుండెను. తనయా! నీవుకూడ మహారాష్ట్రదేశమున తేఁడవై, దక్షిణాత్యమున హిందూధర్మావలంబివై యుందువుగాకయని యాశీర్వదించుచుంటిని."

సేనయంతయు సన్నాహమయ్యెను. శివాజీ నిశ్శబ్దముగ నశ్వారోహణ మొనరించెను; నిస్తబ్ధముగ సైనికులు దుర్గద్వారము నతిక్రమించిరి.

దుర్గద్వారము నతిక్రమించుతరి నొకయల్పవయస్కయోధుఁడు శివాజీసమ్ముఖమునకరుగుదెంచి యతనికి నమస్కరించెను. శివాజీ యతనిని గుర్తించి వానినిట్లని ప్రశ్నించెను. "రఘునాథుఁడా! యీసమయమందు నీకుఁగావలయున దేమున్నది?"

రఘునాథజీ—ప్రభూ! తోరణదుర్గమునుండి పత్రాదులనుఁగొని వచ్చిననాఁడే ప్రసన్నులరై పురస్కారమొసఁగెదనంచు వచించి యుండిరి.

శివాజీ—నేఁడీయుత్కటకార్యప్రారంభమందు పురస్కారము కొఱకై వచ్చితివా?

రఘునాథజీ—ఈయుత్కటకార్యమందు నన్ను తమ్మనుగమింప నిచ్చుటను పురస్కారమును దయచేయుఁడు. పూనానగరమునకు మీతోఁగొనిపోవు నిరువదియైదు యోధులవెంట నన్నుఁగూడఁ దోడ్కొని పొండు.

శివాజీ—రసపుత్రబాలకా! ఏలనీవిచ్ఛాపూర్వకముగ నీవిషా

దమందుఁ జొచ్చెదవు? అల్పవయసునందే యసువులఁగోల్పోవ నుత్సుకుఁడవగుచుంటివేమి?

రఘునాధజీ—రాజశేఖరా! మీ వెంటవచ్చినచోఁ బ్రాణములఁ బాయుదునను భయము నాకేమియు లేదు. పోనిండొకవేళ నేను విగతజీవుఁడనైనను నాకొఱకు సుంతైన వంతఁజెందువారలెవరు నీజగమందు లేరు. లేక కార్యద్వారమునఁ బ్రభునకు సంతస మొనఁగూర్పఁగలిగినచో జీవితుఁడనై యుండియే ప్రత్యాగమనముఁ గావింపఁగలను. అట్లగుచో—భవిష్యమున నాకు మంగళమే చేకూరును.

రఘునాధుని కృష్ణకేశగుచ్ఛము లతనిభ్రమరవినిందిత నయనములపైఁ బడుచుండెను. బాలకుని సరళయుదారముఖమండలమున యోధస్థిరప్రతిజ్ఞ విరాజమగుచుండెను. అల్పవయస్కయోధుని యీ వాక్యములనువిని, అతని యుదారవదనమండలమునుఁగాంచి, శివాజీ సంతుష్టుఁడై తోడనతనిఁ దనతోడఁ బూనానగరమునకు రమ్మనియనుమతించెను. రఘునాధజీ మరల నతశిరస్కుఁడై శివాజీకి నమస్కరించి నిజతురగము నారోహించెను.

సింహగరమునుండి పూనాకుఁబోవు పథమునందు శివాజీ తనసైన్యమునుంచెను. సంధ్యాఛాయయందు నిశ్శబ్దముగ నాపథమున కిరుపార్శ్వములందు స్థానస్థానములందు తన వాహినులనన్నిటి నతఁడు సన్నివేశముఁ గావింపఁదొడంగెను. ఒకదీపము నుజ్జ్వలించినఁగాని లేక రణభేరీమ్రోయించినఁగాని పూనానగరమందు శివాజీ ప్రభృతు లొనరించు యీగుప్తకార్యము ప్రకాశమగును. దానిం జేసియే యతఁడాయంధకారమున నిస్తబ్ధముగ సైనికుల నటఁబొంచియుండ నియమించెను.

ఆకార్యమైపోయెను. నలుకెలంకులందును నిరులు గ్రమ్ముకొనిపోయెను. శివాజీ తన్నజీ యశజీ లిరువదియైదుగురు మావులీలనుమాత్రము వెంటఁగొని యొక మహోద్యానమును సమీపించి నాయారామాభ్యంతరమున దాఁగియుండిరి. రఘునాధజీ ఛాయచాడ్పున ప్రభుని వెనుక నుపవిష్టులైయుండెను.

కొలఁదిసేపగుసరి కంధకారము గాఢతరమై ఆయామ్రోద్యానము నావృతముఁ గావించివైచెను. నైశశీతలమారుత మామహోద్యానవనమునందు మర్మరధ్వనిఁ గావించుచుండెను. పథికులింకను నొక్కరొకరుగ నాయారామపార్శ్వమునుండి పూనాభిముఖులై చనుచుండిరి. నిబిడాంధకారము తక్కవారలేమియుఁ గాంచలేదు. పత్రమర్మరశబ్దము భిన్న పథికులేమియు వినలేదు.

క్రమక్రమముగఁ బూనా నాగరికుల కోలాహలము నిస్తబ్ధమైపోయెను. దీపావళి నిర్వాణమయ్యెను. ఆనిశ్శబ్దనగరమందుఁ బ్రహరులుమాత్రమపుడపుడు యుచ్చశబ్ద మొనరించుచుండిరి. సమయసమయములందు ఫేరవరవములు వాయుపథమునుండి రాసాగెను. ఝుణఝుణమని యకస్మాత్తుగ శబ్దము విననయ్యెను. శివాజీ హృదయము చమకితమయ్యెను. అతఁడావైపునకుఁ దిరిగిచూచెను. ఏదోయొక సన్నపథమందు శబ్దము వినవచ్చుచుండెను. బహిఃప్రదేశమునుండి దానినిఁ గాంచుట సంభవమగుచుండుటలేదు.

ఘుణఘుణమని శబ్దము మరల నుత్పన్నమయ్యెను, మరల శివాజీ యాతట్టున వీక్షించెను. జనులనేకులు దీపావళినిగొని భేరీమృదంగకాహళవాద్యములు సలుపుచు, పురరాజపథమునుండి యేతెంచుచుండిరి. యిదియే పెండ్లివారి యూరేగింపుటుత్సవము!

వరయాత్ర సమీపించుచుండెను. పూనానగరమునకు నలుకెలంకులందును ప్రాచీరములులేవు. అందుచే నంతయు స్పష్టముగఁ గన్పట్టుచుండెను. పథమంతయు జనసమాకీర్ణమై నానావిధవాద్యజనిత

యుచ్ఛ్రవముచే ముఖరితమగుచుండెను. అందనేకహయారోహకులును పదాతులును గూడనుండిరి.

శివాజీ నిశ్శబ్దముగ బాల్యమిత్రులైన తన్నజీ యశజీలనాలింగనమాచరించుకొనెను. వార లొకరినొకరు మాత్రముఁ జూచుకొనిరి. "ప్రియసఖుఁడిదియే కడసారిచూపు"ను భావ మందఱి మనములందును జాగరితమై నయనములందు వ్యక్తమయ్యెను. కాని వచనము లనావశ్యకములు. నిస్తబ్ధముగ శివాజీ యనుచరసహితముగఁ బెండ్లివారిలోఁ గలసిపోయెను.

పెండిలివారు నయస్తఖాను గృహమునుండిపోయిరి. అగారమందలి రమణీమణులు గవాక్షములపొంతఁ జేరి యీ బహుజనసమారోహము నవీక్షించసాగిరి. క్రమక్రమముగ నుత్సవకారులు వెడలిపోయిరి. కాంతలందఱు లోనికిఁ బోయి శయనముఁగావించిరి. పెండ్లివారిలోనుండి రమారమి ముప్పదిమనుజులు ఖానుగారి గృహసమీపమున నాగిపోయి యటనొకచో దాగియుండిరి. వారలట్లుచటఁ బొంచియుండుట నెవరునుఁ జూడలేదు. క్రమక్రమముగ నూరేగింపు శబ్దము పూర్తిగ నాగిపోయెను.

రాత్రిమఱింత గభీరమయ్యెను. నయస్తఖానునియొక్క వచన గృహాపరిభాగమున నొక గవాక్షముండెను. అచటొకించుక శబ్దముగాసాగెను. ఖానుబీబీగారి యంతఃపురరమణు లందు నిద్రాళువులై యుండిరి; అందుచే వారికా యలికిడి యంతగ వినిపించలేదు.

గృహముపైనున్న యిటుక లొక్కొక్కటిగ దీసివైవఁబడెను. పైనుండి మృత్తిక శబ్దమొనరించుచు లోపలఁబడియెను. స్త్రీలందఱు పులికిపడి లేచి, సందిగ్ధలై యుత్తమాంగము లెత్తి జూచిరి. రంధ్రమునుండి యొకనివెంబడి మఱియొకయోధుఁడు పిపీలికాసేనపగిది క్రిందికి దిగి

గృహమందుఁ బ్రవేశించిరి. అపుడు కాంతలందఱుఁ జీత్కారశబ్దముఁగావించి నయస్తఖానుమందిరముకడ కరిగి యతనికి నిద్రాభంగ మొనరించి వానికావిషయ మెఱింగించిరి.

శివాజీ సంధిప్రార్థనముఁ గావించుచుండెనని స్వప్నమున గదు సంతసించు నయస్తఖా నులికిపడి లేచి శివాజీ పూనానగరమును హస్తగతముఁగావించుకొని తనప్రాసాదము నాక్రమించుకొనెనని విని కలవరఁబడసాగెను.

పలాయన మొనరించుటకై ఖానుసాహేబుగారొక ద్వారముకడకుఁ జనిరి. కాని ఖడ్గపాణియైన యొక మహారాష్ట్రయోధుఁడచటఁగాచియుండెను. మఱియొక కవాటముకడకరిగి యదిగూడఁ జూచి సభయమున దానిని బంధించివైచి, గవాక్షమార్గముగుండా బలాయనమాచరించ నుపక్రమించెను. అట్టితఱి "హరహర మహాదేవ" యనియఱచుచు మహారాష్ట్రవీరులా పార్శ్వగృహముఁజొచ్చిరి.

రాజపుర మాక్రాంతమయ్యెనని నలుకెలంకులందునుఁ గోలాహల ముత్పన్నమయ్యెను. ప్రాసాదరక్షకభటు లకస్మాత్తుగఁబట్టుపడి హతజ్ఞానులై పడియుండిరి. వారిలోఁ గొందఱుహతులును మఱికొందఱాహతులునునైరి. భవనమందొకచో మఱగియుండి యతనిశిష్యులై యున్నభటులు రక్షణార్థమై బరువెత్తి ఆయిరువదియైదుగురు మావులీలను నలుకెలంకులందును వేష్టన మొనరించిరి.

నిమిషములోఁ బ్రాసాదమంతయు భీషణారవముచేఁ బ్రతిధ్వనింపసాగెను. భవనమందలి దీపములన్నియు నిర్వాణమైపోయెను. అంధకారమందు మావులీలు చీత్కార మొనరించుచు యుద్ధమాచరించుచుండిరి. కన్నుమిన్నుఁగానక హిందూముసల్మానులు భండనమాచరించుచుండిరి. కవాటముల ఝుణఝుణశబ్దములును యాక్రమకారులద్వాగు

జీకృతోత్సాహరవములును యాఆక్రాంతయాహతుల యార్తనాదములునుకలిసి యాభవనమునుముఖరితమొనరించుచుండెను. ఆసమయమున శివాజీకృపాణపాణియై యోధులనడుమ లంఘించి "హరహర మహాదేవ"యనియుచ్చైస్స్వరమునఁ గేకలిడసాగెను. మావులీలుకూడ నపుడే హుంకారముఁ జేయమొదలిడిరి. మొగలప్రహరులు పలాయనమాచరింప నుద్యుక్తులైరి. కాని వారట మహారాష్ట్రుల కరవాలముల కెఱయైరి. భీషణఖడ్గఘాతముచే శివాజీ కవాటమును భిన్నమొనరించి సయస్తఖాను శయనాగారమందుఁ బ్రవేశించెను.

సేనాపతి రక్షణార్థమై తత్క్షణమే కొందఱు మొగలాయిలాగదిలోనికి బరువెత్తిరి. శివాజీ సమ్ముఖమున మృతుఁడైన చందాఖాను పుత్త్రుఁడైన శమ్‌సెర్‌ఖాను నిలచియుండెను. తండ్రియవమానితుఁడై యాత్మహత్య నొనరించుకొనెనని తలచియు విక్రమశాలియైన యాపుత్త్రుఁడు తనప్రభుపు రక్షణార్థమై నిజాసులఁగోల్పోవుట కగ్రగణ్యుఁడగుట కచటికేతెంచెను. శివాజీ యొకించుక తడవచటనే నిలచియుండి కరవాలమునుక్రిందుగనుంచి యతనినుద్దేశించి యిట్లనియెను, "యువకుఁడా! నీజనకుని రక్తముచే నిపుడుగూడ నాహస్తము కలుషితమైయుండెను. నిన్నువధించుటకు నాకిచ్చయొడముటలేదు. మార్గమునుండి తొలఁగిచనుము."

శమ్‌సెర్‌ఖానుత్తరువీయలేదు. అతనినేత్రములనుండి యగ్నివిస్ఫులింగములు రాలుచుండెను. శివాజీయాత్మరక్షణార్థమైప్రయత్నింపకపూర్వమే ఖానుయొక్క యుజ్జ్వలఖడ్గమతని యుత్తమాంగముపైఁబడుచుండెను.

ముహూర్తకాలము శివాజీ ప్రాణములపై నాసవదలివైచి తన యిష్టదేవతయైన భవానీనిదలఁచెను, అపుడు వెనుకనుండి యొకకృపాణము చటాలున ముందుకు దూసుకువచ్చి ఖడ్గధారియైన శమ్‌సెర్‌ఖాను

ముభూతలశాయిఁగ జేసెను. శివాజీ వెనుకకు దిరిగిచూచెను. రఘునాథజీ నిలచియుండెను.

శివాజీ—యోధవరుఁడా! ఆపత్సమయమునఁ దోడ్పడిననీవు నాజ్ఞప్తియందుండెదవు.

ఇట్లనిమాత్రము వచించి శివాజీ ముందునకుఁ బోయెను.

ఇట్టితరి సయస్తఖాను గవాక్షమునుండి యొకరజ్జువునవలంబన మొనరించి వెలుపలకుఁ బలాయన మొనరింప నుద్యుక్తుఁడయ్యెను. అపుడుకొందఱు మావులీలటకు బరువెత్తిరి. వారిలో నొకఁడు తనకరవాలమున కతని నెఱవేయనుంకించి దాని నతనివైపుగ విసరివైచెను. ఆయాఘాతము సయస్తఖానునియొక యంగుళీయకమునకు మాత్రమే తగిలి దానిని ఛేదముగావించివైచెను. కాని ఖానుగారికిఁ దిరిగిచూడకయేఁ ముందునకు బరువెత్తిరి. అతని పుత్త్రుఁడైన యబ్దుల్ ఫతెఖానును తక్కుంగలభటులును నిహతులైరి, ఆభవనమంతయు రక్తరంజితమైపోయెను. ప్రాసాదమందంతటను ప్రహరుల మృతదేహములు పతితములైయుండెను. పరువులెత్తువారి యాక్రందస్వరముతోను, రమణీమణుల యార్తనాదముతోను భవనమంతయు ముఖరితముగాఁ దొడంగెను. మొగలాయీలను వధించుటకై మావులీలు నలుకెలంకులకును బరువులెత్తిరి. ద్వారముకడనున్న ప్రదీపముయొక్క యస్పష్టాలోకమునఁ గొందఱి మృతదేహములును, కొందఱి ఛిన్నశరీరములును, గాయములచే నిండిన గాయములవారును గన్పట్టుచుండెను. రుధిరసిక్తమైనయాప్రదేశమంతయుఁ గడుభీషణమైయుండెను. శివాజీ యపుడు మావులీలను తనకడకుఁ బిలచెను. సర్వసమయములందును, సకలసమరములందును, యతఁడు జయప్రాప్తినొందిన పిదప వృథాగా ప్రాణనాశనమైనచో విరక్తుఁడగుచు నిఁక రిపుజనులను రక్షింపఁదలపడును. దానిం జేసి శివాజీ "మనకార్యము సిద్ధియయ్యెను. భీరుఁడైన

సయుస్తఖానిఁక మనతోరణము సూచింపఁడు. ఇఁక ద్రుతపదమున సింహగరాభిముఖముగఁ జనుఁడని యాదేశ మొసరించెను.

ఆయంధకారనిశియందుఁ బరివారసహితుఁడై శివాజీ యనాయాసముగ సింహగరదుర్గాభిముఖుఁడై చనెను. రమారమి రెండు క్రోసుల దూరముచనిన పిదప వారనేక కాగడలను జ్వలించిరి. మహారాష్ట్రసేనలు నిరాపదముగ సింహగరమును జేరుటఁ బూనానుండి సయుస్తఖానుగాంచెను.

మరునాఁడు ప్రాతఃకాలమున మొగలాయిలు కొందఱుక్రోధోద్దీపితులై సింహగరము నాక్రమింపఁజనిరి; కాని దుర్గశిఖరమునుండి వచ్చు నాడితూపులచే ననేకులు మడిసిరి. తక్కుంగల వారలు భీతిల్లి యటనుండి బలాయనమొనర్చిరి. కర్తాజీగుజ్జర్ తన యధీనమందున్న యశ్వారోహకులను వెంటనిడుకొని, మొగలాయిలను చాలదూరము వఱకుఁ దఱిమెను.

అల్పవిషాదము సంభవించినపుడు సామాన్యులైన యోధుల యొక్క యుద్ధపిపాసయెంత యెక్కుడగును; కాని సయుస్తఖానట్టి వీరుఁడు కాఁడు. నిజసైనికుల భీరుత్వమును సూచించుచు, నర్ధవాంఛచే యశవంతుఁడు వశీభూతుఁడై శివాజీ పక్షము నవలంబించెనని దెలుఁపుచు నతఁడొక పత్రమును యౌరంగజేబు కడకంపెను. వారలిరువురుకూడ నకర్మణ్యులని దలఁచి చక్రవర్తి వారల ఢిల్లీకి మగుడిరండని యాజ్ఞాపించి, నిజతనయుఁడైన మురాదును దక్షిణసీమకంపెను. పిదప నతనికి సహాయ్య మొనర్చుటకై యతఁడు యశవంతసింహుని మరల దక్షిణమునకుఁ బంపెను.

ఇట్లుజరిగిన యొకవత్సరమువఱకు యుద్ధములేవియు విశేషముగ జరుగలేదు. 1664 సంవత్సర ప్రారంభమందే శివాజీ తండ్రియైన షాహాజీ కాలముఁ జేసెను. దానింజేసి శివాజీ సింహగరమందలి దన కా

ర్యములన్నిటి నిర్వాహణముఁ గావించుకొని, రాయగరదుర్గమున కరిగి యట రాజబిరుదాంకితుండై, నిజనామమున నాణ్యముల ముద్రింపఁగావింపఁదొడంగెను. మన మిపుడిఁక నీసభాపతి నికటమున సెలవుఁగైకొందము.

పాఠకులారా! మనము తోరణదుర్గమునుండి వచ్చి చాలదినములయ్యెఁగదా. మన మిపుడొక మాఊదుర్గముకడకుఁ జనియట నేమి జరగుచున్నదో చూతమురండు.

పదియవప్రకరణము.

ఆశ.

ఏదినమున రఘునాథుఁడు తోరణదుర్గమున కరిగెనో, యేనాఁడతని హృదయము క్షిప్తమయ్యెనో, యాదినమందే ప్రథమప్రణయానందలహరి యందొక బాలికహృదయము ప్లావితముగాఁ దొడంగెను. ఉద్యానవనమందానాఁటి సంధ్యాసమయమునఁ బ్రియంవద దృక్కులకస్మాత్తుగ నాస్వదేశీయతరుణ వయస్కయోధునిపైఁ బతితమైనపుడా బాలికచమకితయయ్యెను. మరల నామెయొక మాఱటుజూచెను—ఆయుదారవదనమండల మాకాంచనసన్నిభావయవములు నాబాలికహృదయఫలకమందు ముద్రితములయ్యెను. ప్రియంవద లజ్జావనతముఖియై పిదప గృహాభ్యంతరమున కరిగెను.

ఆనాఁటిరేయి ప్రియంవద రఘునాథునకు విందొనరించుచు, నతనిపార్శ్వతలమున నిలుపంబడి యతని దేవనిందితయవయవములను వీక్షించు రఘునాథుఁ డుత్తమాంగమెత్తి మరలఁదన్నుఁదిలకింప యిరువురి చక్షులు నొండొంటితో మిళితములాఁగ లజ్జావృతవదనయై మెల్లగఁ బ్రక్కగఁ దప్పుకొనియెను.

అట్లామెయఱిగినను, ప్రియంవద యెదయందొక నూతన భావముదయమయ్యెను. రఘునాథుఁడా సుందరిపైఁ దన సోద్వేగదృక్కులను బఱపించనేల? రసపుత్రబాలికపై నారసపుత్రవీరుఁ డనురాగంపుంజాదృక్కుల నిగుడించెనా యేమి? ప్రియంవద యెడల రఘునాథుని హృదయమందు మమతయుద్భవమయ్యెనా యేమి?

మఱుచటి దినమున బాలిక యోధుని మరలఁ గాంచెను—మరల నామె హృదయమొకించుక యుద్విగ్నమయ్యెను. పిదప ప్రియంవద రఘునాథుని ప్రియవాక్కులను విని, యతఁడు దన కంఠమందు ముక్తాహారమును వైవఁగఁ జమకితయయ్యెను. ఆమె హృదయమాహ్లాదోద్వేగములంగుఁ ప్లావితమయ్యెను. రఘునాథుఁడు తదనంతరమున నామెసెలవుఁగైకొని యశ్వారూఢుఁడై పోవుతరి ప్రియంవద గవాక్షపార్శ్వమందు నిలువంబడి యా యోధు నాత్రముతోఁ జూడసాగెను.

చాలసేపటి వఱకు బాలిక గవాక్షప్రాంతమందె నిలువంబడి యుండెను. అశ్వికుఁడు దృక్పథము నతిక్రమించి చనినను, నిష్పందయై బాలికయా వైపుగనే జూచుచుండెను. దివాలోకమునఁ బర్వతమాల చాలదూరము వఱకును గన్పట్టుచుండెను. శైలపార్శ్వ స్థితసాల శ్రేణులు సాగరలహరిచందమున మారుతమం దూగులాడుచుండెను. గిరిశృంగమునుండి యచ్చటచట జలప్రపాతములు పతితమగుచుండెను. పిదప నాస్వచ్ఛవారి యొకనదీరూపముఁ దాల్చి క్రిందుగఁ బ్రవహింపఁదొడంగెను. గిరులందలి సుందరమగులోయలలోని కుగ్రామటీకురములు గన్పట్టుచుండెను. మనోహార హారిద్వర్ణ క్షేత్రములన్నియు దృక్పథమునఁ బడుచుండెను. ఆకేదారములనడుమ పర్వతకన్యలైన తరంగిణులు మెల్ల మెల్లగ విహరించుచుండెను. మేఘవర్జితభానుఁ డాసుందరదృశ్యముపైఁ దన యాలోకహల్లోలము నానందమునఁ బ్రవహింపఁ జేయుచుండెను. కాని ప్రియంవద వీనిని వీక్షించుటలేదు—ఆమె మనమందీ దృశ్యములేవియు న్యస్తములై లేవు.

ప్రియంవద నేఁటిదినమున నన్యమనస్కయై యుండెను. నిశియైన పిదప జనకుఁడు భోజనమొనరించుచుండ నతని నికటమున నుపవిష్టయై యుండెను. జనకుని భోజనానంతరమున నతని పర్యంకముననుకూలముగ నమర్చివైచి పిదప మెల్లగఁ దనశయనాగారములోనికిఁ బోయెను. నిస్తబ్ధమైన యానిశియందు ప్రియంవద కేమియు నిద్దురపట్టలేదు. పాన్పునుండి దిగి యాబాలిక మెల్లగ గవాక్షపార్శ్వమున కరిగి నిశ్శబ్దముగ నటనుపవిష్టయై విరహిణుల రిపుఁడైన శీతాంశుని శుభ్రాలోకమును వీక్షింపఁదొడంగెను.

పదునొకండవప్రకరణము.

చింత.

జనార్దనశర్మ సరళస్వభావుఁడైన పురుషుఁడు. దినమంతయు శాస్త్రానుశీలనమందుఁగాని దేవపూజయందుగాని, రతుఁడై యుండును. ప్రభాతసాయంకాలము లందతఁడు కిల్లాదారుని కడకుఁబోవుచుఁ గదాచిత్కాముగ నిలయమందే యుండును. తానల్లారుముద్దుగఁ బెంచుకన్యనాతఁడు ప్రాణతుల్యముగఁ బ్రేమించుచుండును. భోజనసమయమందతఁడు బాలికను తన నికటమునఁ గాంచనిచో నతఁడేమియు భుజింపలేఁడు. రాత్రులం దపుడపుడు శర్మపురాణకథలఁ జెప్పుచుండ బ్రియంవద యతని పార్శ్వమునఁ గూర్చుండి చక్కగ వినుచుండును. ఇతరసమయములం దాతఁడు తఱచుగ నిజకార్యములందే నియుక్తుఁడై యుండును. దానింజేసి యతఁడు బాలికమన మందొక నూతన భావముదయమయ్యెనని యెట్లెఱుంగఁగలఁడు?

బాలికహృదయమం దకస్మాత్తుగనొక దినమం దుదయమైన భావము బహుదినములు స్థాయియైయుండు టెట్లు? ఒకనాఁటి సంధ్యా

సమయమందుద్భవమైన భావోద్రేకము మూఁడునాలుఁగు దివసముల లోనే క్షీణింపకెట్లుండును? ఆభావమట్లామె హృదయమందులీనము గాక పోయినను, ఆతరుణవయస్క-యోధునిఁ గూర్చిన విషయమునప్పు డపుడామె యెదయందు జాగరితములగు చుండెను. జన్మించినదాదిగఁ బ్రియంవద యేకాకినియై మెలంగెడిది. జనార్దనశర్మగాక, ప్రియమాప్తులైన వారలేరును యామె నయనపథమునఁ బడలేదు. ఆమె యొరులేరిని యెఱుఁగదు. దానిం జేసి శైశవమునుండియు నామె ధీరవతియై శాంతురాలై చింతాశీలయైయుండెను. ప్రథమయౌవనమం దే మూర్తిని గాంచి ప్రియంవదయుద్విగ్నహృదయయయ్యెనో, సంధ్యాసమయములందును, ప్రభాతములందును, నిశలందును నామూర్తి యపుడపుడామె యెదయందు జాగరితమగు చుండెను.

కల్పన మాయావినికదా! ప్రియంవద యేకాకినియై గవాక్ష పార్శ్వమున నుపవిష్టయై యున్నపుడుగాని నిశీథమునఁ జంద్రాలోకమం దాపుష్పోద్యానవనమున విచరణ మొనరించు నపుడుగాని యామె మన మందెన్నియో తీఱులకల్పన లుదయించును. "ఆతరుణవయస్క-యోధుఁడిచటి నుండి జనినప్పటి నుండియు యుద్ధజనితోల్లాసమున మగ్నుఁడై దుర్గములెన్నిటినో, హస్తగతముఁ గావించుకొని, శత్రులను ధ్వంసమొనరించుచుండనోపు. ఇట్లునిజకార్యనియుక్తుఁడైన యాయందకాని చిత్తమున నీప్రియంవదఁ గూర్చిన తలంపొకమాత్రైన నుదయించునా? పురుషమనంబులు నానాకార్యచింతాశోకోల్లాసములతో సర్వదా పరిపూర్ణములై యుండును. జీవన మాశాపూర్ణమైనది. అది నానాయాశలచే నతివాహితమగుచుండును. ఆయాశలుఫలించినను కాక పోయినను జీవనమెల్లపుడు నుల్లాసపూర్ణమై యుండును. రాజద్వారములందును, యుద్ధక్షేత్రములందును, శోకగృహములందు లేక నాట్యశాలలందును, నానాకార్యములందును, నానాచింతలందును నిండి

యున్న యతని హృదయమందీ ప్రియంవద చింత చిరకాలముండునా? "అయిన నప్పుడప్పుడు నన్ను గుఱించి యతఁడొకించుకయైనఁ దలఁపకనుండఁబోడని మాయావినియైన యాశ నాకర్ణములందు మెల్లగఁ జెప్పుచుండె"నని యాత్మగతమునఁ బ్రియంవద దలఁచుచుండును.

ఇంతియఁగాక నామె మరల నిట్లుచింతించుచుండును. "ఆసుందరుఁడింకను తోరణదుర్గమును గూర్చి తలంచుచుండునా? ఈకాలమున, నీవయసునం దతనిచిత్తము స్థిరముగ నుండునా? ఆహా! అతని ముద్దుమోము! ఈనదీతీరుతరంగమైనున్న యీపుష్పమును దీసి క్షణకాలమాఁడుకొనెఁగాక! ఆహా! యీకుసుమమెంత యానందముఁగ నాకరములం దాడుచున్నది! మరల—నాతరంగమేది? అదెచ్చటికి పోయెను?—పుష్పము శుష్కించిపోవుచున్నది అయ్యో! ఆనీరము మరల దానికడకు రాదేమి? అయినను, ఆయావనుఁడు మరల నీ తోరణదుర్గమునకు రాకుండనుండఁడు."

ఆపర్వతపథముగుండా నొకనవీనయశ్వారోహుఁడేతెంచుచున్నట్లుండెనే! ఆతురగము శ్వేతవర్ణముగలది. ఆహా! ఆనీలకేశగుచ్ఛపిహిత సుందరలలాటము! ఏమి ఆకమలసన్నిభనేత్రయుగముసొంపు! అవునా యోధుఁడు దుర్గమును సమీపించి తనఘోటకము నవరోహించి నావైపుగవచ్చుచుండెను. అతనిమస్తకమున సువర్ణఖచితశిరస్త్రాణమున్నది. ఆబలిష్ఠదీర్ఘబాహువులందు హిరణ్మయమైన పిడిచేనొప్పుకృపాణమును, అతనిస్కంధములనుండి లంబితమగు నమ్ములపొదియు నెట్లు విరాజిల్లుచుండెనో! అతఁడు నాకడకువచ్చి మునుపటిచందముగనే యాహారమిడుమనియడుగుచుండును. అతఁడుపవిష్టుఁడై భుజించుచుండ నేనతని పార్శ్వమున నిలువంబడియుందును. పిదప నిశియందొరులేరును లేనితరి నీ ప్రాసాదోపరిభాగమున సుధాంశుకిరణశుభ్రాలోకమున సలజ్జనై నేనతని చెంతనిలువంబడియుండ నావన్నెకాఁడు ప్రముదితచిత్తుఁడై సాదరము

గనన్నుఁ దనకడకుఁ జేరి యూహావములఁ గూర్చిన విషయములు నాకెఱిం
గించుచుండ నేవినుచుందును.

“ఆంగణము పూర్తియై పోవును. తరుణవయస్కుఁడైన యీ సేనా
పతి సమరమందు దనబాహుపటిమఁజూపి రిపువీరులనుఁ దునుమాడి ది
గంత విశ్రాంతకీర్తిమంతుఁడగును. అతఁడు బిరుదాంకితుఁడగును. యశ
వంతుఁడైనను నతఁడు తన ప్రియంవదను మఱువఁజాలఁడు. నాజనకుఁడు
నన్నతని కొసఁగి పరిణయమాచరింప నిశ్చయించును. మానిలయమంత
యుఁ బెండ్లిసంభారములతో నిండియుండును. బంధువులతో మాగృ
హమంతయుఁ బూర్ణమైయుండును. నలుకెలంకులందును శుభ్రాలోకము
లు జ్వలించుచుండును. వాద్యనినదములు, గానాలాపములు వినవచ్చు
చుండును: ఇట్లుదలఁచుచుంటి నేమి ? వెలుపల జరగుశృంగారములన్ని
యు గృహాభ్యంతరమున వివాహవేదికయం దుపవిష్టురాలనై యుండు
నాకెట్లుగ స్పష్టమగును. ఏమేమిగావింపఁబడెనో పిమ్మట నెఱుఁగనుఁగాక! నేన
వగుంఠనవతినై యా సేనప్రతిమూర్తి నికటమున కూరుచునియుండి, యా
చెలువుని చెంత నవనతముఖినై యుండి, యతని హస్తములందు నాస్వే
దార్ద్రకంపితకరమునుండి ఆనిశియందే నాజీవితేశ్వరునిఁ బడసెదను. ఆహా
ఆనందముగ నాహృదయ ముప్పొంగుచుండెను గదా! ఇదేమి ప్రియంవ
దా ! నీవిట్లు బేలవగుచుంటివేమి” ?

“కాదు. రఘునాథుఁడు యశవంతుఁడు కాలేదు. అతఁడే యుపాధినిఁ
బడయలేదు. అతఁడు నిరుపేదయైనను నన్ను వివాహమాడును. ఈశైల
యథోభాగమున నాయందంపులోయమందు కలకలరవముగ బ్రవహిం
చుచు, సుధాంశు కిరణాలోకమున సుందరముగ గన్పట్టు నానదీ నికట
మునఁ గౌముదీస్నాతమై సుషుప్తి మగ్నమై, సుందరమైన, యావచ్చనివి
శాలకేదారమందారమణీయస్థానమం దనేకకుటీరములనడుమ నా
నాథుఁడు మాకొఱకొక యందమైన పర్ణశాలను నిర్మించును. అదిపొంది

యసియే నేఁజెప్పుకొనుచుందును. దివసావసానమున ననేకవ్యంజనసహి
తముగ వచించి నాజీవితేశ్వరుని కొఱకెన్నియో సంభారములనుగావిం
చి మాకుటీరసమ్ముఖమున నవమాద్వారమున్నన నుపవిష్టనైయుండి మ
నోహరునిమిత్తమై ప్రతీక్షించుచు దూరముననున్న కేదారముల వైపు
నిరీక్షించుచుండి సమస్తదిన పరిశ్రమానంతరమున దీర్ఘకాయుఁడై యం
దకాఁడైనయొక యువకుఁడు నాకుటీరాభిముఖుఁడై యరుగుదెంచుటఁజూడ
నాకెట్టి యాహ్లాదమొదవును! ఆహా! నాహృదయము నృత్యముఁగావిం
చుచుండెను ! ఆనవమోహనాకారుఁడు పర్ణశాలయందుఁ బ్రవేశించి
నన్నుఁ దనకడకురమ్మని జేరి మందస్మితవదనుఁడై నావక్షమునొక నూతన
కంఠమాలచే నలంకరించి నన్నానందింపఁజేయును ! ఆహా! నాశరీరము
పులకితమగుచుండెను. ఆహ్లాదమూచే నాహృదయము మరలస్ఫీతమగు
చుండెను. ప్రియంవదా ! ప్రియంవదా !! ఇదేమి యిట్లు బేలవగుచు
టివి ?” ఈ తీఱునసిశీథమందాయున్నతదుర్గమును నలుకెలంకులనున్న
పర్వతమాలలును కలువలతేని శుభ్రకాంతియందు నిస్తబ్ధముగ సుషు
ప్తిమగ్నములైయుండ నీలనభశుభ్రసుధాంశులఁగాంచి నప్పుడు ప్రియం
వద హృదయమం దుదయమాకల్పనల నన్నియునునిర్వాచ్యములుకదా!
ఆకల్పనలకు శేషము లేదు ! అగాధజలనిధిహిల్లోలముల చాప్పననొక
దానివెంబడి మఱియొకటి నితాంతముగ నాబాలచిత్తమున నుద్భవము
గుచుండెను.

ఈరీతిగ మాసము వెనుక మాసము చొప్పున నొకవత్సరమతివా
హితమయ్యెను. కాని ప్రియంవద కల్పనాలహరి శేషింపలేదు. ఏతరుణ
వయస్కస్వసీమయోధునకుఁ బ్రియంవదయీవిదేశముననొకనాఁడాదర
పురస్సరముగ విందొసఁగెనో యతని కమనీయముఖమండలముపుడపు
డాబాలికమనోదర్పణమునఁ బ్రతిబింబితమగుచుండెను. ఏదీర్ఘకాయనవ
మోహనాకారుఁడుత్సాహపూర్వకముగ ప్రియంవదకంఠమునఁ బ్రియ

ముక్తాహారమును వైచెనో, యతనియానందనీయవదనమును దేవతుల్యరూపమును ఆబాలిక కల్పనలందు, యిఁకనపుడపుడ నేల; సర్వదామిళితములై యామెహృదయముననుదయమగుచుండెను. కల్పనయొకమాయావిని యాయేమి ?

పండ్రెండవ ప్రకరణము.

పునర్మిళనము.

కల్పన మాయావిని కాదు; ప్రియంవదచింత మిథ్యావాదిని కాదు; బాలికయాశ విశ్వాసఘాతిని కాదు.

ఒకనాఁటి సంధ్యాసమయమునఁ బ్రియంవద మఱలనాపుష్పోద్యానవనమున సురభికుసుమములఁ గోయుచు నడుమ నడుమ నేదియో భావించుచుఁ దనహృదయపీఠమునలంకరించియున్న యాకంఠహారమును నిరీక్షించుచుండెను. ప్రియంవదరూపము ముసుపటివలెనే స్నిగ్ధమై యానందనీయమై యుండెను; ఆమెముఖమండలము వెనుకటిచాడ్పుననే కమనీయమైశాంతమైయుండెను; కానియీసంవత్సర మా రూప మొకించుక పరివర్తనమయ్యెను. నవోల్లాసయౌవన మావదనబింబము నధికతరకమనీయకాంతివంతము గావించెను. నూతనజ్యోతితో నానేత్రయుగ మాలోకితమయ్యెను. నూతనలావణ్యమం దాశరీరము భాసమానమగుచుండెను. ప్రియంవద ప్రథమయౌవనమునఁ బదార్పణ మొనరించెను. ఆచింతావతి—ఆరూపవతి—ఆయౌవన సంపన్న పూలఁగోయుచు నాకంఠమాలను వీక్షించుచు నేదియోజింతించుచున్నతరి ద్వారముకడ నొక నవయౌవనాకారుఁడైన రసపుత్రవీరుఁడేతెంచి హయమునుండియవతరణమొగావించెను. కుసుమములను గోయుచుగోయుచు నారసపుత్రమణి యావైపుగఁ జూచెను. తోడనే యామె శరీరము గగుర్పొడిచెను; ఆదిక్కునుండి యారాకుమారి తన దృక్కులను మరల్పఁజాలకుండెను.

రసపుత్రయోధుఁడు కూడ నాకుసుమారామమున నారాజపుత్రకాంతను మరలఁ గాంచఁగలిగెను. ఒకనాఁటి నిశీథమం దేయం

గనారూపమును వీక్షించి తాను విమోహితుఁడయ్యెనో, యొకనాఁటి ప్రభాతముననే లావణ్యమయి పవిత్రకంఠమును ప్రియకంఠమాలచే నలంకరించెనో, రణమందును, సంకటమందును, శిబిరమందును సైన్యమధ్యమునను, యేసుందరికత్తె వదనమండలము తన మనోదర్పణమునఁ గదాచిత్కముగఁ బ్రతిఫలించుచుండెనో, నిశీథములందును, స్వప్నములందును నేకమనీయ లజ్జారంజిత ముఖబింబము సర్వదా తన సమ్ముఖమున నుదయమగుచుండెనో, నేఁడు, బహుదినానంతరమున నాయానందనీయ లావణ్య లజ్జారంజిత వదనమండలము తన నయనపథమునఁ దోఁచఁగనే రఘునాథజీ క్షణకాలము వాక్యశూన్యుఁడై నిశ్చేష్టుఁడై నిలువంబడి యుండెను.

హేకుముదబాంధవుఁడా! రఘునాథ ప్రియంవదలపై సుధావర్షమును గురిపించి నీసుధాంశునామమును సార్థకముఁ జేసికొనుట కిదియే తగినయదను. నీవు నిశీథమందు జాగరణమాచరించి యంతయుఁ జూచుచుండెదవు; కాని జగమందిట్టి దృశ్యమును నీవెపుడును గాంచియుండవు. తరుణవయసున నెపుడు చిత్తము ప్రథమ ప్రణయోల్లాసమున నుత్క్షిప్తమగునో, నవజాతచంద్రకిరణముచాడ్పున నెపుడు నవజాతప్రణయానంద హిల్లోలము మానసజగతియందుఁ బ్రవహించునో, యెపుడు యౌవన ప్రథమప్రణయమందు సమస్త పృథ్వియు సిక్తమగునో, నీజగమింద్రపురియగును! క్షణకాలము గడచిన పిదప ప్రియంవద యవనతముఖియై మందిరమందుఁ బ్రవేశించి, జనకునకు రఘునాథజీ యాగమనవార్త నెఱింగించెను. జనార్దనశర్మ యత్యంత సమ్మానపురస్సరముగ శివాజీ దూతనాహ్వానముఁ గావించెను.

సంధ్యాసమయమున రఘునాథజీ పురోహితుని సమ్ముఖమున నుపవిష్టుఁడై సమాచారములన్నిటి నతని కెఱుఁగఁ జేయఁదొడఁగెను.

"శివాజీ రాజనగరమునకుఁబోయి రాజబిరుదాంకితుఁడై దేశశాసనార్థము వలయు ప్రయత్నములనుఁ గావించుచుండెను. కాని ఢిల్లీశ్వరుఁడు శివాజీ నణఁచుటకై యన్వరాధిపతియై, మహా పరాక్రమశాలియైన రాజాజయసింహుని ప్రేరణ మొనరించెను. అదివిని మహారాష్ట్ర నృపుఁడు చింతితుఁడగుచుండెను. మహారాష్ట్రతిలకుఁడు ప్రాయశః జయసింహునితో సంధి గావించుకొనును. ఈ కార్య నిర్వాహణార్థమై, యన్వర దేశీయులను, శాస్త్రజ్ఞులునైన జనార్దనశర్మగారి సహాయ్యము వేఁడుచుండిరి. రాజానతి చొప్పున రఘునాథుఁడు పురోహితులవారిని వెంటఁగొని పోవుటకై వచ్చెను. శిబికము మొదలగు సవన్నియుఁ దయారుగ నున్నవి. పురోహితమహాశయులకు వీలుకలుఁగుచో, మూఁడు నాలుఁగుదినములలో రాజనగరమున కరుగుదెంచిన నానందించెదమని శివాజీ సెలవొసఁగెనని యతఁడు పురోహితున కెఱింగించెను.

ఆనిలయమందొక పార్శ్వమునఁ బ్రియంవద యతిథికివలయు నాహారసంభారములన్నియుఁ జక్కఁ జేయుచుండెను. రసపుత్రయువకుఁ డెఱింగించు విషయములన్నియు నారమణి యాత్రముతో వినుచునేయున్నదని మేము మాచదువరులకు వేఱుగఁ జెప్పనక్కఱలేదు. "జనకుఁడు రాజధానికడ కరుగును. రాజనగరుకు మమ్ములఁ గొనిపోవుటకై నీయందకాఁడిట కరుగుదెంచెను. ఆహా! యేమి నాభాగ్యమని" ప్రియంవద సంతసించుచుండెను. ఆమె హృదయము నృత్యముఁ గావింపఁదొడంగెను. ఆతరుణి కరమందున్న కలశ మకస్మాత్తుగఁ గ్రిందఁబడిపోయెను. ప్రియంవద యపుడు లజ్జావనత ముఖియై, పులకితగాత్రియై సదనమునుండి యుద్యానములోనికి నిష్క్రమించి యట మఱుగున నిలువంబడి యోధవరుని పలుకులను వినుచుండెను.

రఘునాథుఁ డింకను చాలసేపటి వఱకును జనార్దనశర్మతోనే మేమియో ముచ్చటింపసాగెను. తన దేశమును గుఱించియు, కుల

గోత్రములఁ గూర్చియు, జననీ జనకులగుఱించియు సవిస్తరముగ సమస్త విషయములను జనార్దనున కెఱింగించి యతనిని మాతుల యని సంబోధింపఁ దొడగెను. జనార్దనుఁడు రఘునాథుఁడున్నతకులోద్భవుఁడని యెఱింగి యువకుని వీర్య సౌందర్యములను, వినయవిధేయతలనుఁ గాంచి మిగులనానందించి యతనిని జామాతయని పిలువసాగెను. రఘునాథుఁడిఁక నాహార మొనరించుసమయమయ్యెను. ప్రియంవద సంభారములన్నిఁటి నమర్పసన్నద్ధురాలై యుండెను. వృద్ధుఁడైన జనార్దనశర్మ లేచి, హృష్టచిత్తుఁడై రఘునాథు నాలింగన మొనరించుకొని యిట్లనియెను. "వత్సా! రఘునాథా! ఇఁకభోజనమునకు లెమ్ము! నేఁడునీచరితంబంతయు విని చాలయానందించితిని. నీవంశము నాకపరిచితమైనది కాదు. నీగుణములు కూడవంశోచితములై యున్నవి. ప్రియంవదను నేను నాకన్న బిడ్డగఁ బెంచుకొనుచుంటిని; నిన్నుకూఁడ నేను నేఁటి నుండి నాయన్నులమిన్న చాడ్పున నేఁ బ్రేమించుచుండెదను. భగవానుని కృప మనపై నుండుచో, రణానంతరమున నీవంటి యొక యుపయుక్త పాత్రునకు ప్రియంవద నొసంగెదను. తదనంతరమున నిశ్చింతుఁడనై నీమానవలీలను సంవరణముఁ గావించెదను. జగదీశ్వరుఁడు నిన్నును, నాచిన్నారిపట్టియైన ప్రియంవదను సుఖవంతులుగ నొనర్చుఁగాక."

ఈవాక్యములను వినిన పిదప రఘునాథుని నయనములనుండి యొకటి రెండశ్రుబిందువులు రాలెను. అతఁడు పురోహితుని చరణపద్మములకు ప్రణమిల్లి యిట్లుపలికెను. "ఆర్యా! యీదరిద్రయోధుఁడు తమ యభిలాషను పూర్ణము గావించున ట్లాశీర్వదింపుఁడు. రఘునాథుఁడు నిరుపేదయైన వీరుఁడు మాత్రమే. ఇపుతడనికి నామము లేదు. అర్థము లేదు; పదము లేదు; కాని పరాత్పరుఁడు కృపఁజూచినచో, నార్యోత్తములైనదా మాశీర్వదించినచో, రఘునాథుఁడీ యమూల్యరత్నమును బడయు కొఱకు జతనము లొనర్చును."

ప్రేమ ప్రపూర్ణములైన యీవచనములు ప్రియంవద కర్ణములఁబడెను. వాయుతాడిత పత్రము పగిది నామె తనుల్లత కంపితమయ్యెను.

ఆదినమున రఘునాథుఁ డొకించుకయైన నాహారముఁ గావింప లేకపోయెను; అరక్తముఖియైన ప్రియంవద కూడ బాగుగ నతనికి విందొనరింపఁ జాలకపోయెను.

పదమూడవ ప్రకరణము.

రాజగర ప్రయాణము.

ప్రయాణ సన్నాహము లొనర్చుట కైదారుదినములు విలంబమయ్యెను. రఘునాథుఁడు పురోహితుని గృహమందే వసించుచుండెను. ప్రాతఃకాల సంధ్యాసమయము లందతఁడు ప్రియంవదను పుష్పోద్యానవనమునఁ బూలఁగోయుచుండుటఁ గాంచును. మధ్యాహ్న యపరాహ్ణ సమయములందు రసపుత్ర యోధుఁడు ప్రియంవద ప్రియహస్తమునుండియే యాహారమును గ్రహించుచుండును. ఈయైదారు దినములకాలమందుఁ గూడ నతఁడు సాహసించి రసపుత్రరమణితోఁ బ్రసంగింపఁజాలక పోయెను. ప్రియంవదను జూచునపుడు రఘునాథుని హృదయ మాహ్లాదముతో నిండిపోవును. రాకొమారి కూడఁ దన మేలిముసుంగును చక్కఁ జేసికొని భోజనసమయమందుగాక తక్కిన సమయములందు రఘునాథుఁడు తన దృక్పథమునఁ బడినపుడు లజ్జావనతముఖియై ప్రక్క ప్రక్కగా దప్పుకొని చనును.

తోరణదుర్గమునుండి సింహగడమునకుఁ బ్రయాణము సేయుతరి ప్రియంవద యున్న శిబికము వెనువెంటనె యొక తురగారోహకుఁడు మెల్లమెల్లగాఁ దన యశ్వమును నడపుచుఁ జనుదెంచుచు, పర

తపథములందుగాని, గహనభూములందుగాని, భూరుహశూన్యమైదానములందుగాని నదీతీరములందుగాని, పాలకీడనుండి యొక మహూర్తమాత్రమున దూరముగఁబోవుచుండుటలేదు. నిశీథములందు ప్రియంవద సహచరుల సహితముగ నేదేని యొక సామాన్యమందిరమందుగాని, యంగడియందుగాని లేక నొక ధనికుని యగారమందుగాని విడసినపుడు, సమయ సమయములందొక యనిద్రయోధుఁడు కృపాణపాణియై యామె యుండుచోఁ బచారిఁ జేయుచుండును.

నారీమణిమాత్రమే యీసకలచిహ్నముల నెఱుఁగఁగలదు. ఈసర్వచిహ్నములను వీక్షింపఁగలదు. పురుషయత్నములను, మనోవాంఛలను అతని హృదయవేగమును నారీనయనములనుండి గోపనములు గాలేవు. శిబికాభ్యంతరమునుండియు నిశీథములందుఁ బ్రియంవద యాయవిశ్రాంతయనిద్రయశ్వారోహక యోధునిఁ గాంచుచునేయుండెను. ఆ దేవనిర్మితయాకృతిని జూచినపుడు ప్రియంవద నేత్రపద్మములు వికాసింపసాగెను. ఆదుర్దమనీయావేగ చిహ్నములఁ గాంచినపుడు రాకొమారి యెద యానంద ప్రేమోద్వేగములతోఁ బ్లావితమగుచుండెను.

సంధ్యాసమయములందుఁ బ్రియంవద యోధున కాహారమిడ నరుగుదెంచి, మౌనావలంబియైన యాయందగానిఁ గాంచి లజ్జితయై యవనతముఖియై నిలువంబడును. కాని ప్రియాస్పదుఁడైన వానికివలయు పదార్థము లేవియని యడుగఁజాలకుండెను. ప్రభాతములందామె తన శిబికము నారోహించుతరి ఘోటకపృష్ఠమున నుపవిష్టుఁడైయున్న యోధాగ్రేసరుని మ్లానముఖమండలముపైఁ దనయనురాగంపుఁ జూపులనిగుడించి వానినిమరల వెనుకకుఁ ద్రిప్పనశక్తయగుచుండెను.

కతిపయదినభ్రమణానంతరమున ప్రయాణికులు రాజగరమును చేరిరి. సంధ్యాసమయమున దుర్గపరిసరమున నున్న యొక గ్రామమ

దుఁబ్రవేశించి మఱుచటిదినమున దుర్గమున కరుదెంచుట కనుమతి యొసంగవేఁడుచు జనార్దనశర్మ మహారాష్ట్రనృపునికడ కొకదూత నంపెను.

ఆనాఁటిరేయి భోజనసన్నాహముల నొనర్పుట కొకించుక విలంబమయ్యెను. జనార్దనుఁడు ఫలాహారముఁగావించి త్వరగ శయనింపనేగెను. రాత్రిఝాముగడచిన వెనుకఁ బ్రియంవద రఘునాథునకు విందొనర్చెను.

భోజనానంతరమున రఘునాథుఁ డన్యదివసములచాడ్పున వెలుపలకుఁ జనక నిలయమందేయిటునటుఁ బచారుఁ జేయసాగెను. కొలఁది సేపైనపిదప నతఁడు ప్రియంవదయొంటరిగనున్న [illegible] మెల్ల మెల్లగా జని నతమస్తకుండై నిలువంబడి హృదయోద్వేగమును దమనముఁగావించుకొని స్థిరస్వరమున నారాకొమారికనుద్దేశించి యిట్లనియెను. "దేవీ! నాకిఁక సెలవొసంగుము !!

తృషితునిగళమున వారిధారపడువడువున రఘునాథోచ్చరిత ప్రియవాక్కులు ప్రియంవదకర్ణములఁబడెను. ఆమెహృదయమానందముతో నుప్పొంగిపోయెను. తనయరక్తముఖము నవనతముఁగావించి లజ్జితయై యామె లేచినిలువంబడెను.

రాకొమరుఁడు మరలవారసపుత్రిమణినుద్దేశించి యిట్లు పలికెను. "చంద్రముఖీ! నాకు సెలవొసంగుము. రేఁపటిదినమున మీరలు రాజప్రాసాదమునకుఁబోయెదరు. ఈదరిద్రసైనికుఁడు మరల నిజకార్యమందు నియుక్తుఁడగుటకుఁబోవును."

ఈవాక్యమునువిని ప్రియంవద లజ్జావిస్మితయయ్యెను. ఆసుందరాంగి నయనపద్మములనుండి యశ్రుధారలు జలజలమని రాలెను. నీరవయై యామగువ సుమితాపూర్ణస్వరమున నిట్లనియెను, "తామెంతో శ్రమపడిరి. జనకునికొఱకును, నాకొఱకును మీరుతీసికొనిన

ప్రయాసకు మేమేమి ప్రతిదానముఁ గావింపఁగలము ? భగవానుఁడు రణమందుఁ దమకుజయముఁ జేకురఁజేయుఁగాక. మీమనస్కామనము లన్నియు ఫలించుఁగాక!"

వినీతస్వరమున రఘునాథుఁడిట్లుత్తరువొసఁగెను. "నిరాపదమున మిమ్ములను రాజగరమునకుఁ గొనివచ్చుటే నాభాగ్యము. మీకొఱకు నేనంతగఁ బ్రయాసపడలేదు. కాని—కాని—యీనిరుపేదసైనికుని యత్నములు నీకానందమొనరించినచో—అటులైనచో—మఱియీ- యీనిరుపేదసైనికుని మఱచిపోకుము."

ఆవాక్యములయర్థము ప్రియంవదకుఁ దెలియకపోలేదు. రాకొమరుని విలోకించి యారాజానన లజ్జితయై యవనతముఖియై యటులే నిలువంబడియుండెను. రఘునాథజీ యపుడొకించుక సాహసించి లజ్జా విస్మరణమొనరించి మరల నిట్లనియెను. "సుందరాంగీ ! ఇన్నిఁడైన యీరాకొమరుఁడెక్కుడుగ నాశించినచో నీవతనిపై దోషారోపణ మొనరింపకుము. నీజనకుఁడు నాయందనురాగమూనియుండెను. నీవు గూడ నాపైఁ బ్రసన్నదృక్కులఁబఱపించెదవని యాశించుచుంటిని. భగవానుఁడు నన్ను సఫలీకృతమనోరథుఁగావించినచో నాజీవనవాంఛాయాశలు పూర్ణముగుచో, నామనమునందున్నదంతయు నీకువిప్పి చెప్పెదను. అంతదనుక నీదుర్భాగ్యరాకొమరునకపుడపుడు నీస్మరణపథమందుఁ దావొసంగుము."

పిదప రఘునాథజీ వినీతభావమున సెలవుగైకొని యటనుండి చనెను. ప్రియంవద యొకనిమేషమువఱకును రాకొమరుఁడరిగిన పథమువెపు వీక్షించుచు నాత్మగతమున నేమియోజితింపఁ దొడంగెను. ఆయర్థరాత్రమునఁ బ్రియంవద యొకదీర్ఘనిశ్వాసమును విడచి తనలోఁ దానిట్లనుకొనియెను. "మోహానాకారా! చిరకాలము నీవీదాసి స్మరణపథమున జాగరితుఁడవై యుందువు. ఇందుకుఁ బరాత్పరుఁడే సాక్షియై యుండును."

పదునాలుఁగవ ప్రకరణము.

రాజా జయసింహుఁడు.

ఔరంగజీబు సయస్తఖానుయశవంతసింహులవలన నేమియుఁబ్రయోజనము చేకూరలేదని వారలను మగుడిరండని యాజ్ఞాపించి నిజపుత్రుని దక్షిణసీమకుఁ బనిచెననియు మరలనతని సహాయార్థమై యశవంతునిఁ బంపెననియు మేముముందే వివరించితిమి. వారలవలనఁగూడ ఫలలాభమేమియుఁ గలుఁగనందున వారలుభయులను స్థానాంతరితపఱచి ప్రసిద్ధికెక్కిన యస్వరాధిపతియగు జయసింహునకు దిల్వారుఖానను విక్రమశాలియగు నొకయాఫ్గనుసేనాపతినిఁ దోడిచ్చి యతనిని దక్షిణదేశమునకుఁబంపెను. 1665 సంవత్సరమున చైత్రమాసానంతరమున జయసింహుఁడచటకుఁబోయెను. సయస్తఖానుని పగిదినిరుత్సాహుఁడై యూరకుండక దిల్వారుఖానునకుఁ బురందరదుర్గము నాక్రమణముఁ గావింపుమని యాదేశ మొసఁగి దాను సింహగరమును వేష్టనమొనరించి రాజగర పర్యంతము వాహినీసహితుఁడై చనెను.

హిందూ సేనాపతితోఁ భండనమొనరింప శివాజీ పరాఙ్ముఖుఁడై యుండెను. జయసింహుని ప్రసిద్ధనామము, నతనిసైన్యసంఖ్యలు, నతని తీక్ష్ణబుద్ధియు, నతనిదోర్దండప్రతాపమును శివాజీ కవిదితములై యుండలేదు. ఆపగిది పరాక్రమశాలియైన సేనాధిపతి యౌరంగజేబుకడఁ బ్రాయశః మఱియొకరులుండబోరు. సమగ్రభారతవర్షమునందు జయసింహునిభంగి న్యాయవిచక్షణుఁడును, బుద్ధిమాన్యుఁడును, దూరదర్శియునైన వ్యక్తి మఱియొకఁడు లేఁడని యాకాలపు పారసీకభ్రమణకారియైన బెర్నియా లిఖించెను. ప్రథమమునుండియు శివాజీభగ్నోద్యముఁడై పలుమరు జయసింహునితో సంధినొనరింపఁ బ్రయత్నించెను; కాని తీక్ష్ణబుద్ధిగల జయసింహుఁడతని సంధిప్రస్తావములను విశ్వసింపలేదు.

తదనంతరమున శివాజీకడ విశ్వసనీయుఁడై మంత్రిపదవియందున్న రఘునాథపంథ న్యాయశాస్త్రి దూతవేషధారియై జయసింహునికడ కరిగి యతని సమక్షమున శివాజీ తనచతురత నేమియుఁ జూపుటలేదని యారాజశేఖరున కనేకరీతులఁ దెలిపెను. అతఁడుకూడ క్షత్రియుఁడే; రసపుత్రకులోచిత సమ్మానము నతఁడెఱుఁగకపోలేదు, శాస్త్రజ్ఞుఁడైన యాభూసురప్రవరుని సత్యవాక్యములందతఁడు విశ్వాసముంచి యతని కరములుగ్రహించి యిట్టులనెను: "ద్విజవరా! మీపలుకులు నన్నానందింపఁజేసినవి. ఢిల్లీశ్వరుఁడు మీప్రభునివిద్రోహాచరణమును మన్నించుటేగాక యథేష్టముగ నతనిని సమ్మానించునని నేను ఘంటాపథముగ వక్కాణింపఁగలను. నేను రసపుత్రుఁడననియు రసపుత్రునిపలుకు లన్యథాగా నేరవనియు శివాజీకిఁ దెలుపుఁడు"

తదనంతరమునఁ గతిపయదినములు గడచినవెనుక వర్షాకాలమందు జయసింహుఁడు నిజశిబిరమందు సభాభ్యంతరమున నుపవిష్టుఁడైయున్నతఱి దూతయొకఁడతని కడకరుగుదెంచి యిట్లని విన్నవించెను. "మహారాజుగారికి జయమొదవుఁగాక ! మహారాష్ట్రనృపుఁడైన శివాజీ బహిర్ద్వారమున నిలచియుండి దేవరదర్శనార్థమై వేచియుండెను."

సభాసదులందఱు విస్మితులైరి. జయసింహుఁడు స్వయముగ శివాజీ నాహ్వానింప శిబిరము వెలుపలకుఁజని బహుసమాదరపురస్సరముగ నతని నాహ్వానించి యాలింగనమొనరించి శిబిరాభ్యంతరమునకుఁ దోడ్తెచ్చి తనదక్షిణ పార్శ్వమున నొక భద్రాసనముపైఁ గూరుచుండ వేఁడెను.

ఇట్టి సమ్మానమునొంది శివాజీ కడుసంతసించెను. క్షణకాలముయిష్టాలాపమొనరించి జయసింహుఁడవశేషమున నిట్లనెను; "రాజేంద్రా! తామిచట కరుదెంచుటంజేసి మాశిబిరమంతయుఁ బావనమ

య్యెను. ఈశిబిరమును నిజాలయముగాఁ బ్రవేశించవలయును."

శివాజీ—నృపశేఖరా! యీదాసుఁ డెప్పుడైన తమ యాజ్ఞాపాలనమున విముఖుఁడై యుండెనా? రఘునాథపంతుని ద్వారా నన్నిటకుఁ దామురమ్మని ముదల నొసంగుటచే నేనట్లొనర్చితిని. తా మొనరించిన సమ్మానము నన్నానందింపఁ జేసినది."

జయసింహుఁడు—అవును. రఘునాథన్యాయశాస్త్రికిఁ దెలిపినదంతయు నాకుజ్ఞప్తియం దున్నది. రాజతిలకమా! నేనుపలికిన చొప్పున నాచరించెదను. ఢిల్లీశ్వరుఁడు తమవిద్రోహాచరణములను మన్నించి వైచును. మిమ్ములను రక్షించును. యథేష్టముగఁ దమ్ము సమ్మానించును. ఈవిషయమందు నేను వాగ్దాన మొనరించుచుంటిని. రాజపుత్రుని వచనములు వేఱుగాఁ జాలవు.

ఈవిధముగ నానృపశేఖరు లిరువురుఁ గొంతవడికుఁ బ్రసంగించుకొనినపిదప సభముగిసెను. శిబిరమందు శివాజీజయసింహులు తక్క నొరు లెవరును లేరు. శివాజీ కపటానంద చిహ్నములఁ జూపెను. పిదప నతఁడు హస్తమున గండస్థలమునుంచి యేదియో చింతింపఁదొడంగెను. అతనినయనము లశ్రుపూరితములయ్యెను. జయసింహుఁ డదిగాంచెను.

జయసింహుఁడు—రాజేంద్రా! తమ రాత్మసమర్పణ మొనరించుకొని నిరుత్సాహులగుటవలనఁ బ్రయోజన మేమియు లేదు: నాయందు విశ్వాసముంచి తామిటకరుగుదెంచితిరి. రసపుత్రులు విశ్వాసనీయులకుఁ గీడొనరింపఁజాలరు. నాయశ్వశాలయందలి తురగము నొకదానినిఁ గొని నేఁటి నిశియందే మగుడిచనుఁడు. మీరు నిరాపదముగనే తెంచిరి. నిరాపదముగనే యరుఁగుడు. నాయాదేశానుసారముగ నేరాజపుత్రుఁడును మీకుహాని నొనరింపనేరఁడు. పిదప రణమందు జయప్రదుఁడనైన బాగు; లేకున్నను విచారము లేదు. కాని క్షత్రియధర్మము నెపుడును మఱువఁజాలను.

శివాజీ—మహారాజా! భవాదృశనృపునికటమునఁ బరాజయస్వీకార మొనరించి యాత్మసమర్పణముఁ గావించినందువలన ఖేదపడుట లేదు. బాల్యకాలమునుండియు నేహిందూధర్మము నిమిత్తమై, యేహిందూగౌరవార్థమై యత్నించితినో, ఆమహాదుద్దేశ్య, మాయున్నతోద్యమము శేషించెఁగదాయని వంత జెందుచుంటిని. ఆచింతవలననే నాహృదయము విదీర్ణమగుచుండెను. కాని ఆవిషయమందుఁ గూడ మనస్స్థిరమాచరించుకొనియే తమశిబిరముకడ కరుగుదెంచితిని. ఆవిషయమున నేనంతగా వంతఁ జెందుటలేదు.

జయసింహుడు—అట్లైనచో మీరేల నిరుత్సాహులై యుండితిరి?

శివాజీ—బాల్యకాలమునుండియు మీవంశజుల గౌరవగీతములఁ బాడనిచ్చగించుచుందును. నేఁడాగీతములు మిథ్యలుగావని యెఱిఁగితిని. పృథివియందు మహాత్మ్య సత్యధర్మములున్నచో నవిరసపుత్రుల శరీరములందున్నవి. ఈరసపుత్రుఁడు యవనుల యధీనతను స్వీకరించునా? మహారాజైన జయసింహుఁడు యవనుఁడైన యౌరంగజేబు సేవాపత్రియా?

జయసింహుఁడు—క్షత్రియకులతిలకమా? అది ప్రకృతి దుఃఖకారణము. రసపుత్రులు సహజముగ నేరి యధీనతను స్వీకరింపరు. సాధ్యమైనంతదనుక వారలు ఢిల్లీశ్వరునితో నాలమాచరించిరి. విధినిర్బంధమువలననే వారలు పరాధీనులైరి. మహారాణావీరప్రవరుఁడును, ప్రాతఃస్మరణీయుఁడునైన ప్రతాపుఁడసాధ్యమునుగూడ సాధింపయత్నించెను. కాని యతనిసంతతివారుకూడ నిపుడు ఢిల్లీశ్వరునకు లొంగియుండిరిగదా! ఈవిషయములన్నిటిని మహాశయులీవఱలోనే యెఱింగియుందురు.

శివాజీ—అవునట్లుగ యేయుంటిని. అందువలననే మిమ్ముల నడుగుచుంటిని. ఎవనితో మీ కింతదనుక వైరభావముండెడిదో యతని కార్యమందు దా మీరీతిని యత్నశీలులరై యుండుటెందులకు?

జయసింహుఁడు—ఢిల్లీపతి సేనాపతిత్వము నెపుడు గ్రహణ మొనరించితినో యపుడే యతని కార్యసిద్ధి నొనర్చెదనని సత్యదాన మొనరించితిని. ఏవిషయమందు వాగ్దాన మొనరించితినో దానిని నాచరించెదను.

శివాజీ—అందఱికడ నన్ని సమయములందు సత్యము పాలనీయమా? ఎవరైతే మనదేశశత్రులై యుండిరో, ధర్మవిరుద్ధాచారులై మెలఁగిరో వారలతో సత్యసంబంధ మేమి?

జయసింహ—తాము క్షత్రియులై యుండియు నన్నిట్లడుగుచుంటిరి. ఒక రసపుత్రు నిట్లు ప్రశ్నించుచుండిరి. రాజపుత్రు లనేక వత్సరములు ముసల్మానులతో రణ మొనరించి యెప్పుడును సత్యలంఘన మొనరింపలేదను విషయము దాము రసపుత్రులయితిహాసమును పఠించిన నెఱుఁగఁగలరు. పలుమరు జయప్రదులైరి. అనేకమారుల పజయ మొనరింపఁబడిరి. కాని జయపరాజయములందును, సంతసవిషాదములయందును, సర్వదా రసపుత్రులు సత్యపాలన మొనరించిరి. మాకిపుడా గౌరవముయొక్క స్వాధీనత లేదు. కాని సత్యపాలనముయొక్క గౌరవమున్నది, స్వదేశమందును, విదేశమందును, మిత్రుల మధ్యమందును, శత్రుల యభ్యంతరమందును రసపుత్రుల నామము గౌరవాన్వితమైయున్నది. క్షత్రియకులశిరోమణియైన తోడరుమల్లు వంగదేశము నాక్రమించెను. మాన్‌సింహుఁడు కాబూలునుండి యొరిస్సాపర్యంతము ఢిల్లీశ్వరుని విజయపతాకము నెత్తియుంచెను. వీరలందెరుగాని యెప్పుడుగాని తమయందు చక్రవర్తి యుంచిన విశ్వాసమునకు విరుద్ధముగ నాచరింపలేదు ఢిల్లీచక్రవర్తికడ నేసత్యము నువచించిరో దానిని పాలన మొనరించుటకు

వారేమియు సంకోచింపలేరు. మహారాష్ట్రరాజా! రసపుత్రుల మాటయే సంధిపత్రము. అనేక సంధిపత్రములు లంఘనమైనను, రసపుత్రుల వాక్యములు లంఘనములుగాలేవు.

శివాజీ—యశవంతుఁడైన యశవంతుఁడు హిందూధర్మరక్షణకర్తలందు ప్రధానుఁడు. అతఁడు ముసల్మానులకొఱకై హిందువుల విరుద్ధమునఁ బవర మొనరింప నొప్పుకొనలేదు.

జయసింహుఁడు—యశవంతుఁడు వీరశ్రేష్ఠుఁడనుట యందును, యశవంతుఁడనుటయందును, హిందూధర్మరక్షణకర్తలలోఁ బ్రధానుఁడనుటయందును సందియ మేమియు లేదు. అతని మార్వారు దేశము మరుభూమి. అతని మార్వారుసేనకంటె కఠోరమైన జాతిగాని, సాహసమైన సేనగాని మఱియొకటి జగతియందు లేదు. యశవంతుఁ డామరుభూమియందు వేష్టితుఁడై ఆసాహసుల సహాయమున హిందూస్వాధీనతోద్ధారమై యత్నించియుండినచో నేనతనికి ధన్యవాద మొనరించెడివాఁడనే. అతఁడు జయవంతుఁడై యౌరంగజేబును పరిభవించి ఢిల్లీయందు హిందూపతాకము నెత్తియుండినచో నేనతనిఁ జక్రవర్తియని సమ్మానించెడివాఁడను. లేక నతఁడు ఖండనమునఁ బరాజితుఁడై స్వదేశస్వధర్మరక్షణార్థమై ఆమరుభూమియందుఁ బ్రాణత్యాగ మొనరించియుండినచో, నేనతనిని దేవతయని పూజించెడివాఁడను. కాని యేదినమున నతఁడు ఢిల్లీశ్వరుని సేనాపతియయ్యెనో, ఆదినమున నతఁడు ముసల్మానుల కార్యసాధన మొనరింప బద్ధకంకణుఁడయ్యెను. ప్రతిగ్రహణమాచరించి దానిని లంఘన మొనరించుట క్షత్రియోచిత కార్యము కాలేదు. యశముయొక్క కళంకమందుఁ దన యశోరాశిని మ్లానముఁ గావించెను, సిప్రానదీకూలమున నతఁడు పరాజితుఁడైనదాదిగ నౌరంగజేబునకు విద్వేషియైయుండెను. లేకున్న నతఁడీ గర్హితకార్యము నాచరించి యుండఁడు.

జయసింహుఁడు యశవంతసింహుఁడు కాఁడను విషయము చ

తుఁడైన శివాజీ బాగుగ నెఱింగెను. క్షణకాలానంతరమున నతఁడు మఱలనిట్లనియెను. "హిందూధర్మోన్నతి నిమిత్తమై ప్రయత్నించుటగర్హితకార్యమా? హిందువుని భ్రాతభంగిఁ బ్రేమించి—సోదరుఁడనితలంచి యతనికి సాహాయ్యమొనరించుట గర్హితకార్యమా?

జయసింహుఁడు—నేనట్లువచింపలేదు. యశవంతసింహుఁడేల యౌరంగజేబు కార్యముసుత్యజించివైచి. పృధివిసాహాయ్యమున భగవానునిసాహాయ్యమున మీతో సఖ్యమొనరింపలేదు? తామేతీరున స్వాధీనతరక్షణార్థమై యత్నించుచుండిరో, యతఁడుకూడ నాతీరుననే యాచరింపలేదేమి? చక్రవర్తి కార్యమందుండి గోపనముగ విరుద్ధాచరణమాచరించుట కపటాచరణము! క్షత్రియరాజా! కపటాచరణము క్షత్రియోచితకార్యము కాదు.

శివాజీ—ఆతఁడు నాతోఁ బ్రకాశముగ సఖ్యమొనరించియుండినచో ఢిల్లీశ్వరుఁడన్యసేనాపతిని బంపియుండును. ప్రాయశః మేమిరువురముకూడఁ బరాజితులమై హతులమైయుందుము.

జయసింహుఁడు—ఆహవమునందు మరణించుటకంటె క్షత్రియునకు సౌభాగ్యము మఱేమియు లేదు. కపటాచరణమొనరించుటకంటె క్షత్రియునకవమానము మఱేమియు లేదు.

శివాజీ ముఖమరక్తమయ్యెను. అతఁడిట్లనెను. "రసపుత్రులును మహారాష్ట్రులునుగూడ మృత్యువునకు వెఱువరు. ఈయకించిత్కరజీవనమును పరిత్యజించినచో నాయుద్దేశ్యము సాధనమై, హిందూస్వాధీనత హిందూగౌరవములు పునఃస్థాపితములగుచో భవానీదేవి సమక్షమున నీముహూర్తమందే నీవక్షఃస్థలమునఁ విదీర్ణముఁగావించెదను. లేకరసపుత్రకులతిలకమా! మీరు సత్వరమే కృపాణపాణులు కండు; యీహృదయమందాఘాతమొనరింపుడు; మందహాసవదనుఁడనై ప్రాణత్యాగమొనరించెదను. కాని యీహిందూగౌరవవిషయమై బాల్యకాలమునుండియు

స్వప్నములయందుఁగూడఁ దలఁచుచుంటినో, దేనికొఱకై శతరణములనుగావించితినో, శతశత్రులను పరిభవించితినో, యేయుద్దేశ్యనిమిత్తమున నీయిరువది వత్సరములును, పర్వతములందును, కందరములందును, గహనములందును, శిబిరములందును, రిపులయభ్యంతరమందును, దివసములందును, సంధ్యాసమయములందును, గభీరనిశీథములందును, యత్నములను సలిపితినో ఆగౌరవము, నాస్వాధీనతాయాశను త్యజింపఁదలఁచిన నాయెదయందు మిక్కుటమగు వేదనముద్భవిల్లును. "ఆహవమందు మరణించినచో నాస్వాధీనత చేకూరఁగలదా?"

శివాజీయొక్క తీవ్రవచనములను జయసింహుఁడు సావధానమనస్కుఁడైవినెను. మహారాష్ట్రవీరుని నేత్రములు బాష్పపరిపూర్ణములయ్యెను; కాని జయసింహుఁడు పూర్వమువలెనే స్థిరభావమున నుత్తరువొసఁగెను. "సత్యపాలనవలన సనాతన హిందూధర్మరక్షణముకానిచో సత్యలంఘనమువలన నగునా? వీరాగ్రేసరుల శోణితమునందుఁ స్వాధీనతాబీజమంకురితముగానిచో శూరులచతురతవలననేమగును?

శివాజీ నీరవుఁడయ్యెను; కొలఁదిసేపైనపిదప మరల మెల్లఁగనతఁడిట్లనియెను. మహారాజా! తమ్ము నేను పితృతుల్యముగ నెంచుచుందును. మీవంటి ధర్మజ్ఞులను, తీక్ష్ణబుద్ధిగలయోధులను నేనెపుడును గాంచియుండలేదు. నేను మీకు పుత్రతుల్యుఁడను. మిమ్ములనొకటి ప్రశ్నించెదను. మీరు పితృతుల్యులుగాన సత్పరామర్శనొసంగుఁడు. నాశైశవమందేను కొంకణప్రదేశమందసంఖ్యపర్వతగహనములందు భ్రమణమొనరించునపుడు భవానీదేవి సాక్షాత్కరించి స్వాధీనతాస్థాపనమొనరింపుమని నాకుముదలనొసంగి దేవాలయసంఖ్యావృద్ధినిమిత్తమును ధర్మవిరోధులైన ముసల్మానులను తఱుముకొఱకును దేవివానసమక్షమున నుత్తేజనమైనటులఁ దలఁచుచుండెడివాఁడను—అటులామెను స్వప్నములందుఁగాంచుచుండెడివాఁడను—ఆత్మగతమున ననేకమూఱులు భావించుచుండెడివాఁడను. అపుడు నేను బాలుఁడనై యుండెడివాఁడనుఆస్వా

ప్నములనేనింకను మఱువలేదు. శైశవమునుండియు సదర్పమున కరవాలమును గ్రహించి వీరశ్రేష్ఠుల సఖ్య మొనరించి దుర్గముల నధికార మొనరింపఁ బ్రారంభించితిని, యౌవనమందుఁగూడ నాస్వప్నములందు హిందూ వాసుగౌరవమును హిందూధర్మప్రాధాన్యమును హిందూస్వాధీనతా సంస్థాపనమును గాంచితిని. ఆస్వప్నబలమువలన నే దేశమును జయ మొనరించితిని; శత్రువులను బరాజితులుగ నొనర్చితిని; రాజ్యవిస్తీర్ణ మాచరించితిని; దేవాలయస్థాపనముఁ గావించితిని. క్షత్రియ రాజా! నా యీయుద్దేశ్యము హేయమైనదియా? నాస్వప్నములలీక స్వప్నమాత్రములా? మీరు పుత్రునకుపదేశ మొనరింపుఁడు."

బహుదూరదర్శియు ధర్మపరాయణుఁడునైన జయసింహుఁడు నిమేషమాత్రము నిస్తబ్ధుఁడైయుండి పిదప గంభీరస్వరమున నిట్లనియెను. "నృపశేఖరా! మీయుద్దేశ్యముకంటె మహత్తరోద్దేశ్యమును నేనెఱుఁగను తమస్వప్నములకంటె పవిత్రములైనవానిని నేఁదెలుపఁజాలను. మహారాష్ట్రసింహమా! మీమహాయుద్దేశ్యము నాకింతకుమున్న విదితమైయుండలేదు. శత్రువీరుల నికటమందుఁగూడఁ దమ యుద్దేశ్యమును పలుమారు ప్రశంసించితిని. పుత్రుఁడైన రామసింహునకు మీయుదాహరణమును జూపి శిక్షణమొనరించితిని. రజపుత్రుల స్వాధీనతాగౌరవము నింకను మఱువలేదు. వీరాగ్రేసరా! మీస్వప్నము స్వప్నము కాదు. నలుకెలంకులందును వీక్షించిచూడ మొగలాయిరాజ్యమింక నిలచునట్లు గన్పట్టుట లేదు. వారలయత్నములన్నియు విఫలములగును. ముసల్మానురాజ్యము కళంకములచేఁ బూర్ణమైయుండెను. మొగలాయీలవిలాసక్రీడలచే నది జర్జరితమయ్యెను. పతనోన్ముఖ గృహము వడపున నదింక నిలచియుండలేదు. శీఘ్రమందుగాని యొకించుక విలంబమునఁగాని యీప్రాసాదతుల్య మొగలురాజ్యము ధూళిమిశ్రితమగును. తదనంతరమున హిందూధర్మము సుస్థాపితమగును. మహారాష్ట్రీయజీవనమంకురితమగుచుండెను.

మహారాష్ట్రీయయౌవన తేజము భారతవర్షమునందంతటను ప్లావితమగును. మహారాష్ట్రరాజా! మీస్వప్నము స్వప్నముకాదు. భవానీదేవి మీకు మిథ్యాయుత్తేజనముఁ గావింపలేదు.

ఉత్సాహానందములతో శివాజీ శరీరము కంటకితమయ్యెను. అతఁడుమరల నిట్లు ప్రశ్నించెను. "అటులైనచో భవాదృశులైనమహాత్ములా పతనోన్ముఖ మొగలు ప్రాసాదమున కొక స్తంభస్వరూపులై నిలచియుండిరేమి?"

జయసింహుఁడు—సత్యపాలనము క్షత్రియధర్మము. ఏసత్య మొనరించితినో దానిని పాలనముఁగావించెదను. కాని యసాధ్యమెన్నఁడును సాధనముఁ గానేరదు. పతనోన్ముఖనిలయము పతితమగును.

శివాజీ—బాగు; సత్యపాలన మొనరింపుఁడు. కపటాచారియైన యౌరంగజేబు నికటమందుఁగూడఁ దా మొనరించు ధర్మాచరణమును గాంచి, దేవతలుకూడ విస్మితులై మీకుధన్యవాద మొనరించెదరు కాని నేనెన్నఁడును యౌరంగజేబుకడ సత్యమొనరించి యుండలేదు. బుద్ధిబలమున నేను స్వదేశోన్నతిసాధనముఁ గావింపఁగలిగినచో నౌరంగజేబును పరాజితుఁ జేయఁగలుఁగుదును. అదినిందనీయమగునా?

జయసింహుఁడు—క్షత్రియరాజా! సర్వకాలములందును యోధులు చతురతనవలంబించుట నిందనీయము. విశేషతః మహదుద్దేశ్యసాధనమునఁ జతురతయధికతరనిందనీయము. మహారాష్ట్రుల గౌరవవృద్ధి యనివార్యమైనది. వారలబాహుబలము క్రమశః వృద్ధియగును. వారలుభారతవర్షమున కధీశ్వరులుగావచ్చును. కాని మహారాష్ట్రరాజా! నేఁడుమీరే శిక్షనొసఁగుచుండిరో, ఆశిక్షనెపుడును మఱువకుఁడు. ఈపలుకులనాలించి నాపై దోషారోపణ మొనరింపకుఁడు; నేఁడుమీరు నగరములను గొల్లఁగొట్టనేర్పుచుండిరి; ఎల్లి మీయనుచరులు భారతవర్షమును గొల్లఁగొట్టెదరు; నేఁడుతాము చతురతవలన

జయఫలముఁ బడయ నేర్చుచుండిరి; పిదపవారలు సమ్ముఖయుద్ధము నెపుడును నేర్చుకొనఁజాలరు, ఏజాతివారచిరకాలములో భరతఖండమున కధీశ్వరులగుదురో, మీరాజాతియొక్క బాల్యగురువులు; గురుని వడువున ధర్మశిక్షనొసంగుఁడు. నేఁడు తాము మందశిక్ష నొసంగినచో, శత వర్షపర్యంతము దేశదేశములందా శిక్షాఫలము గన్పట్టుచునే యుండును. వృద్ధుఁడును, బహుదర్శియునైన నీరాజపుత్రుని వాక్యములనాలింపుఁడు; మహారాష్ట్రులకు సమ్ముఖరణశిక్ష నొసంగుఁడు; చతురతను మఱువుఁడని వారలకు బోధింపుఁడు. తాము హిందూశ్రేష్ఠులు. మహదుద్దేశ్యమునుగల మీకేను బహుభంగుల ధన్యవాదమొసంగుచుంటిని; మీరీయున్నతశిక్ష నొసఁగనిచో నేమికాఁగలదు? మహారాష్ట్రశిక్షాగురూ! వినుఁడు. మీ ప్రతికార్యముయొక్క ఫలము బహుకాలస్థాయియై, బహుదేశవ్యాపియై యుండును.

ఈమహద్వాక్యములనువిని శివాజీ క్షణకాలము స్తంభితుఁడై యుండి పిదపనిట్లనెను. "తాము గురువునకు గురువులు; మీయుపదేశములన్నియు శిరోధార్యములు. కాని నేఁడే నౌరంగజేబుయొక్క యధీనతను స్వీకరించితిని; శిక్షనెపుడొసఁగెదను?

జయసింహుఁడు—జయపరాజయములు స్థిరములుగావు. నేఁడు నాకు జయము చేకూరెను; ఎల్లి మీకు జయమొదవవచ్చును. నేఁడు మీ రౌరంగజేబు యధీనులైతిరి; ఘటనాక్రమమున రేపు స్వాధీనతనొ స్వేచ్ఛఁబడయఁగలుఁగుదురు.

శివాజీ—జగదీశ్వరుఁడట్లే యొనర్చుఁగాక! కాని తామౌరంగజేబుకడ మీరు సేనాపతిగ నున్నంతవఱకు నేను స్వాధీనతను బడయఁగలుదునను యాశ వృథా. హిందూపతులతో నాలమాచరింప భవానీదేవి స్వయముగ నిషేధించెను.

జయసింహుఁడొకించుక మందహాసమొనరించి యిట్టులనియెను.

“శరీరములు క్షణభంగురములు; యీవృద్ధకాయము లెన్నిదినములు నిలచియుండును? కాని యెన్నాళ్లు నిలచియుండునో, యన్నినాళ్లును సత్యపాలనమందు విరతులుగాకుండుఁడు.”

శివాజీ—తాము దీర్ఘజీవులై యుండుఁగాక!

జయసింహుఁడు—మహారాష్ట్రనృపా! ఇఁక నాకు సెలవొసంగుఁడు. నేనౌరంగజేబు జనకునికడఁ గార్యమొనరించితిని; యిపుడౌరంగజేబు యధీనమునఁ గార్యమొనరించుచుంటిని; యెంతకాలము సజీవినై యుందునో, యంతకాలము ఢిల్లీయొక్క యీవృద్ధసేనాపతి విద్రోహాచరణమాచరింపనేరఁడు. కాని క్షత్రియప్రవరా! నిశ్చింతులై యుండుఁడు. మహారాష్ట్రులగౌరవమును, హిందువులప్రాధాన్యమును యనివార్యములు. వృద్ధునివచనములను గ్రాహ్యమొనరింపుఁడు; మొగలు రాజ్యమిఁక నిలువదు; హిందూతేజమిఁక నివారితముగాఁజాలదు. ఆచిరకాలములో దేశదేశములందు హిందూగౌరవనామమును, మీ ప్రసిద్ధగౌరవనామమును ప్రతిధ్వనితములగును.

అశ్రుపూర్ణలోచనుఁడై శివాజీ జయసింహు నాలింగనమాచరించుకొని యిట్లనెను. “ధర్మాత్మా! మీశుభకార్యములన్నియు ఫలించుఁగాక! మీవచములన్నియు సార్థకములగుఁగాక! మీతో నేఁ బవరమాచరింపను; ఆత్మసమర్పణమొనరించితిని; కాని ఘటనాక్రమమున మరల స్వాధీనతయలవడినచో, రసపుత్రప్రవరా! మఱియొకదినమునఁ దమ్ము దర్శనమొనరించి, మఱియొకమాఱు జనకుని చరణపద్మములకడ నుపవిష్టుఁడనై యుపదేశముఁగొనియెదను.

పదునైదవ ప్రకరణము.

దుర్గవిజయము.

శీఘ్రముగ సంస్థాపనమయ్యెను. మొదలాయీల యొద్దనుండి స్వాధీనముఁగావించుకొనిన దుర్గములన్నిఁటిని శివాజీ తిరిగి యిచ్చివైచెను.

విలుప్తమైన అహమ్మదునగరరాజ్యమందు తానునిర్మించిన యిరువది రెండుదుర్గములలో నిరువదింటిని ఢిల్లీశ్వరున కొసంగి మిగిలిన పండ్రెండుదుర్గములను శివాజీయౌరంగజేబు యధీనమందు జాగీరురూపమున నుంచుకొనియెను. చక్రవర్తి కతఁడొసంగిన ప్రదేశములకు బదులుగ విజయపురరాజ్యాధీనమందలి కొలఁదిస్థానములనతఁడు బడసెను. ఇంతియేఁగాక నెనిమిదివత్సరముల ప్రాయపువాఁడైన శంభుజీ (శివాజీపుత్రుడు) యైదువేలదళములపై మన్సాబదారుగ నియమింపఁబడెను.

శివాజీతో సంధి నిశ్చయమైనపిదప జయసింహుఁడు విజయపురరాజ్యమును ధ్వంసమొనరించి దానిని ఢిల్లీచక్రవర్తి యధీనమునకుఁ గొనివచ్చుటకు ప్రయత్నములు చేయఁదొడంగెను. శివాజీ విజయపురనృపులకు షాహాజీగావించినసంధినిమఱచి విజయపురిపుతేఁడు శివాజీ విపత్కాలమందున్నతరి నతనిరాజ్యము నాక్రమించుకొనుటకు సంకుచితుఁడు కాలేదు. దానింజేసి, శివాజీయిపుడు జయసింహుని పక్షము నవలంబించి, విజయపురసుల్తానైన యాలీయదిల్ షాహానితోఁ బోరు సలిపి తనమావులీ సైన్యసహాయమున ననేకదుర్గములను హస్తగతముఁ గావించుకొనియెను.

శివాజీ జయసింహులనడుమ నుదయించిన సద్భావముత్తరోత్తరమున వృద్ధిగాఁ దొడఁగెను. పరస్పరులమధ్య నతిశయమైత్రి జన్మించెను. సర్వత్రయుభయులేకమిత్రులైయుండి, యాలమునఁ బరస్పరసాహాయ్య మొనరించుకొనుచుండిరి. శివాజీ కడనుండు తరుణవయస్కయోధుఁడొకఁడు తఱచుగ జయసింహుని పురోహితుని సదనమునకుఁ బోవుచుండునని వేఱుగఁ దెలుపనక్కఱలేదు. అతని పేరు దెలుపవలసిన యావశ్యకము మాత్రమేమున్నది ?

సరళస్వభావుఁడైన జనార్దనుఁడు క్రమక్రమముగ రఘునాథు నత్యంతముగఁ బ్రేమించుచు, సర్వదా యతనినిఁ దన గృహమున కాహ్వా

నించుచుండెను. సమయము చిక్కినపుడెల్లను, రఘునాథుఁడు పురోహితుని యాలయమున కరుగుచు, నతనివలన రాజస్థానమును గుఱించిన విశేషములను, జయసింహుని వార్తలను, స్వదేశసమాచారములను దెలియుచుండెను. అపుడపుడతఁ డర్ధరాత్రివఱకుఁ గూరుచునియే యుండి, పర్వత, దుర్గ, శత్రుశిబిరాక్రమణ విషయములను దెలుపుచు, గహన-గిరిచూడలందు జరగు భీషణఖండనములను వర్ణించుచుండును. ఆవిషయములన్నియుఁ దెలుపుతరి యోధుని నయనములు ప్రజ్వలితములగుచుండును—స్వరము కంపితగుచుండును. ముఖమరక్తమై పోవుచుండును.

వృద్ధుఁడైన జనార్దనుఁడు సభయముగ యుద్ధవార్తలను వినుచుండును. పార్శ్వగృహమందు నీరవయై కూరుచునియున్న ప్రియంవద యాజ్వాలంతవార్తలను వినుచు, నశ్రుధారలను విడుచుచు, నాతరుణయోధుని రక్షింప భగవానునిఁ బ్రార్థించుచుండును. రాత్రి రెండు యామములైన పిదప సమరవార్తలన్నియు సాంగములగును. ప్రియంవద యపుడు రసపుత్రిపిరున నాహారమిడును. రఘునాథజీ భోజనమొనరించుతరి ప్రియంవద నీరవయై, ఆదేవమూర్తిననిమేషలోచనయై వీక్షించుచు మనమందు తృప్తిఁ బొందుచుండును. భోజనానంతరమున యోధాగ్రేసరుఁడు మృదుస్వరమున సెలవుఁగొనెదనని గాని లేక యితరములైన యొకటి రెండు వాక్కుల నుచ్చరించినపుడు ప్రియంవద యుద్విగ్నయై, యవనతముఖియై యతనికేమియుఁ బ్రత్యుత్తర మొసఁగఁజాలెడిది కాదు. లజ్జచే నా రమణి గండస్థలమరక్తవర్ణమగుచుండును—నయనపద్మములు ముదితము లగుచుండును. అవగుంఠనమును సవరించుకొని, ప్రియంవద ప్రక్కకుఁ దొలఁగిచని, సహచరి ద్వారా యుత్తరము నంపుచుండును.

కాని యుత్తరమువలని యవశ్యక మేమున్నది? ప్రియంవదయొక్క నయనముల భాషను రఘునాథుఁ డెఱుఁగును. రఘునాథుని నేత్రభాషను ప్రియంవద యెఱుంగును. ఉభయుల యసువులును ప్రథమ ప్రణయానిర్వచనీయ సంతసలహరియందుఁ బ్లావితములగుచుండెను. ఇరువురి హృదయములు ప్రథమప్రణయోద్వేగమున నుత్క్షిప్తము లగుచుండెను.

కొలఁదిదినములలో విజయపురసుల్తాను యధీనమందున్న దుర్గములను చాలగహస్తగత మొనరించుకొని, యవశేషమున శివాజీ యతిశయదుర్గమమైన పర్వతదుర్గము నొకదాని నాక్రమించుకొన నిశ్చయించెను. అతఁ డెపు డేదుర్గము నాక్రమించుకొనునో పూర్వమందే రును యెఱుఁగఁజాలకుండిరి. నిజసైనికులకైన నతఁడు పూర్వమందేమియుఁ దెలిపెడువాఁడు కాఁడు. ఆదుర్గమునుండి నాలుగైదు క్రోసుల దూరమున, జయసింహుని శిబిరమునకు నికటమందే యతని శిబిరమున్నది. సాయంకాలమున వేయిమంది మావులీ మహారాష్ట్రసైనికులకు సిద్ధముగ నుండుఁడని తెలిపి, తదనంతరమున నిశియందు ప్రథమయామానంతరమున గభీరాంధకారమున రుద్రమండలి దుర్గము నాక్రమణముఁ గావించుకొనవలెనని శివాజీ వారల కెఱిఁగించి, నిశ్శబ్దముగ సైనికులను వెంటనిడుకొని దుర్గాభిముఖుఁడై చనెను.

ఆయంధకారనిశీథమున నిశ్శబ్దముగ వారలు దుర్గతలమును సమీపించిరి. నలువైపులను సమభూమియుండెను. దాని నడుమ నొక యుచ్చపర్వత శృంగోపరిభాగమున రుద్రమండల దుర్గము నిర్మింపఁబడియుండెను. పర్వతము నధిష్ఠించుట కొకేపథముండెను. ఇపుడు యుద్ధసమయమగుటంజేసి ఆపథము రుద్ధమైయుండెను. ఇతరదిక్కుల నుండి గిరినెక్కుట చాలకష్టసాధ్యము. పథమేమియు లేదు. అంతయు వివిధభూరుహములచే సాంద్రమై, శిలారాశిపరిపూర్ణమై యుండె

ను. ఆకఠోరదుర్గమస్థానమునుండి పర్వతారోహణ మొనరింపుఁడని శివాజీ తన సైనికుల కాదేశ మొసఁగెను. అతని మావులీ మహారాష్ట్ర సైనికులు పర్వతమార్జాలముల చాడ్పున తరుశాఖలనుండి గిరిశిఖరముల మీఁదకును, పిదప శైలాంతరములందునను లంఘించుచు నాయున్నత పర్వతము నారోహింపఁదొడంగిరి. ఒక్కొకచో నిలువంబడి మఱియొక్కొకచో నుపవిష్టులై కొండొకచో సాలశాఖలనుండి వ్రేలాడుచు, రొండొకతావున దుముకుచు సైనికు లాపర్వతము నధిష్ఠింపసాగిరి. మహారాష్ట్రీయ సైనికులు తక్క నొండు జాతీయవారలీతీరున పర్వతారోహణ మొనరింప సమర్థులగుదురా? కారా? యని సందేహము.

శైలమును నగమువలె నధిష్ఠించినపిదప దుర్గప్రాచీరోపరిభాగమున నేదియో వెలుతురు గన్పట్టెను. శివాజీ చింతాకులస్వాంతుఁడై క్షణకాలము నిలువంబడి యుండెను. శత్రువులు వారల యాగమన వార్తనెఱుఁగఁ గలిగితిరా యేమి? లేకున్నచోఁ బ్రాచీరోపరిభాగమున నిట్టి యాలోకము జ్వలించుచుండనేల? ఆలోకకిరణములు దుర్గాధోభాగమువఱకును బ్రసరించుచుండెను. దుర్గవాసులు శత్రువులను ప్రతీక్షించుచు, నీయాలోకమును జ్వలించియుండ నోపుదురు. అంధకారమందేయను దుర్గము నాక్రమణ మొనరించుకొనకుండుటకై వారలా వెలుతురును గావించి యుందురు. మునుపటికంటె నెక్కుడు సతర్కభావమున సాలశైలరాశుల యంతరమునుండి మెల్లమెల్లగా నారోహణ మొనరింప శివాజీ తనసైనికుల కాదేశ మొసఁగెను. నిశ్శబ్దముగ నామహారాష్ట్రసైనికు లాపర్వతము నధిష్ఠింపఁదొడంగిరి. వృద్ధభూరుహములను, శిలారాశులను, కంటకపుపొదలను దాటవలసి వచ్చినపుడు సైనికులు తమ యొదలపై కరముల నిడుకొని మెల్లగ శ్వాసను విడుచుచుఁ బైకిబోవుచుండిరి. ఏమియు శబ్దమగుటలేదు. అంధకారమున నిస్తబ్ధముగ శివాజీ ఆ శైలము నధిష్ఠించుచుండెను.

క్షణకాలములో మహారాష్ట్ర సైనికులొక్క పరిష్కారసమతల ప్రదేశమును చేరిరి. ఉపరిభాగమునుండి యాలోకమచట స్పష్టముగఁ బ్రసరించుచుండెను. ఆప్రదేశమునుండి పైకిఁ బ్రాఁకిన యెడల వారలు పైనున్న వారల దృక్పథమునఁ బడుటకేమియు సందియము లేదు. శివాజీ వృక్షాంతరాళమున నిలువంబడి యుండి యిటునటుజూడ సాగెను. అతని సమ్ముఖముననే బదిగజముల వఱకు తరువులేమియు లేవు. ఆస్థలమునకు వెలుపల వారల సాలశ్రేణులు సాంద్రముగ నుండెను. ఈయేబదిగజముల దూరమును దాటుటెట్లు? పార్శ్వమునుండి పోవుట కేమియు నుపాయము లేదు. క్రిందుగఁ జూడగఁ జాలదూరము వారు పైకెగఁ బ్రాకినట్లు శివాజీ యెఱింగెను. మరల క్రిందికిఁ బోయి యొండు పథముగుండా బోవుదమన్న వారలు మార్గమును చేరుటకుఁ బూర్వమే ప్రభాతము కాఁగలదు. శివాజీ యట్లనే నిశ్శబ్దముగ నిలువంబడి యుండి, పిదపఁ దన బాల్యకాల విశ్వాసపాత్ర సుహృద్వరుఁడైన మావులీయోధుని తన్నజీమాలశ్రీని బిలచి యిరువురు నాభూరుహపుచ్ఛభాగమందే నిలువంబడి యతిమృదుస్వరమున ముందొనర్పఁదగిన దానినిఁ గూర్చి యాలోచించుచుండిరి. క్షణకాలమైన పిమ్మట తన్నజీ వెడలిపోయెను. శివాజీ యచటనే నిలువంబడి యుండెను. అతని సైనికులందఱు నిస్తబ్ధముగ నపేక్షించియుండిరి.

అరనిమేషకాలములో తన్నజీ మరల తేనికడకరిగి మెల్లగ నతనితో నేదియో పలికెను. శివాజీ యొకించుక చింతించి యిట్లనెను. "అట్లనే కానిమ్ము, అన్యోపాయమేమియు లేదు."

వర్షజలావతరణముచే నొకప్రదేశమొకించుక ఛిన్నమైయుండ, నటప్రవాహరహితమైన వెల్లువయొకటి యేర్పడియెను; ఆప్రణాలికిరు పార్శ్వములందు మున్నతమైన శిలలుండెను. అదియతిగభీరమైయుండెను. దానిసిఁ జొచ్చిముందునకుఁ బోయినచో నిరుపార్శ్వములందును శైల

ముండుటచేఁ బైనున్న వారలు తమ్ముఁజూడఁజాలరని వారలు తలఁచిరి. పిదప నాయకుని యాదేశానుసారముగ సైనికులందఱు జలములఁ జొచ్చి మెల్లగఁ బర్వతారోహణ మొనరింపసాగిరి. అసంఖ్యములైన శిలాఖండములను దాటుచు నాస్తబ్ధాంధకారరజనియందా వేయిమంది సైనికులు మెల్లమెల్లగ గిరినెక్కుచు, నచిరకాలములోఁ బూర్తిగ శైలము నధిష్ఠించి, యటనున్న వృక్షశ్రేణుల నడుమ నిలువంబడిరి. ఆత్మగతమున శివాజీ భవానీ దేవికిధన్యవాద మొసఁగెను.

అకస్మాత్తుగ శివాజీ పార్శ్వమందున్న యొకసైనికుఁడు నేలఁగూలెను. అతని వక్షస్థలమున నొకశిలీముఖము నాటియుండుట శివాజీ గాంచెను. ఒకదాని పిమ్మట నొకటి చొప్పున వారల పైననేక వాడి తూపులు పడుచుండెను. శత్రువులు మేల్కొనియే యుండిరి. శివాజీ సైనికులు వెల్లువనుండి పైకరుదెంచు సమయమున పైనున్న వారలు వారలనుఁ గాంచి యాదిక్కుగనే యమ్ములను విడచుచుండిరి.

సైనికులందఱు తరులయంతరాళమున దాగిరి; బాణవర్షమాగిపోయెను. వారల యాగమనమును శత్రువులెఱుఁగఁ గలిఁగిరని శివాజీ తెలిసికొని దుర్గము నవిమేషలోచనుఁడై వీక్షింపసాగెను. ఇపుడనేక యాలోకములు ప్రజ్వలితములగుచుండెను. సమయసమయమందు ప్రహారులిటునటుఁ బచారిచేయుచుండిరి. శివాజీ సైన్యసమేతముగ నప్పుడుదుర్గప్రాచీరమునుండి యిరువదియైదు గజముల దూరమున మాత్రమేయుండెను. సైనికులందఱు సతర్కులై యుండుట నతఁడు గ్రహించెను. భీషణయుద్ధమొనరించిననే నేఁడు దుర్గము స్వాధీనము కాఁగలదు.

శివాజీ చిరసహచరుఁడైన తన్నజీ యుదంతయుఁగాంచి, యతనితో నిట్లనియెను. "రాజేంద్రా! ఇపుడుకూడ నిచటనుండి క్రిందికిఁ

బోవుటకుఁ జాలినంత సమయమున్నది. దుర్గము నేఁడు స్వాధీనము కాక పోయినను, మెల్లియగును. కాని, నేఁడు ప్రయత్నించినచో నందఱు మడియుట కేమియు సందియము లేదు." గంభీరస్వరమున శివాజీ యిప్పు డిట్లనెను. "జయసింహుని నికటమున నేమిఁ బలికితినో, దానినిఁ జేసి తీరెదను. నేఁడు రుద్రమండల దుర్గమును స్వాధీనమైనఁ గావించుకొనవలెను. లేక యీరణమునందు బ్రాణములనైనఁ ద్యజించవలెను?

నిస్తబ్ధముగ శివాజీ ఆవృతశ్రేణుల నడుమనుండి ముందునకుఁ బోసాగెను. శత్రువులను మోసపుచ్చుటకై తన సైనికులలో నూరుగురను దుర్గమునకు వెనుకటి భాగమునకుఁ బోయి యటనల్లకల్లోలము నొనరింపనియమించెను. నిమిషమాత్రములో దుర్గపుచ్ఛభాగమునఁ దుపాకిశబ్దము వినవచ్చెను. ఆవైపునుండి శివాజీ దుర్గాక్రమణ మొనరించుచుండెనని తలఁచి దుర్గమందలి సైనికులును, ప్రహరులును నాతట్టుగఁ బరువులెత్తిరి. ఈవైపునఁ బ్రాచీరోపరిభాగమున జ్వలించుచున్న యాలోకములన్నియు నిర్వాణమై పోయెను. శివాజీ యపుడు తన సైనికుల నుద్దేశించి యిట్లనెను. "మహారాష్ట్రీయ యోధులారా! అనేకరణములందు మీరు మీమీ పరాక్రమమును జూపిరి. శివాజీ నామమును నిలువఁబెట్టిరి. మరల నేఁడొకమారా శౌర్యమును బ్రకటింపుఁడు. తన్నజీ! బాల్యకాల సౌహృద ప్రేమను నేఁడు చూపుము."

ప్రభువాక్యములచే నందఱి హృదయములు సాహసపరిపూరితములయ్యెను. నిశ్శబ్దముగ నాగంభీరాంధకారమున నాసైనికులందఱు ముందునకుఁ జొరవంబడి నిమేషమాత్రములో దుర్గప్రాచీరమును సమీపించిరి. రాత్రి రెండు యామములయ్యెను. అంబరమందాలోకమేమియు లేదు. జగమందు శబ్దమేమియు లేదు. నైశవాయువు మాత్రము పర్వతపాదపపర్ణాభ్యంతరమునుండి మర్మరశబ్ద మొనరించుచుఁ బ్రవహించుచుండెను.

రుద్రమండల ప్రాచీరమునకు శివాజీ పదిగజముల దూరమం దుండెను. అతఁడపుడు ప్రాచీరోపరిభాగమున నొకదుర్గరక్షకునిఁ గాంచెను. భూరుహాంతరాళమున శబ్దము విని యాప్రహరుఁడట కరుగుదెంచెను. మావలీయొకఁడు నిశ్శబ్దముగ నొకయమ్మును వానిఱొమ్మున గాఢ నేసెను. హతభాగ్యుఁడైన యాభృత్యుని మృతశరీరము ప్రాచీరబహిఃప్రదేశమునఁ బతితమయ్యెను.

ఆశబ్దము వినినతోడనే యొకనితరువాత నొకఁడుచొప్పున ననేకసైనికులు ప్రాచీరోపరి యగ్రభాగములందు గుంపుగఁగూడిరి. రోషావేశపరవశుఁడై శివాజీ యోష్ఠోపరిభాగమున దంతస్థాపన మొనరించి, "ఇఁక దాఁగియుండుటవలనఁ బ్రయోజనమేమియు లేదు. వేవేగముగ ముందునకు దుముకుఁ"డని తనసైనికుల కాదేశ మొసఁగెను.

తత్క్షణమే మహారాష్ట్రయోధులు "హరహర మహాదేవ"యని యఱచుచు ముందునకు దుమికిరి. ఆయుద్ధనాదముచే దిక్కులు పిక్కటిల్లెను. ఆసైనికులలోఁ గొందఱు ప్రాచీరము నుల్లంఘించుటకై పరువెత్తిరి. మఱికొందఱు పాదపాంతరాళమునందే నిలచి క్షిప్రహస్తులై ప్రాచీరారోహులైన ముసల్మానులను తమవాడి తూపులచే నొప్పించుచుండిరి. ముసల్మానులుకూడ శత్రురాగమనకతమున నేమియు భీతిల్లక, "అల్లాహుఅక్బర్" అని యఱచుచు దచ్ఛబ్దముచే నాకాశమేదినులను కంపిత మొనరించుచుండిరి. వారలలోఁ గొందఱు ప్రాచీరోపరిభాగమునుండి యమ్ములను విడుచుచుండిరి. మఱికొంద ఱుత్సాహపరిపూర్ణులై ప్రాచీరమునుండి క్రిందికి లంఘించి ముందునకుఁ బరువెత్తి వృక్షాంతరాళమందున్న మహారాష్ట్ర సైనికుల నాక్రమించిరి.

శీఘ్రములో నాప్రాచీరతలవృక్షాంతరాళములందు సమరమారంభమాయెను. ప్రాచీరముపైని నిలచిన ముసల్మానులు తమనిశిత కరవాలములను ద్రిప్పుచు మహారాష్ట్రులను హతముఁ జేయసాగిరి. మహా

రాష్ట్రులుకూడ వెనుదీయక తమవాడితూపులచే ముసల్మానులను దునుమాడుచుండిరి. ప్రాచీర పార్శ్వతల మంతయు మృతదేహరాశులతోఁ బరిపూర్ణమైయుండెను. గాయములచే హతులైన సైనికుల కాయముల పైనిలచి, ఆయోధులు ప్రళయకాలరుద్రుల చాడ్పున భీషణరూపములఁదాల్చి రుధిరసిక్తకాయులై సింహనాదమొనరించుచుఁ గృపాణములను గిరగిరం ద్రిప్పుచుండిరి. నూఱులకొలఁది ముసల్మానులు భూరుహాంతరాళము వఱకు లంఘించుచు వచ్చిరి. శివాజీయొక్క మావులీసైనికు లశనపీడితశార్దూలముల వగిది నొక్కుమ్మడి ముసల్మానులపై దుమికిరి. ప్రబలప్రతాపోపేతులైన యాఫ్గనులుకూడ సమరమందసమర్థులు కారు. రక్తస్రోత మాగిరిపార్శ్వమునుండి ప్రవహించుచుండెను. పాదపాంతరాళములందును, కంటకాభ్యంతరములందును, శిలారాశిపార్శ్వములందును నిలచి, మహారాష్ట్రశూరులు శిఖిశిఖాసమానసితశిలీముఖములచే రిపువీరుల నొప్పించుచుండిరి. పాదపపర్ణాభ్యంతరములనుండి యవారితముగ బాణవర్షముఁ గురియుచు ముసల్మాను సంఖ్యలను క్షీణతర మొనరించుచుండెను.

అకస్మాత్తుగ నపుడు ప్రాచీరమునుండి "శివాజీకిజయ్" అను వజ్రనాదమొకటి యుత్పన్నమయ్యెను. ఆశబ్దము సమరనాదమును మించెను. అపుడందఱొక్కమాఱుగ నావైపుగఁ దమదృక్కులఁ బఱపిరి. శత్రుసైన్యమును భేదించి రక్తాప్లుతఖడ్గముపై భారముంచి, యొకరసపుత్రయోధాగ్రేసరుఁడు హుమ్మనుచు లంఘించి రుద్రమండలప్రాచీరముపై నిలచి, యచట పఠానుల పతాకమును పదాఘాతమొనరించి, దానిని క్రిందికి విసరివైచి, పతాకధారియైయున్న ప్రహారుని తననిశితకరవాలమున కెఱవైచి ప్రాచీరోపరిభాగమందే నిలచియుండెను. ఆశూరశిఖామణియే "శివాజీకిజయ్" అని వజ్రనాదము చాడ్పున గంభీరస్వరమున నఱచెను. ఆయోధుఁడెవ్వరై యుండవచ్చును. అతఁడు మనచిరపరిచితుఁడైన రఘునాథజీ కాకమఱెవరు ?

హిందూముసల్మానులు ముహూర్తమువఱకు సమరమునాపి విస్మయోత్ఫుల్ల లోచనులై తారకాలోకమున నాదీర్ఘమూర్తినిఁ గాంచుచుండిరి. ఆయోధాగ్రేసరుని లోహనిర్మిత శిరస్త్రాణము నక్షత్రాలోకమునఁ దళతళమని మెఱయుచుండెను. అతని జానులంబిత బాహువులు రక్తమందాప్లుతములైయుండెను. అతని విశాలవక్షముపై నొకటిరెండు శిలీముఖములు నాటియున్నవి. అతనిదీర్ఘహస్తమందు రుధిరసిక్తకరవాలము మెఱయుచుండెను. అతని యుజ్జ్వలనయనములు గుచ్ఛములైపడు కేశరాశిచే నావృతమైయుండెను. ఉన్నతజలయానము సమ్ముఖమందలి తరంగములచాడ్పున రిపుశ్రేణి శూరశిఖామణి కిరుపార్శ్వముల నుండి ముహూర్తమాత్రము సచకితులై తొలఁగిచనిరి. రణదేవుఁడంబరమునుండి యవతీర్ణుఁడై కృపాణహస్తుఁడై యిప్పట్టునఁ బ్రాచీరముపై నిలవంబడెనా యని యందఱు విభ్రాంతులగుచుండిరి.

క్షణకాలమాత్రమువఱ కందఱు నిస్తబ్ధులైయుండిరి. రిపువీరుఁ డొకఁడు ప్రాచీరము నధిష్ఠించుటఁ గాంచి, యూఫ్గనులు నలుకెలంకుల నుండి యతనికడకుఁ బఱవెత్తి కృష్ణమేఘముల వడువున రఘునాథుని చుట్టుముట్టడించిరి. రఘునాథజీ సామువిద్యయందద్వితీయుఁడు. కాని యసంఖ్యాకులగు శత్రువులతో సమరము సలుపుట సంభవము కాదు. ఆయోధప్రవరుని జీవనము సంశయావస్థయందుండెను.

మావులీలపుడు రఘునాథుని విక్రమముఁగాంచి యుత్సాహితులై, ప్రాచీరాభిముఖముగఁ బఱవెత్తి క్రోధోద్దీపితములైన వ్యాఘ్రముల వడువున ప్రాచీరముపై లంఘించి, రఘునాథునకు నలుకెలంకులందును నిలచి రణమొనరింపసాగిరి. క్రమక్రమముగ మావులీసైనికులనేకులా ప్రాచీరోపరియధోభాగములందు గూడి తమకడ్డుగనున్న పఠానులనందఱిని తమకరవాలముల కెఱవైచి సమ్ముఖమందలి పథమును పరిష్కారముఁగావించిరి. మహానాదముతో దుర్గమంతయు ముఖరితమగు

చుండెను. సహస్రమహారాష్ట్రసైనికులతో నొకటి రెండు నూఱుల పఠానులాహవము సేయుట యసంభవము. వారలు మహారాష్ట్రుల నడ్డ పడఁజాలకుండిరి.

అపుడు శివాజీ తన్నుజీవిరుపురు ప్రాచీరమునుండి లంఘించి, దుర్గములోనికి బడవెత్తిరి; ఇఁకనచ్చోట కాలమాచరింప నవశ్యకము లేదని తలఁచి సైనికులందఱు ప్రభువు ననుసరించి దుర్గాభ్యంతరమునకుఁ ద్వరితగతిఁ జనిరి.

విద్యుద్గతి నచ్చున శివాజీ కిల్లాదారుని ప్రాసాదమును సమీపించెను. ఆ ప్రాసాద మతికఠినమైనసురక్షితమైయుండెను. శివాజీ యాదేశానుసారముగ మహారాష్ట్రసైనికులందఱా భవనమును వేష్టించి, తత్పరిసరమున నున్న ప్రహరులనందఱను యమాలయమున కనిపిరి. వజ్రనాదమున శివాజీ యపుడు ప్రాసాదాభ్యంతరమునందున్న కిల్లాదారునుద్దేశించి యిట్లనియెను, "కవాటమును తెఱవుము; లేకున్న నీభవనమును దహించివైచెదను." నిర్భీతుఁడైన యాపఠానుఁడు "అగ్నియందు దహనమయ్యెదను; కాని కాఫరునకు వెఱచి నే నీద్వారమును తెఱువ"నని గంభీరస్వరమునఁ బ్రత్యుత్తర మొసఁగెను.

తత్క్షణమే మహారాష్ట్రులు కాగడలనుఁ గొనివచ్చి ప్రాసాదద్వారగవాక్షములకగ్నిదాన మొనరింపసాగిరి. భవనోపరిభాగమునుండి యనుచరసహితుఁడై కిల్లాదారుఁడు క్రిందికి బాణవర్షముఁ గురిపించుచు ననలమును నివారణ మొనరింపఁ బ్రయత్నించెను. అనేక మహారాష్ట్రులు కరములందు కాగడలనిడికొనియే భూతలశాయులైరి; కాని యగ్ని మాత్రము జ్వలించెను.

అనలము ప్రథమమున ద్వారగవాక్షములను పిదప దూలములను దహించి క్రమక్రమముగ నావిస్తీర్ణప్రాసాదమునంతను జ్వలింపసాగెను. ఆప్రచండాలోకము భీషణనాదమున నభమునంటుచు రజ

నీయంధకారము నాలోకమయ మొనరించివైచెను. బహుదూరపర్యంతము శైలశిఖరమునుండియు లోయలనుండియు నాయాలోకము గన్పట్టుచుండెను. శివాజీయొక్క దుర్దమనీయ ప్రతిభాతసైనికులు ముసల్మానుల దుర్గమును స్వాధీన మొనరించుకొనిరని జనులందఱు గ్రహించిరి.

వీరునకేదిసాధ్యమో, పఠానుకిల్లాదారుఁడైన రహమత్ ఖానది యొనరించెను; ఇఁక వీరుని వడువున మరణింపవలసియున్నది. భవనమంతయు నగ్నిపూర్ణము కాగనే యతఁడనుచరసహితముగఁ బ్రాసాదమునుండి హుమ్మనుచు భూమిపై లంఘించి, యొక్కొక మహావీరుని చాడ్పునఁ గృపాణములఁ ద్రిప్పుచు ననేక మహారాష్ట్రసైనికులను హత మొనరించెను.

అందఱా ముసల్మానులను ముట్టడించిరి. శత్రువులనడుమ వారలొకరివెనుక నొకరు పడియుచుండిరి. క్రమక్రమముగఁ బదిమంది ముసల్మానులు మడిసిరి. రహమత్ ఖానాహతుఁడై క్షీణించియుండెను. కాని యపుడుకూడ సింహవీర్యముతో నాశూరశిఖామణి పోరుసలుపుచుండెను. మహారాష్ట్రు లతనిని పూర్తిగ వేష్టించిరి. నలువైపులందును ఖడ్గములుత్తోలితములగుచుండెను. రహమత్ ఖానునకిఁక జీవనమునై నాశయేమియు లేదు. అపుడుచ్చైస్స్వరమున శివాజీ యాదేశము వినవచ్చెను. "కిల్లాదారును బంధింపుఁడు. వీరశిఖామణిని వధింపకుఁడు." క్షణకాలమున యోధనికరమునుండి శివాజీసైనికులొక్కరవాలమును వెఱికికొని, యతనిహస్తములను బంధించివైచి వానినిలోఁబఱచుకొనిరి.

మహారాష్ట్రులు ప్రాసాదమందలి యగ్నినిర్వాణ మొనరించుచున్నతరి దుర్గపుచ్ఛభాగమునుండి కృష్ణమేఘము చాడ్పున రమారమి యేనూఱుగురు రాఘనసైనికులు రణసంసిద్ధులై పర్వతము నెక్కుటను శివాజీ గాంచెను. శివాజీదుర్గప్రాచీరము నాక్రమించుకొనక పూర్వమే

తన సైనికులలో గొందఱిని దుర్గమునకు వెనుకటిభాగమునఁ గోలాహలము చేయుఁ బంపెనుగదా! వారలట్లొనరించుచుండ దుర్గమందలి సైనికులలోఁ జాలమంది ఆదిక్కునుండి శత్రువు దుర్గము నాక్రమించుచుండెనని భ్రమించి యాటకుఁ బరువెత్తిరి. చతురులైన మహారాష్ట్రీయ సైనికులు భూరుహాంతరాళములందుఁ గొలఁది నిమేషములవఱకు సమరము సలిపి క్రమక్రమముగఁ బలాయనమొనర్పఁ దొడంగిరి. అదిగాంచి ముసల్మానులుత్సాహితులై పలాయితులగు నాసైనికులను రోషావేశపరవశులై తఱుముసాగిరి. వెనుక వైపున శివాజీ ప్రాసాదము నధిష్ఠించి పిదప దుర్గమును స్వాధీనముఁ గావించుకొనిన విషయమందిసుమంతయైన వారలకు దెలియలేదు.

తదనంతరమున భవహాలోకమున క్షేత్రిగ్రామ గహన శైలశిఖరాంతరము లుద్దీప్తములు కాగనే యపుడా యధిక సంఖ్యాకులైన ముసల్మానులు తమభ్రమ నెఱిఁగి మరల దుర్గారోహణమొనరించి శత్రువినాశమొనర్ప కృతసంకల్పులైరి, అల్పసంఖ్యాకులైన సైనికులను పరిమార్చి శివాజీ దుర్గజయమొనరించి యపుడేనూరుయోధులు దురితవేగమున నాశైలదుర్గము నారోహణ మొనరించుటఁ జూడఁగనే యతని ముఖము గంభీరమయ్యెను.

శివాజీతన తీక్ష్ణదృక్కులను నలుకెలంకులకును బఱపి, దుర్గమధ్యమునఁ గిల్లాదారుని ప్రాసాదమే యన్నిటికంటెను దుర్గముతరమైనస్థానమని యెఱిఁగెను. నలువైపులందును ప్రస్తరమయప్రాచీరమున్నది. అనలమువలన నాప్రాచీరమున కేమియు ననిష్టవాటిల్లలేదు. ప్రాసాదమందలి ద్వారగవాక్షములు జ్వలనమైపోయెను. ఒక్కొకచో నాప్రాసాదము భూమిపైఁగూలి ప్రస్తరస్తూపాకారమై యుండెను. అధిక సంఖ్యాకులైన సైనికులతోఁ బోరుటకుఁదగు స్థలమింతకంటె నొండేదియు

నుత్కృష్టమైనప్రదేశము లేదని శివాజీ ముహూర్తమధ్యమందే గ్రహించెను.

నిమిషములోనతఁడు తనమనమందేదియో సంకల్పముఁగావించుకొనియెను. తన్నజీ రెండునూరుల సైనికుల నాప్రాసాదమున సన్నివేశితముఁ గావించెను. ప్రాచీరద్వార గవాక్షపార్శ్వములందతఁడు విలుకాండ్రను నిలువం బెట్టెను.

ఇంతియెఁగాక నతఁడు ప్రాసాదోపరిభాగమున ఖడ్గధారులైన యోధులను సన్నివేశ మొనరించెను. ఒక్కొకచో ప్రస్తరములు పరిష్కారణముగావింపఁబడెను. మఱొకచో ననేకశిలాఖండములు రాశీకృతమొనరింపఁబడెను. ముహూర్తమాత్రమందంతయు నమర్పఁబడియెను. అపుడు శివాజీ మందహాసమొనరించుచు తన్నజీనుద్దేశించి యిట్లనియెను. "తన్నజీ! శత్రువులీప్రాసాదము నాక్రమణముఁగావించినచో నీవుదీనిని రక్షింపఁగలఁగెదవా? కాని రిపుసైనికులీప్రదేశమును చేరుటకుఁ బూర్వమే ప్రాయశః వారలను పరాజితులుగ నొనర్పఁగలఁగుదువు. వారలింకను పర్వతము నారోహించుచుండిరి, ఈసమయమందే వారలనాక్రమించుటుచితము. తన్నజీ! రెండునూఱుల సైనికులతో నీవీస్థానమందే నిలచియుండుము. నేనొకమాఱు ప్రయత్నించిచూచెదను"

తన్నజీ—తన్నజీయాస్థానమున నిలచియుండఁడు. ఒక్కని మహారాష్ట్రుఁడైన నిటనుండనోపఁడు. క్షత్రియరాజా! తామీ ప్రాసాదరక్షణముఁగావింపుఁడు. అంతయు బాగుగనమర్చియుంపుఁడు. అరుదెంచుచున్న శత్రుసైనికులను దునుమాడుటకు మీభృత్యులు సమర్థులు గారా యేమి?

శివాజీ మరల మందహాసమొనరించి యిట్లనివచించెను. "తన్నజీ! నీవనినట్లొనర్చుటయే యుచితము. సమ్ముఖమున శత్రువులనుగాంచి

నేను యుద్ధలుబ్ధుఁడనైతిని. కాని నీవు పలికినదే యుత్కృష్టముగనున్నది. నేనీప్రదేశమందే యుండుట కర్తవ్యము. నాయోధులయందు నెవండు రెండునూఱుల సైనికులను వెంటఁగొని యీ ఆఫ్గనుల నీగభీరాంధకారమున నకస్మాత్తుగ ముట్టడించి పరాజితులుగ నొనర్పఁగలఁడును?

అపుడొకరితరువాత నొకరుగ బహుగురుశూరులు లేచి సమ్ముఖమున నిలువంబడి తమతమ సామర్థ్యములను వెల్లడించుచుఁ గోలాహలమొనర్పఁదొడఁగిరి. రఘునాథజీ వారలప్రక్క నిలువంబడెను. కాని యేమియుఁబలుకక నీరవుఁడై యతఁడుత్తమాంగము నవనతమొనరించుకొని భూతలమునఁ దనదృక్కులఁ బఱపుచుండెను.

శివాజీ మెల్లమెల్లగ నొకరితరువాత నొకరిగ నందఱినిచూచి పిదప రఘునాథుని సంబోధించి యిట్టులనెను. "శూరశిఖామణీ! నీవు వీరందఱికంటెను కనిష్ఠుఁడవు. కాని నీ బాహువులం దీవనూరవీర్యమును గ్రహింపుము. నేఁడు నీవిక్రమమునుగాంచి పరితుష్టుఁడనైతిని. రఘునాథా! నీవు నేఁడు దుర్గవిజయము నారంభముఁ గావించితివి; నీవే శేషముఁగావింపుము."

రఘునాథుఁడు లేచి ముదలను శిరమునధరించి యతనికి వినయపురస్సరముగఁ బ్రణామమిడి రెండుశతముల సైనికులను వెంటఁగొని విద్యుద్గతిని నయనములనుండి బహిర్గతుఁడయ్యెను. శివాజీయపుడు తన్నజీ నుద్దేశించి యిట్లుపలికెను. "ఈయోధాగ్రేసరుఁడు రజపుత్రకుల సంజాతుఁడు. ఇతని ముఖమండలమును నాచరణములను గాంచిన నితఁడేదేని యున్నత వీరవంశోద్భవుఁడని తోఁచును. కానియీ శూర ప్రవరుఁడెపుడును తనవంశము విషయమై యొక పలుకైననుచ్చరింపలేదు. తనయసాధారణ సాహసవిషయముంగూర్చైన నతఁడొక గర్వితవాక్యమునైనఁ బలికియుండలేదు. ఒకనాఁడు పూనాయందు రఘునాథుఁడు నాప్రాణములను గాపాడెను. నేఁడు రఘునాథజీయే దుర్గ

విజయమందు ముందంజవైచెను. నేనింతవఱకు నతని కేపురస్కారము నొసఁగియుండలేను. ఎల్లి రాజసభయందు రాజాజయసింహుని సమ్ముఖమున నీరజపుత్రశూరున కుచితరీతి పురస్కార మొసంగెదను."

రఘునాథజీ యేకార్యభారమును వహించిపోయెనో, దానిని నిర్వహించెను. ఆఫ్గనులింకను పర్వతారోహణ మొనరించుచుండుటఁ గాంచి ప్రాచీరోపరిభాగమునుండి మహారాష్ట్రులు తమయమ్ములను విడువసాగిరి. పిదపవారలు "హరహర మహాదేవ" యని భీషణనాద మొనరించుచు సమరోపక్రమణ మొనరించిరి, కాని రణము కాలేదు. ప్రాచీరముపైనున్న కాగడల యాలోకమున నసంఖ్యాకులైన శత్రువులుండిరని గ్రహించి ఆఫ్గనులు దుర్గోద్ధారము దుఃఖసాధ్యమని తలఁచి మరలపర్వతము నవతరణమొనరించి పలాయనమొనర్చిరి. మావులీలు పశ్చాద్ధావన మొనరింపసాగిరి ఉన్మత్తమావులీల యవారితనిశితకరవాలాఘాతములచే నాఫ్గనులు నిహతులుగాఁజొచ్చిరి.

రఘునాథజీ యపుడుచ్చైస్స్వరమున "పలాయితులగువారినివిడిచివైచుఁడు. ఇచ్చవచ్చినచొవ్వున వారలనుపోనిండు. ఎవనిని హతమొనరింపక శివాజీ యాదేశమును పాలనమొనరింపుఁ"డని సైనికులకుముదలనొసఁగెను. ఆహవమంతరించెను. ఆఫ్గనుయోధులు శైలము నవతరించి, పరువెత్తిరి.

ఆపుడు రఘునాథజీ దుర్గప్రాచీరమునస్థానస్థానములందుఁ బ్రహరులను గావలియుంచి యమ్ములపొదులును, నస్త్రశస్త్రములును యుండు యాగారమునఁ దనభృత్యులలోఁ గొందఱిని సన్నివేశితమొనరించి దుర్గమందలి ప్రతినిలయము, సమస్త స్థానములను హస్తగతమొనరించుకొని భద్రముగ వానిని గాయుచుండుఁడని యనుచరుల కాన నొసఁగి శివాజీనికటమున కరిగి నతమస్తకుఁడై సర్వవిషయములను నివేదించెను.

ఎప్పుడుషారక్తిమకాంతి పూర్వదిక్కునఁగనుపట్టెనో, యెప్పుడు ప్రాతఃకాలసుమంద శీతలవాయువు వీవఁదొడంగెనో, యప్పుడు సమస్త దుర్గమును శబ్దశూన్యమైయుండెను. అంతయు నిస్తబ్ధముగనుండెను. ఈసుందర శాంతపాదపమండిత పర్వతశేఖరము ఋషిచంద్రులయాశ్రమమైయుండనోపు! ఆహవపైశాచిక రవమెన్నఁడు నింతకుమున్ను శాంతినికేతనమునశ్రితమై యుండదు !!

ప ది యా ఱ వ ప్ర క ర ణ ము.

విజేతపురస్కారము.

మఱునాఁడపరాహ్ణమున నాదుర్గోపరిభాగమున నొకమహాసభ సన్నివేశితమయ్యెను. కౌశేయవినిర్మిత సభామండప స్తంభములపై రక్తవర్ణవితానములును పార్శ్వములందు వివిధరాగ వసనములును మండితములైయుండెను. ఉన్నతమైన గద్దెపై—రాజాసనములందు జయసింహ శివాజీలిరువురు నుపవిష్టులైయుండిరి. నలుపార్శ్వములందును సైనికులు తమకరముల తుపాకులనిడికొని శ్రేణిబద్ధులై నిలువంబడిరి. ఆకృపాణాగ్రములనుండి రక్తరాగపతాకములపరాహ్ణవాయు హిల్లోలములందు నృత్యమొనరించుచుండెను. నలుకెలంకులందును యనేకులుగూడి ఢిల్లీశ్వర జయసింహ శివాజీల నామముల నుచ్చరించుచు జయనాదముల నొనర్చుచుండిరి.

జయసింహుఁడు మందహాసవదనుఁడై శివాజీనుద్దేశించి యిట్లనెను: "మీరు ఢిల్లీశ్వరుని పక్షావలంబులైనప్పటినుండియు నతనిదక్షిణకరముకరణి నుండిరి. ఈయుపకారమును చక్రవర్తి యెప్పుడును మఱువఁజాలఁడు, మీజతనములన్నియు జయోపేతములయ్యెను."

శివాజీ—జయసింహుఁ డెచటనుండెనో జయమచటనేయున్నది!

జయసింహ—మనము శీఘ్రముగ విజయపురము నాక్రమించుకొనఁగలమని దలఁచెదను, మీరొకనిశియందే యీదుర్గమును స్వాధీనముఁగావించుకొనఁ గలిగెదరని నేనెపుడును దలఁపలేదు.

శివాజీ—మహారాజా! దుర్గవిజయశిక్షను బాల్యకాలమునుండి యానెఱుంగుదును. కాని యెట్లనాయాసముగ దుర్గమును స్వాధీనముఁగావించుకొనఁ గలుఁగుదునని వివేచనమొనరించితినో, యట్లొనరింపఁజాలనైతిని.

జయసింహుఁడు—ఎందువలన?

శివాజీ—ముసల్మానులందఱు సుషుప్తిమగ్నులైయుండెదరని తలఁచితిని. కాని వారలుకనుజాగరూకులై సంగ్రామసంసిద్ధులైయుండిరి. పూర్వమెన్నఁడును దుర్గజయమొనరించుతరి నాసైనికులలో నిందరు నిహతులుగా లేదు.

జయసింహ—ఇది యాహవసమయమని యెఱిఁగి రాత్రిలందు సర్వదా శత్రువులు సన్నద్ధులైయుండిరని తలఁచెదను.

శివాజీ—అది సత్యమే. ఇన్ని దుర్గములను జయించితిని. కాని యెపుడు నెచటను యీతీఱున సైనికులు భండన సంసిద్ధులైయుండుటఁ జూచియుండలేదు.

జయసింహుఁడు—శిక్షితులై రిపులు క్రమక్రమముగ సతర్కులైయుండనిందు, లేకట్లుగాకుండనిందు. రాజాశివాజీ కడ్డుపడుట కేరికిని సాధ్యముకాదు. శివాజీజయ మనివార్యమైనది.

శివాజీ—రాజేంద్రుని ప్రసాదమున దుర్గజయమైయుండుట నిక్కువమే. కానిగడచిన నిశియందుఁ గలిగిన యనిష్ట మీజీవనమందు వాపికొనఁగలుఁగు టసాధ్యము. సహస్రసైనికులనడుమ రెండుమూఁడునూఱులమనుజులను నేనిఁక యీజీవమందుగాంచలేను. అట్టివిశ్వాసపా

త్రులును దృఢప్రతిజ్ఞాపాలకులును ప్రతిజ్ఞావంతులును వారుమరల నలవడుట యసంభవము.

శివాజీ క్షణకాలము శోకాకులచిత్తుఁడైయుండి పిదప బంధితులైనవారలను సభామంటపమునకుఁ గొనిరమ్మని తనభృత్యులకాదేశ మొసఁగెను.

రహమత్ ఖాను యధీనమున వేయిమందిసైనికు లాదుర్గమ దుర్గమును గాపాడుచుందురు. నిన్నటిరణాంతరమున నొకటి రెండునూఱుల సైనికులుమాత్రము బంధితులుగాఁబడిరి. మిగిలినవారిలోఁ జాలమంది హతులైరి. కొందఱుపలాయితులైరి. బంధితులకరములు పశ్చాద్దిక్కుగ బంధింపబడెను. వారలు సభాసమ్ముఖమునకుఁగొని రాఁబడిరి.

శివాజీ వారలను బంధవిముక్తులుగఁ జేయునిజసేవకులకుముదలనొసఁగి పిదప వారల నుద్దేశించి యిట్లనియెను. "అఫ్గనుసైనికులారా! మీరలందఱు మీమీవీరనామములను గాపాడుకొనిరి. మీయాచరణమువలన నేనెంతయుఁ బరితుష్టుఁడనైతిని. మీరలందఱిపుడుస్వాధీనులైరి. మీకిచ్ఛయున్నచో ఢిల్లీశ్వరుని కార్యములందు నియుక్తులుకండు. లేకున్న మీప్రభువైన విజయపురసుల్తానుకడకుఁబొండు. నాయాదేశానుసారముగ నేరునుమీకేశాగ్రములనైన స్పృశింపరు."

శివాజీయొక్క సదాచరణముఁగాంచి యేరునువిస్మితులుగాలేదు. అన్నియుద్ధములందును దుర్గవిజయానంతరమున నతఁడు విజితులైనవారి యెడల దయఁగలిఁగి ప్రవర్తించును. అతనిమిత్రులపుడపుడిందువలన నాతనిపై దోషారోపణమొనరించుచుందురు. కాని శివాజీ యేమియు లక్ష్యముచేయక సదాచరణపరాయణుఁడై రిపుజనులనురక్షించును. అతనియౌదార్యముఁగాంచి గడువిస్మితులై యాఫ్గనుసైనికులలోన నేకులు ఢిల్లీశ్వరుని వేతనము ననుభవించుటకిచ్ఛగించిరి.

పిదపశివాజీ కిల్లాదారైన రహమత్ ఖానునటకుఁగొనిరమ్మని సేవకులకాదేశ మొసఁగెను. అతని పెడతెక్కలు విఱచికట్టఁబడెను. అతని లలాటమందు ఖడ్గాఘాతము గన్పట్టుచుండెను. అతని బాహుద్వంద్వము శిలీముఖవిద్ధమై క్షతమైయుండెను. సదర్పముగ నావీరాగ్రేసరుఁడు సభాసమ్ముఖమున నిలువంబడియుండి తనతీక్ష్ణదృక్కులను శివాజీపైఁ బఱపెను.

శివాజీ యాయోధశ్రేష్ఠునిఁగాంచి నిజాసనమునుండి లేచి అతని కెదురేగి తనకరవాలముచే నతనికరములను బంధించియుండిన రజ్జువులను నరకివైచి పిదపమెల్లగ నతనినుద్దేశించి యిట్లనియెను. "వీరప్రవరా! యుద్ధనియమానుసారముగ తమహస్తములను బంధింపఁజేసితిని. మీరొకనిశిబంధితులైయుండిరి. నాదోషమును మన్నింపుఁడు. తామిపుడు స్వతంత్రులైయుండిరి. జయపరాజయములు భాగ్యక్రమమున ఘటిల్లును; కాని తమబోంటి శూరశిఖామణితోఁబోరి నేను కడుధన్యుఁడనైతిని. నేను చాల సమ్మానితుఁడనైతిని."

ఇంతదనుక రహమత్ ఖాను రాజదండానుసారముగ నాఁడు తనప్రాణములను విడువవలయునని దలఁచుచుండెను. అయిన నతనిస్థిరగర్వితనయనములం దొకించుకైన విచారసూచనగన్పట్టలేదు. కాని శివాజీయొక్క యీయసాధారణ సమ్మానముఁ గాంచినతోడనే యతని హృదయము విచలితమయ్యెను. రణమున శత్రుమధ్యమున నేరును యెన్నఁడును రహమత్ ఖానుముఖమునఁ గాతరతాచిహ్నముఁగాంచియుండలేదు. నేఁడావృద్ధుని యుజ్జ్వలచక్షుర్ద్వయమునుండి రెండశ్రుబిందువులు పతితమయ్యెను. ఖాను తనవదనమును వెనుకకుఁద్రిప్పుకొని బాష్పములను మోచనమొనరించి మెల్లగ శివాజీనుద్దేశించి యిట్లనెను. "రాజశేఖరా! నిన్నటినిశీథమందు తమ బాహుబలకతమున నేను పరాజితుఁడనైతిని. నేఁడు మీభద్రాచరణకతమున నంతకంటె నెక్కుడుగఁ బరాజితుఁడనైతిని. ఎవఁడు హిందూమసల్మానుల కధీశ్వరుఁడో, యెవఁడు

పాదుషాపై పాదుషాయో, యెవనియగిది "జమీాను" సుతియొకఁడు లేఁడో, యెవఁడు భూభాగ్యాకాశములంతకును "సుల్తానో," అతఁడిందువలననే మాకీనూతనరాజ్యవిస్తార మొనరించుటకు సామర్థ్య మొసఁగెను.

జయసింహుఁడు—వతాను సేనాపతీ! తమయుచ్ఛపదయోగ్యతను మీరు బాగుగఁ బ్రమాణముఁగావించితిరి. ఢిల్లీశ్వరుఁడు తమవంటి సేనానినిఁ బొందఁగలిగినచో నింకను పదవృద్ధినొందఁగలుఁగుననుటకేమియు సందియము లేదు. మీవంటి వీరశ్రేష్ఠులతని వాహినులందొక కర్మచారియగుటకు సమ్మతించెదనని నన్ను చక్రవర్తికి వ్రాయ నిచ్చెదరా ?

రహమత్ ఖాన్—మహారాజా! తమవచనములు మిగులనన్నానందింపఁ జేసెను. తమసన్మానముచే మిగులధన్యుఁడనైతిని. కాని చిరకాలమునుండి యెవనికార్య మొనరించుచుంటినో యతనిని పరిత్యజింపఁజాలను. ఎన్నిదినములీహస్తము ఖడ్గమునుఁ బట్టఁగలుగునో యంతకాలము విజయపురమునకే బట్టును.

శివాజీ—అట్లనే కానిండు. నేఁటినిశియందు మీరిచటవిశ్రమింపుఁడు. ఎల్లియుదయమున నాసైనికులఁగొందఱిని వెంటనిడుకొని నిరాపదముగ విజయపురమును జేరుఁడు.

రహమత్ ఖాన్—క్షత్రియప్రవరా! మీరునన్నుఁ జాలగ సన్మానించితిరి. నేను మీకసన్మానముఁజూపను, మీనికటమున నేనేవిషయమును గోపనముఁ గావింపనేరను. మీసైనికులనందఱిని బాగుగఁ బరీక్షించిచూడుఁడు. అందఱును ప్రభుభక్తులుగారు.

నిన్నటిదినమున దుర్గాక్రమణముయొక్క గోపనానుసంధానమును నేను ముందే యెఱుఁగఁగలిగితిని. దానిం జేసియే నాసైనికులందఱు నిన్నటినిశియందు సర్వవిధముల సంగ్రామసంసిద్ధులైయుండిరి. దుర్గాక్ర

మణవిషయమై మాకుఁ బలికినది మీసైనికులలో నొకఁడైయుండెను. ఇంతకంటె నెక్కుడుగ నేనేమియు మీకెఱిఁగింపఁజాలను. సత్యోల్లంఘన మాచరింపను.

ఇట్లు పలికి రహమత్ ఖాను మెల్లగ రాజభృత్యుల ననుసరించి ప్రాసాదాభిముఖముగనరిగెను. శివాజీరోషావేశపరవశుఁడయ్యెను. అతని ముఖమంతయుకృష్ణవర్ణమైపోయెను. అతని నేత్రములనుండి యగ్నిస్ఫులింగములు రాలుచుండెను. అతని కాయము కంపించుచుండెను. శివాజీ మిత్రులతనితోనపు డేమిప్రసంగించినను వృథయని తలఁచిరి. నేఁడేదో ప్రమాదము రానున్నదని యతనిసైనికులు భయమొందియుండిరి.

రోషావేశుఁడైయున్న శివాజీనిఁగాంచి జయసింహుఁడతని నోకించుక శాంతపఱచి పిదప సైనికులనుద్దేశించి యిట్లనియెను. "ఈదుర్గము స్వాధీనముఁగావింపఁబడునని మీరిదివఱలో నెపుడెఱిఁగి యుంటిరి?"

"రాత్రి యొక యామము గడచినవెనుక" నని వారలుత్తరువొసఁగిరి.

జయసింహుఁడు—అంతకుఁ బూర్వమెపుడీవిషయము నెఱిఁగియుండలేదా ?

సైనికులు—నిశియందేదేని యొక దుర్గమాక్రమణమొనరింపఁబడునని మాత్రము మేమెఱుఁగుదుము. కాని మేమీదుర్గము నాక్రమింపవలెనని యెఱిఁగియుండలేదు.

జయసింహుఁడు—బాగు; ఎపుడైనను మీరీదుర్గమును చేరియుంటిరా ?

సైనికులు—జామున్నరరాత్రి గడచినవెనుకనే చేరితిమి.

జయసింహుఁడు—సరియే జాము జామున్నర సమయములకు నడుమ మీరందఱు కలిసియేయుంటిరా ? ఎవరును రాకనుండలేదా ?

అశ్లైరైన రాకయుండినచో వెల్లడి పఱచుఁడు. ఒకసదోషముకొఱకై వేయిమంది సైనికులను శిక్షించుట యనుచితము. మీరనేకగ్రామములందనేకయుద్ధములనుగావించియుండిరి. మీనృపుఁడెల్లపుడును మిమ్ములను విశ్వసించుచుండెను. మీకీతనివగిది ప్రభువలవడుటదుర్లభము. మీయందీతఁడు సూపుచుండు విశ్వాసముయొక్క యోగ్యమును ప్రమాణముగావింపుఁడు. ఎవండైనవిద్రోహియై యుండినచో వానిని వెలుపలకుఁ గొనిరండు. లేక నతఁడు నిన్నటిరేయి రణమందు నిహతుఁడై యున్నచో, నతని నామధేయమును వెల్లడిపఱచుఁడు. అన్యాయసందేహముచే నేలయుందఱినామములను కలుషితమొనరించెదరు ?

గడచిన దినమందు జరగిన విషయములను సైనికులు జ్ఞప్తికిఁ గొనివచ్చుచుండిరి. వారొకరితోనొకరు ప్రసంగించుకొనుచుండిరి. శివాజీ క్రోధమొకించుక యుపశమనమయ్యెను. సుస్థుఁడై యతఁడు జయసింహు నవలోకించి యిట్లనియెను. మహారాజా! మీరు నేఁడా కపటయోధుని వెలుపలకుఁగొనిరాఁగలిఁగినచో చిరకాలము నేను మీనికటమున ఋణముఁగొన్న వాఁడనై యుండెదను.

అపుడు చంద్రారావనునొక జుమ్లాదారుఁడు ముందున కరుగుదెంచి తేనినుద్దేశించి మెల్లగనిట్లనెను. “రాజేంద్రా! నిన్నటిరేయి జాముగడచినపిదప మనము యుద్ధసన్నద్ధులమై పర్వతము నారోహించుచున్నతరి నాయధీనమందుండు యోధుఁడొకఁడు కనుపించలేదు. అతనికొఱకై యెంతయన్వేషించినను వానిజాడలేమియుఁ దెలియరాలేదు. పిదపమనము దుర్గతలమునఁ జేరఁగనేయతఁడు మనలను కలసికొనెను”

శివాజీ—అతఁడెవఁడు? ఇపుడింకను సజీవుఁడై యుండెనా? విద్రోహిపేరును వినుటకందఱు నాతురులై నిస్తబ్ధముగనుండిరి. శివాజీ ఘననిశ్వాసశబ్దమందఱికి వినవచ్చుచుండెను. సభాతలమందొకసూచికపడినను దానిశబ్దముకూడవినఁబడునట్లంతయు నిశ్శబ్దముగనుండెను.

ఆనిస్తబ్ధతామధ్యమున చంద్రారావుమెల్లగ నిట్లనెను. “రఘునాథజీ!”

అందఱు నిర్వాక్కులైరి—విస్మయస్తబ్ధులైరి!

చంద్రారావు ప్రసిద్ధివడసిన యోధుఁడైయుండెను; కాని రఘునాథజీ యాగమనమునుండియు నందఱు చంద్రారావు నామవిక్రమములను మఱచియుండిరి. మానవప్రకృతి యందీర్ష్యవగిది భీషణప్రవృత్తిమఱొండేదియు లేదు.

శివాజీముఖమండలము మరలకృష్ణవర్ణమైపోయెను. ఓష్ఠమందు దంతస్థాపన మొనరించి చంద్రారావును లక్షించి సరోషముగనతఁడిట్లనెను. హేకపటాచారీ! వృథగనిట్టి నిందాప్రలాపము లాడెదవేల? నీనింద రఘునాథుని యశోరాశిని స్పృశింపనేరదు. రఘునాథుని యాచరణములను స్వయముగఁజూచితిని. నీమిథ్యానిందకు శాస్తిని సైనికులందఱుఁగాంచుఁగాక!”

గంభీరముగ నిట్లుపలికి యతఁడు తనకరమందున్న నిశితకరవాలమును ఝుళిపించుచు చంద్రారావును సంహరింప నుంకించుచుండ నపు డకస్మాత్తుగ రఘునాథజీ ముందునకులంఘించి కరములఁబట్టికొని “రాజశేఖరా! ప్రభువైన చంద్రారావును వధింపకుఁడు. అతఁడుమిథ్యావాదికాఁడు. దుర్గతలమున కరుదెంచుటకు నాకువిలంబమయ్యె”నని నుడివెను.

మరల సభాస్థలమంతయు నిస్తబ్ధమైపోయెను. అందఱు నిర్వాక్కులైపోయిరి—విస్మయస్తబ్ధులైరి.

శివాజీక్షణకాలము ప్రస్తరప్రతిమూర్తివగిది నిశ్చేష్టుఁడైయుండెను. పిదప మెల్లగ లలాటమందలి స్వేదబిందువులను మోచనమొనరించి యతఁడిట్లనెను: “నేనిపుడు స్వప్నమును గనుచుంటినా యేమి? నీవు రఘునాథుఁడవేనా? నీవే యిట్టియాచరణమొనరించితివా ? ప్రాచీరలంఘన సమయమున నేకాకివై దుర్దమనీయ తేజమున నగ్రసరుఁడవై

వది నీవేనా! రెండునూఱుల సైనికులను మాత్రము వెంటఁగొని యేనూరాఫ్గను సైనికులను దుర్గాధోభాగమువఱకుఁ దఱిమివైచిన మహాశూరుఁడవు నీవేనా!!

విద్రోహాచరణ మొనరించి కిల్లాదారునకుముందే యాక్రమణ విషయమెఱింగించినది నీవేనా?"

"ప్రభూ! నేనావిషయమున నిర్దోషి" నని రఘునాథజీ మెల్లఁగఁ బ్రత్యుత్తర మొసఁగెను.

దీర్ఘకాయుఁడు నిర్భీకతరుణయోధుఁడు శివాజీయొక్క యగ్నిదృష్టిసమ్ముఖమున నిష్కంపుఁడై నిలచియుండెను. అతఁడనిమేషలోచనుఁడైయుండెను. అతని చక్షుఃఫలకము లొకింతయైన కంపించుట లేదు. సభాసదులును పరిసరమందు గుమిఁగూడియున్న యసంఖ్యాజనులుఁదమ తీక్ష్ణదృక్కులను రఘునాథజీపైఁ బఱపుచుండిరి. రఘునాథజీ స్థిరముగ నవిచలితముగ నకంపితముగనుండెను. అతని విశాలవక్షస్థలమొక గభీరనిశ్శ్వాసముచే మాత్రము స్ఫీతమైయుండెను. గడచినదినమున నసంఖ్యాకులైన రిపువీరులనడుమఁ బ్రాచీరోపరిభాగమున నేకాకియై యెట్లు నిలచియుండెనో, నేఁడంతకంటె నధికసంకటమధ్యమున నాశూరశిఖామణి యట్లే ధీరుఁడై యవిచలితుఁడై యుండెను.

క్రోధావేశుఁడై శివాజీ "అట్లైన నేల నాయాజ్ఞోల్లంఘన మొనరించి రాత్రిఝామైనపుడు రాకయుంటి?" వని ప్రశ్నించెను.

రఘునాథుని యోష్ఠ మొకించుక కంపితమయ్యెను; కాని యతఁడేమియు నుత్తరమీయక నతమస్తకుఁడై భూమిపైఁ దనదృక్కులనిగుడించుచు నిలువంబడియుండెను.

రఘునాథజీ నిర్వాక్కుఁడైయుంటఁ గాంచినతోడనే శివాజీయొక్క సందేహము వృద్ధియయ్యెను. అతని నయనద్వయము మరల రక్త

వర్ణమయ్యెను. క్రోధకంపితస్వరమున నతఁడిట్లనెను. "కపటాచారీ! ఇందుకొఱకేనా నీవీరత్వమును ప్రదర్శించితివి? కాని, చెముఘమునున నీవు శివాజీనికటమున నీమోసగింపుశక్తిఁ బ్రదర్శించితివి."

రఘునాథుఁడల్లే ధీరాకంపితస్వరమున నిట్లు పలికెను. "రాజేంద్రా! మోసముగాని కపటాచరణముగాని మహావంశజుల యభ్యాసము కాదు. ప్రభువైన చంద్రారావు ప్రాయశః దాని నెఱిఁగియేయుండును."

రఘునాథుని స్థిరభావము శివాజీ క్రోధమం దాహుతమైనట్లయ్యెను. కర్కశభావమున శివాజీ యిట్లనెను. "పాపిష్ఠుఁడా! పరిత్రాణప్రయత్నము ప్రయోజనరహితము; క్షుధార్తకంఠీరవ నాతఁబడి పలాయన మాచరింపఁగలుగుదువు;

కాని శివాజీయొక్క జ్వాలంతక్రోధమునఁ బడినచోఁ బరిత్రాణములవడుట యసంభవము."

రఘునాథజీ పూర్వముపగిదినే మెల్లగనిట్లు ప్రత్యుత్తర మొసఁగెను; "నేను మహారాజునికటమునఁ బరిత్రాణప్రార్థనముఁ గావించుట లేదు. మనుష్యునికడ క్షమాప్రార్థన మాచరింపను. జగదీశ్వరుఁడు నేనపరాధినైయున్నచో నాదోషమును మార్జన మొనరించుఁగాక!

క్రోధావేశముకతంబున క్షిప్తప్రాయుఁడైయున్న శివాజీకృపాణము నుత్తోలన మొనరించి వజ్రనాదమున "విద్రోహాచరణశాస్తి ప్రాణదండ!" మని వాక్రుచ్చెను.

రఘునాథజీ ఆవజ్రముష్టియందు తీక్ష్ణఖడ్గమును గాంచెను. అప్పుడుకూడ నాయవిచలిత స్వరమున నిట్లనెను. "యోధుఁడు మరణసన్నద్ధుఁడయ్యే యుండెను. విద్రోహాచరణము నతఁడాచరింపలేదు."

శివాజీయిఁక సహింపఁజాలక పోయెను. అతనియవ్యర్థముష్టి

యందుఁ గరవాలము కంపించుచుండెను. ఇట్టితరి జయసింహుఁడతని కరమును బట్టుకొనియెను.

శివాజీ ముఖమండలమపుడు క్రోధవివృతమైపోయెను. అతనిశరీరము కంపించుచుండెను. అతఁడు జయసింహునకుఁగూడ సముచిత సమ్మానముఁ జూపమఱచి కర్కశస్వరమున నిట్లనెను. "హస్తమును వదలివైచుఁడు. రాజపుత్రుల నియమమేమియో నెఱుఁగను. మహారాష్ట్రుల సనాతనధర్మమేమన విద్రోహులశాస్తి ప్రాణదండమని శివాజీ యీనియమమును పాలన మొనరించును."

జయసింహుఁడొకించుకైనఁ గోపింపక మెల్లగనిట్లనెను. "రాజశేఖరా! నేఁడేమి యాచరించెదరో యెల్లి దానినన్యథా గావింపనేరరు. ఈయోధునకు నేఁడు ప్రాణదండము విధించినచో చిరకాల మందువలనఁ బశ్చాత్తాప మొందెదరు. రణానుభవమందు నాకేశములు శుక్లమైనవి. నా నుడువులాలింపుఁడు. ఈయోధుఁడు విద్రోహి కాఁడు. కాని యిపుడావిచారమువలని యావశ్యకము లేదు. మీరు నామిత్రులు. మిత్రునికడ నేనీ రసపుత్రయోధుని ప్రాణభిక్ష వేఁడుచుంటిని. నాకీభిక్షదాన మొనరింపుఁడు."

శివాజీ జయసింహుని సమ్మానముఁగాంచి యొకించుక యప్రతిభుఁడయ్యెను. ఒకించుక యూరకుండి యతఁడిట్లనెను. "అతులనా! నా పరుషవాక్యములను మన్నింపుఁడు. మీవచనముల నెపుడును నిర్లక్ష్యముఁ గావింపను. కాని శివాజీ విద్రోహిని మన్నించునని యెపుడు నుతలంచి యుండలేదు. యోధుఁడా! జయసింహుఁడు నీజీవనరక్షణ మొనరించెను. కాని నాసమ్ముఖమునుండి దూరముగఁ బొమ్ము. శివాజీ విద్రోహుల ముఖదర్శన మొల్లఁడు?"

రఘునాథజీ సభాస్థలమును త్యజింప నుపక్రమించుచుండ

శివాజీమరల నిట్లనెను. "ఒకించుక యాగుము. నీవఱయందున్న ఖడ్గము నేనే నీకొసంగితిని. విద్రోహిహస్తమున నాకృపాణము నవమానముఁ గలిగియుండెను. భృత్యులారా! ఆఖడ్గము నూడఁబెఱికికొని పిమ్మట నీద్రోహిని దుర్గమునుండి త్రోలివైచుఁడు."

రఘునాథునకు ప్రాణదండశిక్ష నొసంగిన నెపుడాదేశమయ్యెనో యపుడతఁడవిచలితుఁడై యుండెను. కాని భృత్యులెపుడతనికడనున్న కరవాలము నూడఁబెఱుక నుంకించిరో యపుడతని శరీరము కంపితమయ్యెను. నయనద్వయ మార్ద్రక మయ్యెను. కాని యతఁడాయుద్వేగమును సంయత మొనరించుకొని, శివాజీవైపుగ నొకమాఱు తనదృక్కులఁబఱపి పిదప మృత్తికావర్యంతము శిరమువంచి నిటలతటఘటితాంజలియై నిశ్శబ్దముగ దుర్గమునుండి వెడలిచనెను.

సంధ్యాఛాయ క్రమక్రమముగ గాఢతరమై పృథివినావృత మొనరించుచుండెను. అపుడొక పథికుఁ డేకాకియై నిశ్శబ్దముగఁ బర్వతమునుండి యవతీర్ణుఁడై ప్రాంతరాభిముఖుఁడై గమన మొనరించుచుండెను. పిదపనతఁడా ప్రదేశము నతిక్రమించి యొండుగ్రామమును చేరెను. అతఁడాగ్రామమునుగూడ నతిక్రమించి మఱియొక ప్రాంతమును సమీపించెను. అంధకారము గభీరతరమయ్యెను. నైశవాయువుమర్మర శబ్దమొనరించుచు వీచుచుండెను. పిదపనిక నేరు నాపథికునిఁగాంచలేకపోయిరి.

పదునేడవ ప్రకరణము.

చంద్రరావు జావ్లాదారుఁడు.

చంద్రరావుతోఁ బరిచయమగుట మనకిది యే ప్రథమపర్యాయము. అతఁడసాధారణధీశక్తిఁగలిగి యప్రతిమాన వీర్యవంతుఁడై

యుద్యోచ్చప్రతిజ్ఞ సూపుచుండును. అతని ప్రాయము రఘునాథజీ వయసుకంటె నైదారువత్సరములకంటె నెక్కుడు లేదు, కాని దూరము నుండి చూచిన నతఁడిరువదివత్సరములఁ బ్రాయఁపువానిపగిదిఁగన్పట్టును. అతని ప్రశాంతలలాటము దీవయసునందే యొకటిరెండు గభీర చింతారేఖలంకితములై యుండెను. అతని మస్తకమందలి కేశములొకించుక శుక్లములై యుండెను. అతని నయనములు క్షుద్రములైయతితేజోజ్జ్వలములై యుండెను. చంద్రారావు పేరు విశేషముగ నెఱిఁగియుండిరో వారలతని తేజస్సాహసములెట్టి దుర్దమనీయములో, వాని భీషణానివార్య స్థిరప్రతిజ్ఞ, దూరదర్శిత ప్రభావములు నట్టివని యెఱిఁగియుండిరి, అతని ముఖమండలమందీ రెండు భావములు విశేషముగ వ్యక్తమగుచుండును. అతని శరీరము లోహనిర్మితమైన దానివలెఁగన్పట్టును. అతని యసీమపరాక్రమము, విజాతీయక్రోధము, గంభీరబుద్ధి, దృఢప్రతిజ్ఞత, నెరెఱిఁగియుండిరో వారలాయల్పభాషితో నెపుడును వివాదముఁ గావింపరు. ఇవన్నియుఁగాక చంద్రారావు చరిత్రయందొక దోషమున్నది. దాని నేరును బాగుగ నెఱుఁగరు విజాతీయయుచ్ఛాభిలాషకతమున నతనిహృదయము దివారాత్రములు జ్వలించుచుండును. అసాధారణబుద్ధిసంచలనముచే నతఁడాత్మోన్నతిపథము నావిష్కారముఁ గావించును. అతఁడతుల దృఢప్రతిజ్ఞాపురస్సరముగ నాపథమునవలంబించి, కృపాణపాణియై దానిని పరిష్కారమొనరించును. శత్రువైనను, మిత్రుఁడైనను, దోషియైనను, నిర్దోషియైనను, యపరాధియైనను, పరమోపకారియైనను మఱే రైనను నాపదసమ్ముఖమున నిలచియున్నచో, నుచ్చాభిలాషియైన చంద్రారావు పతంగముపగిది నతనినిఁ బదదలితుఁగావించి నిజపథమును పరిష్కారమొనరించుకొనును. నేఁడు బాలకుఁడైన రఘునాథజీ ఘటనావశతః నాపదసమ్ముఖమున నిలచియుండుటచేఁ బతంగము భంగినే యతనిని దలితుఁ గావించి చంద్రారావు తనమార్గమును బరిష్కార

మొనరించుకొనెను. ఇట్టియసాధారణపురుషుని పూర్వవృత్తాంతమెఱుఁగుట యవశ్యకము. శ్రోతృఁడనే రఘునాథుని వంశవృత్తాంతముఁగూడ నొకించుకఁ దెలియఁగలడు.

చంద్రారావు తన జన్మవృత్తాంతము నెపుడును ప్రకాశముగా వింప నిచ్చగింపఁడు. యశవంతసింహుని ప్రధానసేనానులలో నొకఁడైనను గజపతిసింహుఁడు చంద్రారావును శైశవమునుండి పెనుచుచువచ్చెను. అనాథబాలకుఁడైన చంద్రారావు గజపతిసింహుని గృహకార్యములను నిర్వర్తించుచు నతని పుత్రపుత్రికలనాడించుచు సేనాని వెంట నరుగుచు ననేక రణరంగములందు దిరుగుచుండెడివాఁడు.

చంద్రారావునకు పదునేను వత్సరములవయసురాగనే యతని గభీరచింత, దుర్దమనీయ తేజము, దృఢప్రతిజ్ఞలఁగాంచి గజపతిమిగుల సంతసించి నిజపుత్రుఁడైన రఘునాథుని పగిది నతనిని ప్రేమించుచు, నాకోమలవయసునందే యతనినిఁ దనయధీనమున సేనాకార్యమందు నియుక్తునిఁగావించెను.

సైనికవ్రతధారణమొనరించినదాదిగ దినదిన ప్రవర్ధమానముగఁ జంద్రారావు చూపుచుండు విక్రమముఁగాంచి ప్రాచీనయోధులుగూడ విస్మితులగుచుండిరి. ఏస్థానమున నత్యంత విషాదమున్నదో. యేప్రదేశమున మిత్రశత్రుల శరములు రాశీకృతమగుచుండెనో, యేతావునధూళిధూమములు గగనము నాచ్ఛాదితమొనరించుచుండెనో, యెయ్యెడ విజేతహుంకారములు, నారులనార్తనాదము ... ప కర్ణవిదీర్ణమొనరించుచుండెనో, యటనన్వేషించినచోఁ బదునైదేండ్లవయసువాఁడైన చంద్రారావుగన్పట్టును. సమరానంతరమున జయశీలురైన సైనికు లేయెడ నేకస్థులై నిశియందు గీతవాద్యములు సలుపుచుందురో, పరిహాసామోదముల నొనర్చుచుండిరో, యచట జంద్రారావు గానరాఁడు. ఆ బాలకుఁ

డు శిబిరమున నంధకారమున నేకాకియై యుపవిష్టుఁడై యుండును లేక ప్రాంతరమందైనను నదీతీరమునందైన నతఁ డేకాకియై, కుంచితలలాటుఁడై సాయంకాలమునఁ బదాచరణమాచరించును. ఆయల్పవయస్కుని యల్పభాషిత్వమును, దృఢప్రతిజ్ఞఁ గాంచి యందఱచ్చెరువొందుచుండురు. చంద్రారావు యుద్దేశ మొకించుక సాధితమయ్యెను. అతఁడిపు డజ్ఞాతరాజపుత్రశిశువుగాఁడు, అతఁ డున్నతిపదవిలాభము నొందెను, గజపతిసింహుని యధీనమందున్న సైనికులందఱుఁ జంద్రారావసాధారణతేజస్వియైన వీరుఁడని ప్రతీతివడసెను. గౌరవవృద్ధిననుసరించి యతని యుచ్చాభిలాషగర్వము లధికతరవృద్ధి నొందుచుండెను.

ఒకనాఁడొకయుద్ధమున గజపతి సింహుని చంద్రారావొక పరమ విపాదమునుండి యుద్ధారముఁ గావించెను. రణానంతరమున గజపతి చంద్రారావును దనకడకుఁ బిలచి యందఱిసమ్ముఖమున యథోచితరీతి నతనిని సమ్మానముఁ గావించియిట్లనెను. "బాలకా! నేఁడు నీసాహసము కతమున నే నాకుఁ బ్రాణరక్షణ మొదవెను; దీనికి నీకే నేమి పురస్కార మొసఁగఁగలను?"

వినీతభావమున ముఖము నవనతముఁ గావించి చంద్రారావు నిలువంబడియుండెను.

గజపతి ప్రీతిపురస్సరముగ మరలనిట్లనెను. "బాగుగ భావించి నీకేది యిచ్చరో యెఱింగింపుము. బాలకా! అర్థపదవృద్ధి సామర్థ్యములందు నీక దేయమైన దేదియును లేదు.

చంద్రారావు మెల్లగనుత్తమాంగము నెత్తియిట్లనెను. "రసపుత్రవీరు లాడిన మాటఁ దప్పరను విషయము జగద్విదితమైనదే. శూరాగ్రేసరా! మీపుత్రికయైన లక్ష్మీబాయిని నాకొసఁగి పరిణయ మొనరింపుఁడు."

సభాసదులందఱు నిర్వాక్కులై నిస్తబ్ధులైపోయిరి. గజపతిసింహుని మస్తకమున నభము విఱిగిపడినట్లయ్యెను. క్రోధముచే నతని శరీరము కంపితమయ్యెను. అతని యసి యొఱనుండి సగమువఱకు నిష్కోషితమయ్యెను. కాని యతఁ డాక్రోధము నొకించుక సంయత మొనరించుకొని యుచ్చహాస మొనరించి యిట్లనెను. "ఆడినమాట తప్పకుండుట కొప్పియేయుంటిని. కాని నీవు మహారాష్ట్రదేశమందుద్భవించితివి. మహారాష్ట్రదస్యులఁ గూడి రసపుత్రదుహితలు పర్వతకందరంబులందును, గహనాభ్యంతరసీమలందును గాపురముండు నభ్యాసము లేదు. ప్రప్రథమమున నాముద్దులపట్టి కుపయుక్తమైన వాసస్థానమును నిర్మాణముఁ గావింపుఁడు. కాననపర్ణశాలలకు బదులుగ దుర్గములను నిర్మింపుము. దస్యుపరివర్తముగ యోధనామమును గ్రహింపుము. తదనంతరమున రసపుత్రబాలికను బరిణయమాడ వాంఛ నెఱింగింపుము. ఇపుడీవు కోరునదేమైననున్నదా."

"ఇపుడేను కోరునదన్య మేమియు లేదు. అట్టికోరిక యొదవినపుడు ప్రభున కెఱింగించెద"నని మెల్లగ చంద్రారావు ప్రత్యుత్తర మొసంగెను.

సభముగిసెను. అందఱు తమతమ శిబిరములకు మగుడిచనిరి. ఉదారచేతస్కుఁడైన గజపతిసింహుఁడు చంద్రారావుపైఁ దనకుఁ గలిఁగిన క్రోధము నచిరకాలమందే మఱచెను. అతఁ డాదినమున వాక్రుచ్చిన వచనములఁ గూర్చి మఱిదలఁపలేదు. కాని చంద్రారావాదినచర్యను మఱువలేదు. ఆనాఁటి సంధ్యాసమయమున నతఁడు నిజశిబిరమందు బచారిఁ జేయసాగెను. శిబిరమంతయు గభీరాంధకారబంధురమై యుండెను. కాని యంతకంటె గభీరతరదుర్భేద్యాంధకారము చంద్రారావు హృదయలలాటములందు నిండియుండెను.

రెండు నిమేషములైన పిదప చంద్రారావు ప్రదీపమును జ్వలించి యొక పుస్తకమందు మిగుల జాగరూకతతో నేమేమియో లిఖించి, దానిని మూసివైచి, మరలఁ దెఱచి, మరలఁ జూచి, మరల మూసి

వైచెను. అతని ముఖమండలమందొక వికటహాస్యము గన్పట్టెను. ఇంతలో నాతని మిత్రుఁ డొకఁడు శిబిరమును ప్రవేశించి, "చంద్రా! యేమి లిఖించుచుంటి"వని ప్రశ్నించెను. సహజావిచలితస్వరమున "నేమియు లేదు. నేనెవరియొద్ద నెంత ఋణముఁ దీసికొంటినో దానిని గుఱించి జ్ఞాపకార్థమిందొకించుక లిఖించితి"నని ప్రత్యుత్తర మొసఁగెను.

మిత్రుఁడు వెడలిపోయిన పిదప చంద్రారావు మరల పుస్తకమును దెఱచెను. విత్తవిషయము లెన్నియో నందు వివరముగ లిఖింపఁబడి యుండెను. చంద్రారా వొక ఋణముఁగూర్చి యే యందు లిఖించెను. మరల నతఁడు పుస్తకమును మూసివైచి దీపమును నిర్వాణ మొనరించెను.

ఈఘటనానంతరమున నొకవత్సరము గడచినతోడనే యౌరంగజేబు యశవంతసింహుల కుజ్జయినీ సన్నిధానమున మహాయుద్ధము సంభవించెను. ఆరణమందు గజపతిసింహుఁడు నిహతుఁడయ్యెనను విషయమును "మాధవీకంకణ" మను నవలను పఠించినవా రెఱిఁగియే యుందురు.

గజపతిసింహుని యనాథబాలికా బాలకు లిరువురు మర్వారునుండి మీవారునందున్న సూర్యమహాలు దుర్గమునకు మగుడిపోవుచుండిరి. రఘునాథుఁడు ద్వాదశవర్ష ప్రాయుఁడై యుండెను. లక్ష్మివయసు నవవత్సరములు మాత్రమే. వారలు ప్రయాణముఁ జేయుతఱి నొక పురాతనభృత్యుఁడు మాత్రము వారలవెంటఁ జనుచుండెను. పథమధ్యమందొక దస్యుదళము భృత్యుని సంహరించి, బాలకబాలికలను మహారాష్ట్ర దేశమునకుఁ గొనిపోయెను. బాలకుఁ డల్పవయసునందే తేజస్వియయ్యెను. ఒకనాఁటి నిశియం దతఁడు దస్యుశిబిరమునుండి పలాయన మాచరించెను దస్యుపతి గజపతి ముద్దుపట్టికను బలాత్కారముగఁ బరిణయమాడెను; ఆదస్యుపతి చంద్రారావు!

తీక్ష్ణబుద్ధియైన చంద్రారావు యొక్క మనోరథము కొంతవఱకుఁ బూర్ణమయ్యెను. గజపతి యాస్తినుండి యతఁ డొకించుక యర్థమును సంగ్రహించి విస్తీర్ణజాగీరును క్రయముగఁ గొని మహారాష్ట్ర సీమయందొక సమాదృత సంభ్రాంతపురుషుఁడయ్యెను. చంద్రారావొక పురాతన రజపుత్రవంశోద్భవుఁడని యందఱెఱుంగుదురు. ప్రసిద్ధివడసిన రజపుత్రుఁడైన గజపతిసింహుని యేకమాత్రపుత్రిక నతఁడు పరిణయమాడెనని యందఱెఱుఁగఁ గలిగిరి. అతని సాహస విక్రమములఁ గాంచి శివాజీ యతనికి 'జుమ్లాదారు' పదవి నొసంగెను. అతని విపులయర్థ విస్తీర్ణ జాగీరులను విలోకించి జనులందఱు తనియెడ సమాదరమును జూపుచుండిరి. చంద్రారావు యశము దినదినప్రవర్ధమాన మగుచుండెను. ఇట్టి సమయమున నొక కుక్షణమందు బాలకుఁడైన రఘునాథజీ యతని యున్నతిపథమందు నిలచెను. చంద్రారా వచిరకాలములోనే తనపథమును పరిష్కార పఱచుకొనెను.

పదునెనిమిదవ ప్రకరణము.

లక్ష్మీబాయి

పండ్రెండేండ్ల ప్రాయమున సోదరి సహితముగ రఘునాథుఁడు దస్యువేషధారియైన చంద్రారావు కరములఁబడి రాజస్థానమునుండి మహారాష్ట్ర సీమకుఁ గొనిరాఁబడియెను. ఒకనాఁటి యర్ధరాత్రమున నతఁడు పలాయన మొనరించి సాంద్రగహనగిరికందర ప్రాంతరములందును, యప్పుడప్పు డొండొంటు గ్రామముల నేరేని గృహస్థుల గృహములందును కతిపయ దినములు దాఁగి యుండెను. సుందరాకారాల్పవయస్కబాలునిఁగాంచి యెవరును ముష్టిభిక్ష నొసంగుటకుఁ బరాఙ్ముఖులుగా లేరు.

ఈరీతిగ నైదారు వత్సరములవఱకు రఘునాథుఁడు నానాస్థానములందు నానాకష్టముల ననుభవించెను. సంసారానంతసాగరమును నాయనాథబాలకుఁడే కాకిరై యీఁద సాగెను. బహుసీమలందుఁ బర్యటన మొనరించి, యనేక చోటుల భిక్షమెత్తి యెపుడపుడు దాస్యవృత్తి నవలంబించి యతఁడు జీవనయాపన మొనరించెను. పూర్వగౌరవ వృత్తాంతమును, జనకుని వీరత్వ సన్మాన విషయములును బాలకుని మనమందు సర్వదా జాగరితములగుచుండెను. కాని యభిమానవంతుఁడైన రఘునాథుఁడు తనపూర్వ వృత్తాంతమునుగాని మనస్థితదుఃఖమును గాని యెవ్వరికిని దెలుపక యెపుడపు డేదేని యరణ్యమధ్యమునఁ గాని శైలశృంగోపరిభాగమునఁ గాని యొంటరిగ నుపవిష్టుఁడై యనిస్తబ్ధతలముల ననాథుఁడై పడియుండి హృదయభారము విడునట్లు రోదన మొనరించి, పిదప ననారిగఁ బ్రవహించు బాష్పవారిని మోచన మొనరించి స్వకార్య నిర్వాహణార్థమై పోవును.

వయోవృద్ధి సహితముగ వంశోచిత భావము రఘునాథుని యెదయందు దనంతఁ దానే జాగరితముగా సాగెను. ఆయల్పవయస్క భృత్యుఁడు గోపనముగ నపుడపుడు ప్రభుశిరస్త్రాణమును ధరించుచు, ప్రభుని కరవాలమును యొరయందే దూయుచుండెను. సంధ్యాసమయమందతఁ డేదేని ప్రాంతరమం దుపవసించి, దేశీయ నాటకుల గానముల నుచ్చైస్స్వరమున బాడుచుండును. ధరాదరీ ద్వారములనుండి వచ్చు సంగ్రామ సింహుల ప్రతాపము నుగ్గడించు గీతముల మధురధ్వనములను విని నైశపథికులు చమత్కృతులగుచుండిరి. పదునెనిమిదేండ్ల ప్రాయంపువాఁడైన పిదప రఘునాథుఁడు శివాజీ వీర్యకీర్తి యుద్దేశ్యములఁ గూర్చి చింతించుచుండును, రాజస్థానము కరణి నీమహారాష్ట్రదేశము స్వాధీనమగుననియు, శివాజీ దక్షిణసీమయందు హిందూరాజ్య విస్తార మొనరించుననియు నాత్మగతమున నతఁడు భావిం

చుకొనినఁ గొలఁదియు నతని హృదయ ముత్సాహప్రపూర్ణమగుచుండును. తదనంతరమున నతఁడు శివాజీ కడకరిగి యొక సాధారణ సైనికుని కార్యమందుఁ దన్ను నియుక్తుఁ గావింప వేఁడుకొనెను.

శివాజీ యోధులను బరీక్షించుటయం దద్వితీయుఁడు. కతిపయ దినములలోనే యతఁడు రఘునాథుని బాగుగఁ బరీక్షించి, యతనినిఁ దన సేనయందొక సముచితపదవియం దుంచి, కొలఁది దినములు గడచిన పిదప నతనిని తోరణ దుర్గమునకుఁ బంపెను. పథమధ్యమందే మనకు రఘునాథునితోఁ బ్రథమ పరిచయ మొదవెను. అతని ప్రకృతనామము రఘునాథ సింహుఁడు; కాని మహారాష్ట్రదేశమందతఁడు సైనికవృత్తి యందుండ నందఱతనిని రఘునాథజీ యోధుఁడని బిలచెడివారు.

రఘునాథుఁడు శివాజీకడ సైనికవృత్తియందు నియుక్తుఁడయ్యెనని తెలిపియుంటిమి. రఘునాథజీ శివాజీ నికటమున కేతెంచిన సమయమున చంద్రారావు యధీనమందున్న యొక యుచ్చస్థాన ధనికుఁడు మృతినొందెను. రఘునాథుఁడా మృతయోధుని పదమందు నియుక్తుఁడయ్యెను. చంద్రారావు జనకుని పురాతనభృత్యుఁడనియు తన బాల్యమిత్రుఁడనియు, రఘునాథుఁడు గుర్తించెను; కాని యతఁడు దస్యుపతి యని కాని భగినీపతి యని కాని యెఱుంగఁడు. దానిం జేసి యతఁడానంద పురస్సరముగ చంద్రారావు దర్శన మాచరింప నతనికడ కరిగెను. చంద్రారావు రఘునాథుని కభ్యర్థన మొనరించెను, కాని యాయల్పభాషి లలాటము నేఁడు మరలఁ గుంచితమై పోయెను.

రఘునాథజీ యొక్క సాహసవిక్రమయశములు దినదిన ప్రవర్ధమానములగుచుండెను. చంద్రారావు యొక్క స్థిరప్రతిజ్ఞ యెపుడును విచలితమగుట లేదు. అతని గభీరమంత్రణ మెపుడును వ్యర్థమగుట లేదు. దైవయోగమున నేఁడు రఘునాథజీ ప్రాణరక్షణ మొందెను.

కాని విద్రోహియనియుఁ గపటాచారియనియు నతఁడు శివాజీ కార్యమునుండి దూరీభూతుఁడుఁ గాఁబడియెను.

చంద్రరావు కతిపయదినములు శివాజీకడ సెలవుఁగొని నిజావాసమునకుఁ బోయెను. పాఠకులారా! మనము కూడ నొక మాఱాతాలక్ష్మీయుతుని యాగారమునందు సభయులమై ప్రవేశింతము రండు

చంద్రరావు నిజాలయమునకు సమీపించెను. గృహబహిర్ద్వారమున "నహాబత్" మ్రోగసాగెను. అసంఖ్యాకులైన దాసదాసీజనులతని కెదురేగిరి. అనేక ప్రతివేశీ పురుషులతని దర్శన మాచరింపఁ జనిరి. అచిరసమయమందే చంద్రరావుయొక్క యాగమనవార్త సమగ్రదేశమందును దెలియనయ్యెను. రావుగారి యంతఃపురమంతయు నాహ్లాద స్రవంతులతోఁ బొంగుచుండెను. ఆయానందశబ్దములందే శాంత నయనయై, క్షీణాంగియైన లక్ష్మీభాయి నీరవయై మనోహరుని యభ్యర్థనమున కనువగు సంభారములన్నియుఁ గావింపఁ దొడంగెను.

లక్ష్మీభాయి యథార్థముగ లక్ష్మీస్వరూపయే. ఆమె శాంతధీరత్వములతో నొప్పు బుద్ధిమతి—పతివ్రత, శైశవమున నామె జనకుని కడనల్లారుముద్దుగఁ బెఱిఁగిన కన్య; కానికోమలవయసునందే విదేశమున, నపరిచితుల నడుమ, నల్పభాషియై కఠోరస్వభావియైన ప్రియునికరములఁ బతితయయ్యెను. పాదపమునుండి యుత్పాటితమైన కోమలపుష్పము చాడ్పున నామె దినదినమునకు శుష్కించిపోవుచుండెను. తొమ్మిదేండ్ల వయసునందున్న బాలికగనున్నపుడే యామె జీవనము శోకాచ్ఛన్నమై పోయెను. కాని యీనారమణి తన శోకము నెరికెఱిఁగించును? ఏరామె నోదార్చి యాదరించెదరు? పాపమా బాలిక తన పూర్ణవృత్తాంతము స్మరించుకొనుచుఁ బ్రాణతుల్యుఁడైన సహోదరునిఁ గూర్చి దలంచుచు, నే

రును లేనియెడఁ జేరి హృదయస్థితదుఃఖభరమునాపుకొనఁజాలక నశ్రువర్షముఁ గురిపించుచుండును.

కష్టశోకములందుఁ బడినచో మనలబుద్ధి తీక్ష్ణమగును; మనహృదయమనములు సహిష్ణములగును. ఒకటి రెండు వత్సరముల సమయములోనే లక్ష్మి సంసారకార్యముల నాచరింప మొదలిడి భర్తృసేవాతత్పరయయ్యెను. హిందూరమణులకుఁ బతిగాక నింక గతియేమున్నది? ప్రియుఁడు సహృదయుఁడై సదయుఁడైనచో నారి యానందవార్ధియందోలలాడుచు నతనికి బహుభంగుల సేవయొనర్చును; పతినిర్దయుఁడై విముఖుఁడైనను సతికిఁ బతిసేవగాక నింక నుపాయమేమున్నది. చంద్రరావు హృదయమందభిమానజ ఘాస-యుచ్చాభిలాషములు విరాజితములగుచున్నను, యసహాయయైన పత్నియెడ నిర్దయుఁడై యుండువాఁడు కాఁడు. నమ్రముఖియై, నమ్రహృదయయైన, లక్ష్మీభాయి పరిచర్యలచేఁ జంద్రరావు సంతృప్తుఁడగుచుండును; యుద్ధవిగ్రహము శేషించినపిదప నతఁడు పతిపరాయణయైన లక్ష్మీభాయికడకరిగి శాంతిలాభము నొందుచుండును; ప్రాణేశ్వరి స్నిగ్ధవచనములను విని, యతఁడామోహనాంగిని ప్రీతిపురస్సరముగఁ గౌఁగిలించుకొనును. పతిబాహువులందు బంధితయైయున్నపు డాయన్నులమిన్న జగతియందుదానే భాగ్యవతినని భావించుకొనుచుండును, ప్రియుని సామాన్యప్రయాదరమువలననే యాసుందరాంగి దేహలతయంతయుఁ బులకితమగును. తనమనోహరుని మిష్టాలాపములను వినినపు డాప్రఫుల్లముఖియెద యానందముచేఁ బ్లావితమగుచుండును. ఏకుసుమశాఖయుద్యానమునుండి గొనిరాఁబడి గృహమధ్యమం దంధకారమున నుంచఁబడెనో యాశాఖ తద్గృహాభ్యంతరమందున్న నొక యాలోకముచే నెట్లు భాసమానమగుచుండెనో!

ఈవిధముగ లక్ష్మీభాయి సంసారకార్యములందును పతిసేవయందును నియుక్తయైయుంట వత్సరము పిదప వత్సరమతివాహితము గాసాగెను. క్రమక్రమముగ నాశాంతస్వరూపిణి సంపూర్ణయౌవనవతియయ్యెను; కాని యాజవ్వనము నిరుద్వేగమైనదా ? లక్ష్మీభాయి తనపూర్వవృత్తాంతమును జాలవఱకు మఱచెను. ఒకవేళ సాయంకాలములందు రాజస్థానవృత్తాంతముగాని, బాల్యకాలసుఖచర్యలుగాని, శైశవక్రీడలుగాని, ప్రాణతుల్యుఁడైన రఘునాధుని విషయముగాని మనముం దుదయించినచో నామెనిశ్శబ్దముగ నొకటి రెండశ్రుబిందువుల తనసుందరరక్తశూన్యగండస్థలముపై రాలఁజేసి పిదపవానిని మోచనమొనరించి యెప్పటియట్ల గృహకార్యములందుఁ బ్రవృత్తయగుచుండెను.

నేఁడు చంద్రరావాహారమొనరింప నుపవిష్టుఁడైయుండెను. లక్ష్మీభాయి పార్శ్వమున నిలువంబడి వ్యంజనముల నొడ్డించుచుండెను. ఆలతాంగిప్రాయ మిపుడు పదునేడువత్సరములుండును. ఆసుందరి యవయవములు కోమలములై యుజ్జ్వలములై లావణ్యమయములైయుండెను—కాని యవియొకించుక క్షీణించియుండెను. ఆయందకత్తె భ్రూయుగళము సుందరమై సుచిక్కణమై యావిశాలశాంతపరిష్కారలలాటమునఁ దూలికముచే నంకితమైనట్లుండెను. ఆజవ్వనవతి ప్రశాంత కోమలకృష్ణనయనములయందు చింత తన యావాసస్థానముఁ గావించుకొనెను. ఆరమణీమణి గండస్థలము సుచిక్కణమై కోమలమైయున్నను యొకించుక పాండువర్ణముగలిఁగియుండెను; ఆమెశరీరమంతయు శాంతమూర్తిభాతినుండి క్షీణించియుండెను, జవ్వనముయొక్క యపరూపసౌందర్యము వికసితమైయుండెను. కాని యౌవనప్రఫుల్లతా యున్మత్తతలేవి? ఆహా ! రాజస్థానమందలి యీయపూర్వ సౌందర్యకుసుమము మహారాష్ట్రసీమయందు దనసుగంధమును వితరణమొనరించుచుండెను; కాని జీవనాభావమున నీషత్ శుష్కించియుండెను. ఆనారీరత్నముయొ

క్క చారునయనములందు, సుదీర్ఘకేశభారమందు కోమలబాహుద్వయమున, మృదుతనుల్లతయందు ముక్తాలావణ్యము నిండియుండెను; కాని యాహీరామణి యుజ్జ్వలకిరణరహితయైయుండెను.

ఒకనాఁడు చంద్రరావు ప్రేయసినుద్దేశించి, "నీసోదరుఁడు నాయధీనమున సైనికుఁడైయుండెను. అతఁడు సుప్రసిద్ధయోధుఁడై యశస్తిలకుఁడయ్యె" నని పలికెను. ఆవచనములు సాంగములుకాగనే యతని లలాటము మేఘాచ్ఛన్నమైపోయెను. అదిగాంచినతోడనే లక్ష్మీభాయిమనసున సందేహముదయించెను.

మఱియొకదినమున లక్ష్మీభాయిభర్తమిష్టాలాపప్రోత్సాహితయై ప్రియునిచరణయుగళినికటమున నుపవసించి, "ఈదాసీనివేదనమొకటి యున్నది; కాని దానిని దెలుపుటకు భయమొందుచుండె"నని మెల్లగ పలికి నతమస్తకయయ్యెను.

చంద్రరావు శయనించి తాంబూలచర్వణమొనరించుచు పదతలముననుపవిష్టయైయున్న మోహనాంగిని దన నికటమునఁ జేర్చి, యాజవ్వనవతి దేహలతను దన బాహుద్వంద్వముచే బంధించి తనముద్దుగుమ్మముద్దుమోమునగొలఁదిమాత్రపుముద్దులనుముద్రించి ప్రీతిపూరస్సరముగ నాయిందములపోల్పును చుంబనమొనరించి, "ప్రేయసీ! నీకువలయునదేమియో దెలుపుము. నీకేనొసఁగనిదేమున్నది" అని ప్రేమపూర్వకముగఁబలికెను.

"నాభ్రాతబాలకుఁడు అజ్ఞానుఁ"డని మాత్రము లక్ష్మీభాయి యనెను.

తన బాహువులనుండి చంద్రరావపుడు సతినివదలివైచెను. ఆతని ముఖము గంభీరమయ్యెను.

లక్ష్మీభాయి—అతనుమీభృత్యుఁడు. తమ యధీనముందేయుండెనుగదా !

చంద్రరావు—కాదు. అతఁడు నాకంటెగూడ సాహసుఁడను ప్రతీతివడసెను.

బుద్ధిమతియైన లక్ష్మీభాయి పతి వచనభావమును గ్రహించెను. ఆమె దేనినిగుఱించి భయపడుచుండెనో యది యేఘటించెను. చంద్రరావు రఘునాథునిపై మిగులఁగ్రోధముఁగలిఁగియుండెను. లక్ష్మీభాయి భయకంపితశరీరయై యిట్లనియెను. "బాలకుఁడేయైన నపరాధ మొనరించిన తామతనిని మన్నింపకున్న నిఁక నేరుమన్నింతురు?"

చంద్రరావు ముఖమండలమున మరల నామేఘచ్ఛాయగన్పట్టెను. లక్ష్మీభాయి ప్రియుని స్వభావము నెఱిఁగియే యుండుటచే నా ప్రసంగమును మరల నుల్లేఖింపలేదు.

అంతియఁగాక చంద్రరావు నేఁడు ప్రథమమునగృహమునకే తెంచెను, రఘునాథునకేమిఘటిల్లెనో లక్ష్మీభాయి యెఱుఁగదు. కాని యామెహృదయము చింతాకులమైపోయెను, ఆమె సాహసించి ప్రియు నేమియుఁబ్రశ్నింప నేరకుండెను. రజనీసమయమున ప్రియుఁడు నిద్రితుఁడు కాగనే, భృత్యులనడిగి సోదరుని కుశలవార్త నెఱుఁగ నామె మనస్స్థిర మొనరించుకొనియెను.

మరునాఁడురాత్రి భోజనము కాగనే చంద్రరావు శయనాగారములోనికిఁబోయెను. తాంబూలమును కరమున నిడుకొని యచటకుఁబోయెను.—ప్రియునిలలాటము చింతాయుక్తమైయుండెను. తాంబూలము పతికొసఁగి లక్ష్మీభాయి మెల్లగ వెలుపలకరిగెను. చంద్రరావు సతర్కభావమున ద్వారమును మూసివైచెను.

చంద్రరావపుడొకగుప్త స్థానమునుండి యొకపెట్టెను వెలుపలకుఁదీసి, దానినిఁ దెఱచి యందుండి యొకపుస్తకమును వెలుపలకుఁదీసెను. విత్తవిషయములును ఋణవివరములు నందు లిఖింపఁబడును. రమారమి పదివత్సరములకుఁబూర్వము గజపతిసింహునిసభయందు

దానవమానితుఁడైన దినమందే యతఁడా పుస్తకమందొకఋణమును గూర్చిలిఖించెను. అతఁడా పత్రమును తెఱచిచూచెను, సుందరస్పష్టహస్తాక్షరము లాతీఱుననే దేదీప్యమానములైయుండెను;

"ఉత్తమర్ణుఁడు—గజపతి
ఋణము—అవమానము.
ఋణవిముక్తి— (1) అతని రుధిరము.
(2) అతని వంశావమానము."

అతఁడాయక్షరములను బలుమరుచదివెను. ఆవికటముఖమండలమున నొకించుక మందహాసము గన్పట్టెను. అతఁడపుడాస్థానమున నిట్లు లిఖించెను. "ఋణవిముక్తి నేఁడాయెను." తిథిమాసములను వివరముగ లిఖించి యతఁడు పుస్తకమును మూసివైచి దానిని వెనుకటి ప్రదేశమున నుంచివైచెను.

పిదపనతఁడు కవాటమును దెఱచి ప్రేయసిని బిలచెను. సమ్ముఖియైన యారమణి భక్తిపూర్వకముగ ప్రియుని నికటమున కరిగెను. తనయర్ధాంగలక్ష్మియైన లక్ష్మీభాయి కోమలకరములఁబట్టికొని మందహాసమొనరించి చంద్రరావిట్లనియెను. "బహుకాలమునుండియున్న ఋణమునుండి నేఁడు నేను విముక్తుఁడనైతిని."

భర్త వచనములను విని లక్ష్మీభాయి భయకంపితవిహ్వలయయ్యెను !

సరస్వతీ గ్రంథమాల

కాకరపర్రు, తణుకు తాలూకా పశ్చిమ గోదావరి.

1924 సం॥లో స్థాపితము.

ఈగ్రంథమాలయందు మూడుమాసముల కొక గ్రంథముచొప్పున నవలలు నాటకములు ప్రకటింపఁబడుచుండును, కాఁబట్టి భాషాభిమానులందఱును నాయుద్యమమునకు దోడ్పడుచు రాజపోషకులుగాను, పోషకులుగాను, చందాదారులుగాను బ్రవేశింపఁ బ్రార్థితులు. దీనికి సం॥ చందా రు 2—8—0 ప్రవేశరుసుము రు 0—4—0

1924 సం॥న (1) కనకాంగి 0—12—0

(2) మదనసుందరీపరిణయము—ఆరంకముల నాటకరాజము వెల. 1—0—0

(3) పీష్వా నారాయణరావువధ—మహారాష్ట్ర చరిత్రనుండి వ్రాయఁబడిన నొకవిషాదాంతమగు నవల 0—౬—0

(4) సరోజినీ భాస్కరము—షేక్స్పియర్ రోమియో & జూలియట్ ననుసరించి వ్రాయఁబడిన నాటకరాజము. 0—12—0

1925. (1) ప్రహ్లాద. (వేదాంత మార్గమును బోధించును.) —0—0

(2) ఆనందమయి—1భాగము. (విచిత్రమైననపరాధపరిశోధకనవల, మిగులఆశ్చర్యమును బుట్టించును 0—12—0

(3) ఆనందమయి—రెండవభాగము 0—12—0

(4) విజయశ్యామ 0—12—0

1926 (1) ప్రేమమహిమ I
(2) ప్రేమమహిమ II } 1—0—0

(3) బిలమందిరము 0—12—0

ఇట్లు,
కాకరపర్తి సత్యనారాయణ.
Editor & publisher,
Saraswati grandhamala
Kakaraparru Tanuku Tq.

మహారాష్ట్ర జీవనప్రభాతము.

ద్వితీయభాగము.

పందొమ్మిదవ ప్రకరణము.

దుర్గ మందిరము.

పరాక్రమశాలియైన చంద్రరావు గృహామునుండి కతిపయ క్రోసులదూరమున నొక దుర్గమందిరముగలదు. సామాన్యోచ్చపర్వత శృంగోపరిభాగమున నామందిరము ప్రాచీనకాలముననే ప్రతిష్ఠింపఁబడెను. మందిరసమ్ముఖమున ప్రస్తరరాశి సోపానరూపమున నిర్మింపఁబడెను. మందిరాధోభాగముననొండు పర్వతతరంగిణి కలకలరావమొనరించుచు నాసోపానపదములను ప్రక్షాళనమొనరించుచుఁ బ్రవహించుచుండెను. పురాతనమునుండియు నసంఖ్యాకులైన యాత్రికులును యుపాసకులు నాపుణ్యస్రవంతియందు స్నాతులై పిదప సోపానముల నధిష్ఠించి యుమాదేవినిఁబూజించుచుందురు. నేఁటివఱకు మందిరగౌరవముఁగాని యాత్రికులసంఖ్యగాని తగ్గియుండలేదు. మందిరపశ్చాత్ స్థిత పర్వతపృష్ఠభాగము బహు పురాతనభూరుహశ్రేణులచే నావృతమైయుండెను. గిరిశిఖరమునుండి క్రిందనున్నసమతలభూమి పర్యంతమూ తరుపంక్తులుదక్క నింకేమియుఁగన్పట్టదు. దివాభాగములందుఁగూడ నావృక్షసాలములందొకించుక యంధకారముగన్పట్టును. ఆనుస్నిగ్ధఛాయయందు దుర్గనారాధించు నర్చకుఁడును మఱికొందఱు భూసురేంద్రులును పర్ణశాలలనునిర్మించుకొని యందు సుఖంబుగ వాసముఁజేయుచుందురు

ఆపుణ్యానుస్నిగ్ధస్థానమును గాంచినంతనేయట శాంతిరసముదక్క యన్య భావోద్రేకముఁ గలుగదు. భారతవర్షపవిత్రపురాతనచారిత్రములను. వేదమంత్రములనుదక్క నన్యశబ్దము నాపురాతనపాదపబృందములువిని యుండలేదు. బహుభండనములచే మహారాష్ట్రసీమయంతయుఁ దలక్రిందులగుచున్నను, అక్షుద్రప్రశాంతపర్వతమందిరాభ్యంతరభాసమాన దుర్గశ్రీవిగ్రహము హిందూకులటలచేగాని మ్లేచ్ఛులచేగానికలుషితము గావింపఁబడలేదు.

నేఁటిరాత్రి ప్రథమయామానంతరమున నొకపథికుఁడేకాకియై ఆశాంతకాననమధ్యమున విచరణ మొనరింపుచుండెను. ఆపథికుని హృదయ ముద్వేగపరిపూర్ణమైయుండెను. అతనిప్రశాంతలలాటము కుంచితమైయుండెను—ముఖమండలము రక్తవర్ణమైయుండెను—నయనయుగళమునుండి యున్మత్తస్వాభావికజ్యోతి నిర్గతమగుచుండెను. రోషజిఘాంసవిషాదములచే నేఁడు రఘునాథుని హృదయ మొకేమాఱుగదగ్ధమగుచుండెను.

అతఁడట్లే చాలసేపటివఱకుఁ బచారీచేయసాగెను; అతనిశరీరము పూర్తిగ నవసన్నమైపోయెను. కాని యతని హృదయోద్వేగ మొకించుకైన వివరణముగాలేదు. రఘునాథజీ యున్మత్తప్రాయుఁడైయుండెను. ఈభీషణచింత శీఘ్రములో నుపశమముగానిచో నాయువకునివివేచనాశక్తి నిక్కముగ విచలితమైపోవును—లుప్తమైచనును. ఈవిషమప్రపంచమునందు దుఃఖము శిలీముఖసన్నిభమై హృదయమును విదీర్ణమొనరించును. అనలసంకాశమై శరీరమును శోషింపఁజేయును. అంగములను దహించివైచుచు భీషణమైయుండునుగదా? మానసికరోగమునకుఁ జికిత్సగాని యౌషధముగాని లేదు. కానిప్రకృతి యాచింతాశక్తినణచివైచును—దానినుపశమన మొనరించును! ఆహా! ప్రకృతియెట్టి భిషగ్వరము; ఉన్మత్తతయే యెందరిహతభాగ్యుల యారోగ్యము! సహస్ర

సంఖ్యాకులైన హతభాగ్యులీయారోగ్యముకొఱకు దివానిశలందు బ్రార్థనముల నలుపుదురు. కాని వారలు విఫలమనోరథులగుచుందురుగదా ?

ఆభూరుహశ్రేణులకనతిదూరమునఁ గొందఱుపాఱులు పురాణపఠన మొనరించుచుండిరి. ఆహా! ఆసంగీతపూర్ణపురాణపఠన మావేదాధ్యయన మాశాంతినిశీథమందా ప్రశాంతకాననమం దమృతవర్ష మొనరించుచు నెట్టి యానందప్రవంతులఁ బాఱఁజేయుచుండెను? చదువరులారా! ఆవేదాధ్యయననిస్వనంబులు నక్షత్రవిభూషితనైశనభమండలమూదనుకఁబోవుచుండెను. ఆసామగానము లాశాంతనైశగహనమందుఁ బ్రతిధ్వనితములగుచు, నచేతనపాదపపంక్తులను సచేతన మొనర్చుచుండెను; శాఖాపత్రములాగీతకుతూహలమును బాన మొనరించుచుండెను. నైశవాయువాగీతామృతమును నలుకెలంకులందును వెదఁజల్లుచుండెను. మానవహృదయములు శాంతిరసముచే విగళితములగుచుండెను.

బహుసహస్రవర్షములనుండి యీపుణ్యగీతములు భారతవర్షమున ముఖరితములగుచుండెను! సుందరవంగదేశమందున, తుషారపూర్ణపర్వతవేష్టితకాశ్మీరరాష్ట్రమందును, వీరప్రసూరాజస్థానమహారాష్ట్రభూములందును, సాగరప్రక్షాళితకర్నాటద్రావిడసీమలందును, భారతీయులెపుడీశిక్షణమును మరువకుండుటకై యనేకవేలవత్సరములనుండి యీగీతములు ప్రతిధ్వనితములగుచుండెను. గౌరవదినములందీ గానములుయీయనంతగీతములు మనపూర్వుల నుత్సాహితులఁ జేసి, హస్తినా, అయోధ్య, మిథిల, కాశీ, మగధ, ఆంధ్ర, యుజ్జయినీ ప్రకృతిదేశములందు వీరత్వయశములనుఁ బ్లావితమొనరించెను. దుర్దినములందీ గీతాలాపములనొనరించి సమరసింహుఁడనుప్రతీతివడసినప్రతాపసింహుఁడు ధర్మరక్షార్థమై హృదయరుధిరము నొసఁగివైచెను. ఈమహామంత్రములచే ముగ్ధుఁడయ్యే శివాజీ పూర్వకాలయశమును మరలఁ బ్రతిష్ఠిం

పజతినములను నలిపెను. నేఁటిక్షీణదుర్బలహిందువుల యాశ్వాసస్థల మీపూర్వగీతమే! విషాదవిషాదదుర్బలులంను మనమీపూర్వవృత్తాంతములను మఱువకుండ నుందుముగాక! ఎంతకాలము జాతీయజీవనము నిలచియుండునో యంతకాలము మనహృదయయంత్రము లీగీతములఁ దోడ్తోడనే ధ్వనితములై యుండుగాక !

నవ్యపాఠకులారా! ఇలియడ్, యినియడ్. డాంటే. షేక్స్పియరు, గేటే, యూగోల గ్రంథములను చదివితిరా! సాదీ, ఫరదూసీ లను గ్రంథకర్తల పొత్తములను పఠించితిరా? మీయెదలన్వేషించిచూడుఁడు. ఏగ్రంథరచన సరసభావపూర్ణమై యున్నట్లు మీమనములకుఁదట్టెను? ఏగ్రంథరచనాచాతుర్యముచే మీహృదయము లధికతరముగ భావపరిపూర్ణములై, యుత్సాహపూరితములై ముగ్ధములయ్యెను? భీష్మాచార్యుని యపూర్వవీరత్వచారిత్రము, దుఃఖినియైన సీత యపూర్వపతివ్రతచారిత్రమును, హిందూమాతల హృదయాంతరాళములందు తరతరములందును గ్రథితమైయుండెను. ఈవిషయమును హిందూజాతివారేరును యెప్పుడును మఱువకుండ నుందురుగాక !

పాఠకులారా! ఒంటరినై గూరుచుని యొక్కొక్కమాఱు దేశీయగౌరవ గీతములను బాడుచుందును. ఆధునికప్రాచీనసమయముల వీరత్వచరిత్రలను స్మరించుచుందును. కేవలమీయుద్దేశముకొఱకే లేఖనమును బూనియుంటిని సనాతనధర్మచారిత్రలను భారతశూరుల పవిత్రేతిహాసములను మీచే స్మరింపఁజేయఁగలిగినచో నాయీయత్నము సఫలమైనదనితలంచెదను. అట్లుగాక మీరలు మీమాతృదేశచరిత్రలను మఱువనిచ్ఛగించుచో నాయీపుస్తకమును మూసివైసి దూరముగ నొకచో నుంచివైచుఁడు. లేఖకుఁడందువలన చింతితుఁడుగా నేరఁడు.

శాంతకాననమందలి పవిత్రపురాణకాలక్షేపములును, సామగానములును, రఘునాథుని యుత్తప్తలలాటమున వారివర్షముఁగావింపఁ

దొడంగెను—అతని యుద్విగ్నహృదయము శాంతిసేచన మొనరింపసాగెను. ఆహతభాగ్యుని యున్మత్తతక్రమక్రమముగ క్షీణించెను. ఆమహద్వాక్యములసికటమున దన కష్టశోకము లకించిత్కరములని యతఁడుఁ దలఁచెను. తనమహదుద్దేశ్యవీరత్వములు గణింపరానివని యతఁడూహించెను. పిదపఁ జింతాహారిణియైన నిద్రాదేవి రఘునాథుని దనయంకతలమునఁజేర్చెను. రఘునాథుని శ్రాంతియవసన్నశరీర మొక వృక్షమూలమున శాయితమయ్యెను.

నిద్రితుఁడైన రఘునాథజీ స్వప్నముఁగాంచెను. ఆస్వప్నమేమై యుండును? రఘునాథునిగౌరవజీవన మాస్వప్నమునగన్పట్టుచుండెనా? దినదినప్రవర్ధమానపదోన్నతియు, యశోవిస్తారము నాస్వప్నమునఁబొడఁగట్టునా? ప్రాయశః రఘునాథుని యట్టిజీవనస్వప్నమంతరించిపోయెను. ఆచింతముగిసిపోయెను. మరీచికవిలుప్తమై పోయెను.

రఘునాథుఁడు యుద్ధక్షేత్రములను స్వప్నమందు గాంచుచుండెనా? రిపుశూరులను సంహరించుచుండెనా? దుర్గ జయమొనరించుచుండెనా? యోధ కార్యనియుక్తుఁడయ్యెనాయేమి? రఘునాథునియట్టి యుద్యమ మంతరించిపోయెను. ఆస్వప్నముకూడ విలుప్తమైపోయెను.

అతని యౌవనోద్యమములొకదానిపిదప నొకటిచొప్పున నన్నియు విలుప్తములైపోయెను. ఆశాప్రదీపము నిర్వాణమైపోయెను. ఈయంధకారనిశియందు శ్రాంతబంధుహీనయువకుని బహుదినవృత్తాంతమంతయుఁ బూర్వజీవనస్మృతిపగిది జాగరితమయ్యెను. శోకభారమతనిహృదయము నాక్రాంతము, గావించివైచెను. ఆశాసుఖములు మనయొద్దనుండి సెలవుఁగొని చనినపుడు—మనముబంధుహీనులమై యుండతటస్థించినపుడు మనములందెట్టి భావము లుదయించునో, మనపూర్వసుఖదినములెట్లుస్మరణపథమునఁగన్పట్టునో, యట్టిభావములే, యట్లేరఘునాథుని స్వప్నావస్థయందతని చిత్తమననుదయించెను. ప్రేమమయియైన

మాతయొక్క ప్రణయాసిక్తముఖమండల మతని మనమందుజాగరితమయ్యెను. జనకుని దీర్ఘావయవప్రశాంతలలాటము లతనిచిత్తమునఁ గన్పట్టెను. బాల్యకాలమున సూర్యమహాలునందు, సంతసహాసనములతో నలుకెలంకులను ప్రతిధ్వనింపఁజేయుచు, దానుసలిపిన క్రీడలన్నియునతని స్వప్నమునఁ గన్పట్టెను. శైశవకాల సహచరియై శాంతస్వభావియై, ధీరచిత్తయై, ప్రాణతుల్యయైన లక్ష్మీభాయిని రఘునాథుఁడా స్వప్నమునవిలోకించెను. అహా! ఇఁకనతఁడా యనురాగంపు సోదరిని దీనజీవనమందుఁ గాంచఁగలఁడా? నేఁడా సౌఖ్యమయ సంసారమెక్కడ? నేఁడా యానందపూర్ణ జగమెచట? ప్రఫుల్లముఖయైన ఆసోదరి యెచట? అనిద్రితుని ముద్రితనయనములనుండి యొకటిరెండశ్రుబిందువులు భూమితలమున రాలెను.

ప్రణయస్వరూపిణియైన సహోదరిఁదలఁచుచు రఘునాథజీ నయనములనున్మీలిత మొనరించెను. అతఁడేమిచూచెను? లక్ష్మీభాయి సోదరుని శిరమున నిజాంకతలమునని డికొని యాపాదపచ్ఛాయయందుపవిష్టయై, తనకోమలశీతలకరములనతని యుష్ణలలాటమందుంచి వాని హృదయోద్వేగమునుదూరీకృత మొనరించుచుండెనా? యనిరఘునాథుఁడుభ్రమించెను. లక్ష్మీభాయి తనప్రణయ పూర్ణదృక్కులను సహోదరునిపైఁబఱపుచుండెనా? యని యతఁడు దలంచెను. ఆహా! దుర్భరదుఃఖభరముచే నారమణీమణి ప్రఫుల్లముఖమండల మొకించుక శుష్కించియుండెనా యేమి? ఆయరవిందనేత్రినయన యుగళమట్లేస్థిరమై, ప్రశాంతమై, స్నిగ్ధమైయుండెనని రఘునాథుఁడు భావించెను, కాని ఆనేత్రములు చింతకువాసస్థానములైయున్నట్లుగూడఁ దోఁచుచుండెను.

రఘునాథజీనయనములను ముద్రిత మొనరించెను. మఱియొక బాష్పబిందువు భూతలమునఁబడియెను—"భగవానుఁడా! అనేక యిక్క

ట్టులననుభవించితిని, ఏలవృథాయాశచే నాహృదయమును వ్యథితమొనరించుచుంటివి? నన్నున్మత్తునిఁ గావింపకుము."

ఒకకోమలకరము రఘునాథుని యశ్రుబిందువును దుడిచినట్లతఁడు భావించి మరలఁదన నయనములనున్మీలించెను. ఇదిస్వప్నముకాదు. అతనిబహిఃప్రాణమైన సోదరియే యతనియుత్తమాంగమును యూరువునందుఁజేర్చి యాతరుమూలమునఁ గూరుచునియుండెను.

రఘునాథుని హృదయము తత్తరపడియెను. అతఁడు సహోదరికరపల్లవముల రెంటిని తనతప్తహృదయముపైనుంచి ఆప్రణయపూర్ణముఖమండలమునట్టులే జూడసాగెను. అతనికివాక్యస్ఫూర్తి కాలేదు. అతనినయనములనుండి బాష్పవర్షమవారిగ గురియుచుండెను. అవశేషమునవిఁక సహ్యమొనరింపఁజాలక, నాతరుణయోధుఁడుచ్చైస్స్వరమున రోదనమొనరించుచు గద్గదస్వరమునవిట్లనెను. "సోదరీ! లక్ష్మీ! లక్ష్మీ! సోదరీ! నిన్ను మరల నీజీవనమందే మరలఁజూడగలిగితినా? అన్యసుఖముదూరీకృతమౌఁగాక! అన్యయాశదూరమైపోఁగాక! నీహతభాగ్యభ్రాతకు నీనికటమున స్థానమొసఁగుము. అతఁడీజీవనమున నిఁకనేమియుఁ గోరఁడు."

లక్ష్మీభాయికూడ తనశోకమును సంవరణమొనరించుకొనఁజాలకపోయెను. ఆరమణిసోదరునిహృదయమున దనముఖమునుమూసివైచి పెద్దపెట్టున నేడువసాగెను. ఆహా! ఈక్రందనమందెట్టి సుఖమున్నది! జగమందలి రత్నరాసులలవడుసుఖముగాని, స్వర్గసుఖముగాని యిట్టియభాగ్యులయీయానందపుసుఖముకడ తుచ్ఛములుగఁదలఁపనగును!

బహుకాలానంతరమునఁ బరస్పరులను జూచికొనుటచేఁ జాలసేపటివఱకు వారలు వాక్యశూన్యులైయుండిరి. చిరకాలము నాఁటి విషయములెన్నియో, వేవేగముగ వారలహృదయములందుజాగరితములుగాఁ దొడంగెను. సుఖలహరీసహితముగ శోకలహరి మిశ్రితమైవారల యెద

లందుఁ బ్రవహింపసాగెను. సమయమతిక్రమించు కొలఁదియు నశ్రుధారలం దా సోదరీ సోదరుల హృదయములు దేలుచుఁబోవుచున్నవి. సోదరీకరణి ప్రేమమయి యీజగతియందిఁ కేమిగలదు? భ్రాతృప్రియము వగిది పవిత్రప్రేమ యేమున్నది! మేమాప్రణయమును వర్ణింపనశక్తులము. పాఠకులారా! మన్నింపుఁడు.

చాలసేపైనపిమ్మట వారిరువురి హృదయములును శీతలములయ్యెను. లక్ష్మీభాయి తనయంచలిచే సహోదరుని యశ్రుసలిలమును మోచనమొనరించి యిట్లనెను. దుర్గకటాక్షమున నత్యంతానుసంధానాంతరమున నేఁడు నిన్నుఁ గాంచఁగలిఁగితిని. ఆహా! నాసుఖమెట్టిది! దుఃఖనికషమున నిట్టిపరమసుఖమలవడునని లిఖింపఁబడియుండెనా? అన్నా! నీవీశీతలవాయువునందుండినచో రుగ్ణుఁడవయ్యెదవు. మందిరములోనికిఁ బోదమురమ్ము. నేనిఁకఁ జాలసేపిచటనుండరాదు."

భ్రాతాభగినులిరువురు మందిరాభ్యంతరమునకుఁ బోయిరి. లక్ష్మీభాయియొక స్తంభపార్శ్వమున నుపవిష్టయయ్యెను. శ్రాంతుఁడైన రఘునాథజీపూర్వము వగిదినే సోదరియంకతలమున నౌదలవంచి శయనించెను. అపుడాయుభయులు నాగభీరాంధకారనిశియందు దమతమ పూర్వవృత్తాంతముల నొకరితో నొకరు దెలుపుకొనఁదొడంగిరి.

సహోదరుని ముఖమండలమును కాయమును దనకోమలకరములతో దువ్వుచు లక్ష్మీభాయి ప్రేమపూర్వకముగ నతని నెన్నియో విధములఁ బ్రశ్నింపసాగెను. రఘునాథుఁడు మెల్లమెల్లగఁ దనవృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లు సోదరీమణికెఱిఁగించుచుండెను. దస్యుహస్తములనుండిఁ బలాయితుఁడైన దాదిగ నాయనాథకుండేయే సీమలఁగ్రుమ్మరెనో, యెచట నెట్టియవస్థయందుండెనొ చెల్లెలికెఱిఁగింపసాగెను.

"సోదరీ! నేననేకతావులందు భ్రమణమొనరించి, బహువిధకార్యములఁ గావించితిని. ప్రస్తుతమున సంక్షిప్తముగ దెలిపెదను. బహుదినములేను మహారాష్ట్రీయహాళికులకడ సేవ్యమొనరించితిని. గోవత్సలను మేషములను గాచితిని. మేషములవెనువెంట నరుగుచుఁ బర్వతములందును, కొండలోయలలోను, విస్తీర్ణ మైదానములందును, సాంద్రగహనములందును భ్రమణమొనరించుచు, నిర్మానుష్యప్రదేశములందు గూరుచుని నాటకులగీతములను నాట్యకారులపాటలను బాడుచుండెడివాఁడను. ఒక్కొకప్పుడు సంధ్యాసమయములందు నదీకూలములందేకాకినై కూరుచుని యుచ్చైస్స్వరమునమధురగానమొనరించి, హృదయమునకు శాంతముఁ గొలిపెడివాఁడను. ఒక్కొకప్పుడు ప్రత్యూషములందు గాననాభ్యంతరములఁజొచ్చి పూర్వపుబ్రతుకును, స్మరించి యుచ్చైస్స్వనమునరోదనమొనరించెడివాఁడను. పర్వతసంకులకంకణప్రదేశమునఁ గతిపయవత్సరములుండి, పిదప నొకమహారాష్ట్రీయ సేనానియధీనమున గార్యమొనరించుచు నతని వెనువెంట నప్పుడప్పుడు రణరంగములకుఁబోయెడివాఁడను. వయోవృద్ధి యగుకొలఁదియు సమరోద్యోగమందునాకుఁగల యుత్సాహము హెచ్చుకాఁదొడఁగెను. తదనంతరమున నేను మహానుభావుఁడైన శివాజీనికటమునకరిగి యతని యనుగ్రహకతమున సైనికపదవియందు నియుక్తుఁడనైతిని. నేటికి మూఁడువత్సరములకుఁ బూర్వముదనుక సేనాకార్యమును గావించుచుంటిని. సేవాకార్యమందేదోషముగాని యొనరించలేదు. ఎట్టి నిర్లక్ష్యమును జూపలేదు. సర్వాంతర్యామియైన జగదీశ్వరుఁడే నాకుసాక్షి. కాని యేలకో ప్రభువైన శివాజీ నావిషయమున శంకాసంకలితస్వాంతుఁడగుటచే నేనవమానితుఁడనై, నిరాశ్రయుఁడనై దేశదేశములందును పర్యటనమొనరించుచుంటిని. ఇఁక నాకీపృథివియందెట్టి

యాశయు లేదు—యెట్టి యుద్దేశ్యమును లేదు. జనకునివడువున నేదేని యాహవరంగమునఁ బ్రాణత్యాగ మొనరించి, యీయసారజగమును బరిత్యజించివై చెదను." ఇట్లు పావమాహత భాగ్యుఁడు తన దుఃఖవాహినిసంతయు దన యనురాగంపు జెల్లెలికెఱింగించుచు నశ్రుధారల నవారిగ విడచుచుండెను.

సోదరుని విషాదచరిత్రమును వినుచున్న గోలఁదియోఁ బ్రేమమయి లక్ష్మీభాయి హృదయమునుండి దుఃఖము పొంగి పొఱలుచుండెను; కానియాలలన నిశ్శబ్దముగ నేయుండి నిజచేలాంచలమును బాష్పధారిచేఁ బూర్తిగ సిక్తముఁగావించివై చెను. ఆమె నిజకష్టములవలనఁగలిగిన శోకమును సహింపఁగలిగెను. కాని సోదరుని యగచాట్లను వినుటచే యామె యనిర్వాచ్యమైన వ్యాకులముచేఁ బొగులుచుండెను. సహోదరుని దుఃఖచారిత్రము ముగిసిన వెనుక నతికష్టముతో నారమణి తనశోకము నొకించుక సంవరణ మొనరించుకొని, తన్నుఁగూర్చి యేమి తెలుపవలయునని యామె చింతించుచుండెను. చంద్రారావు నామము నుచ్చరించకయే బాష్పజలమును మోచన మొనరించుకొని సోదరునితో నిట్లు బలుకఁ దొడంగెను. "మహారాష్ట్రదేశమున కే నరుగుదెంచిన పిదప నచిరకాలములోనే నొక సంభ్రాంతమహారాష్ట్ర జాగీరుదారునకుఁ బత్నినైతిని" అరమణి ప్రియుని నామము నుచ్చరించుటకు లజ్జించి మరల నిట్లు దెలుపసాగెను. "గగనమందలి శశధరుని నామమే నాప్రియుని నామధేయము. నభమందలి సుధాంశుని నిర్మలాలోకము వడువున నామనోహరుని గౌరవజ్యోతి దిగంతములందు వికీర్ణమగుచుండెను. ఆశక్తిసంపన్నుని విపుల సంసారమందే నేను సుఖినైయుంటిని. యశస్తిలకుఁడైన నానాథుఁడీచరణాశ్రితదాసియెడ ననుగ్రహముఁ గలిగియే యుండెను. నాకీజీవనమం దేకోరికయు లేదు. ప్రాణసముఁడవైన నీవు సుఖవంతుఁడవైయుండుటఁ గాంచినచో మాత్రము నాజీవనము

సార్థకమగును. నీవిషయమైన వార్తలను నేనపుడపుడెఱుఁగఁ గలుఁగుచుంటిని. నిన్నొకమాఱు జూచుటకై యాతురనై యనేకదినములనుండి యత్నముఁ జేయుచుంటిని. నేఁడాకోరికఁ దీరుప దుర్గను వేఁడి యామెను బూజించుటకై యిటకరుగుదెంచితిని. నాపూజకుఁ బ్రత్యక్షఫలము పొడసూపెను. నాభాగ్యవశమున నకస్మాత్తుగ మందిరపార్శ్వమునఁ బాదపమూలమున ప్రాణసముఁడైన నాసోదరుని నేఁటికిమరలఁ గాంచఁగలిగితిని."

ఈవిధముగ లక్ష్మీభాయి నిజవృత్తాంతమెల్ల సోదరునకెఱింగించి, దుర్భరమైన యతనిదుఃఖము నుపశమింపఁజేయఁ దొడంగెను. ఆరమణి దుఃఖిని; దుఃఖభారమామె బాగుగ నెఱుఁగును; లక్ష్మీభాయి నారి—దుఃఖోపశమన మొనరింపఁగలదు. సహిష్ణులై నిజవిషాదమును సహించి యితరుల నోదార్చి వారలఖేదమును దూరీకృత మొనరించుట నారీమణుల ధర్మము.

ప్రబోధవాక్యములచే సోదరుని మనస్సంకటము వాప నారమణీతిలకము బహుభంగుల జతనముల సలుపుచు నిట్లనెను; "మన జీవితము లేయిట్టివి; అన్నిదినములును సమానములై యుండవు. భగవానుఁడు ప్రసాదించు సుఖమును భోగించుచు నతఁడెపుడైనను దుఃఖ మొసఁగినచో దానిని సహించుటకు విముఖులమై యుండుటఁదగునా? మానవజన్మమే దుఃఖమయము; మనమాదుఃఖమును సహింపనిచో నింక నేరు సహించెదరు? సుదిన దుర్దినములందఱికినిఁ గలవు, దుర్దినములందు మనమా విధాతనామమును స్మరించుచు మనఖేదమును మఱువలయును. అతఁడే మనకొకప్పుడు పిత్రాలయమున సుఖము నొసంగెను; అతఁడే మనకిపు డిక్కట్టుల నిచ్చెను; అతఁడే మరల మనల నీయిడుమలనుండి దప్పించును. అన్నా! యీనైరాశమును దూరీకృత మొనరింపుము! నీవిట్టి యవస్థయందున్నచో నీశరీరమింక నెన్ని

దినములు నిలచియుండఁగలదు ? ఆహారనిద్రలను త్యజించివైచినచో మనుష్యజీవనము లెంతకాలము నిలచియుండును ?"

రఘునాథుఁడు—ఈజీవనము నిలచియుండవలసిన యావశ్యకమేమున్నది ? ఏదినమున విద్రోహియని సైనికునినామము కళంకమయ్యెనో, యాదినముననతని జీవనము వెడలి పోలేదేమి ?

లక్ష్మీభాయి—నీసోదరిలక్ష్మిని చిరదుఃఖినిఁ జేయవలెననియా నీయిచ్ఛ ? చూడుమన్నా! నాకీపృథ్వియం దిఁకేరుగలరు ? పితలేఁడు; జగత్సంసారమున నేరునులేరు. నీవుకూడ దుఃఖినివైన లక్ష్మియెడల గల మమతనంతయు మఱచితివా? విధాత యీహతభాగిని విషయమై యింకేమాఱుఁగ విముఖుఁడైయుండెనా ?

రఘునాథుఁడు—లక్ష్మీ ! నీవునన్నుఁ బ్రేమించుచుంటివి. అది నేనెఱుఁగుదును. నీకేదినమున నేను కష్టమునొసఁగెదనో యపుడే యీశ్వరుఁడు నాయందు నిర్దయుఁడైయుండుఁగాక ! కాని సోదరీ ! నాకీజీవనమున నింకసుఖము లేదు. నీవాడుదానవు. సైనికులశోకము నెట్లెఱుఁగఁగలవు ? జీవనముకంటె మాకు మానామము ప్రియతరము మృత్యువుకంటెఁ గళంకయుపయశములు సహస్రమడుంగులు కష్టదాయకములు. ఆకలంకముచే రఘునాథునినామము కళంకితమై పోయెను.

లక్ష్మీభాయి—అటులైనచో నాకలంకమును దూరీకృతమొనరించు జతనమందేల విముఖుఁడవై యుంటివి ? మహానుభావుఁడైన శివాజీ కడకరుగుము. అతని క్రోధమంతరించినచో నవశ్యముగ నతఁడే నీపలుకుల నాలించి నీవు నిర్దోషివని యెఱుంగును,

రఘునాథుఁ డుత్తరువొసఁగలేదు; కాని యతని ముఖమండలమంతయు రక్తవర్ణమైపోయెను. అతని నేత్రముల నుండి యగ్నికణములు బహిర్గతములు గాఁదొడంగెను.జనకుని యభిమానదర్పములు పుత్రుని

యందు గన్పట్టుచుండెనని బుద్ధిమతియైన లక్ష్మీభాయి గ్రహించెను. కంఠమునఁ బ్రాణములున్నంత దనుక నతఁడట్టి యావేదన మొనరింపఁడు,తీక్ష్ణబుద్ధిగల లక్ష్మి భ్రాతయంతరమందలి భావము నెఱిఁగి మరల నతనితో నిట్లనివచించెను. "అన్నా ! మన్నింపుము. నే పాడుదానను. ఏమియు నెఱుఁగని దానను. కాని శివాజీ నికటమున కరుగుటకసమ్మతమైనచోఁ గార్యరూపమున నేల నీవు నీయాశయమును గాపాడుకొనవు ? సైనికుని సాహసప్రభుభక్తులు కార్యమందుఁ బ్రకాశమగునని మన జనకుఁడు పలికెను. నీవు విద్రోహివని యెవరైనసందేహించి యుండినచో నసిహస్తుఁడవై యేలనీవాశంకను ఖండనమొనరింపవు ?

ఉత్సాహముచే రఘునాథుని నయనములు ప్రజ్వలితములుఁ గానతఁడే తీఱున" యని యామెను బ్రశ్నించెను.

లక్ష్మి—శివాజీ ఢిల్లీకరుగుచుండెనని వింటిని. అచట నెన్నియో ఘటనములు ఘటింపఁగలవు. దృఢప్రతిజ్ఞుఁడైన సైనికుఁడు తన శక్తిసామర్థ్యములను జూపుటకనేకయుపాయములుండవచ్చును. నేను రమణిని; నాకేమిదెలియునో వచింపుము ? నీజనకుని వసుపున సాహసోపేతుఁడవై, యతని మాడ్కి వీరప్రతిజ్ఞుఁడవైనచో నీయుద్దేశ్యము సఫలము గానేరదు ?

అన్యచింతయొనరించుటకు రఘునాథునకు సమయముండినచో దనచెల్లెలైన లక్ష్మీభాయి మానవహృదయశాస్త్రమం దనభిజ్ఞ గాదని గ్రహించియుండును. ఏయౌషధిని నేఁడా నారీశిరోమణి రఘునాథుని యెదయందుఁ బ్రయోగించెనో, దాని పటుత్వముచే ముహూర్తకాలమందే యతని శోకసంతాపము లంతరించిపోయెను. యోధప్రవరుని హృదయము పూర్వముభంగి నుత్సాహముచే స్ఫీతమయ్యెను.

రఘునాథజీ చాలసేపాలోచించెను. అతని నయనములు సంతసవిస్ఫారితములయ్యెను. రఘునాథజీ ముఖమండల మకస్మాత్తుగఁ గాం

త్రివంతమాయెను. చాలసేపైన పిమ్మట నతఁడిట్లనెను. "లక్ష్మీ! నీవు స్త్రీ మాత్రమవు; కాని స్త్రీవచనములను వినినకొలఁది నామనమందు నూతనభావము లుదయమయ్యెను. నాహృదయముత్సాహశూన్యము కాదు. భగవానుఁడు నాకుఁ దోడ్పడుగాక ? రఘునాథుఁడు విద్రోహి కాఁడు; భీరుఁడు కాఁడు. ఈవిషయమిపుడుకూడఁ బ్రచారమగును. కాని నీవు బాలికవు. నీనికటమున నివన్నియుఁ బలుకనేల ? నీవు నాహృదయమందలి భావము నెట్లుగ్రహింపనోపుదువు ?"

లక్ష్మీబాయి మందహాస మొనరించి, "వ్యాధినిర్ణయ మొనరించినది. నేను. ఔషధ మొసఁగినది నేను. కాని నేనేమియు గ్రహింపనోపనా ?" యని భావించి, ప్రకాశముగ నిట్లనెను. "అన్నా! నీయుత్సాహమును గాంచినతోడనే నాయుసురులు జల్లవడియెను. నీమహదుద్దేశ్యమును నేనెట్లు గ్రహింపఁగలను ? కాని యేమగుఁగాక! నీచెలియ లెంతకాలము సజీవియైయుండునో, యంతదనుక నామె నీవు పూర్ణమనోరథుఁడవగుటకు సదా జగదీశ్వరుని నికటమునఁ బ్రార్థనసలుపును"

రఘునాథుఁడు—లక్ష్మీ! నేను సజీవుఁడనై యున్నంతవఱకు నీయవ్యాజప్రేమ నెపుడును మఱువను.

చాలసేపైనపిదప లక్ష్మీబాయి యధోవదనయై యిట్లనెను. నామాట మఱియొకటియున్నది. కాని దానిని నీకుఁ దెల్పుటకు భయపడుచుంటిని.

రఘునాథుఁడు—లక్ష్మీ! నాయొద్ద నేమిబలుకుటకీవుభయపడుచుంటివి? నేను నీసహోదరుఁడనుగానా? సోదరునికడ భయమేమి?

లక్ష్మీ.—చంద్రరావను నొకజుమ్లాదారు ప్రాయశః నీకపకారముఁ జేసియుండును.

రఘునాథుని యుత్సాహహాసనము లంతరించెను. అతనిముఖము రక్తవర్ణమాయెను. కాని యతఁడా యుద్వేగమును దమన మొనరించి

యిట్లుపలికెను:" చంద్రరావు తేనిసమ్ముఖమున నేమివచించెనో యది యథార్థము కాదు. అతఁడు నాకపకారమేమైనఁ గావించెనో లేదో నేనెఱుంగను."

లక్ష్మీ—పురుషుఁ డేమియొనరించినను, అన్నా! నీవతని కనిష్టఁ గావింపనని సమ్మతిగమ్ము.

రఘునాథుఁడు నిరుత్తరుఁడై చింతింపసాగెను. లక్ష్మీబాయి మరలనిట్లనెను:" నాసోదరునికడ బూర్వమేనెన్నఁడు నెట్టిభిక్షనుగావించియుండలేదు. నేనొకటిచెప్పెదను.అన్నా! నీవు నన్నుఁ బ్రేమించినచో నాకోరికఁదీర్పుము."

సోదరియనురోధముచే రఘునాథునిహృదయముకరిగిపోయెను. అతఁడా సుందరికరపల్లవముల రెంటినిబట్టుకొని యిట్లనెను.

"లక్ష్మీ! చంద్రరావే నాకీమహాపరాధ మొనరించెనని నాకుఁ జాలసందేహ మొడముచున్నది. కాని నేను నీకొసఁగరాని దేమియు లేదు. చంద్రరావునకే యనిష్టము గావింపనని నేనిదె యీదుర్గమందిరమున ప్రతిజ్ఞ నొనరించుచుంటిని. నేనతనిదోషమును మన్నించితిని. జగదీశ్వరుఁ డతనిని మన్నించుఁగాక!"

"జగదీశ్వరుఁడావ్యక్తిని మన్నించుగాక"యని లక్ష్మీబాయికూడ నాతురతయైబలికెను.

పూర్వదిక్కునఁ బ్రభాతాలోకచ్ఛట గన్పట్టెను. లక్ష్మీబాయి యపుడశ్రువర్షముఁగురిపించి ప్రణయపురస్సరముగ సహోదరునికడ సెలవుఁగొనుచు నిట్లనెను.

"నావెంటనంటి యింటియందలి పరిచారిక యొకర్తుక యీప్రదేశమున కరుగుదెంచెను. ఇపుడుకూడ నందఱు నిద్రితులై యుండిరి. ఇపుడేను మగుడిచనకున్న, నందఱీవిషయము నెఱుఁగఁగలరు. ఇఁక

నేను పోయివచ్చెదను. పరమేశ్వరుఁడు నిన్ను సఫలీకృతమనోరథుఁ జేయుఁగాక!"

"జగదీశ్వరుఁడు నీకు సుఖముఁ గూర్చుఁగాక" యని పలికి ప్రేమపూర్వకముగ లక్ష్మీభాయియొద్ద సెలవుఁగొని రఘునాథజీ మందిరమునుండి నిష్క్రాంతుఁడయ్యెను. లక్ష్మీభాయికడ సెలవుఁగొంటిమి. పాఠకులారా! హతభాగినియైన ప్రియంవదకడఁగూడ సెలవుఁ గొనివత్తము రండు.

ఇరువదియవ ప్రకరణము.

జానకీపతియను జడదారి.

రుద్రమండల దుర్గాక్రమణదినమున రఘునాథజీయట కరుగుట కేల విలంబమాచరించెనోయని మా పాఠకమహాశయు లవశ్యముగ నుపలబ్ధి గావించియుందురు. ఆనాటి సమరమం దేరు బ్రదుకఁగలరని యేరును నెఱుంగరు. ఆహవమునకుఁ దొడరక పూర్వము రఘునాథజీ కన్నులార నొకమాఱు ప్రియంవదను జూచుటకై యామెకడ కరిగెను. సాశ్రునయనయై యాలావణ్యాంగి రఘునాథునకు సెలవొసంగెను.

రఘునాథజీ పోయినపిదప నెన్నిదినము లతివాహితములైనను యతనివార్త లేమియుఁ బ్రియంవద యెఱుంగఁజాలకుండెను. కాని యాశాదేవి యారమణికర్ణములందు. "రఘునాథజీ సన్మానితుఁడాయెను. విజయుఁడైన యారాకొమరుఁ డుల్లాసితహృదయుఁడై యచిరకాలములో మరల నీకడ కేతెంచును. పరమకుతూహలోపేతుఁడై యతఁడు నీజనకునికడ సంగ్రామవిశేషముల నెఱింగించు"నని పలుకసాగెను, కాని రఘునాథుఁడు మగలరాలేదు. ఆదినమునఁ గావింపఁబడిన సమరమునుగుఱించి యతఁడేమియు వర్ణింపలేదు.

ఇటులుండ నకస్మాత్తుగ నొకనాఁడు "రఘునాథుఁడు విద్రోహి యాయెను. విద్రోహాచరణముకతంబున నవమానితుఁడై దూరీకృత మొనరింపఁబడెను" ను ఘోరవార్త యేతెంచి వజ్రపాతమువలెను ప్రియంవదహృదయమున నాఁటెను. ప్రథమముహూర్తమందు ప్రియంవద చకితయైపోయెను. ఆవార్తయర్థ మామెకు బోధగమ్యముఁగా లేదు. ఆమెలలాటమంతయు రక్తవర్ణమైపోయెను. రక్తోచ్ఛ్వాసముచే నాబాలిక ముఖమండలమంతయు రంజితమైపోయెను. ఆరాకొమరిశరీరము గంపింపఁదొడంగెను. ఆమె నయనములనుండి యనలకణములు బహిర్గతముఁగాసాగెను. పరిచారికనుద్దేశించి యానారి యిట్లనెను "రఘునాథజీ విద్రోహియని వచింపుచుంటివా? ఆరాకొమరుఁడు ముసల్మానులతోఁ గలసెనా? కాని నీవు నిర్బోధరమణివి. నీకే నేమి చెప్పుదును? నాసమ్ముఖమునుండి తొలఁగిచనుము."

క్రమక్రమముగ నాహవరంగమునుండి యొకరివెనుక నొకరు చొప్పున ననేకసైనికు లటకువచ్చి "రఘునాథుఁడు విద్రోహి" యని బలుకనావార్త సఖీజనులవలనఁ బ్రియంవద యెఱింగెను. వృద్ధుఁడైన జనార్దనుఁడుకూడ సాశ్రులోచనుఁడై యిట్లనసాగెను. "ఆసుందరయుదారమూర్తి మనమందిట్టి క్రూరతయుండెనని యేరెఱుంగుదురు?" ప్రియంవద యందలి పలుకుల నాలించుచు నేమియు నుత్తరువిచ్చుట లేదు. జగమందలి లోకులందఱు రఘునాథుఁడు విద్రోహియని యనుచున్నను బ్రియంవదహృదయము మాత్రమిట్లు బలుకదొడంగెను "వృథవిమిథ్యావాది. రఘునాథునియం దెట్టిదోషము లేదు నిక్కముగ నతఁడు నిపరాధి"

ఈవిధానఁ గతిపయదినము లతివాహితమైన పిదప నొకనాఁడు సంధ్యాసమయమునఁ బ్రియంవద సరోవరతీరమునకుఁబోయెను. ఆపుష్కరిణీకూలమున నాసైకాంధకారమున దీర్ఘకాయుఁడైన యొకజటా

జటాధారి యువవిప్రుఁడైయుండెను. ప్రియంవద యొకించుక విస్మితయైనిలువంబడి యాజడదారిని వీక్షింపఁదొడంగెను. ఆఋషిచంద్రుని తేజఃపూర్ణయవయవములను గాంచినకొలఁది ప్రియంవదహృదయమున భక్తిరసముప్పొంగుచుండెను.

యతిసత్తముఁడు దన స్థిరదృక్కులా సుందరిపైఁబఱపి యాదరపూర్వకముగ నామెనుద్దేశించి యిట్లనెను.

"బాలా! ఈవైరాగికడ నీకేమైన ప్రయోజనమున్నదా? ఏదైన విశేషాభీష్టసిద్ధికొఱకై నాయొద్దకరుగుదెంచితివా యేమి? రమణీ! నీవదనమండలమున విషాదచిహ్నములను గాంచుచుంటినేమి? నీనయనపద్మము లశ్రుసిక్తములైయుండెనేమి?"

ప్రియంవద ప్రత్యుత్తర మీయఁజాలకపోయెను. సంయమివరుఁడు మరలనిట్లు పలుకసాగెను. "నేను నీయుద్దేశ్యమున కవగతుఁడనైతిని. ఒకమిత్రునివిషయమై ప్రశ్నింపవచ్చితివిగదా?"

ప్రియంవద యపుడు కంపిస్వరమున నిట్లనెను. "భగవానుఁడా మీశక్తి యసాధారణము. అనుగ్రహించి యింకను రవంతచుక్కఁ బలికినచో బోధితనగుదును. ఆమిత్రుఁడు విపన్నుఁడైయుండెను. అతనికుశలవార్తఁ బ్రశ్నింపనరుగుఁదెంచితిని."

వైరాగి—పృథ్వియందఱాతనిని విద్రోహియని దూషించుచుండిరి.

ప్రియంవద—స్వాములకుఁ దెలియని దేమియు లేదు.

సంయమి—మహారాజైన శివాజీయతఁడు విద్రోహియనిదలఁచి వానిని వెడలనంటివైచెను.

ప్రియంవద ముఖమురక్తవర్ణమైపోయెను. అశ్రుపూరితలోచనయై యామెయిట్లనెను. "తాపసకుల కంఠీరవా! ప్రవచనమున విశ్వసింతు

ను. కాని రఘునాథజీ ...

ను. మునికుంజరా! ఇఁక ...

పరివ్రాజకుని ...

ఒకనిమేషమూరకుండి యా ... పలసినది మఱియు...

గలదనియెను.

ప్రియంవద—నివేది ...

మౌని—మనుష్యహృదయముల నెఱుంగ మనుష్యగణములకసాధ్యము. రఘునాథునిహృదయమునం దేమియున్నదో యెఱుఁగుటకొక యుపాయమున్నది. ప్రణయినిహృదయము ప్రణయిహృదయదర్పణస్వరూపము. రఘునాథునికైన యథార్థప్రణయినియుండినచో నామెకడకరిగి యామెహృదయభావ మేమియని యడుగుము. ఆమెహృదయచింత మిథ్యావాదిని కాదు.

ప్రియంవదయాకసమును విలోకించుచు నిట్లనెను. "జగదీశ్వరా! నాహృదయమున కిపుడీవు శాంతినొసంగినచో నీకే ననేకమాఱులు ధన్యవాదములొసఁగెదను. ఉన్నతచరిత్రుఁడైన ఆయోధుని ప్రణయిని నగుదునని యెవతెయాశించుచుండెనో, దనకంఠమునఁ బ్రాణములున్నంతదనుక నామెకు రఘునాథజీ సత్యసంధతయందుఁ గలస్థిరవిశ్వాసము విచలితముగా నేరదు.

క్షణకాలానంతరమున గోస్వామి మరల నిట్లనెను.

"సుందరీ! నీపలుకుల నాలించినపుడీవేయాయోధుని ప్రకృతప్రణయినివని దోఁచెడిని. నేననేక సీమలందుఁ బర్యటన మొనరించువాఁడను. ప్రాయశః నేను మరల రఘునాథుని కలసికొనఁగలను. నీవతని కెఱింగింపవలయున దేమైననున్నదా? నాయొద్ద నీవు లజ్జపడవలసిన యక్కఱలేదు. నేను సంసారమునుండి బహిర్భూతుఁడనైతిని.

మస్తకయై హీనస్వరము
జీ యా రాకుమా-రు

వైరాగి—నిన్నటిని దిరముకడ నేనతనినిఁజూచితిని. అతఁడే నన్ను నీకడకుఁబ పు.

ప్రియంవద—వారు ప్రస్తుత నేమిగావింపఁ బ్రతిజ్ఞఁబూనిరో స్వాముల సెలవిచ్చెనా ?

ఋషికంఠీరవుఁడు—నిజబాహుబలముచే నిజకార్యగుణములచే నతఁడు తనకుఁ గలిగిన యన్యాయయావయశమును తిరోహితమొనరించును. లేకున్న నాప్రయత్నమందుఁ బ్రాణదానమొనరించును.

ప్రియంవద—ఆవీరప్రతిజ్ఞ నిక్కువముగ ధన్యమైనదే. తాను మరల నానుందరాంగుని గలసికొన్నచో, నావచనములుగ నాతనితోనిట్లు బలుకుఁడు "ప్రియంవదయను యీరసపుత్రబాలిక జీవనముకంటె యశమే యధికమంచెంచును. నామేననసువు లున్నంతకాలము నీవు కళంకశూన్యవీరుఁడవని యుప్పొంగుచు, నీయశోగీతములనే సదా బాడుచుండును. దీనరక్షకుఁ డవశ్యముగ నీయత్నములన్నిటిని సఫలమొనరించుఁగాక !"

మునిపుంగవుఁడు—భగవానుఁడట్లేయొనర్చుఁగాక! కాని, బాలా! సత్యమునకు సర్వదాజయము సేకూరదు. రఘునాథుఁ డేదుర్యాపాద్యమమందుఁ బ్రవృత్తుఁడగుచుండెనో విశేషతః యందాతని ప్రాణసంశయముకూడ నున్నది.

ప్రియంవద—రసపుత్రబాలికదియే ధర్మము. కర్తవ్యసాధనమందతనికిఁ బ్రాణవియోగము ఘటిల్లినచోఁ బ్రియంవద యుతని యశోగీతములఁ బాడుచు హర్షోత్ఫుల్లముఖయై, నిజాసువులను విసర్జించునని మీతరని సెలవింపుఁడు.

ఉభయులును క్షణకాలము నిస్తబ్ధులై యుండిరి. చాలసేపైన పిమ్మట "రఘునాథజీ మీతో నిఁక నేమైన సెలవిచ్చెనా" యని ప్రియంవద ప్రశ్నించెను.

ఋషివృషభుఁడు యోచించుక చింతించి యిట్లనెను. "రాకుమారీ! తనవచనములుగ నతఁడిట్లు నీకుఁ దెలుపమన్న వేడెను." "విద్రోహియని జగమంతయు నన్ను దూషించుచుండెను. అటులైనను నీవు నాకు నీహృదయమందు స్థానమొసఁగెదవా ? పృథివియంతయు నెవ నినామము నుచ్చరింపదో నీవతని నామమును స్మరించెదవా? ఘృణిత, అవమానిత, దూరీకృత రఘునాధుని ప్రియంవద తనజ్ఞప్తియందుంచుకొనునా ?"

ప్రియంవద యిట్లనెను. "స్వామీ ! ప్రియంవద రసపుత్రబాలికయనియు న-విశ్వాసిని కాదనియుఁ దామీరసపుత్రశూరున సెలవింపుఁడు?"

మునీశ్వరుఁడు—జగదీశ్వరా ! అటులైన నిఁకనతని హృదయమందెట్టి విషాదమును యుండదు. లోకులందఱుఁదన్ను నిందించినను యీపృథియందింకను నొకర్తుక మాత్రముదనయందు విశ్వాసముంచెనని రఘునాథుఁడు సంతసించును. సుందరీ! నాకిఁక సెలవొసంగుము. ప్రియంవద ప్రియవచనములను నేనారాకొమరున సెలవిచ్చినచో నతని హృదయమందు శాంతిసేచన మొనరించిన వాఁడనగుదును.

సజలనయనయై ప్రియంవద యిట్లనెను. "అతఁడసిహస్తుఁడై యశపథపరిష్కారమొనరించుఁగాకనియు, యెంపడీ జగమున కాదిపురుషుఁడో యతఁడే యారాకొమరునకుఁ దోడ్పడుఁగాకనియు నేఁగోరితినంచాతని సెలవింపుఁడు."

ఇరువురు మరల నీరవులైయుండిరి. పిదపఁ బ్రియంవద స్వామీ

జీతో నిట్లనెను. "యోగీంద్రా! నాహృదయమును శాంతపఱచితిరి. స్వాముల నామధేయము నెఱుఁగవచ్చునా ?"

"జానకీపతి" యని యోగి ప్రత్యుత్తరమొసఁగెను.

ఆనిశి జగమందంతటను గభీరతరాంధకారమునుఁ గ్రమ్మరింపఁ దొడంగెను. ఆయంధకారము గుండా మునిపుంగవుఁడొకఁ డేకాకియై రాయగరదుర్గాభిముఖుఁడై గమనమొనరించుచుండెను.

ఇరువదియొకటవ ప్రకరణము

రాయగరదుర్గము

పూర్వోక్తఘటనానంతరమునఁ గతిపయదివసములు గడచినపిమ్మట నొకనాఁటి యర్ధరాత్రమున శివాజీచే నూతనముగ నిర్మింపఁబడిన రాజధానియైన రాయగరమందొక సభఁగావింపఁబడెను. శివాజీయొక్క ప్రధానసేనాని మంత్రిపురోహితశాస్త్రజ్ఞులాది యనేకకర్మచారులా సభ నలంకరించిరి. పరాక్రమోపేత, ధీశక్తిసంపన్న, శీర్ణతను, శుక్లకేశ, దూరదర్శి, న్యాయశాస్త్రవిశారద, ప్రధానమంత్రిలనేకులా సభాతలమును సుశోభితమొనరించిరి. సమరోద్యోగమునందును, బుద్ధిసంచాలనమందును, విద్యాబలమందును వీరలే చిరకాలమునుండి శివాజీకి సహాయమొనరించుచుండిరి. శివాజీ వడువుననే వీరలహృదయములు కూడ స్వదేశానురాగపూర్ణములైయుండెను. కాని నేఁడు సభాస్థలము నిస్తబ్ధముగనుండెను. శివాజీ నీరవుఁడైయుండెను. మహారాష్ట్రీయవీరులు నేఁడు మహారాష్ట్రీయగౌరవలక్ష్మినికటమున సెలవుఁగైకొనుటకై సమావేశులైరి.

చాలసేపైనపిమ్మట శివాజీ ముకేశ్వరుని సంబోధించి యిట్లనెను, "శ్రీస్వామీ! చక్రవర్తియధీనతనుస్వీకరించి, యతని యధీనమందే జాగీరుదారునిగా నుండవలెనని యేనా మీయభిప్రాయము?"

ముకేశ్వరుఁడు—మనుష్యునకు సాధ్యమగునదంతయుఁ దాము గావించితిరి. విధినిర్బంధము నేరు లంఘనమొనరింపఁ జాలుదురు?

శివాజీ—స్వర్ణదేవా! నాయాదేశానుసారముగ మీరీసుందర ప్రశస్త రాయగరదుర్గమును నిర్మాణమొనరించినపుడు దీని నొకతేని రాజధానిగ నిర్మించితిరా? మీరేయభిప్రాయముతో దీనినిర్మాణముఁగావించితిరి?

ఆవాజీస్వర్ణదేవుఁడు క్షీణస్వరమున నిట్లు ప్రత్యుత్తరమొసఁగెను. "రాజశేఖరా! భవానీయాదేశమునఁ దామొకప్పుడు స్వాధీనతనువాంఛించియుండిరి. భవానీ యాదేశముననే యిపుడా ప్రయత్నమునుమానితిరి. ఇట్లొనరింపకున్నచో-నవిధేయముగఁ గన్పట్టును. హిందూసేనాపతితో రణమొనరింపవలదని యుమాదేవి యుత్తరువొసఁగెనుగదా?

అన్నజీదత్తుఁడుకూడ నిట్లనెను. "అనివార్యమైనదేదియో జరిగిపోయినది. ప్రస్తుతమున మీరు ఢిల్లీగమనమొనరించు కర్తవ్యాకర్తవ్యములను వివేచనమొనరింపుఁడు?"

శివాజీ—అన్నజీ! మీపలుకులు సత్యములే. కాని యేయాశ—యే ప్రయత్నము హృదయమందు బహుకాలమునుండియు స్థాపితమైయుండెనో దానిని నకస్మాత్తుగ నుత్పాటితమొనరించుట కష్టము. సుధాంశుకిరణాలోకమునఁ గన్పట్టు యాపర్వతశ్రేణులనుఁ జూచుఁడు?—బాల్యకాలమందే నాపర్వతశృంగముల నారోహించుచున్నతరి యెట్టిస్వప్నములు నాహృదయమందావిర్భావములయ్యెను! మరల మహారాష్ట్రదేశము స్వాధీనమగుననియు, హిందూజేఁడు హిమాలయపర్వతములనుండి సాగరకూలపర్యంతము సమగ్రభారతవర్షమును పాలించుననియు నాశించితిని గదా ? భవానీ ! యీయాశ యలీకస్వప్నముమాత్రమే

రైనచో నేలయిట్టి స్వప్నముచే బాలకుని హృదయమును చలచల మొనరించితివి?

ఈవచనములను విని సభాసదులందఱును నీరవులైయుండిరి. సభయందొకించుకైన శబ్దము లేదు. ఆనిస్తబ్ధతనడుమ సభామండపమునందొకప్రాంతమున నొకించుక చీకటిగనున్న ప్రదేశమునుండి యొకగంభీరస్వరము విననయ్యెను.—"భవాని ప్రవంచన మొనరింపలేదు. మనుష్యునకు దృఢప్రయత్న వీరత్వములున్నచో దుర్గాదేవి యతనికి సహాయమొనరించుట యందుఁ గుంఠితఁగాదు."

ఆపలుకులనాలించి శివాజీ చకితుఁడై యావైపుగదిరిగెను. అచట నవీనమానివరుఁడొకఁడు నిలచియుండెను. అతఁడు జానకీపతి

ఉత్సాహముచే శివాజీనయనములు జ్వలింపనతఁడిట్లనెను. "గోసాయిజీ! మీరు నాహృదయమందు బాల్యోత్సాహమును పునరుద్రేకముఁగావించితిరి. మీవచనములు నాశైశవకాలవృత్తాంతమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి. తుల్యుండైన దాదాజీకనాయుదేవు మృత్యుశయ్యయందు శాయితుఁడై నాతో నీతెఱఁగునఁబలికెను. "వత్సా! నీవొనరించుచున్న ప్రయత్నముకంటె మహత్తరయత్న మఱొండేదియు లేదు. ఈయున్నత పథమునను సరించి చనుము. దేశస్వాధీనతాసాధన మొనరింపుము. బ్రాహ్మణగోవత్సకృషికులను గాపాడుము. దేవాలయమును కలుషిత మొనరించువారలకుఁ దగుదండనము విధింపుము. భవానీదేవి యే యుత్కృష్టపథమును నీకుఁజూపెనో యాపథమునుండి యనుధావన మొనరింపుము? ఇరువదిసంవత్సరములు గడచినపిదప నేఁడు దాదాజీ గంభీరస్వరము నాకర్ణకుహరమందు శబ్దితమగుచుండెను. దాదాజీ ప్రవంచనావాక్యముల నుచ్చారణ మొనరించెనా?

మరలనాజడదారియట్టి గంభీరస్వరముననే యిట్లనెను. "కనైదేవు ప్రవంచనావాక్యముల నుచ్చరింపలేదు. ఉన్నతపథమునను సరించిపోయినచో నవశ్యముఁగనున్నత ఫలము చేకూరును. పథమధ్యమున మనముభగ్నోత్సాహులమై ప్రయత్నమును త్యజించుటకు సంకుచితులము కాకుండుట దాదాజీకనై దేవుని ప్రవంచనమా? లేక మనభీరుత్వమా?"

"భీరుత" యనుశబ్దముచ్చరింపఁబడఁగనే సభయందొకించుకఁగలవరముదయమయ్యెను. వీరుల యొరలందున్న కరవాలములు ఝణఝణమని శబ్దమొనరించెను.

జడదారి మరలగంభీరస్వరమున నిట్లనెను. "రాజేంద్రా! సన్న్యాసి యొక్క వాచాలతను మన్నింపుఁడు, పలుకరానివచనములనువచించి యుండినచో మన్నింపుఁడు. కాని మదీయోపదేశము సత్యమా? లేకున్న నలీకమా? యను విషయమును రాజేంద్రా! మీవీరహృదయము నడిగి తెలిసికొనుఁడు. ఏధీరుఁడు జాగీరుదారుపదవినుండి రాజపదవిని గ్రహించెనో, యేశూరుఁడసిహస్తుఁడై స్వాధీనతాపథమును పరిష్కారమొనరించెనో, యేమహానీయుఁడు పర్వతములందును, గిరికందరంబులందును, గ్రామములందును, గహనములందును, వీరత్వచిహ్నమంకిత మొనరించెనో, యతఁడావీరత్వమును మఱచునా? ఆస్వాధీనతయందు జలాంజలి యొసఁగునా? బాలసూర్యునివడవున హిందూరాజ్యజ్యోతి అంధకారమంతయు విదీర్ణ మొనరించి నలుకెలంకులందును విస్తృతమగుచుండెనో, ఆజ్యోతి—ఆభానుఁడ కాలమందస్తమించునా? రాజశేఖరా! హిందూగౌరవలక్ష్మి తమ్మువరించియుండ స్వేచ్ఛాపూర్వకముగ మీరాలచ్చిని త్యజించివైచెదరా? నేనుధర్మమార్గవర్తనుఁడనుమాత్రమే! మీకాలోచన మొసగుటకు నాకధికారము లేదు. స్వయముగ మీరే వివేచన మొనరించిచూడుఁడు."

సభాసదులందఱు నిస్తబ్ధముగనుండిరి. శివాజీ నీరవుఁడైయుండెను. కాని యతని నయనయుగళము జ్వలించుచుండెను.

చాల సేపైనపిదప శివాజీ మునీంద్రునిఁ దిలకించి యిట్లనెను.

"యతిచంద్రా! కొలఁది దివసములకుఁ బూర్వమే మీపరిచయము నాకుఁ జేకూరెను. మీరు దేవాంశసంభూతులో మనుష్యులో నేనెఱుఁగను. కాని దైవవాణికంటె మీవాక్యములు నాహృదయమున, గభీరతరముగ నంకితములయ్యెను. మిమ్ములనొకటి ప్రశ్నించుచుంటిని. హిందూసేనాపతి తుములప్రతాపుఁడు తీక్ష్ణరణకౌశలుఁడు. అతనికడ నసంఖ్యములైన రసపుత్రసేనలున్నవి. ఆవాహినులతో సమరము సలుపసమర్థులఁగల సేనలు మనకడ నేవి?

జానకీపతి—రసపుత్రులు వీరాగ్రగణ్యులు. కాని, మహారాష్ట్రులుగూడ దుర్బలహస్తములచే నసిధారణ మొనరింపరు. జయసింహుఁడు రణపండితుఁడు. కాని, శివాజీకూడ క్షత్రియకుల సంజాతుఁడు. పరాజయ మొదవునని భయపడినచోఁ బరాజయమే కలుఁగును. పురుషసింహా! విషాదమును తుచ్ఛ మొనరించి దైవసహాయమునుగొని, కార్యసాధన మొనరింపుము; భారతవర్షమందు మీయశోగాన మొనరింపని హిందువుఁడును, నభమందు, మీకుసహాయ మొనరింపని దేవతగాని గన్పట్టుటసంభవము.

శివాజీ—అవునట్లే. హిందువుతో హిందువుపోరి దేశమంతటను రుధిరస్రోతప్లావిత మొనరించుట మంగళకరమా? అదిపుణ్యకర్మమా?

జానకీపతి—అట్టిచర్యయందుఁ బాతకుఁడెవండై యుండును? ఎవండు స్వజాతినిమిత్తమై స్వధర్మార్థమై రణమొనరించునో యతఁడు కాఁడు. ఎవఁడు ముసల్మానుల వేతనములను గొనుచు స్వజాతులకు బ్రతికక్షుఁడై వైరాచరణ మొనరించునో యతఁడు!

శివాజీ మరల నీరవుఁడై పోయెను. అతఁడట్లే యొకనిమేషము పఱకు నిస్తబ్ధుఁడై యేదియో చింతింపఁదొడంగెను. అతనివిశాలహృదయ

మెట్టిభీషణ చింతాలహరియందుఁ దలక్రిందులగుచుండెనో యెవరు వచింపగలరు? నిమేషానంతరమున మెల్లగనుత్తమాంగమెత్తి యాపురుషసింహుఁడిట్లనియెను. "మునీంద్రా! మహారాష్ట్రదేశమింకను వీరశూన్యము గాలేదనియు నిప్పుడుగూడఁ బరాధీనము గానేరదనియు నేఁడెఱింగితిని. మరల నాలమగును. ఆసంగ్రామదివసమున మీకంటె విచక్షణుఁడైన మంత్రియు సాహసుఁడును సహాయకారుఁడును నాకులభింపఁడు. కాని, ఆసమరదివసమింకను యాసన్నముగాలేదు. నేను పరాజయమునకు వెఱచుటలేదు. స్వధర్మనాశనమగునని భీతిల్లుటలేదు. మఱొండుహేతువుచేఁ బ్రస్తుతము యుద్ధమొనరింప విముఖుఁడనైతిని. శ్రవణ మొనరింపుఁడు.

ఏమహద్వ్రతమును ధారణ మొనరించితినో దానిసాధనార్థమే ననేకోపాయములను బహుగుప్తప్రయత్నములను యవలంబన మొనరించితిని. మ్లేచ్ఛులకును నాకును జరిగినసంధిని వారలు నిలుపువారు కారు. నేనుకూడ నాసంధిని స్థిరముగనుంపను.

హిందూధర్మావలంబిన స్వరూపుఁడును హిందూప్రతాపప్రతిమూర్తిస్వరూపుఁడును సత్యనిష్ఠుఁడునైన జయసింహునితో నేఁడుసంధి గావించితిని. శివాజీ యాసంధిని లంఘన మొనరించుట కిచ్ఛగించుటలేదు. మహానుభావులైన రసపుత్రులతో శివాజీ యేసంధినిగావించెనో యతఁడు దనయాసువులున్నంతదనుక లంఘన మొనరింపఁడు.

"సత్యపాలనముచే సనాతనహిందూధర్మము రక్షణముఁ గానిచో సత్యలంఘనము వలననగునా" యని యాధర్మాత్ముఁడు పూర్వమొకప్పుడు నాతోఁబలికెను. ఆవచనములింకను నాజ్ఞప్తియందున్నవి. ఆపలుకులను నేఁడుమఱవఁజాలను.

యోగీంద్రా! చతురుఁడైన యౌరంగజేబు మనసంధికి వ్యతిరిక్తముగ నాచరించినచో నప్పుడుమీమంత్రమును గ్రహించెదను. శివాజీ

యపుడు దుర్బలహస్తముచేఁ గృపాణమును బూనఁడు. కాని సత్యపరాయణుఁడైన జయసింహునితో నొనరించిన యీ సంధినతఁడు భిన్నమొనరింప నిచ్ఛగింపఁడు.

సభాసదులందఱు నీరవులైయుండిరి. క్షణకాలానంతరమున తన్నజీ యిట్లనెను. "మహారాజా! మనము మఱియొక విషయము నాలోచింపవలయును; మీరు ఢిల్లీపోవుటకు స్థిరమొనరించుకొంటిరా?"

శివాజీ—ఆవిషయమందుగూడ నేను జయసింహునకు వాగ్దానమొనరించితిని.

అన్నజీ—రాజేంద్రా! ఔరంగజేబు చతురతను మీ రెఱుంగియే యుండిరి కదా? అతఁడు విశ్వసనీయుఁడా? మనోరథుఁడై యతఁడు మిమ్ము నాహ్వానించెనా? ఆవిషయమును మీరాలోచించుటలేదా ?

శివాజీ—అన్నజీ! ఢిల్లీకి బోయినందువలన నాకేమియుఁ జేటు వాటిల్లదని జయసింహుఁడు వాగ్దానమొనరించెను.

అన్నజీ—కపటాచారియైన యౌరంగజేబు తమ్ము బంధించినను లేక వధించినను జయసింహుఁడెట్లు తమ్ము రక్షించును?

శివాజీ—సంధిలంఘనాఫలము నౌరంగజీబవశ్యముగ భోగించును, దత్తజీ! మహారాష్ట్రభూమి వీరప్రసవిని. ఔరంగజీబిట్టి యాచరణమొనరించినచో మహారాష్ట్రదేశమందే యుద్ధానలము ప్రజ్వలితమగుచో సాగరజలమంతయు నాయగ్ని నివారితమొనరింపఁజాలదు; ఔరంగజేబు ఢిల్లీసామ్రాజ్యసహితముగ నాయనలశిఖలందు దగ్ధమొందును. పాపకార్యఫలము నిక్కువముగ గన్పట్టును.

శివాజీయొక్క స్థిరప్రతిజ్ఞఁ గాంచి యిఁక నెవరును నిషేధమొనరింపలేదు. క్షణకాలానంతరమున శివాజీయిట్లనెను! "పేష్వాజీమురేశ్వరా! ఆవాజీ స్వర్ణదేవా! అన్నజీదత్తా! మీవంటి కార్యక్షమ విచక్షణపండితులు మహారాష్ట్రసీమయందుగడునరుదుగఁ గన్పట్టుదురు. నేని

టలేనితఱి మహారాష్ట్రదేశమును మీరు ముగ్గురును బాలింపుఁడు. మీ యీ దేశములను నాయీదేశములవడువుననే ప్రజలందఱుఁ బాలనమొనరించునట్లేవాజ్ఞ నొసఁగిపోయెదను."

మురేశ్వర స్వర్ణదేవ యన్నజీలు ముగ్గురును శాసనభారమును గ్రహణమొనరించిరి. మాలశ్రీ యపుడిట్లనెను. "రాజశేఖరా! నాయీ వేదన మొకటియున్నది. బాల్యకాలమునుండియు నేనెపుడును మీ సంగమమును త్యజించియుండలేదు. మీవెంట ఢిల్లీ వచ్చుటకు నాకనుమతి నొసంగుఁడు."

సజలనయనుఁడై శివాజీయిట్లనెను "మాలశ్రీ! నీవిషయమున నేఁ దీర్పఁజాలని యభిలాషయు నంగీకరింపఁజాలని యీవేదనము లేవు. నీయిచ్ఛ పూర్ణమగును."

ఒకించుక సేపైనపిదప జానకీపతి యిట్లనెను. "రాజేంద్రా! అటులైన నాకు సెలవొసంగుఁడు. వ్రతసాధనార్థమై నేననేకతీర్థములకుఁ బోవలయును. జగదీశ్వరుఁడు మిమ్మును నిరాపదమం దుంచుఁగాక!"

శివాజీ—నవీనయోగివరా! కుశలముగఁ దీర్థయాత్ర సేవింపుఁడు. సమరసమయమందు మిమ్ములను మరల స్మరణమొనరించెదను. మీకంటె పరికృతమిత్రుని నేఁజూడఁగోరుటలేదు. ఇట్టియల్పవయస్సునందీభాతి తేజస్సాహసవీరత్వములతో నొప్పువారలను మిమ్ముఁ దక్క నేనింకొరులనెవరినిఁ గాంచియుండలేదు.

తదనంతరమున నతఁడొక దీర్ఘనిశ్వాసమును త్యజించి యస్ఫుటస్వరమున నిట్లనెను. "మఱియొక పురుషుని మాలశ్రీయుఁ గాంచితిని."

ఇరువదిరెండవప్రకరణము.

చాందకవిగీతములు.

1666వ సంవత్సరమున వసంతకాలమందు దేబనుగురశ్వారోహకులను వేయిమంది పదాతికులను వెంటనిడుకొని శివాజీ ఢిల్లీసమీపమును జేరెను. నగరమునకు రమారమి యాఱుక్రోశుల దక్షిణముననతఁడు శిబిరమును సంస్థాపిత మొనరించెను. సైనికులందఱు విశ్రమ మొందియుండఁ జింతితమనస్కుఁడై శివాజీ యిటునటుఁబరిభ్రమణ మొనరించుచుండెను. ఆతఁడు ఢిల్లీ యేతెంచుటయుక్తమా? కిము సల్మానులయధీనతనుస్వీకరించుట వీరోచితకార్యమా? ఇపుడుకూడఁ బ్రత్యావర్తన మొనరించుట కుపాయము లేదా? ఇట్టిచింతలెన్నియో శివాజీయొక్కయుదారహృదయమందు త్పన్నమగుచునతనిని గలవర మొందఁజేయుచుండెను. ఆమహాయోధుని ముఖమండలమంతయుఁ జింతారేఖలచే నంకితమైయుండెను. యుద్ధకాలమందుగాని లేక మఱే విపత్కాలమందుగాని యేరును శివాజీయొక్క వదనమండలమిట్లు చింతాంకితమైయుండుటఁగాంచలేదు.

శివాజీవెనువెంటఁ దేజస్వియు నుగ్రస్వభావుఁడునైన యతని నవవర్షప్రాయంపుఁదనయుఁడైన శంభాజీమాత్రముఁబోవుచు నొక్కొకమాఱు జనకుని గంభీరముఖమండలమునుగాంచుచు, నతనిహృదయభావము నాలోకించుక గ్రహించుచుండెను. రఘునాథపంథన్యాయశాస్త్రియను శివాజీపురాతనమంత్రి యొకండాలోకించుక వెనుకనై యరుగుదెంచుచుండెను.

చాలసేపైనపిమ్మట శివాజీ మంత్రినిట్లడిగెను. "న్యాయశాస్త్రిజీ! మీరెపుడైన నింతకుమున్ను ఢిల్లీ యేతెంచియుండిరా?"

న్యాయశాస్త్రి—బాల్యకాలమందు ఢిల్లీనగరమును జూచియుంటిని.

శివాజీ—బహువిస్తీర్ణప్రాచీరముపగిది యల్లదె దూరమునగన్పట్టుచుండునదేమియో దెలుపఁగలరా? అనన్యమనస్కులై మీరావైపుగఁ జూచుచుంటిరేమి?

న్యాయశాస్త్రి—మహారాజా! ఢిల్లీయంత్యహిందూరాజైన పృథురాయని దుర్గప్రాచీరము గన్పట్టుచుండెను.

శివాజీ విస్మితుఁడైయిట్లనెను. "ఇది యాపృథురాయని దుర్గమా? ఈస్థానమందే యారాజచంద్రుని రాజధానియుండెనా? ఈప్రదేశమునందేనా ఢిల్లీ శేషహిందూరాజు రాజ్యశాసన మొనరించినది? న్యాయశాస్త్రీ! స్వప్నమువడుపున నాదినము గతమైపోయెను. దివసావలోకము గతమైపోయినచో మరల దివసము గన్పట్టును. శీతకాలమందలి విలుప్తపత్రకుసుమములు వసంతకాలమున మరలశోభిల్లును. మన గౌరవదివసములు మరలగన్పట్టవా?"

న్యాయశాస్త్రి—భగవానుని ప్రసాదమున నన్నియుఁ జేకూరఁగలవు. మీబాహుబలముచే మనముమరల గౌరవలాభ మొందునట్లు సర్వేశ్వరుఁడు మనల నాశీర్వదించుఁగాక!

శివాజీ—న్యాయశాస్త్రిజీ! మన బాల్యకాలమునఁ గంకణప్రదేశమునఁగథకులుజెప్పు చరిత్రవిశేషములను జాందకవిగీతములను మీరెపుడు మఱువకుండనుండిరా? ఈభగ్నదుర్గము ప్రాసాదపూర్ణమై బహుజనాకీర్ణమైయుండెడిది. పతాకతోరణశోభిత విస్తీర్ణనగరమై యిది యలరారుచుండెడిది. యోధవర్గవేష్టితుఁడై రాజసభయందు తఁడుపవిష్టుఁడై యుండువాఁడు. వెలుపలఁ జూపుమేరవఱకుఁ బథఘట్టగృహప్రాంగణ నదీతీరములందు నాగరికులానందభరితులై యుత్సవములను

సలుపుచుండువారు! బహువిస్తీర్ణములైన బజారులందు విశేషముగఁ గ్రయవిక్రయములు జరగుచుండెడివి. ఆరామసీమలందనేకులానందోపేతులై నృత్యగీతవాద్యములు సలుపుచుండువారు, సరోవరరాజములనుండి లలనామణులు సలిలపూర్ణకలశపాణులై నిజావాసములకు మందగాములై పోయెడివారు. ప్రాసాదసమ్ముఖమున సైనికులు సమరసన్నద్ధులై నిలువంబడియుండువారు. వాద్యకులు సానందముగ వాద్యములుసలుపుచుండువారు, ప్రభాతభానుఁడీ యపురూపదృశ్యముపై సుందరరశ్మివర్షణమొనరించుచుండువాఁడు. నగరమంతయు నిట్లు శోభిలుచుండ నొకనాఁడు మహమ్మదుఘోరీదూత రాజసభయందుఁ బ్రవేశించెను. మీకీవిషయములు జ్ఞప్తికివచ్చుచుండెనా?

న్యాయశాస్త్రి—రాజేంద్రా! చాందకవిగీతావిశేషములను మఱువలేదు. కాని తామొకమాఱావిశేషముల నెఱింగింపుఁడు? మీరువానినిఁ దెలుపుచుండ నాకానందముగనుండును.

శివాజీ—ముసల్మానుదూత పృథురాయనితో నిట్లనెను. మహారాజా! తమరాజ్యమందలి యర్ధాంశమాత్రముఁగొని సంధిస్థాపనమొనరించుట మహమ్మదుఘోరీ సమ్మతించుచుండెను. ఇందు మీయభిప్రాయమేమి?"

మహానుభావుఁడైన పృథురాయఁడిట్లుత్తరువొసఁగెను,

"ఏదినమున సూర్యభగవానుఁడు నభస్సీమనుండి తొలఁగియన్యభానునకు స్థానమొసఁగునో, యాదినమునఁ బృథురాయఁడు స్వీయరాజ్యమందన్యరాజునకుఁ దావొసంగును."

ముసల్మానుదూత మరలనిట్లనెను. "మహారాజా! మీశ్వశుర మహాశయులు మహమ్మదుఘోరీతో సంధిఁగావించెను. భండనక్షేత్రమున ముసల్మాను రజపుత్రసైనికు లేకస్థులై దమ్ముఁదార్కొందురు."

పృథురాయఁ డిట్లుత్తరువొసంగెను. " శ్వశురమహాశయులకు నాఁబ్రణామముల నెఱింగించి యవిలంబముగ స్వయముగ నేను వారిదర్శనమొనరించి వారిపదధూళి గ్రహించెదనని దెలుపుము? "

వెంటనేచోహాణసైనికులీప్రశస్తదుర్గమునుండినిష్క్రాంతులైరి; తిరోరీయుద్ధమున యవనరాఠోరుసైనికులు పృథురాయని సమ్ముఖమున వాయుతాడితధూళివగిది నెగిరిపోయిరి. హతశేషుఁడైన ఘోరీ యతికష్టమునఁ బలాయనమొనరించి ప్రాణరక్షణ మొనరించుకొనెను.

రఘునాథశాస్త్రీ! ఆదినములు గడచిపోయెను, ఇపుడు చాందకవివరేణ్యునిగీతముల నెవరుపాడెదరు? యెవరువినెదరు? గానియీప్రదేశమునవిలచిన-మనపూర్వపురుషుల యవినశ్వరకీర్తిని స్మరించిన, స్వప్నముచాడ్పున నవనవయాశచిత్తమున నుదయమగుచుండును. ఈవిశాలకీర్తిక్షేత్రము చిరకాలము తిమిరావృతమైయుండదు. భారతగౌరవదినములింకను యుదితములగును. జగదీశ్వరుఁడు రుగ్ణునియారోగ్యుఁజేయును; దుర్బలుని శక్తియుతుఁగావించును; జీర్ణపదదలితభారతసంతానము నతఁడిపుడుకూడ నున్నతమొనరింపఁగలఁడు,

ఇరువదిమూఁడవప్రకరణము.

రామసింహుఁడు

శివాజీ శంభాజీలిరువురు శిబిరమందుపవిష్టులైయుండ నొకభృత్యుఁడటకువచ్చి యిట్లనెను; "మహారాజా! జయసింహునిపుత్త్రుఁడైన రామసింహుఁ డనుచరసహితుఁడై చక్రవర్తియాదేశానుసారముగ మిమ్ము ఢిల్లీనగరములోనికాహ్వానించుట కరుగుదెంచి ద్వారముకడ నిలచియుండెను.

శివాజీ—సాదరముగ వారలను లోనికిఁగొనిరమ్ము.

ఉగ్రస్వభావుఁడైన శంభాజీ యపుడిట్లనెను. “పితా! మిమ్మవమానించుట కౌరంగజేబిరువురుదూతలనుమాత్రమే పంపెనా?”

ఔరంగజేబుకృతయేతదవమానము శివాజీ మనమునఁగ్రోధాగ్నిరగులఁజేసెను. కానియతఁడాక్రోధమును ప్రకాశముఁగావింపలేదు. క్షణములో రామసింహుఁడు శిబిరాభ్యంతరమునఁబ్రవేశించెను. రాజపుత్రయువకుఁడు తండ్రివగిదిఁ దేజస్వి శూరుఁడు. జనకునిమాడ్కి ధర్మపరాయణుఁడు సత్యప్రియుఁడు. తీక్ష్ణబుద్ధియైన శివాజీ యువకుని ముఖమండలముఁ జూచినంతనే, యతనియుదారయకపటచరిత్రమును గ్రహించెను; కాని ఔరంగజేబునకేదైన కుయభిసంధియుండెనో లేదో యనిఁ బ్రసంగమువలన నెఱుఁగనతఁడు యత్నించెను. రామసింహుఁడు తండ్రి నికటమున శివాజీ వీర్యప్రతాపగుణము లనేకమాఱులు వినియుండెను. అతఁడిపుడు విస్మయనయనములతో మహారాష్ట్రశూరు నవలోకింపఁదొడంగెను. శివాజీ రామసింహు నాలింగనమొనరించుకొని యథోచితసమ్మానపురస్సరముగ నతని కభ్యర్థనమొసఁగెను.

ఒకించుకసేపైన పిమ్మట రామసింహుఁ డిట్లనెను. “మహారాజా నింతకు మున్నెన్నండును నేనుజూచి యుండలేదు; కాని నాజనకునికడ మీయశోవార్తలనేకమాఱులు వింటిని, నేడు మీవగిది స్వదేశప్రియ ధర్మపరాయణ వీరపురుషునిఁ గాంచుటచే నానయనములు సార్థకములయ్యెను.”

శివాజీ—నేనుకూడ పరమసౌభాగ్యుఁడనైతిని. మీజనకుని వగిది విచక్షణ ధర్మపరాయణసత్యప్రియవీర్యవంత రసపుత్రుఁడు రాజస్థానమందుఁగూడ నుండుటరుదు, ఢిల్లీవచ్చుసమయమున నాయశస్విలకుని పుత్రుని దర్శనమగుట సులక్షణమనుట కేమియు సందియములేదు.

రామసింహుఁడు—రాజేంద్రా! తాముఢిల్లీనగరమున కరుగుదెంచుచుండిరని వినియే చక్రవర్తి నన్నుఁదమకడకఁ బంపెను. మీరు నగరమును ప్రవేశించుట కెపుడభిలషించెదరు?

శివాజీ—ప్రవేశసంబంధమున మీరేమి సలహాయిచ్చెదరు? అకపటస్వరమున రామసింహుఁ డిట్లుత్తరువొసఁగెను. “ఈక్షణమందేఁ బ్రవేశించుట మంచిదని నేఁ దలంచెదను. విలంబమైనచో వాయువుత్తప్తమగును. గ్రీష్మము దుస్సహనీయమగును”

రామసింహుని సరళోత్తరువును విని శివాజీ హాసనమొనరించి యిట్లనెను. “నేనావిషయమునఁ బ్రశ్నింపలేదు. మీరు ప్రస్తుతమున ఢిల్లీయందు వసించుచుండిరి. మీకవిదితమైన విషయమేమియు నుండదు. నేను ఢిల్లీప్రవేశించుట బుద్ధిమంతుని కార్యమగునో కాదో యని యవశ్యముగ మీరెఱుఁగుదురు.

ఉదారచేతస్కుఁడైన రామసింహుఁడు శివాజీయొక్క మనోగతభావమును గ్రహించి మందహాసమొనరించి యిట్లనెను. “మన్నింపుఁడు. నేను మీయుద్దేశ్యమును ప్రథమమున గ్రహింపలేకపోతిని. నేను మీయవస్థయందున్నచోఁ జిరకాలము పర్వతములందు వసించుచు, నిజాసిపై నసువులనిర్భరమొనరించి యుండెడివాఁడను. కరవాలముమాడ్కి ప్రకృతబంధువు మఱొండేదియు లేదు. కాని యీవిషయమున నేనజ్ఞానుండను. ఢిల్లీకేతెంచుఁడని జనకుఁడు మిమ్మును గోరఁగనే మీరిటకు వచ్చుట మంచిదియే యయ్యెను. అతఁ డద్వితీయపండితుఁడు—అతని యాలోచనయెపుడును వ్యర్థము కాదు.

ఢిల్లీనగరమునఁ దన్నుబంధింప నెట్టికల్పనలు జరుగలేదనియు లేశనట్టివేమైన జరిగియున్నయెడల రామసింహుఁడు వానినెఱుఁగఁడనియు శివాజీ గ్రహించి, యపుడుమరల నిట్లనెను. “అవును. మీతండ్రిగారే యాలోచించి నన్నిటకురమ్మని గోరిరి. నేను వచ్చుతరి యా

రాజశేఖరుఁడింకను వాగ్దాన మొనరించి యుండెను. ఆవిషయముఁ గూడ మీ రెఱుంగుదురంచుఁ దలంచెదను."

రామసింహుఁడు—ఎఱుంగుదును. ఢిల్లీయాగమనమందుఁ దమ కెట్టివిపాదముఁ గాని, యెట్టి యనిష్టఁగాని గానేర దనువిషయమున నతఁడుఁ దమకు వాగ్దాన మొనరించెను. ఆవిషయమున నతఁడు నాకుఁ గూడ నాదేశ మొనరించెను.

శివాజీ—అందు మీయభిప్రాయమేమి ?

రామసింహుఁడు—జనకుని యాదేశమవశ్యముగఁ బాలనీయ మైనది. రసపుత్రులవాక్యము లెపుడును లంఘనములు గాలేవు. తాము నిరాపదముగ స్వదేశమునకు మగుడి పోఁగలరు. జనకుని వాక్యములు వృథాగానేరవు. ఆవిషయమున సీదానుని యత్నములందెట్టి లోపమును యుండఁబోదు.

శివాజీ చిత్తమపుడు నిరుద్వేగమయ్యెను. శంకారహితుఁడై మందహాస మొనరించి యతఁడిట్లనెను. "అటులైనచో మీరు వచించినట్లే యాచరించెదను. 'విలంబమాచరించినచో వాయువుత్తప్తమగును.' ఈక్షణమందే ఢిల్లీనగరమును బ్రవేశింతమురండు,"

వెంటనే యందఱును ఢిల్లీనగరాభిముఖులై పోయిరి.

పథమంతయుఁ బురాతన ముసల్మానుప్రాసాదభగ్నావశేషములచేఁ బరిపూర్ణమై యుండెను. ప్రథమముసల్మానులు ఢిల్లీని జయ మొనరించి, బృథురాయని పురాతనదుర్గ నికటమునఁ దమ రాజధానిని నిర్మాణ మొనరించుకొనిరి. దానిం జేసి ప్రథమసామ్రాట్టుల మసీదులు ప్రాసాదసమాధిమందిరముల నిర్మూలావశిష్టమైన యాప్రదేశమునఁ గన్పట్టుచుండెను. జగద్విఖ్యాతమైన కుతుబ్ మినారీస్థానమందే నిర్మితమయ్యెను. కాలక్రమమున నూతన చక్రవర్తులింకను నూతన ప్రాసాదరాజభవనములను నిర్మాణ మొనరించుటచే నగరము కూడఁ గ్రమముగ

నుత్తరాభిముఖముగ వ్యాపనమొందెను. పథమునను సరించి పోవుచు గాంచిన భవనమసీదు మినారుస్థంభములను, సమాధిమందిరభగ్నావశేషములను శివాజీ గణింపఁజాలక పోయెను. రామసింహుఁడు శివాజీననుసరించిజనుచు నానాస్థానములను వేర్వేఱుగా శివాజీ కెఱింగింప సాగెను, ఉభయులు నొకరొకరి గుణవిశేషముల నెఱిఁగిరి. వారలిరువురనడుమ నమితమైన సౌహార్ద్యమంకురించెను. ఢిల్లీ పురమందెట్టి విపాదము సంఘటిల్లినను, నొక ప్రకృతమిత్రుఁడు లభింపఁగలఁడని సూక్ష్మబుద్ధియైన శివాజీ గ్రహించెను.

పథమధ్యమందు లోడీవంశీయచక్రవర్తుల ప్రకాండసమాధి మందిరములన్నియు దృష్టములయ్యెను. ప్రతినృపుని సమాధిపై నొక గోరీయుఁదత్పార్శ్వమున నొకభవనమును నిర్మితమైయుండెను. ఆప్గనుల గౌరవసూర్యుఁ డెపుడస్తమితుఁడయ్యెనో యపుడీప్రదేశమున ఢిల్లీయుండెడిది; తదనంతరమున నదింకను యుత్తరముగ వ్యాపించెను.

అటుపిమ్మట హుమయూనుయొక్క ప్రకాండసమాధిమందిరము గన్పట్టెను. పిదప "చౌషట్ ఖంబా" లేక, శ్వేతప్రస్తరవినిర్మితమైన యరువదినాలుఁగు స్తంభములు గలనొక సుందరవిశాల భవనము బొడఁగట్టెను, ఆప్రాసాదమునకు వెనుకననేక సమాధులుండెను. పృథురాయని దుర్గమునుండి యాధునిక ఢిల్లీ పర్యంతము వచ్చుచు, నాపథమందే భారతవర్షేతిహాసమంకితమయ్యెనని శివాజీ దలంచెను. ఒక్కొక ప్రాసాదమా యితిహాసమున కొక్కొకపత్రమై యుండెను—ఒక్కొకసమాధి దానియందొక్కొక యక్షరమైయుండెను. ఇట్టి యితిహాసమును లిఖించిన లేఖకుఁడు పూర్వకాలకాలపువాఁడు. లేకున్ననిట్టి యక్షరములతో నితిహాసము నేల లిఖింపవలెను ?

శివాజీ యింకను ముందునకుఁ బోసాగెను, ఢిల్లీనగరప్రాచీరనికటమునకు రాఁగనే రామసింహుఁడు సగర్వముగ మందిరమును మహా

రాష్ట్రజేనికిఁజూపి యిట్లనెను. "రాజేంద్రా! ఆగన్నట్టుమందిరమును పితాజీ జ్యోతిషగణనార్థమై నిర్మాణమొనరించిరి. బహుదేశములనుండి పండితప్రవరులీమందిరమున కేతెంచి రజనీసమయమున నక్షత్రగణనమొనరింతురు."

శివాజీ—మీరాజనకుఁడెట్టి వీరుఁడో యట్టివిజ్ఞుఁడు. ఇట్టిసర్వగుణసంపన్నులు జగతియందుండుటఁ జాలయరుదు. పుణ్యాకాశీధామమందుఁగూడ నామహానుభావుఁడిట్టి మందిరముచేఁ బ్రతిష్ఠితమొనరించెనని వినియుంటిని.

ఢిల్లీ ప్రాచీరాభ్యంతరమునఁ బ్రవేశించుతఱి శివాజీ కొకించుక హృత్కంపము గలిగెను. అతఁడు తన ఘోటకము నాపివైచెను. "ఇపుడుకూడ స్వాధీనముగ నుంటిని. పరక్షణమున ఖైదీఁగాఁగల" ననుచింత యాతని మనంబున నుదయమయ్యెను. తత్క్షణమే ధర్మవరాయణుఁడైన జయసింహుని నికటమున నతఁడొనరించిన వాగ్దానము స్మరణకురా, నతఁడు జయసింహుని పుత్రుని యుదారముఖమండలమునుగాంచి, నిజకోశమందలి "భవానీ" యసి నొకమాఱు వీక్షించి ఢిల్లీనగరమునఁ బ్రవేశించెను.

స్వాధీనుఁడైన మహారాష్ట్రయోధుఁడా ముహూర్తమందే ఖైదీయయ్యెను.

ఇరువదినాలుఁగవప్రకరణము.

ఢిల్లీనగరము.

ఢిల్లీనగరము నేఁడు మనోహరశోభాధారణమొనరించెను. ఔరంగజేబు డాంబికప్రియుఁడుకాఁడు. కాని రాజకార్యసాధనార్థమై సమయసమయములం దాడంబరమవశ్యకమని యతఁడు బాగుగ నెఱుంగును.

నేఁడు శివాజీ దరిద్రమహారాష్ట్రదేశమునుండి విపులార్థపూరితమొంగలు రాజధానికరుగుదెంచుచుండెననియు, మొగలాయీల అమితసంపత్తియర్థముల ప్రాచుర్యముఁ గాంచినంతనే శివాజీ తనహీనత నెఱుంగఁగలఁడనియుఁ, మొగలాయి యోధులతో సమరము సలుపుట సంభవముకాదని దెలిసికొనఁగలఁడనియు నుద్దేశించి, నేఁడౌరంగజేబు పురమంతను యలంకరింపఁ బౌరులకాదేశమొసఁగెను. చక్రవర్తి యాదేశానుసారముగఁ బురమంతయు నుత్సవములతో భోరుకలంగుచుఁ గులలలనలీల నపూర్వసౌందర్యమున భాసమానమగుచుండెను.

శివాజీ రామసింహులేకతుల్యులై రాజపథము నతివాహనమొనరించుచుండిరి. తన్మార్గముగుండా నసంఖ్యాలైన నశ్వారోహపదాతులాది వివిధయోధులు గమనాగమనముఁ గావించుచుండిరి. నగరమంతయులోకారణ్యమైపోయెను. బజారులందుఁ దమతమ దుకాణములందు వణిజులు బహుమూల్యపణ్యద్రవ్యములను రాశీకృతమొనరించిరి. ఉత్కృష్టవసన, బహుమూల్యస్వర్ణరౌప్యాలంకార, యపూర్వఖాద్యసామగ్రి, యపర్యాప్తగృహానుకరణ ద్రవ్యములాది నానావిధవస్తుల శోభఁగాంచుచు శివాజీ రాజపథమునుండి పోసాగెను. ఒక్కొకచో నిలయోపరిభాగములందు నిశానములు (పతాకములు) మారుతమందెగురుచుండెను; ఒక్కొకచో సుపరిచ్ఛదధారులైన గృహస్థులు గృహపార్శ్వయావరణములం దుపవిష్టులైయుండిరి, ఒక్కొక చోఁగులకామినీమణులు తమతమగవాక్షములనుండి యాప్రసిద్ధ మహారాష్ట్రశూరాగ్రేసరునిఁ దిలకించుచుండిరి. పథమందసంఖ్యములైన శకటశిబికహస్తియశ్వము లిటునటుఁబోవుచుండెను—రాజమన్సబదార, సేఖ, యమీరాయుమారావులు గమనాగమన మొనరించుచుండిరి. తురగారోహకులు తీవ్రవేగమునఁ బోవుచుండుటచే నగరము కంపించుచున్నట్లుండెను.

సుందరభూషణ, రక్తవర్ణాంబరములచే మండితములై దమశుండములనటునిటునూపుచు మందమంద గమనమున గజేంద్రగణములు గమనమొనరించుచుండెను. శిబికావాహకులు హుహుంకారశబ్దములచే నారోహకులఁ బదమర్యాదనుఁ బ్రచారమొనరించుచుండిరా యమునట్లు మున్ముందునకు వేవేగముగ సాగుచుండిరి. శివాజీ యిట్టినగరము నెన్నఁడును గాంచియుండలేదు. ఢిల్లీనగరమెక్కడ బూనా యెక్కడ? ఇంద్రప్రస్థమేమి? రాయగరమేమి ?

వారలిరువు రిటులా పథము ననుసరించి బోవుచుండ రామసింహుఁ డనతిదూరమున మసీదుశిఖరములను మూఁటిని శివాజీకిఁ జూపి యిట్లనెను; "అల్లదెగన్పట్టునదె జుమ్మామసీదు. షాజహాను చక్రవర్తి యమేయధనరాసులను వెచ్చించి యీ యున్నత ప్రశాంతజుమ్మామసీదును నిర్మాణమొనరించెను. యిట్టి మసీదు మత్తొదియు జగమందు లేదనివింటిని"

రక్తవర్ణప్రస్తరనిర్మితమసీదుప్రాచీరము విస్తీర్ణమై శోభాయమానముగ నుండెను. ప్రాచీరోపరిభాగమున సుందరశ్వేతప్రస్తరవినిర్మితములైన శిఖరములు మూఁడును, యిరుప్రక్కలందును యున్న మినారులు రెండును గగనమును భేదించున ట్లత్యున్నతములై యుండెను. విస్మయోత్ఫుల్లలోచనుఁడై శివాజీ యామసీదును విలోకించెను.

అపూర్వసుందరమైన యామసీదునకు సమ్ముఖమందే రాజప్రాసాదదుర్గముల విస్తీర్ణరుధిరరాగప్రస్తరవినిర్మితప్రాచీరము దృష్టమయ్యెను. దుర్గపశ్చాతమున యమున ప్రవహించుచుండెను. సమ్ముఖమునుండి విశాలమైన రాజపథముబోవుచు శబ్దపూర్ణమై లోకారణ్యమైయుండెను. ఆప్రదేశముపగిది సమారోహపూర్ణస్థానమొండేదియు భారతవర్షమున నుండెడిది కాదు—జగతియందుండెనో లేదో సందేహము. దుర్గప్రాచీరముపైనసంఖ్యములైన పతాకములు వాయుపథమున గంతులిడుచు జగమందు మొగలాయిచక్రవర్తి శక్తిగౌరవములను బ్రకాశమొనరించునట్లుండెను. దుర్గద్వారమున నొకప్రధానమన్సబదారుని ప్రశస్తశిబిరముండెను. ఆమన్సబదారుఁడు దుర్గద్వారమును రక్షణమొనరించుచుండెను. దుర్గబహిఃప్రదేశమున సైనికులనేకులు బారులు తీరినిలువంబడియుండిరి. సైనికకరస్థితనిశితకరవాలములు సూర్యాలోకమునఁ దళతళమని మెఱయుచుండెను. ప్రతికృపాణమునుండియు రక్తవసననిశానములు వాయుమార్గమున నెగురుచుండెను. దుర్గసమ్ముఖమున ననేకులు పలువిధద్రవ్యములను గ్రయవిక్రయ మొనరింప నిలచియుండిరి. దుర్గప్రాచీరమునుండి మసీదుప్రాచీరపర్యంతము పథమంతయు జనసంకులమై శబ్దపూర్ణమైయుండెను. తురగగజశిబికారోహులును, భారతవర్షప్రధానపదాభిషిక్తపురుషులనేకులును సమన్వితులై బహుసమారోహమున విరామములేక దుర్గప్రాచీరమునుండి యాతాయాతన మొనరించుచుండిరి. వారల పరిచ్ఛదశోభ చేనయనములు మిరుమిట్లు గొలుపుచుండెను—జనకలరవముచేఁ గర్ణములువిదీర్ణములగుచుండెను. శబ్దములన్నిఁటిని నిమగ్నమొనరించి నడుమనడుమ దుర్గాభ్యంతరమునుండి ఫిరంగిశబ్దము నగరమును గంపితమొనరించుచు, రాజాధిరాజ అలమ్‌గీర్ (పృథివీకధిపతి) యొక్కకుశలతావార్త జగత్సంసారమునఁ బ్రచారమొనరించుచుండెను. విస్మయోత్ఫుల్లలోచనుండై చాలసేపీ యపూర్వదృశ్యమును విలోకించి యవశేషమున, రామసింహసహితుండై దుర్గద్వారము నతిక్రమించి శివాజీ దుర్గమందుఁ బ్రవేశించెను.

దుర్గాభ్యంతరమునకుఁ జనినపిదపఁ గన్పట్టిన దృశ్యముచే శివాజీ యాశ్చర్యమగ్నమానసుఁడయ్యెను. బహువిస్తీర్ణమైన యొండుశిల్పాలయమున నసంఖ్యులైన శిల్పకారులు రాజానతిచొప్పున నానావిధ

ద్రవ్యములను బ్రస్తుత మొనరించుచుండిరి. అపూర్వసువర్ణరౌప్యఖచిత వసనములు, ముఖమలు, నానారాగవిరాజితములైన మసిలినులు, బహుమూల్యములైన రత్నకంబళులు, శుభ్రవితానములు, విచిత్రములైన దెబులు సుందరపరిధేయోష్ణీషములు, చిత్రమైన శాల్వాలు, గాత్రావరణములు, బేగమపరిధేయములైన హిరణ్యమణిమాణిక్యఖచితసుందరాలంకారములు, చిత్రములైన చిత్రప్రతిమలు, మనోహరలతలతో విరాజిల్లు పటములు, శుభ్రశ్వేతవస్త్రవినిర్మితగృహానుకరణ ద్రవ్యములు, నీలపీత రక్తరాగహరి ద్వర్ణ వస్త్రనిర్మిత నానావిధక్రీడా ద్రవ్యములు, అన్నియుఁ జూపఱనయనములను మిరుమిట్లుఁ గొలుపుచుండెను. భారతవర్షమందలి నిపుణశిల్పకారులు చక్రవర్తి యాదేశానుసారముగ ఢిల్లీకరుదెంచి మాసికవేతనముల ననుభవించుచుఁ బ్రత్యాహారమును దుర్గమందుఁ జనులను నెలుపుచుందురు. రాజకార్యార్థముగాని నిజప్రయోజనార్థముగాని చక్రవర్తికెట్టి ద్రవ్యము లవశ్యకములైనను, విలాసప్రియులైన బేగము లెట్టి తెఱంగులయపూర్వవస్తులుగావలయునని కోరినను, ప్రాసాదవాసుల కేప్రకారపు సామగ్రు లవసరమైనను, తత్సమస్తమీస్థానమందేఁ బ్రస్తుతమగును.

ఈయపూర్వదృశ్యములన్నిటిఁ గాంచుటకు శివాజీకి సమయము చిక్కలేదు, అసంఖ్యాలోకుల నడుమనుండి "దేవ్ యాన్ ఆమ్" అనునొక యున్నత ప్రశస్త రక్తవర్ణశిలానిర్మిత భవనముకడ కరుగుదెంచెను. చక్రవర్తి సాధారణముగ నీప్రదేశమందే సభాయధివేశన మొనరించును. కాని నేఁడు మహారాష్ట్రశూరునకుం బ్రాసాదసౌందర్యమంతయుం జూపుటకో యన, సుందరశ్వేత వస్త్రవినిర్మితనానావిధాలంకారాలంకృతమై, పృథివియందతుల్యమైన "దేవ్ యాన్ ఖాస్" అనునొండు బృహత్ప్రాసాదాభ్యంతరమున సభఁగావించెను. శివాజీ యచ్చోటునకుం బోయెను, భవనగర్భమున రత్నమాణిక్యవినిర్మిత సూ

ర్యరశ్మి ప్రతిఘాతమయూరసింహాసనముపైఁ జక్రవర్తియైనయౌరంగజీబు పవిష్టుఁడైయుండెను. సామ్రాట్టుని నలుకెలంకులందును రౌప్యనిర్మిత క్షుద్రావరణముండెను. దానికి వెలుపల భారతవర్షయగ్రగణ్యనృపులును, మన్సబదారులును, యుమారావులును, సేనాపతులును నిశ్శబ్దముగ నిలచియుండిరి. రాజసదనమున రామసింహుఁడు బ్రవేశించి, మహారాష్ట్రవీరునిఁ జక్రవర్తికిఁ జూపెను.

నేఁడు ఢిల్లీనగరాసాధారణశోభఁ గాంచినపుడే యౌరంగజీబు యొక్క యుద్దేశ్యము శివాజీ గుర్తెఱింగెను, ఈక్షణమున రాజసదనమందు బ్రవేశించిన పిమ్మట నావిషయమును మఱింతస్పష్టముగ గ్రహించెను. ఏశూరుఁడిరువది వత్సరములు పోరసలిపి స్వజాతిస్వాధీనతనుగాపాడి యాత్మరక్షణ మొనరించుకొనెనో, యేవీరుఁడు మహారాష్ట్రసీమనుండి జక్రవర్తి దర్శనార్థమై ఢిల్లీనగరమున కరుగుదెంచెనో, యట్టి యశఃకాము నెట్లీదినమున మొగలాయితేఁ డాహ్వానించెను ? శివాజీ నేఁడొక సామాన్యకర్మచారికరణి నమ్రభావమున రాజసదనమందు నిలచియుండెను. మహారాష్ట్రయోధుని రక్తనాళములందుష్ణశోణితము వడివడిగఁ బ్రవహింపసాగెను. కాని యతఁడీక్షణమున నిరుపాయుఁడు, సామాన్యోద్యోగిచాడ్పున నే యాశూరుఁడును సామ్రాట్టునకు "తస్లీమ్" గావించి రీత్యానుసారముగ "నజర్" నొసఁగెను. ఔరంగజీబు దూరోద్దేశ్యము సాధనమయ్యెను, శివాజీ యౌరంగజీబులు సమకక్షులు గారనియు, దాసుఁడు ప్రభువుతోను, క్షీణుఁడు బలిష్ఠునితోను సమర మొనరించుట మూర్ఖతయనియు జగమంతయు నెఱింగెను—శివాజీ యెఱింగెను.

ఈయుద్దేశ్యసాధనార్థమై యౌరంగజీబు "నజరు" నుగ్రహించెను; కాని యతఁడు శివాజీకెట్టి విశేషసమాదరణమును గావింపక నతనికి "పాంచ్ హజార్" (పంచసహస్ర)సైనికుల సేనాపతులనడుమ

స్థాన మొసఁగెను. శివాజీ నయనములపు డగ్నిచందమున బ్రజ్వలితముల య్యెను—అతని శరీరము కంపింపఁ దొడంగెను. ఓష్ఠముపై దంతస్థాపన మొనరించి గంభీరస్వరమున నతఁడపు డిట్లనియెను. "శివాజి యైదువేల సైనికులకు సేనానియా? చక్రవర్తి మహారాష్ట్ర దేశమునకుఁ బోయిన పుడు శివాజీ యధీనమున నెందఱు పంచసహస్ర సేనానులుండెనో యెఱిఁగి, వారలు దుర్బలహస్తములతో నసిధారణ మొనర్చరని దెలిసి కొనఁగలఁడు."

ఆవశ్యకీయ కార్యములు ముగిసిన వెనుక సభ చాలింపఁబడెను. చక్రవర్తి సింహాసనమునుండి లేచి, పార్శ్వస్థయుచ్చ శ్వేత శిలావినిర్మిత బేగముమహాలునందుఁ బ్రవేశించెను. అపుడు నదీస్రోతముభంగి దుర్గము నుండి నసంఖ్యజనస్రోతము నిర్గతముఁ గాఁ దొడంగెను. అందఱును తమ తమ నెలవులకుఁ జనిరి. సాగరమందువలె, విస్తీర్ణఢిల్లీనగరమం దచిర కాలములోనే లోకస్రోతమంతయు లీనమైపోయెను.

శివాజీ యావాసముకొఱకై నొకగృహము నిర్దిష్టము గావింపఁ బడెను. రోషాభిమానంబులుట్టిపడ సంధ్యాసమయమందు శివాజీ యా నిలయమందుఁ బ్రవేశించి, యేకాకియై యందుపవిష్టుండై యేదియోచింతింపసాగెను.

నేఁడు రాజసభయందు రుష్టుఁడై శివాజీ చక్రవర్తి సమ్ముఖమున వచించిన పలుకులను విని యౌరంగజేబు గినిసెననియు, చక్రవర్తి శివాజీకి దండనమేమియు విధింపనిచ్ఛగింపకున్నను, భవిష్యమున నతఁ డామొగలాయితేని దర్శన మొనరింప ననుమతిఁబొందఁడనియు, రాజసభయందతనికి స్థాన మొసఁగఁబడదనియు ననునొకవార్త యేకాకియై కూరుచునియున్న శివాజీకిఁ దెలుపఁబడెను.

శివాజీయపుడిట్లు భావింపఁ దొడంగెను. "భవిష్యనభము జలధరాచ్ఛన్నమైపోయెను! మృగయుఁ డెట్లు సింగమునుబట్ట జాలమును బ్రయోగించునో క్రూరాత్ముఁడును—దుష్టబుద్ధియు నైన నౌరంగజేబ ల్లె మెల్ల మెల్లగా నీశివాజీని బంధింప మంత్రణాజాలమును బ్రయోగించుచుండెను. ఈజాలమును విదీర్ణ మొనరించి మరల నేను స్వాధీనతా లాభము నొందఁగలనా? హా బాలయోగీ జానకీపతీ! చిరసమరమంత్రము నీవే యొసఁగితివి. నీగరీయసీపలుకులిపుడుకూడ నాకర్ణములందు శబ్దితములగుచుండెను. ఔరంగజేబూ! జాగ్రత! శివాజీ యింతదనుక నీనికటమున సత్యపాలన మొనరించెను. అతనికడనీవు చతురతఁ జూపకుము; యేలనన శివాజీ యీవిద్యయందు శిశువుఁ గాఁడు. నీచతురతను జూపినచో మహారాష్ట్రదేశమునఁ బ్రజ్వలితమగు సమరానలమందీ సుందర ఢిల్లీనగరము నీవిపుల ముసల్మాను సామ్రాజ్యమొకే మాఱుగ దగ్ధమగుట నిక్కువము. ఇందుకు భవానిదేవి సాక్షియై యుండుఁ గాక!"

ఇరువదియైదవప్రకరణము.

నిశీథయాగంతకుడు.

కతిపయదినములలో శివాజీ యౌరంగజేబుయుద్దేశ్యమును స్పష్టముగ గ్రహించెను. మహారాష్ట్రనాయకుఁడిఁక స్వదేశముఁ బోకుండనుండవలయుననియు జిరకాలము ఢిల్లీయందు బంధితుండై యుండవలెననియు మహారాష్ట్రులిఁకెపుడును స్వాధీనులై యుండరాదనియు నౌరంగజేబుద్దేశించుచుండెను. చక్రవర్తి యొక్క యీకపటాచరణముకతంబున శివాజీమిగులఁ గోపోద్దీపితుండై యుండెను. కాని యాశూరుడు తనరోషమును గోపన మొనరించి ఢిల్లీనుండిఁ బ్రస్థాపన మొనరింప నుపాయములఁ బన్నుచుండెను.

శివాజీయొక్క చిరవిశ్వస్థమంత్రియైన రఘునాథపంథన్యాయశాస్త్రి సర్వదా శివాజీతో నీవిషయమున నాలోచనమొనరించుచు నానారూపోపాయముల నుద్భావనమొనరించెను. అనేకయుక్తులనుబన్ని ప్రథమమున దేశపరిత్యాగమనార్థమై. చక్రవర్తినికటమున ననుమతి ప్రార్థనమొనరిగవ విధేయమనియు, నతఁడట్లనుమతి నొసంగనిచో నన్యోపాయోద్భావనమొనరించుట యుక్తమనియు వారలిరువురు స్థిరపఱచుకొనిరి.

న్యాయశాస్త్రి పండితప్రవరుఁడు వాక్పటుత్వమందగ్రగణ్యుఁడు అతఁడు శివాజీ యావేదనమును రాజసదనమునకుఁ గొనిపోవ సమ్మతించెను. ఆవేదనపత్రియందు శివాజీ యేయేకారణములచేఁ దాను ఢిల్లీ యరుదెంచెనో యవన్నియువిస్తరించి లిఖించెను! శివాజీ మొగలుసైనికులకు సహాయమొనరించి యేయేకార్యములనుసాధించెనో యౌరంగజేబే యేవిషయములనంగీకరించి దన్ను ఢిల్లీకిరమ్మని యాహ్వానించెనో యవికూడ స్పష్టాక్షరములతో నందు దర్శితములయ్యెను. పిదపశివాజీ యిట్లుప్రార్థనమొనరించెను. "నేనే కార్యమునుసాధింప నంగీకారమొనరించితినో దానినిపుడుకూడ సాధింప సంసిద్ధుఁడనై యున్నాఁడను. విజయపుర గోల్కొండరాజ్యములను మీయధీనమునకుఁ గొనివచ్చుటకెంతదనుకసాధ్యమగునో సహాయమొనరించెదను. అథవా, తాము నాసహాయమునుగ్రహించి యనుమతినొసంగినచో నిజజాగీరుకడకు మగుడిజనియెదను. ఏలనన; హిందుస్థానజలవాయువులు నాయనుచరులకును నాసైనికులకునుఁ జాలయస్వాస్థ్యకరములై యుండెను. ఈదేశమందు మేముండుట సంభవముకాదు."

రఘునాథపంథన్యాయశాస్త్రి యీయావేదనపత్రముఁ గొని చక్రవర్తిసదనమున కరిగిదాని నౌరంగజేబునకొసంగెను. చక్రవర్తియు నక్షణమందేఁ బ్రత్యుత్తరమొసఁగెను. ఆయుత్తరమందనేక విషయ

ములు లిఖింపఁబడెను; కాని శివాజీయొక్క పరిత్యాగమన యనుమతందులేదు. తన్ను చిరబంధితుఁ జేయవలయుననియే చక్రవర్తియొక్క యేకమాత్రోద్దేశ్యమని శివాజీస్పష్టముగ నెఱింగెను. తదనంతరమున ననుదినము బలాయనమొనరింప నతఁడుపాయములఁ బన్నఁదొడఁగెను.

పూర్వోక్తఘటన కతిపయదివాంతరమున నొకనాటి సంధ్యాసమయమున శివాజీ గవాక్షపార్శ్వమునఁ జింతితభావమున నుపవిష్టుఁడై యుండెను. భానుఁడస్తాద్రిఁగ్రుంకెను. కాని యింకను యిరులు గ్రమ్ముకొనలేదు. రాజపథమునుండి జనస్రోతమిపుడుకూడ నవిరతముగ వహించుచుండెను. భిన్నభిన్నదేశములనుండి యనేకలోకులు బహువిధపరిచ్ఛదములనుదాల్చి వివిధకార్యనిర్వాహణార్థమై యీరాజధానికరుదెంచిరి. అపుడపుడొకరిద్దరు శ్వేతాంగమొగలాయీలు సదర్పముగఁబోవుచుండిరి; అపేక్షాకృతకృష్ణవర్ణయసంఖ్య హిందువులును, ముసల్మానులును సర్వదా యితస్తతఃభ్రమణమొనరించుచుండిరి. ఒకరిరువురు కృష్ణవర్ణకాఫ్రీలుకూడ నపుడపుడు గన్పట్టుచుండిర. పారస్యయరాబియా, తార్తారు, తురుష్కదేశములనుండివణిజులును "ముసాఫర్"లునీ సమృద్ధనగరియందు గమనాగమన మొనరించుచుండిరి. ముసల్మాను హిందూసేనాపతులును రాజమన్సవదారులాదిపురుషులనేకులు సమన్వితులై మహాసమారోహమున దంతావళఘోటకశిబికలను వేత్ర్వేఱుఁగ నారోహించి పోవుచుండిరి. సైనికులొకరితో నొకరు పరిహాసములసలుపుకొనుచుఁ గౌతుకమనస్కులై మెల్లమెల్లగఁ బథమునతివాహనమొనర్చుచుండిరి. విక్రేతులు తమతమ పణ్యద్రవ్యములను మస్తకములందిడుకొని చీత్కారమొనరించుచుఁ జనుచుండిరి. ఏతద్భిన్నయన్యసహస్రజనులు సహస్రకార్యములను నిర్వహింప నలిలము చాడ్పున యాతాయాత మొనరించుచుండిరి.

క్రమక్రమముగఁ బథికప్రవాహము హ్రాసముగాఁ దొడంగెను. ఢిల్లీయందలి యసంఖ్యాకులైన దుకాణదారులు తమతమ యంగడులను మూసివైవసాగిరి. నగరమందలి యసంతకలవరము క్రమక్రమముగ క్షీణింపఁ దొడంగెను. ఒకటి రెండు నిలయముల గవాక్షపథములనుండి దీపశిఖలు గన్పట్టుచుండెను. దూరస్థభవనశ్రేణులు క్రమక్రమముగ దిమిరావృతములుగాఁ దొడంగెను. నభమందొకటి రెండు తారలుమాత్రము గన్పట్టుచుండెను. పశ్చిమదిక్కున రక్తిమచ్ఛటయింక నగపడుటలేదు. శివాజీ పూర్వదిక్కుగఁ దిలకించెను. శాంతవిస్తీర్ణదిగంతప్రవాహినియైన యమునాస్రవంతి సాగరాభిముఖమున నాసాయంకాలమందు నిస్తబ్ధముగ యాత్రఁ గావించుచుండెను. మహారాష్ట్రవీరుఁడది గాంచి సంతససిక్తహృదయుఁడయ్యెను.

ఆనిస్తబ్ధతమధ్యమున జుమ్మామసీదునుండి యాజానము ("నమాన్") యొక్క పవిత్రశబ్దముత్థితమయ్యెను. ఆగంభీరశబ్దము మెల్లమెల్లగ నలుకెలంకులందును విస్తీర్ణముగాఁ దొడంగెను. అదియెల్లసల్లన మానవుల మనముల నాకర్షించి గగనసీమను జేరెను. శివాజీ ముహూర్తమువఱకు స్తబ్ధుడై యాసాయంకాలీన సుదూరోచ్చారిత గంభీరశబ్దమును శ్రవణమొనరింపసాగెను. మరల నతఁడంధకారమునఁ దనదృక్కులఁ బఱపెను. జుమ్మామసీదుయొక్క శ్వేతప్రస్తరవినిర్మితశిఖరములు సునీలయాకాశపటమందస్పష్టముగఁ గన్పట్టుచుండెను. ప్రాసాదరుధిరరాగ యున్నతప్రాచీరము దూరమున గిరిశ్రేణివడువున దృష్టమగుచుండెను. ఏతద్భిన్న సమస్తనగరము తిమిరాచ్ఛాదితమైనైశ నిస్తబ్ధతయందు స్తబ్ధమైయుండెను.

రజని గభీరమయ్యెను. కాని శివాజీయొక్క చింతామాత్రమింక నుచ్ఛిన్నము కాలేదు; ఏలనన నేఁడు పూర్వవృత్తాంతము క్రమక్రమముగ నతని యెదయందు జాగరితమగుచుండెను. బాల్యకాలనుహృద్వ

ర్గము శైశవసమయయాశ, యుద్దేశ్యము, యుద్యమము, సాహసము శౌర్యోపేత యున్నతచరిత్రజనకుఁడు (షాహజీ) పితృతుల్య బాల్యగురుఁడైదాదాజీకనాయి వృ గరీయసియైన మాత (జీజీ) క్రమక్రమముగ నతని భావనాపథమునఁ గన్పట్టుచుండెను. ఆతని వీరమాతయే శిశువైన శివాజీకి మహారాష్ట్ర జయవిశేషములను దెలిపియుండెను. ఆవీరమాతయే బాలకుఁడైన శివాజీ వీరకార్యప్రవృత్తుఁ గావించెను. ఆవీరమాతయే శివాజీకి విషాదమందాశ్వాసమొసంగెను. ఆహవమందుత్సాహము నొసఁగెను.

పిదప యౌవనసమయోన్నతయాశ, యుదారకార్యతత్పరత దుర్గవిజయము, దేశవిజయము, రాజ్యవిజయము, విషాదము వెనుక విషాదము సమరానంతరమున సమరము, అపూర్వజయలక్ష్మి, దోర్దండప్రతాపము దుర్దమనీయయుచ్చాభిలాషము, వీనినన్నిఁటి నావీరుఁడు దలపోయఁదొడంగెను. వింశవత్సరములనతఁడు పర్యాలోచనమొనరించి యాది ప్రతివత్సరము నపూర్వవిజయము చేతను నసమసాహసకార్యము చేతను నంకితమై సముజ్జ్వలమైయుండుట నెఱింగెను.

"ఆకార్యతత్పరత వ్యర్థమైపోయెనా? లేదు. ఆయాశ మాయావినియా? కాదు; ఇప్పుడుకూడ భవిష్యాంబరమందు మాన్యనక్షత్రము లీనమైయుండెను; ఇప్పుడుకూడ భారతవర్షమందు ముసల్మానురాజ్యమవసానమగును; హిందూచక్రవర్తి మస్తకోపరిభాగమున రాజచ్ఛత్రమున్నతమైయుండును."

ఈవిధముగ శివాజీ చింతించుచుండ నిశియందలి ప్రథమయామమును దెలుపు ఘంటమ్రోగింపఁబడెను. రాజప్రాసాదమందలి "నాగరాఖాన"నుండి యాశబ్దముత్పన్నమై సమస్తవిస్తీర్ణనగరమందును పరివ్యాప్తమయ్యెను.

ఆగంభీరశబ్దము నైశనిశ్శబ్దతయందు బహుదూరపర్యంతము శ్రుతమయ్యెను. ఆకాశగర్భమందా శబ్దమింకను లీనముగాలేదు, ఇట్టితరి శివాజీ యున్మీలితగవాక్షద్వారమున నొక దీ మనుష్యమూర్తి నిఁగాంచెను. కృష్ణవర్ణాంధకారా యాకాశపటమందొక దీర్ఘనిశ్చేష్టప్రతికృతిచాడ్పున నామూర్తి నిలచియుండెను.

శివాజీ విస్మితుఁడై నిలువంబడి యామూర్తిపై తీక్ష్ణదృక్కులను బఱపి యొరనుండికరవాలమును సగమువఱకు బహిర్గతముగావించెను. అపరిచితుఁడైన ఆయాగంతుకుఁడు దానిని లక్ష్యింపక మెల్లమెల్లగా గవాక్షమార్గమునుండి గృహములోనికిఁబ్రవేశించి లలాటభ్రూయుగళముపైనున్న నైశశిశిరమును మెల్లగ మోచనమొనరించెను.

శివాజీ తీక్ష్ణనయనుండై యానిర్భీకాగంతుకుని వీక్షింపఁదొడంగెను. అతనియుత్తమాంగము జటాజూటవిరాజితమైయుండెను. శరీరమంతయు విభూతిచే నలమఁబడియుండెను. అతనికరమందుఁగాని కటిప్రదేశమునఁగాని నెట్టియాయుధమును లేదు. అటులైన నాయాగంతుకుఁడు శివాజీనిహతి మొనరింప చక్రవర్తిప్రేరితుఁడై యటకు రాలేదు. దానిం జేసి యతఁడెవరైయుండును?

తీక్ష్ణనేత్రుఁడై ఆయంధకారగృహాభ్యంతరమున శివాజీవిలక్షించి యాగంతుకుఁడిట్లనెను. “మహారాజునకు జయమొదవుగాక!”

అంధకారమున నావ్యక్తి యాకృతినిఁగాంచి శివాజీ యతనిని గుర్తింపఁజాలకపోయెను; కాని యతని కంఠశబ్దమును వినినతోడనే యతనినిగుఱుతించెను. జగమందు ప్రకృతమిత్రులతివిరళముగనుందురు—విషాదసమయములందిట్టి చెలిమికాండ్రు గన్పట్టినచో హృదయము నృత్యమొనరించుచు నుప్పొంగును. బాలయోగియైన జానకీపతికి ప్రణామమొనరించి శివాజీ ప్రేమపురస్సరముగ నతని నాలింగనమాచరించుకొని యతనిని దననికటమునఁ గూర్చుండఁజేసెను. అతఁడు ప్రకాశదీపము నుజ్వలించి మిగుల నౌత్సుక్యసహితముగ జడదారినిట్లు ప్రశ్నింపదొడంగెను. “మిత్రప్రవరా! రాయగరవార్తలేమి? తామెటనుండి యెప్పుడేరీతిని యరుగుదెంచితిరి? ఏయుద్దేశ్యమున మీరింత దూరముఁ బ్రయాణఁదీసికొని నడచివచ్చితిరి? ఇట్టినిశీథమున గవాక్షద్వారమునుండి నాకడకు దా మరుదెంచుటకుఁ గతమేమి?”

నకీపతి—మహారాజా! రాయగరదుర్గవార్తలన్నియు బాగుగనేయున్నవి? మీ రేసచివప్రవరులహస్తములందు రాజ్యభారమును న్యస్తముగావించితిరో వారలయధీనమున రాజ్యమునకెట్టియమంగళమును గలుఁగనేరదు. కాని యీవిషయమును నేను బాగుగఁ నెఱుంగను. ఏలనన మీరు రాయగరదుర్గమును విడచినపిదప నేనచటఁ జాలదివసములుండలేదు. నావ్రతసాధనార్థమై దేశదేశములందును పర్యటనమొనరింపవలయునని పూర్వమే మీకుఁదెలిపియుంటిని. దానిం జేసియే మధురప్రభృతితీర్థస్థానదర్శనార్థమైఁబోవుచు నేఁడు ఢిల్లీకరుగుదెంచితిని, దివ కానిండు లేక నిశి కానిండు, ప్రభుదర్శనమెప్పుడగునో యప్పుడే నాకు సౌభాగ్యము సేకూరును.

శివాజీ—మీకటాక్ష మటులున్నను విశేషకారణమేదియు లేనిచో నీనిశీథమందుఁ దామీగవాక్షమునుండి యిటఁ బ్రవేశింపరు. ఆకారణమేమియో ప్రకాశమొనరింపుఁడు.

జానకీపతి—అటుల నేనివేదనమొనరించెదను. కాని ప్రభువు యిచటకేతెంచినప్పటినుండియుఁ గుశలముగనుంటిరో లేదో ప్రథమమునఁ దెలుపఁగోరెదను.

శివాజీ—శారీరకకుశల మున్నది. కాని శత్రుమధ్యమున మనోకుశల మెటులుండును?

జానకీపతి—చక్రవర్తికిని దేవరకును సంధియయ్యెనుగదా? ఇఁక మీకు శత్రులెవరు?

శివాజీ—మండూకభుజంగముల సంధి యెంతకాలము స్థాయిగనుండును? బాలమునిచంద్రా! అవశ్యముగ మీరంతయు నెఱిఁగే యుండిరి. ఇఁకనన్ను లజ్జితుఁ గావింపకుఁడు. రాయగరమందు మీరు వచించిన పలుకుల వాలించియుండినచోఁ గంకణదేనగిరిపార్శ్వ శైల కందరములందు నేఁడుకూడ స్వాధీనుఁడనై సుఖంబుగ నుండెడివాఁడను ఖలుఁడైన చక్రవర్తి వచనములందు విశ్వాసముంచి ఢిల్లీనగరమందు బంధితుఁడనై యుండకనే యుండెడివాఁడను.

జానకీపతి—ప్రభూ! ఆత్మతిరస్కారముఁ గావింపకుఁడు. మనుష్యమాత్రులందఱును భ్రాంతియధీనులు; ఈజగమంతయు భ్రమపరిపూర్ణమైయుండెను. విశేషముగ నీవిషయమందుఁ దమదోషమాత్రము లేదు. సంధివాక్యములను విశ్వసించి, సదాచారప్రదర్శనమొనరించి మీరీప్రదేశమున కరుదెంచితిరి, ఎవండ సదాచరణకపటవృత్తులందు దోషియౌనో, జగదీశ్వరుఁడవశ్యముగ నతనికే దండనవిధించును. ప్రభూ! ఖలతవలనజయము సేకూరనేరదు. నేఁ డౌరంజేబు పాపమొనరించి మిమ్మిట రుద్ధమొనరించెనో, ఆపాపముందే సవంశముగనతఁడు నిధనుఁడు కాఁగలఁడు. రాజేంద్రా! మీరు రాయగరమం దేవచనములనుచ్ఛరించియుండిరో, మహారాష్ట్రదేశమందా పలుకులనిపుడుకూడ నేరును మఱువలేదు; ఔరంగజేబు కపటాచరణమొనరించినచో, మహారాష్ట్రసీమయందుఁ బ్రజ్వలితమగు సమరానలమందు సమస్తమొగలసామ్రాజ్యము దగ్ధమైపోవును.

ఉత్సాహాహ్లాదములతో శివాజీనయనయుగళము కాంతివంతమయ్యెను. సంతోషమనస్కుఁడైన యామహారాష్ట్రవీరుఁడు మరలనిట్లనెను. "ఋషికుంజరమా! ఆయాశయింకను నంతరించలేదు. మహారాష్ట్రజీవనము శేషించలేదని యౌరంగజేబిపుడుకూడ నెఱుఁగఁగలఁడు. కాని! వీరాగ్రగణ్యులైన నా సైనికులు మొగలాయిలతోఁ దుముల సంగ్రామమందు లిప్తులైయుండుతరి నేనీదూరఢిల్లీనగరమందు నిశ్చేష్టబంధింతుఁడనైయుందునా?"

యోగివరుఁడు—ఔరంగజేబెపుడు గగనసంచారియైన వాయుదేవుని జాలమధ్యమున రుద్ధమొనరింపశక్తుఁడగునో యపుడు మిమ్ము ఢిల్లీప్రాచీరాభ్యంతరమున బంధితుగనుంపఁగలఁడు. అంతకుఁబూర్వమం దతఁడట్లొనరింపఁజాలఁడు.

శివాజీ మందహాసమొనరించి మెల్లగనిట్లనెను.

"అట్లైనచోఁ బలాయనోపాయోద్భావన మొనరించి యేతామిట కరుదెంచియుందురు. దానిని నాకు విన్నవించుటకొఱకే యాతిఋన—గుప్తభాగమున నేఁడీగంభీరాంధకారనిశియందీతావున కేతెంచియుందురు."

జానకీ—తీక్ష్ణబుద్ధిగల ప్రభునికడ నేదిగాని గోపనముగనుంచుట యసంభవము.

శివాజీ—ఆయుపాయమేమి?

జానకీ—అంధకారనిశియందు దేవర ప్రచ్ఛన్నవేషులై అనాయాసముగ గృహమునుండి వెలుపలకుఁబోఁగలుఁగుదురు. ఢిల్లీకినలువైపులందును యున్నతములై ప్రాచీరములున్నను పూర్వదిక్కుననొకచోఁ బ్రాచీరాభ్యంతరమున నొండు లోహశలాకము స్థాపితమైయుండెను. తద్ద్వారా ప్రాచీరమునుల్లంఘన మొనర్చుట మహారాష్ట్రవీరునకసాధ్యము కాదు; అపరపార్శ్వమున నొక జలయానమున్నది. అందెనమండుగురు మల్లవీరులుగలరు. దేవర దానిఁజేరినచో వాతరియాతరి నిమేషమధ్యమునఁ దమ్ముమథురకుఁ గొనిపోవును. అచట ప్రభునకనేక మిత్రులుండిరి. అనేకహిందూదేవాలయములందనేక ధర్మాత్మపురోహితులుండిరి.

అచటనుండి దేవరయనాయాసముగ స్వదేశమునకుఁ బోఁగలుఁగుదురు.

శివాజీ——మీప్రయత్నములను విని చాల సంతుష్టుఁడనైతిని. తామప్రకృతమిత్రులనుట కింకొక నిదర్శనమునను గాంచితిని. కాని ప్రాచీరోల్లంఘన సమయమున నేరైన నన్ను వీక్షింపఁగలిగినచో బలాయనము దుస్సాధ్యమగును; ఔరంగజేబుహస్తములందు మృతించుట నిశ్చయమగును.

జానకీ——ప్రాచీరమున లోహశలాకము స్థాపితమైన ప్రదేశమున కనతిదూరమున మీసైనికులతో బదిమంది విలుకాండ్రు ప్రచ్ఛన్నవేషులై దాఁగియుండిరి. ప్రభునేరైనఁ గాంచగలిఁగి గతిరోధన మొనరించినచో, వారలుహతులగుటనిశ్చయము.

శివాజీ——బాగుగనేయున్నది. నౌకాగమనకాలమునఁ దీరమందలి ప్రహారులు సందేహప్రయుక్తమునఁ బ్లవమునుబట్టఁ బ్రయత్నించిన నేమి జేయనగును?

జానకీ——ఛద్మవేషులైయుండు నెనమండుగురు నౌకావాహకులు మీయధీనమందలి యోధులే. వారలశరీరములు కవచాచ్ఛాదితములై తూణపరిపూర్ణములైయుండును. సాహసించి యేరును తరణీగతిరోధ మొనరింపఁజాలరు.

శివాజీ——మధురఁజేరినయనంతరము నెట్టిమిత్రుఁడును గన్పట్టనిచో నేమి గావింపనగును ?

బాలయోగి——మీపేష్వాయొక్క భగినీపతి మధురయందుండెను. అతఁడు మీచిరపరిచితుఁడు.విశ్వస్తుఁడు. ఈవిషయము మీ కెఱిగినదే. నేఁడే నతని నికటమునుండియే యరుదెంచితిని. అతడంతయు సన్నాహ మొనరించి యుంచెను. అతనిచే లిఖింపఁబడిన లేఖను జదువుకొనుఁడు,

వస్త్రాభ్యంతరమునుండి యొండుపత్రమును వెలుపలకుఁదీసి సన్యాసి దానిని శివాజీకరములందుంచెను, శివాజీమందహాస మొనరించి యుత్తరమును మరల జటదారి హస్తములందుంచి "మీరు చదివి వినిపింపుఁ" డనియెను.

పరివ్రాజకుఁడు లజ్జితుఁడయ్యెను. శివాజీ తన నామమునైనను లిఖింపఁజాలఁడనియు నతఁ డెపుడును వ్రాయఁ జదువ నేర్చుకొనలేదనియు సన్యాసి యపుడు జ్ఞప్తి నొందెను.

జానకీపతియపుడు లేఖనంతయుఁజదివి శివాజీకివినిపించెను. ఏమేమి యావశ్యకమో మురేశ్వరుని బావమఱంది స్థిరముఁగావించెను. పత్రమందు విస్తీర్ణముగ లిఖింపఁబడియున్నది.

శివాజీఅపుడిట్లనియెను."యోగీంద్రా! మీజీవనమంతయు యాగయజ్ఞములతో నతివాహితమైనదను విషయ మెపుడును యేరికినిదోఁచదు. శివాజీయొక్క ప్రధానమంత్రికూడ దమకంటె సుందరరూపమున నుపాయము నాలోచింపశక్తుఁడు కాఁడు. కాని యిపుడుకూడ దమకెఱింగింపవలయు విశేష మొండుగలదు. నేను పలాయన మొనర్చినచో నాపుత్రుఁడును,నావిశ్వస్తమంత్రియైన రఘునాథపంథుఁడును, ప్రియసుహృదులైన తన్నజీమాలశ్రీలును యెచటనుందురు? నావిశ్వస్తసైనికులుకూడ నెట్లౌరంగజేబు కోపానలమునుండి బరిత్రాణము నొందెదరు?"

బాలయోగి——మీపుత్రమిత్రమంత్రులు మీతోడనే నేఁటి నిశియందే వెలుపలకుఁ బోఁగలుగుదురు, మీసైనికులు ఢిల్లీయందుండినను, నెట్టిహానియు వారలకుఁ గలుఁగనేరదు, ఔరంగజేబు వారలనేమి కావింపఁగలఁడు. అగత్యముగ వారలను వదలివైచును,

శివాజీ——మునిచంద్రమా! మీ కౌరంగజేబు నెఱుంగరు:

అతఁడు తనసోదరులనువధించి సింహాసనారూఢుఁడయ్యెను.

బాలయోగి—మీసైనికులపైనతఁడు కఠోరయాదేశ మొసంగినచో నేమహారాష్ట్రసైనికుఁడు మీనిరాపదవార్తను విని యుల్లాసపురస్సరముగ ప్రాణవిసర్జన మొనరింపఁడు?

శివాజీ క్షణకాలము నీరవుఁడై చింతించెను. తదనంతరమున నామహానుభావుఁడు మెల్లగనిట్లనెను: "యతిసింహమా! మీయత్నప్రియాలకతంబున నేను తమకడ చిరబాధితుఁడనై యుందును; కాని శివాజీ తనవిశ్వస్త చిరపాలితభృత్యులను విషాదమందుఁబడవైచి తన యుద్ధారము నిచ్చగింపఁడు. ఇట్టి భీరుతాకార్యము నెపుడును గావింప నేరఁడు. మహాత్మా! అన్యోపాయమేదైన నాలోచింపుఁడు. లేకున్న నీ యత్నమును త్యజింపుఁడు."

బాలయోగి—మఱే తెఱవును లేదు.

శివాజీ—అట్లైన సమయ మొసంగుఁడు. శివాజీకిది ప్రథమవిషాదము కాదు. ఉపాయము నాలోచించుటయందు శివాజీయెప్పుడును పరాఙ్ముఖుఁడుగా లేదు.

బాలయోగి—సమయములేదు. నేఁటినిశియందే తాము పలాయన మొనర్పవలయును. లేకున్న నేఁడు తాము పలాయన మొనరించుట నిషిద్ధమగును.

శివాజీ—తా మేయోగబలమున నిశ్చయించితిరో నేను దెలిసికొనఁజాలను. కాని మీవచనములు యథార్థములైనను శివాజీయొసఁగు నన్యోత్తర మేమియు లేదు. శివాజీ ఆశ్రితప్రతిపాలితపురుషులను విషాదమందుఁ బడఁద్రోచి యాత్మపరిత్రాణము గావింపఁడు. యతిచంద్రా! ఇది క్షత్రియులధర్మము కాదు.

బాలయోగి—ప్రభూ! విశ్వాసఘాతుకులకుఁ దగు శాస్తిఁగా [illegible]సే క్షత్రియధర్మము. ఔరంగజేబునకు శాస్తిదానముఁగావి

పుఁడు. మహారాష్ట్రదేశమునకుఁ బ్రత్యావర్తన మొనరింపుఁడు. అచటనుండి సాగరతరంగములవడువున సమరతరంగములను ప్రవాహిత మొనరింపుఁడు. అచిరకాలములో నౌరంగజేబు సుఖస్వప్నము భంగమగును. అచిరమందే యాయఘప్రపూర్ణ సామ్రాజ్య మతలజలముచే మగ్నమగును.

శివాజీ—మునివృషభమా! ఎవండు బ్రహ్మాండమునకు ఱేఁడో యతఁడే విశ్వాసఘాతుకులకు దగుదండన మొనరించును. నావచనముల నవధారణ మొనరింపుఁడు. అట్లగుట కధికవిలంబము లేదు. శివాజీ యాశ్రితజనులను త్యజింపఁడు.

బాలయోగి—ప్రభూ! ఇంతవిలంబమైనను యీప్రతిజ్ఞను వదలివైచుఁడు. యిప్పుడైనను వివేచన మొనర్చించి యాదేశ మొనరింపుఁడు, ఎల్లి దాము బంధితులగుదురు.

శివాజీ—అటులేగానిమ్ము. శివాజీయాశ్రితులనుపరిత్యజింపఁడు. ఆప్రతిజ్ఞ యవిచలితమైనది.

యోగి నీరవుఁడైయుండెను. అతనినయనము లశ్రుబిందుపూర్ణములైయుండుట శివాజీగాంచి శంకాసంకలితస్వాంతుఁడై ఋషీంద్రునిహస్తములనుగ్రహించి యిట్లనెను, "మహాత్మా! మన్నింపుఁడు. మీయత్నములను మీప్రియాసను మీప్రణయమును నేనీకంఠముల నసువులున్నంతదనుక మఱువను. రాయగరమందలి మీవీరమంత్రమును, ఢిల్లీయందు నన్నుద్ధరింప నింతదూరము మీరుసలిపినయుద్యోగమును చిరకాలము నాహృదయాంతరాళమున నంకితమైయుండును. మీరు నాకడనేయుండుఁడు. మీయాదేశానుసారముగ నచిరకాలములోనే యందఱిని యుద్ధరించుటకేదేనిసాధనమును గావింతము

బాలయోగి—ప్రభూ! మీయిష్టవాక్యములచే నేను యథో

చితపురస్కృతుఁడనై తిని, మీనికటమున నుండుటకంటె యన్యాభిలాష నాకు లేదు. ఇది జగదీశ్వరుఁడెఱుఁగును. కాని నావ్రతమలంఘనీయము. వ్రతసాధనార్థమై నానాస్థానములకును నానాకార్య నిర్వాహణార్థము నేఁబోవలయును. ఇచట నవస్థితుఁడనై యుండుట యసంభవము.

శివాజీ—ఇదెట్టి యసాధారణవ్రతమో యెఱుఁగఁజాలకుంటిని. స్వామీజీ! ఇట్టి కఠోరవ్రతధారణ మొనరించుటకుఁ గతమేమి?

జడదారి—సమస్తము నిప్పుడెట్లు విస్తరించి తమకుఁ దెలుపఁగలను? దివసమున రాజదర్శనము నిషిద్ధము—ఇది నాసాధనమందలి యొకయంగము.

శివాజీ—మంచిది. ఈవ్రతము నేయుద్దేశ్యమున ధారణ మొనరించితిరి?

క్షణకాలము చింతించి యోగిపుంగవుఁ డిట్లనియెను.

“నా లలాటమందొక యమంగళము లిఖితమైయున్నది. బాల్యకాలమునుండియు నేనేయిష్టదేవతకుఁ బూజ నొనర్చుచుంటినో, యేదేవసముని నామమును జప మొనరించి జీవనధారణముఁ గావించియుంటినో ఆయిష్టసురుఁడు విధినిర్బంధమున నాయెడల విముఖుఁడైయుండెను. ఆయమంగళఖండనార్థమయ్యే యీవ్రతమును బూనియుంటిని.”

శివాజీ—ఈయమంగళము నేరుగణన మొనరించి తమకుఁ దెలిపిరి? ఆమంగళఖండనార్థమీవిషమవ్రతమును బూనుఁడని యెవరు తమతో వచించియుండిరి?

బాలయోగి—కార్యవశతః స్వయముఁగ నేనే దీని నెఱుంగఁగలిగితిని. దుర్గమందిరమున నొకయోగిని యీవ్రతమును బూనుమని నా కాదేశ మొసఁగెను. ఇదిసఫలమగుచో దమకడనంతయు నివేదన

మొనరించెదను. లేక నకృతార్థుఁడనైనచో నీయకించన చమత్కారజీవనమును త్యజించివై చెదను. ఎవరిపూజార్థమై జీవనధారణ మొనరించితినో యతఁడు విముఖుఁడైనచో యీజీవనమున నిలువవలయు నవశ్యమేమున్నది?

శివాజీ—మునిశార్దూలమా! మీరువచించినది యథార్థమే. ఎవరినిమిత్తమై యనువులఁ బాయవెఱువమో యెవరికొఱకై యాత్మసమర్పణముఁ గావించెదమో యతని యసంతోషముకంటె జగతియందు మర్మభేదమైన దుఃఖము మఱొండేదియు లేదు.

జడదారి—ప్రభూ! తామెప్పుడైనను యిట్టియాతనము ననుభవించియుంటిరా?

శివాజీ—జగదీశ్వరుఁడు నన్ను మన్నించుగాక! నేనొక నిర్దోషియైన వీరపురుషున కిట్టియాతనము నొసంగితిని. ఆబాలకుని విషయమును స్మరించినచో నిప్పుడుకూడ సమయసమయములందు నాహృదయమందు వేదనముత్పన్నమగును.

బాలయోగి—ఆ బాలుని పేరేమి?

శివాజీ—రఘునాథ యోధుఁడు!

అప్పుడానిలయమందలి ప్రదీపము నిర్వాణమైపోయెను. దీపము నుజ్వాలింప శివాజీ యుద్యుక్తుఁడయ్యెను. అట్టితరి యోగిప్రవరుఁడిట్లనియెను. “దీపమనావశ్యకము. వచింపుఁడు, వినుచుంటిని.”

శివా—ఇఁక నేమివచింపను! బాలకవేషుఁడైన యావీరపురుషుఁడు నాకడకరుదెంచి సైనికకార్యమందుఁ బ్రవృత్తుఁడై మూఁడువత్సరములుండెను. అతనిముఖమండల ముదారమైనది, యోగీంద్రా! అతనియున్నతలలాటోజ్జ్వలనయనములు మీముఖమండల తేజఃపూర్ణనేత్రములచాడ్పున నుండెడివి. కాని యాబాలకుఁడు మీకంటె యొకిం

చుకపిన్నవాఁడు. మీవలె నతనికి బుద్ధిప్రఖరత లేదుకాని ఆయున్నత హృదయమందు దమయందువలెనే దుర్దమనీయవీరత్వసాహసములు సర్వదా విరాజములగుచుండెడివి. మీబలిష్ఠోన్నతదేహమును గాంచినపుడెల్లను మీపరిష్కారకంఠస్వరమును వినినపుడెల్లను మీవీరోచితవిక్రమమునుగూర్చి దలఁచినపుడెల్లను ఆబాలకునివృత్తాంతము సర్వదాహృదయమందు జాగరితమగుచుండును.

బాలయోగి—తదనంతరము?

శివా—ఆబాలకు నేదినమున ప్రథమమునఁ గాంచితినో ఆదినమందే యతను ప్రకృతవీరుఁడని గుర్తెఱింగితిని. ఆదినమందే నానిజాసి నెం డతనికొసంగితిని. రఘునాథజీ ఆకృపాణమున కవమాననమొనరించియుండలేదు. విపత్సమయమునసర్వదా యతఁడు నాఛాయవగిది నానికటమున నుండెడివాఁడు. సమరసమయములందతఁడు తనదుర్దమనీయ తేజముమూలమున శత్రురేఖలనుభేదించి మున్ముందునకు లంఘించువాఁడు, ఆవీరప్రకృతి, ఆకృష్ణకేశగుచ్ఛములు, ఆయుజ్జ్వల నయనములు, యిపుడుకూడ నానేత్రములకుఁ గట్టినట్లుండెను.

బాలయోగి—తదనంతరమున?

శివాజీ—ఆబాలకుఁడొకభండనమందు నాయసువులఁగాపాడెను. మఱొండు యాహవమం దతని యనిర్వచనీయవిక్రమకతముననే దుర్గజయమయ్యెను. అనేకరణములం దాశూరశిఖామణి తనయసాధారణ పరాక్రమమును ప్రకాశముఁగావించెను.

బాలయోగి—తదనంతరమున?

శివాజీ—ఇఁక ప్రశ్నించెద రేల ? నేనొకనాఁడు భ్రమయందు బడితుఁడనై విశ్వసనీయుఁడైన ఆయనుచరు నవమానించి కార్యమునుండి దూరీకృతుఁ గావించితిని. శేషపర్యంతముకూడ రఘునాథజీ యొక్క కర్కశవచనమునైన యుచ్చరింపలేదు. పోవుసమయమందుఁ

గూడ నాయుదారపురుషుఁడు నావైపుగ దిరిగి మస్తకన్యస్తహస్తుఁడై వెడలిచనెను.

మహారాష్ట్ర శూరునికంఠము రుద్ధమైపోయెను. అతని నయనయుగళమునుండి బాష్పవారి యవారిగఁ బ్రవహింపఁదొడంగెను. చాల సేపటివఱకును వారిరువురిలో నెరును మాటాడఁజాలకుండిరి. పిదప మునిప్రవరుఁడిట్లనియెను. "అందాక్షేపణీయమైన కారణమేమున్నదిఁ దోషినిదండించుటే రాజధర్మము."

శివాజీ—దోషియా? రఘునాథుని యున్నతచరిత్రమందు లేశమాత్రమైన దోషము లేదు—అతఁడు నిష్కళంకుఁడైన పురుషుఁడు, నేనట్టికుక్షణమందు భ్రాంతుఁడనైతినో యెఱుఁగలేకుంటిని. సమరరంగమున కేతెంచుటకు రఘునాథునకొకింత విలంబమయ్యెను. నేనతఁడు విద్రోహియని భావించితిని, ఆలపూర్వమునఁ దనపురోహితునికడ నాశీర్వాదమును గ్రహించుటకై రఘునాథజీ పోయియుండెననియు, దానింజేసియే విలంబమయ్యెననియు మహానుభావుఁడైన జయసింహు, డీవిషయము ననుసంధానమొనరించి, దెలిసికొనియెను. నిర్దోషియైన యీమహాత్ముని నవమానించితిని. ఆయవమానమును సహింపనేరక రఘునాథజీ ప్రాణత్యాగముఁ గావించెననియుంటిని. సంగ్రామమందతఁడు నాప్రాణములనురక్షించెను. నేనతనిప్రాణముల వినాశమొనరించితిని. నావగిది కృతఘ్నుఁడును మహాపాపియు నీ రేడుజగములందును గానరాడు.

మహారాష్ట్రుఁడు నీరవుఁడై విలపింపఁదొడంగెను. అతనిపలుకులు శేషించెను. అతనివాక్శక్తి రుద్ధమైపోయెను; అతఁడట్లే నీరవుఁడై యుండిపోయెను, చాలసేపైనపిదప శివాజీ "యోగీంద్రా!" యనిపిలచెను.

ప్రత్యుత్తరమేమియు రాలేదు. కించిత్ విస్మితుఁడై యతఁడు ప్రదీపముసుజ్వలించెను; బాలయోగి ఆనిలయమందు లేఁడు

ఇఱువదియాఱవప్రకరణము.

ఔరంగజేబు.

మఱుచటిదినము రమారమి ఝాముప్రొద్దు గడచినవెనుక శివాజీ నిద్రనుండి మేల్కాంచెను. జాగరితుఁడై యతఁడు రాజపథమున గోలాహలమును వినెను. శయ్యపైనుండి లేచి గవాక్షమార్గమునుండి శివాజీ నిమ్నదిక్కుగఁ జూచి యటనున్న దృశ్యముఁ గంటఁబడఁగనే స్తంభితుఁడై పోయెను.

చకితుఁడైన శివాజీ నిలయపశ్చాద్భాగమున నిరుపార్శ్వములందును సమ్ముఖద్వారమందును, యస్త్రప్రహస్తులైన ప్రహరులు నిలచి యుండుటఁ గాంచెను. విశేషపరిచయముఁ బొందక రక్షకభటులు వెలుపలనుండువారల నెవరిని లోనికిఁ బోనీయుట లేదు; తగుప్రత్యుత్తరముఁ బడసినఁగాని నిలయాభ్యంతరమునుండి యెవరిని వెలుపలకుఁ బోనీయుట లేదు. "మెల్లితా మౌరంగజేబుచే ఖైదిగనొనరింపఁబడుదురు. నేఁడేమీరు పలాయన మొనరింపవలయు"నని గడచినరేయి బాలసన్యాసి యనినపలుకులపుడు శివాజీకి జ్ఞప్తికివచ్చెను.

అపుడు శివాజీ విశేషముగ ననుసంధానము గావింపఁదొడంగెను. తానుస్వదేశమునకుఁ బోవుటకు చక్రవర్తియనుమతి వేడినదాదిగ నౌరంగజేబుమనంబున సందేహోద్రేకమై తత్సందేహప్రయుక్తమున నగరరక్షకభృత్యులను దానవస్థితుఁడైయున్న యాగారబాహ్యమున నలుకెలంకులందును దివారాత్రులందుఁ గావలియుండఁజేసి తన్ను

గాంచ నావాసాభ్యంతరమున కరుగుదెంచువారల వెనువెంట రాజభృత్యులుకూడ నుండవలెనని చక్రవర్తి యాదేశ మొసఁగెనని శివాజీ పూర్తిగ గ్రహించెను; యోగిప్రవరుండైన జానకీపతి యౌరంగజేబుయొక్క యాదేశవృత్తాంతము నెఱిఁగి తాను పలాయనమగుటకుఁ దగు ప్రయత్నములనెన్నిటినో గావించి గడచినదినమున నర్ధరాత్రమున నావిషయము దనకెఱిఁగింప దనకడకేతెంచెనని శివాజీ యెఱిఁగెను. మహారాష్ట్రనాయకుఁడు మనమందు బాలయోగికి సహస్రధన్యవాదములనొసంగెను.

ఔరంగజేబుయొక్క కపటాచారత యిన్నిదివసములు గడచినవెనుక స్పష్టముగఁ బ్రతీయమానమయ్యెను. చక్రవర్తి శివాజీకి ప్రథమమున బహుసమాదరపురస్సరముగఁ బత్రమునులిఖించి ఢిల్లీకాహ్వానించి యతఁడేతెంచినపిదప రాజసభయందతని నవమానించి తదనంతరమున సభకేతెంచుట నిషేధించి యనంతరమున ప్రకృతబంధితునిగనొనరించెను. ఒక్కొకసర్పము గోమహిషాదులను భక్షించుటకుఁ బూర్వముఁ దనదీర్ఘశరీరముచే మృగకాయమును బూర్తిగఁ జుట్టివైచి దానిని సంపూర్ణముగ వశీభూతమొనరించుకొని పిదపఁ గ్రమక్రమముగఁ జూషితమొనరించి మృగము నుదరస్థమొనరించుకొను చాడ్పునఁ గ్రూరుఁడైన యౌరంగజేబు కపటజాలమును శివాజీని క్రమక్రమముగఁ జొప్పింపఁజేసియతనిని బూర్తిగఁ దనయధీనము గావించుకొని పిదప మెల్లమెల్లగ నతనినివినాశ మొనరింప సంకల్పించుకొనియెను. మానసనేత్రములతో నతీతవర్తమాన ఘటనాసముదాయమును ముహూర్తములోఁ గాంచి శత్రువీరుని నిగూఢోద్దేశము నెఱింగి రోషావేశుఁడై శివాజీ గర్జింపఁదొడంగెను. వీరావేశమున నామహావీరుఁడు ద్రుతపదవిక్షేపమున నాగృహమందిటునటు భ్రమణ మొనరింపసాగెను. అతని యధరోష్ఠములపై దంతములు స్థాపితములయ్యెను. శివాజీనయనముల

నుండి యగ్నిస్ఫులింగములు రాలుచుండెను. చాలసేపైనపిదప నర్ధస్ఫుటస్వరమున నతఁడిట్లు వాక్రుచ్చెను. "క్రూరుఁడా! యౌరంగజేబూ! శివాజీనిపుడుకూడ నెఱుంగలేకుంటివా? చతురతయందీ వద్వితీయుఁడ వంచుఁ దలంచుచుంటివిఁ గాఁబోలును! కాని శివాజీకూడ నావిద్యయందు బాలకుఁడు కాఁడు. ఈఋణము నెప్పటికైన దీర్చివైచెదనులే. ఎప్పటికైన దక్షిణాత్యమునుండి హిందూస్థానపర్యంతము సమరాగ్ని ప్రజ్వలితము కాకపోదు."

చాలసేపుచింతించి శివాజీ విశ్వసనీయుఁడైన మంత్రియగు రఘునాథపంథుని పిలచెను. ఆప్రాచీనన్యాయశాస్త్రి యటకరుగుదెంచి నిశ్శబ్దముగ శివాజీ సమ్ముఖమున నుపవిష్టుఁడయ్యెను. శివాజీ యపుడతని నుద్దేశించి యిట్లనెను. "పండితప్రవరా! మీరౌరంగజేబుయొక్క యాటలను జూచుచుండిరి. అట్టియాటలను మనముకూడ నాడవలయును. తమప్రసాదమున శివాజీ యిట్టిక్రీడలం దపరిపక్వుఁడు కాఁడు. నేఁడుమనము బంధితులమగుదుమని గడచిననిశియందే యోజించితిని; కాని యనుచరులనుముందుగ విముక్తులుగ గావించినఁగాని నాకాత్మపరిత్రాణేచ్ఛ యొడమకున్నది. ఆవిషయమున మీయభిప్రాయ మేమి?

న్యాయశాస్త్రి చాలసేపు చింతించియిట్లనెను. "మీయనుచరుల స్వదేశగమనార్థము చక్రవర్తికడకొకయావేదనపత్రమునంపుఁడు. ఇపుడు మిమ్మును ఖైదీఁగావించెను. మీయనుచరులసంఖ్య హ్రాసమైనకొలఁదియుఁ జక్రవర్తి దుఃఖితుఁడగుటకుఁ బదులాహ్లాదితుఁడగును. అనుమతిఁగోరినంతనే బడయఁగలరని దలంచెదను.

శివాజీ—మంత్రివరా! మీరువచించినదియే శ్రేయము. ధూర్తుఁడైన యౌరంగజేబీ విషయమున నిరాకరణముఁజూపఁడని నేను కూడ దలంచెదను.

రఘునాథపంథుఁ డానిమేషమందే యొకయావేదనపత్రమును లిఖించెను. శివాజీ యనుకొనినట్లే ఘటించెను. శివాజీయొక్క యనుచరులందఱు ఢిల్లీనుండి వెడలిపోవుదురని విని చక్రవర్తి సంతసమునస్కుండై వారలుపోవుట కొక్కొక్కని కొక్కొక యనుమతిపత్రము నొసంగనిశ్చయించెను. కతిపయదినములలో ననుమతిపత్రములన్నియు శివాజీని జేరెను. అతఁ డపుడాత్మగతమున నిట్లనుకొనెను. "మూర్ఖుఁడా! శివాజీని బంధితునిగ నుంచెదవా? ఇపు డతఁడొక యనుచరవేషమును ధరించి యీయనుమతిపత్రములలో నొకదానినిఁ గొని ఢిల్లీనుండి వెడలిపోయిన నేమి గావింపఁగలవు? ఏమైనను కానిమ్మిపుడు నాయనుచరులు నిరాపదముగ వెడలిపోవలయును. శివాజీ తనకొఱకై యుపాయమును బన్న నశక్తుఁడు కాఁడు.

పాఠకులారా! యేపురుషుఁడు తనయసాధారణ చతురతబుద్ధికౌశలరణనైపుణ్యములచే నిజభ్రాతృలను బరిమార్చి, వృద్ధుఁడై జనకుని బంధించి, ఢిల్లీమయూరసింహాసనము నారోహించెనో, ఏవ్యక్తి కాశ్మీరమునుండి వంగదేశపర్యంతము సమస్తయార్యావర్తమునకును యధిపతియయ్యె, దక్షిణాత్యసీమను స్వాధీనమొనరించుకొని సమగ్రభారతవర్షమున నేకాధీశ్వరుఁడై యుండవలెనను మహత్సంకల్పముఁగావించెనో, ఆకపటాచారి—అదూరదర్శి-ఔరంగజేబుయొక్క ప్రాసాదాభ్యంతరమునఁ బ్రవేశించి, యతనిమనోభావముల నొకమాఱు నిరీక్షింతము రండు.

రాజకార్యములు సమాప్తినొందిన వెనుక నౌరంగజేబు "గోసల్ ఖానా" యనునొకగృహమం దుపవిష్టుఁడైయుండెను. అదిమంత్రులతోఁగలసి రహస్యాలోచనములను సలుపుటకేర్పఱుపఁబడిన స్థలము; కానినేఁ డౌరంగజే బేకాకియైయుండి యేదియో చింతించుచుండెను. ఒక్కొకనిమేషమున నతనిలలాటమందు గభీరచింతారేఖ గన్పట్టుచుం

డెను. ఒండొకనిమేషమున నతని యుజ్జ్వలనయనములందు రోషాభిమానదృఢ ప్రతిజ్ఞాలక్షణములు బొడసూపుచుండెను. మఱొకక్షణమునఁ దనమంత్రణాసఫలత నెఱుంగుచు నతఁడు ప్రముదితచిత్తుఁడగుచుండెనని యతని యోష్ఠప్రాంతమున నంకితములగు మందహాసరేఖలు చెప్పక చెప్పుచున్నవి. అతఁడేమి చింతించుచుండెను ? తనబుద్ధిబలముచే సమస్త హిందూస్థానమున కేకాధీశ్వరుఁడనైతినని యతఁడుప్పొంగుచుండెనా ? లేక హిందూధర్మమున కింకను యవమాన మొదవఁజేసి రజపుత్ర మహారాష్ట్రుల నింకను బదదలితులఁ జేయ సంకల్పించుచుండెనా యేమి ? లేక శివాజీని బంధించితినని యుల్లసితుఁడగుచుండెనా యేమి ? చక్రవర్తి యేమి యాలోచించుచుండెనో చెప్పఁజాలము. సందిగ్ధమనస్కుండైన యౌరంగజేబు తనసభామధ్యమందుఁగాని భారతవర్షమందుగాని యేమంత్రిని యెప్పుడును విశ్వసించి మనోభావమును వెల్లడిఁజేసెడువాఁడు కాడు. నిజబుద్ధిప్రకర్షచేనతఁడందఱనాటబొమ్మల వగిది నాడించుచు, దేశమందంతటను దనశాసనమును బాగుగ స్థాపింపనుద్దేశించుచుండును. వానికి నిజమస్తకోపరిభాగమునఁ బృథివిని ధరించి విశ్రమమునొల్లక, యేరిసహాయమును గోరకనుండునట్లే యౌరంగజేబు నిజాసాధారణమానసికబలముచే సామ్రాజ్యశాసనకార్యము నేకాకియై వహింపసమకట్టె యేరిమంత్రణమును గోరుచుండెడివాఁడు కాడు.

అతఁడట్లే యేదియో చింతించుచు నుపవేశించియుండ, నొకభృత్యుఁడు "తసలీమ్" గావించి యిట్లనెను. "సామ్రాట్టునకు జయము గుఁగాక ! "జాంహాపనా !" దానేశమందుఁడను తమసభాసదుఁడు దేవరదర్శనార్థమై ద్వారముకడ నిలచి యుండెను." చక్రవర్తి యతనినిలోనికిఁ గొనిరమ్మని భృత్యునకు ముదలనొసఁగి నిజలలాటమునుండి చింతారేఖల నపసృత మొనరించి మందహాసవదనారవిందుఁడై కూరుచుని యుండెను.

దానేశ్ మంద్ చక్రవర్తిమంత్రి కాఁడు, రాజకార్యములందెట్టివరామర్శయు జేసికొనఁగ నతఁడు సాహసించెడువాఁడు కాఁడు. కాని యతఁడు పారసీక యరాబియా భాషలందసాధారణపండితుఁడు. దానిం జేసి చక్రవర్తి యతని నెక్కుడుగ సన్మానించి యపుడపుడు ప్రసంగవశమున నతని నలహాయడుగుచుండును. ఉదారచేతస్కుఁడైన దానేశ్ మంద్ సకలసమయములందును యుదారసరళమంత్రములను జక్రవర్తికిఁ దెలుపుచుండును. చెప్పనేల ? ఔరంగజేబుయొక్క జ్యేష్ఠసోదరుఁడు బంధితుఁడైనపుడు దానేశ్మందతనికి బ్రాణరక్షణమొనరింపుమని చక్రవర్తిని గోరెను. ఏవంవిధమంత్రము కుటిలుఁడైన యౌరంగజేబునకు మనోగతము గాలేదు. ఔరంగజే బతఁడల్పబుద్ధియనియు నదూరదర్శియనియుఁ దలంచుచుండెను ; కాని యతఁడు దానేశ్మందుయొక్క విద్యాధనపదమర్యాదలను గాంచి యతనిని బాగుగ నాదరించుచుండెను. సరళస్వభావుఁడైన యావృద్ధుఁడు (దానేశ్మందు) చక్రవర్తి సమ్ముఖమున కరుదెంచి, యతని కభివాదన మొనరించి తన్నిర్దేశానుసారముగ నటనొక పీఠతలమున నుపవిష్టుఁడయ్యెను.

దానేశ్మంద్—ఈసమయమున దేవరను దర్శింపవచ్చుట సమంజసము కాదు. ఏలనన రాజకార్యములను పరిసమాప్తినొందించి విశ్రమము దీసికొనుచుండిరి. కాని తమ యనుగ్రహమును బొందు నిమిత్తమయ్యే నేనిట కరుదెంచితిని.

పారసీకకవి సుందరముగ లిఖించియుండెగదా—"సూర్యునివైపుగ జగమందలి సర్వప్రాణులును సకలసమయములందును జూచినను నాదిత్యుఁడు విరక్తుఁడై తనకిరణములను బ్రసరింప విరతుఁడగునా?"

చక్రవర్తి మందహాసవదనుఁడై యిట్లనెను. "విద్యాగరిష్ఠా! అన్యులసంబంధమున నేమైనను కానిండు. తాము సర్వసమయములందును సమాదరపాత్రులు."

క్షణకాలమీతీరున మిష్టాలాపములైనపిదప దానేశ్మందన్య ప్రసంగమును ప్రారంభించి యిట్లనెను. "జాంహాపనా!" అలంగీరనా మమును సార్థకముగావింపుఁడు! హిందూస్థానమంతయుఁ దమపదతల మందుండెను; ఇపుడు దక్షిణాత్యమునుకూడ స్వాధీనమొనరించుట కెక్కుడువిలంబము లేదు."

మందహాసమొనరించి యౌరంగజేబిట్లనెను. "ఏల? ఆవిష యమున నాప్రయత్నమును దేనినిజూచితిరి?"

దానేశ్మంద్—దక్షిణాత్యదేశప్రధానశత్రువు తమపదతల మందుండెనుకదా?

ఔరంగజేబు—శివాజీనిగుఱించి చెప్పుచుండిరా? అవును. మూషికము బోనులో బడిపోయెను.

తత్క్షణమే యతఁడు తన మంత్రిణగోపనార్థమై యిట్లనెను. "దానేశ్మందూ ! మీరు మాయుద్దేశ్యము నవశ్యముగ నెఱింగియేయుం డిరి. దేశమందలి ప్రధానవ్యక్తులను సర్వదా సమ్మానించుట మాయు ద్దేశ్యము; శివాజీ ధూర్తుఁడుగానిండు, విద్రోహిగానిండు, అతఁడు యోధుఁడనుటకేమియు సందియము లేదు. అతనిని సమ్మానించుటకే ఢిల్లీకి రప్పించితిని. రాజసభయందు సముచితసమ్మానమొసఁగి యత నికి సెలవొసంగి బంపివైచుటయే మాయుద్దేశ్యమైయుండెను. కాని యతఁడు రాజసభయందు దనయసదాచరణముఁజూపి తనమూర్ఖతను బ్రకాశమొనరించెను, నేనతనిని బంధింపవలెనని గాని సంహరింపవలె నని గాని యెంతమాత్రము నిచ్ఛగించియుండలేదు. దానింజేసి యన్య దండనమేమియు విధింపక రాజసభకు రావలదని మాత్రము నిషేధిం చితిని. కాని యిపుడతఁడు ఢిల్లీ మధ్యమందే యనేకసన్యాసులతోను, విద్రోహులతోను కుట్రలుసలుపుచుండెనని వింటిని. అందువలననే నాభృత్యుల నతఁడుండు యావాసముకడ జాగరూకులై గాపుండుఁడని

నియమించితిని. కతిపయదినానంతరమున సమ్మానపురస్సరముగ నతని నంపివైచెదను."

దానేశ్మంద్—చక్రవర్తిగారి యీయాదేశమును విని, యాహ్లా దితుఁడనైతిని.

ఔరంగజేబు—ఎందువలన ?

ఉదారచేతస్కుఁడైన దానేశ్మం దిట్లనెను. "దేవర కాలోచన మొనఁగుటకు నాకేమిసాధ్యమగును ? కాని ప్రభూ ! దయాళులై యుండక శివాజీపైఁ గరుణఁజూపక, చిరకాలమతనిని బంధించియుంచి నచో మందపురుషులు నానావిధములుగ నఖ్యాతిగావింతురు. శివాజీ నాహ్వానించి బంధించివైచుట న్యాయసంగతము కాదని లోకులందఱు వచింతురు."

ఔరంగజే బాగ్రహమునొకించుక సంగోపనమొనరించి పిదప మరల మందహాసవదనమును జూపి యిట్లనెను. "దానేశ్మందూ! మంద పురుషుల పలుకులచే ఢిల్లీశ్వరునకెట్టి కళంకమును వాటిల్ల నేరదు. కాని సువిచారకరుణలు సింహాసనముయొక్క శోభనములు బాగుగ విచారణ మొనరించి, శివాజీ నూపిన దోషమును మఱచి, యతఁడు సతర్కుఁడై యుండునట్లొనరించి, పిదప దయాపురస్సరముగ నతనిని సమ్మానించి ఢిల్లీనుండి పంపివైచెదను.

దానేశ్మంద్—ఇట్టి సదాచరణముఁజూపియే దేవరప్రపితా మహుండైన యక్బరుషాహా దేశమును బరిపాలించెను. ఇట్టి సదా చరణము వలననే మీయొక్క ఖ్యాతిశక్తులు దినదినప్రవర్ధమానము లగును.

ఔరంగజేబు—అదెట్లు ?

దానేశ్మంద్—దేవరెఱుఁగనిదేమియు లేదు. అక్బరుషాహా ఢిల్లీ సింహాసనారూఢుఁడైనపుడు సామ్రాజ్యమంతయు శత్రుసంకులమై

యుండెను. రాజస్థాన విహారదక్షిణాత్యములాది సర్వస్థానములందును విద్రోహులుండిరి. ఢిల్లీ సన్నికట ప్రదేశముకూడ శత్రుశూన్యమైయుండలేదు, అతని మృత్యుకాలమున సమస్తసామ్రాజ్యము నిశ్శత్రునిర్విరోధమై యుండెను. పూర్వమందు బరమశత్రులై యున్న రజపుత్రులు కూడ పాదుషాయధీనతను స్వీకరించి కాబూలునుండి వంగదేశపర్యంతము ఢిల్లీశ్వరుని విజయపతాకము నుడ్డీనమొనరించిరి. జయసాధనమెట్లయ్యెను ? కేవలము బాహుబలమువలనా ? కేవలము సాహసమువలనా ? తైమూరువంశజులందు సాహసబాహుబలరహితులేరును లేరు. కాని మజేబునిట్లు జయసాధనముఁ గావింపలేరైరెందువలన ? ప్రభూ ! సదాచరణమువలననే యిట్టి జయలాభము చేకూరెను. అతఁడు రిపువీరులను కూడ సమ్మానించెడివాఁడు, దానింజేసి హిందువులుకూడ చక్రవర్తి విశ్వాసభాజనులగుటకు యత్నించుచుండువారు. మానసింహ, టోడరుమల్లు వీరబలప్రభృతి హిందూశూరులే, ముసల్మాను సామ్రాజ్యమునకు స్తంభస్వరూపులైరి, ఉత్తమవ్యక్తులనుకూడ విశ్వసింపనిచోఁ గ్రమక్రమముగ వారలధములగుదురు; అధములైన కాఫరులను కూడ సమ్మానించి విశ్వసించినచో వారలు క్రమక్రమముగ విశ్వాసయోగ్యులగుదురు. ఇది మానవుల ప్రకృతి శాస్త్రములందిట్లు లిఖింపఁబడి యుండెను. మన దక్షిణదేశరణమున శివాజీ మనకుఁ జాలసహాయమొసరించెను. మహాప్రభూ ! అతనిని సమ్మానించినచో సజీవుఁడై యున్నంతదనుక శివాజీ దక్షిణసీమయందు మొగలు సామ్రాజ్యమునకు స్తంభస్వరూపుఁడై యుండును.

దానేశ్మందేల చక్రవర్తి దర్శనమాచరింప నరుదెంచెనో, మా చదువరు లిపుడు గ్రహించి యుందురు. ఢిల్లీశ్వరుఁడు శివాజీ నాహ్వానించి బంధించుటచే జ్ఞానమూర్తియు సదాచారసంపన్నుఁడు నీముసల్మాను సభాసదుఁడు మాత్రమే లజ్జితుఁడయ్యెను. దానేశ్మందును

చక్రవర్తి సమాదరణమొనరించువాఁడు, అతఁడేదో యొకవిధమునఁ బ్రసంగవశమున చక్రవర్తి యొక్క కుప్రవృత్తిమూలోద్దేశ్యమును జూపుట కుత్సుకుఁడయ్యెను. భద్రాచరణపురస్సరముగ శివాజీని నిజదేశగమనమాచరింప ననుమతినొసంగునను నుద్దేశమున దానేశ్మంద్ నేఁడు చక్రవర్తి కడకేతెంచెను, హస్తముచే నొక ప్రకాండభూధరమును విచలితమొనరించుట సంభవమయ్యును, యామంత్రణముచే నౌరంగజేబు దృఢప్రతిజ్ఞ గభీరోద్దేశ్యములను విచలితమొనరించుట యసంభవమని దానేశ్మం దెఱుఁగలేక పోయెను.

దానేశ్మందుయొక్క యుదారసారగర్భవచనములు కుటిలుఁడైన యౌరంగజేబునకు నిటయతిశయ నిర్బోధపలుకులవగిదిఁదోఁచెను. అతఁడు మందహాసమొనరించి యిట్లనెను. "దానేశ్మందు శాస్త్రవిశారదత్వమందెట్టి కౌశలుఁడో మానవహృదయములను పఠించుట యందట్టి నిపుణుఁడేయని దోఁచుచున్నది. దక్షిణదిక్కున శివాజీ స్తంభస్థాపితమొనరించును, రాజస్థానమందు విద్రోహులు స్తంభస్థాపనమును బూర్వమే గావించిరి. కాశ్మీరమును మరల స్వాధీనముగావించి వైచెదను. వంగదేశపఠానులను మరల సమాదరపూర్వకముగ యాహ్వానించెదను. ఈచతుఃస్తంభములపై మొగలు సామ్రాజ్యము సుందరసుదృఢరూపమున స్థాపితమగును !"

దానేశ్మంద్ యొక్క ముఖమండలము రక్తవర్ణమైపోయెను. అతఁడు మెల్లగ నిట్లనెను. "దేవరజనకులీదాసు ననుగ్రహించెడివారు. దేవరకూడ యథేష్టముగ నన్ననుగ్రహించుచుండిరి. దానింజేసి యే సమయసమయములందు మనస్థితభావములను వెల్లడింప సాహసించుచుందును. లేకున్నఁ ద్రిభువన కామంత్రణమొనరింపఁజాలు విద్యాబుద్ధులీదాసునకు లేవు"

దానేశ్మంద్ నిర్బోధసరళవ్యక్తియని యెఱిఁగియు, ఔరంగజేబా సరళతవలననే యాతనినిఁ బ్రేమించుచుండును. అతని చిత్తమును నొప్పించితినని యెఱిఁగి చక్రవర్తి యిట్లనియెను. "విద్యాభూషణా! నావచనములందు దోషమును గ్రహింపకుఁడు. అక్బరుషాహాబుద్ధిమాన్ఁడైయుండెననుట కేమియు సందియము లేదు; కాని కాఫరు మునల్మానుల సమానచక్షులఁజూచి యాతఁడేమి ధర్మసంగతాచరణ మొనరించెను? మఱియొకటి మిమ్ములఁ బ్రశ్నించుచుంటిని. మనసా మాన్యదైనిక కార్యనిర్వాహణము దేవాచరించిన నెట్లగునో యిరులహస్తములనేదియు నట్లుగాదని గ్రహించితిని. ఇట్టివిస్తీర్ణసామ్రాజ్యశాసనకార్యమును కూడనట్టి జడులను విశ్వసింపక, స్వయముగ నిర్వహించుకొనుట యుత్తమముగాదా? నిజబాహుబలముచే సమగ్రభారతవర్షమును పరిపాలింపసమర్థుఁడనై యుండ ఘృణితకాఫరుల స యతను గ్రహించుటెందులకు? ఔరంగజేబు బాల్యకాలమునుండియు సమస్తమును నిజకృపాణముపై నిర్భరమొనరించెను; నిజాసిమూలముననే సింహాసనపథమును పరిష్కారమొనరించెను. నిజకరవాలము మూలముననే దేశపరిపాలన మొనరించెను; యొరులసహాయమునిచ్ఛగింపఁడు; యొరులను విశ్వసింపఁడు"

దానేశ్మంద్—ప్రభూ! స్వహస్తములచే దైనికకార్యనిర్వాహణమొనరింపవచ్చును; కాని యిట్టి సామ్రాజ్యశాసనము సహాయతలేనిదె సంపాదితమగునా? వంగదక్షిణదేశప్రభృతిస్థానములందు స్వరసమయములందును వర్తమానులై దాముండఁగలరా? అన్యులనేరినియుక్తులఁ గావింపకున్న గార్యనిర్వాహణ మెట్లుగాఁగలదు?

ఔరంగజేబు—అవశ్యముగ భృత్యులను నియుక్తులఁ జేసెదను వారలు చిరకాలము భృత్యులవగిదినే యుండి ప్రభులగుట కిచ్ఛగింపఁగూడదు. నేఁడే నెవనికధిక శక్తి నొసఁగెదనో, యెల్లియతఁ డాశక్తి

నాకు విరుద్ధముగ నుపయోగింపవచ్చును, నేఁడే నెవనినధికముగ విశ్వసించెదనో, యతఁడెల్లి విశ్వాసఘాతుకుఁడు గాఁగలఁడు! ఈయవస్థలచే శక్తివిశ్వాసముల నన్యహస్తములందు న్యస్తమొనరింపక నాకరములందే యుంచుకొనుటుత్తమము. మిత్రపుంగవా! మీరాశ్వారోహణమొనర్చునపుడు తురగమును గళ్లెపు మూలమున సంపూర్ణవశీభూతమొనరించుకొని తమయిచ్ఛవచ్చిన వైపుగనాఘోటకమును ద్రిప్పనమర్థులగునట్లే చక్రవర్తికూడ శాసనమొనరించుటుచితము. పరిని విశ్వసింపకుఁడు. పరికరములందు శక్తిని న్యస్తమొనరింపకుఁడు. సమస్తతంత్రిణను నిజహస్తములందే యుంచుకొనుఁడు. కర్మచారిసేనాపతులనుపూర్తిగ వశీభూతమొనరించుకొని వారలచేఁ బనులను గావించుకొనుఁడు.

దానేశ్మంద్—ప్రభూ! మనుష్యులశ్వములంగారు. వారలకు మహత్వమున్నది. నిజసమ్మానజ్ఞానమున్నది.

ఔరంగజేబు—మనుష్యులశ్వములు గారని యెఱుంగుదును. దానిం జేసియే తురగములను గళ్లెముల నడపెదను. మనుష్యుల నున్నతియాశభీతిభయముల నడపెదను. ఎవఁడుత్తమ కార్యమొనరించునో, యతనికిఁ బురస్కారమొసంగెదను. ఎవఁ డధమకృత్యముగావించునో, యతనిని శిక్షించెదను. పురస్కారయాశశాస్తిభయములచే సకల కార్యములు నిర్వహింపఁబడును; శక్తివిశ్వాసమంత్రిణముల నౌరంగజేబు నిజహృదయనిజబాహుబలములందు న్యస్తమొనరించుకొని యుండును.

దానేశ్మంద్—ప్రభూ! పురస్కారయాశశాస్తిభయములు గాక మనుష్యహృదయమందన్యభావములు గూడ నున్నవి. మనుజులకు మహత్వమున్నది-యుచ్చాభిలాషగలదు—నిజసమ్మానజ్ఞానమున్నది.ఎ

వఁడు శిక్షాభయముచేఁ గార్యమొనరించునో యతఁడేదో యొకరీతిన గార్యసమాప్తిఁగావించి నిరస్తుఁడైయుండును; కాని యెవనినిఁ దాము సన్మానించెదరో—సమాదరముగావించెదరో—యెవనికి క్షమతనొసఁగి విశ్వసించెదరో—యతఁడు మీ కాసమాదర విశ్వాసముల నుపయుక్తప్రమాణముఁజూపుటకై ప్రభుకార్యమునకు నిజధనమానప్రాణములనుగూడ ధారవోయును; ఇట్టియుదాహరణము లెన్నియో శాస్త్రములందుగన్పట్టును.

ఔరంగజేబు—అయ్యా! నేను మీవగిది శాస్త్రజ్ఞుఁడగాను; కవితయందు లిఖింపఁబడిన విషయములను నేనువిశ్వసింపను. మానవప్రకృతియే నాశాస్త్రము; మానవులమహత్వమును నేనల్పముగఁజూచితిని. కృతకపటత విశ్వాసఘాతుకతల నేనుజాలవఱకుఁగాంచితిని. ఆశాస్త్రమును పఠించి నేనునిజహస్తమందే క్షమతనుంచుకొననేర్చుకొంటిని. దానింజేసియే కాఫరులపై జిజియాపన్నునువిధించెదను. విద్రోహోన్ముఖరసపుత్రులపై కఠోరశాసనమును బ్రయోగించెదను. మహారాష్ట్రదేశమును రిపురహితముగ నొనరించెదను. విజయపురగోల్కొండల నాక్రమించుకొనియెదను. ఆసేతుహిమాచలపర్యంత బృహత్సీమనొక్కరుండను బరిపాలించెదను. పరిసహాయతనుదీసికొనను; అలంగీర్ నిజనామమును సార్థకమొనరించుకొనును.

ఉత్సాహముచేఁ జక్రవర్తినయనములుజ్జ్వలములయ్యెను. అతఁడు తన మనస్థగభీరాభీష్టము నేరికి నెప్పుడును బ్రకాశించెడివాఁడుకాఁడు. నేఁడు ప్రసంగవశమున దానినిఁ జాలవఱకు హఠాత్తుగఁ బ్రకాశముఁగావించివైచెను, కాని యతఁడు దానేశ్మందుయొక్క యుదారచరిత్రనెఱిఁగియుండుటచే నతనికడనొకటి రెండు గూఢభావములను వెల్లడించినను హానిలేదని దలఁచెను.

క్షణకాలానంతరమున మందహాసమొనరించి యౌరంగజేబిట్లనెను. "సరళస్వభావమిత్రమా! నేఁడు నాయభీష్టమంత్రణములనాలకించుక నెఱిఁగితివా?"

తీక్ష్ణబుద్ధియైన యౌరంగజేబు తనగభీరమంత్రణమందలి కియదంశమును బ్రకాశమొనరించి యాదినమే యుదారచేతస్కుఁడైన దానేశ్మంద్ యొక్క సరళయుపదేశవాక్యములనాలించి యతఁడు పలికినతెఱంగున నాచరించియుండినచో భారతవర్షమున ముసల్మాను సామ్రాజ్యము ప్రాయశఃఅంత శీఘ్రములో ధ్వంసముకాక యుండెడిది.

ఇట్లు వారలిరువురు ప్రసంగించుకొనుచుండ భృత్యుఁడొకఁడచటకువచ్చి యిట్లనెను. "రామసింహుఁడు దేవరదర్శనము నభిలషించుచు ద్వారముకడ నిలువంబడియుండెను."

"లోనికిఁ గొనిరమ్మ"ని చక్రవర్తి వాక్రుచ్చెను.

ఒకనిమేషములో జయసింహునిపుత్రుఁడు రాజసదనము లోనికరుగుదెంచెను.

రామసింహుఁడు—ఇట్టిసమయమునఁ జక్రవర్తిని దర్శించుట మాదృశవ్యక్తుల పక్షమున నవిధేయముకాని జనకుని నికటమునుండి గురుతరవార్త యొకటి దెలియవచ్చెను; దానిని ప్రభునకెఱింగింప నేనిట కరుగుదెంచితిని.

ఔరంగజేబు—మీజనకునికడనుండి మేముకూడ సన్యపత్రి పొందుబడసితిమి. సమస్తవిశేషములకు నవగతులమైయుంటిమి.

రామసింహుఁడు—జనకుఁడు శత్రువులనందఱినిఁ బరాజితులుగ నొనరించి, శత్రుదేశమును విదీర్ణమొనరించి, రాజధానియైన విజయపురము నాక్రమణముఁగావించిన విషయమును దేవర యెఱిఁగియేయుందురు. కాని జనకుని సైన్యమల్పమైయుండుటచే నానగరమింతదనుక హస్తగతముగాలేదు. గోలుకొండసుల్తాను విజయపురరాజుని సహాయార్థ

ము నేకనామ్‌ఖానను సేనాపతిగ నేకసంఖ్యాసైనికులనుతోడిచ్చి పంపెను గదా.

ఔరంగజేబు—అవునది నేనెఱిఁగినదే.

రామసింహుఁడు—చతుర్దిక్కులందును శత్రువేష్టితుఁడై నా జనకుడు దేవరయాదేశానుసారముగ నిపుడుకూడ యుద్ధమొనరించుచుండెను. కాని యీరణమందు జయమసంభవము. అల్పసంఖ్యాకులైన సైనికులను గొందఱిని సహాయార్థము పంపుఁడని ప్రభువును జనకుఁడు వేఁడుచుండెను.

ఔరంగజేబు—మీతండ్రి వీరాగ్రగణ్యుఁడు; అతఁడొక్కరుండు సైన్యసమేతముగ విజయపురమును హస్తగత మొనరించుకొనలేక పోయెనా ?

రామసింహుఁడు—మనుజున కేమిసాధ్యమో జనకుఁడదిగావించును. శివాజీ పూర్వమునఁ బరాజితుఁడుగాలేదు; పితయే యతనికోటలుఁగలుఁగ జేసెను. విజయపురమిదివరలో నాక్రాంతముగాలేదు; జనకుఁడాపురము నాక్రమణమొనరించెను; ఇపుడతఁడల్పసంఖ్యాసైన్యమును మాత్రము వేఁడుచుండెను. మీరు సైనికులను బంపినచో సమస్తకార్యమును శేమించును. దక్షిణదేశమున మొగలుసామ్రాజ్యము విస్తృతమై దృఢీభూతమగును.

ఇట్టియవస్థయందన్యచక్రవర్తి యెవండైనను వలయు సైనికులనంపి దక్షిణాత్యదేశవిజయకార్యసాధనము గావించును. ఔరంగజేబు తాను బహుదూరదర్శిననియు, తీక్ష్ణబుద్ధిననియు భావించి జయసింహుఁడు కోరిన సైనికులనంపక రామసింహునుద్దేశించి యిట్లనెను; "రామసింహ! మీ జనకుఁడు మాసుహృత్ప్రవరుఁడు; అతనివిపద్వృత్తాంతమును విని శోకాకులులమైతిమి. అతఁడే తనయసాధారణబలముచే జయసాధన మొనరింపవలెనని చక్రవర్తి దివానిసులందుఁ గాంక్షించుచుండెనని మీరు మీజనకుని

లేఖాముఖముగఁ దెలుపుఁడు. ఇపుడు ఢిల్లీయందు సేనాసంఖ్యజాల యల్పమైయున్నది. నేనతనికడకు సైనికులనంప నసమర్థుండను."

రామసింహుఁడు కాతరస్వరమున నిట్లనెను. "ప్రభూ ! జనకుఁడు ఢిల్లీశ్వరుని పురాతనదాసుఁడు, మీకాలమందేకాక మీజనకుని కాలమందుఁగూడ నతఁడనేక రణములనాచరించెను. అనేకకార్యసాధనముల నొనరించెను. ఢిల్లీశ్వరుని కార్యసాధనముగాక యతనికి జీవనమందన్యోద్దేశమేమియు లేదు. ఈఘోరవిపత్సమయమున దేవరయొకించుక సహాయము గావింపకున్నచో బ్రాయశః యతఁడు ససైన్యముగ నిధనప్రాప్తుఁడగును.

తన కాతరస్వరయుక్తిజలములచే నౌరంగజేబుయొక్క గభీరోద్దేశ్యగూఢమంత్రణములు విచలితములుగానేరవని పాపమా బాలకుఁడెఱుంగఁడు. ఆయుద్దేశమంత్రణము లేమి? జయసింహుఁడతిశయయుక్తిమతాశాలి—ప్రతాపాన్విత సేనాపతి. అతనికి సంఖ్యములైనసైన్యములును విస్తీర్ణయశమును అనంతప్రతాపమును యున్నవి. ఆజీవనముగనతఁడు నిష్కళంకుఁడై ఢిల్లీశ్వరుని కార్యమొనరించుట నిక్కువమే; కాని యిట్టి శక్తిసామర్థ్యములీసేనాపతికిని విధేయములు కావు; అప్రతిమానశక్తిసంపన్నుఁడైన యీసేనానాయకుని చక్రవర్తి విశ్వసింపలేకుండెను. ఈయీభావమందు. జయసింహుఁడు సార్థకతలాభము నొందజాలక యవమానితుఁడైనచో నతని ప్రతాపయశములొకించుక హీనములగును, లేకనతఁడు సైన్యసమేతముగ విజయపురసమ్ముఖమున హతుఁడైనచో, ఢిల్లీశ్వరుని హృదయమందలి కంటకమొకటి యుద్ధారమగును. ఊర్ణనాభునిజాలములవడువున నౌరంగజేబుయొక్క యుద్దేశ్యములు బహువిస్తీర్ణములై యవ్యర్థములైయుండెను. నేడు జయసింహకీటకమందు పతితమైపోయెను—ఉద్ధారము లేదు.

జయసింహుఁడు చాలకాలమునుండి శక్తివంచన లేక ఢిల్లీశ్వరు

ని కార్యములఁ గావించుచుండెను. చక్రవర్తికి మిత్త్రమై యతఁడు నిజసౌఖ్యమునుదలఁపక పాటుపడుచున్నను నేఁడతఁ డౌరంగజేబు జాలమునఁబడకుండునా? మొగలాయివీరుని సూక్ష్మమంత్రజాలము నేఁడు వ్యర్థమగునా?

ఉదారచిత్తుఁడైన రామసింహుఁ డౌరంగజేబు సమ్ముఖమున నిలువంబడి రోదన మొనరించినను దయావిరహితుఁడైన చక్రవర్తి యతని మొఱాలించునా— దూరదర్శినను దలఁచునతఁడు తనయుద్దేశ్యమును త్యజించునా?

దయాదాక్షిణ్యప్రభృతి సుకుమారమనోవృత్తిసమూహముల నౌరంగజేబు విశ్వసింపఁడు. వానికతఁడు నిజహృదయమందు స్థానమొసఁగఁడు. ఆత్మపథపరిష్కారమై నేఁడతఁడొక పతంగమును దప్పించివైచెను; గడచినదినమున నిజసోదరుని హత మొనరించెను. ఉభయకార్యములనతఁడు ధీరనిరుద్వేగహృదయముతోడనే గావించెను. ఒకప్పుడతని పితృభ్రాతృభ్రాతృపుత్త్రులా యున్నతపథమున బలిత్తులైరి. ఔరంగజేబు మెల్ల మెల్లగ వారలను దప్పించివైచెను. అతఁడు జనకుని సంహరింపలేదు. క్రోధముచే త్వరపడి తన జ్యేష్ఠసోదరుఁడైన దారాను వధింపలేదు. అట్టి బాలకోచితమనోవృత్తులతనియందు లేవు. జనకుఁడు సజీవుఁడై యున్నచో భవిష్యమున నెట్టివిషాదములును సంభవింపవు. అతనియుద్దేశ్యసాధనమున కెట్టి ప్రతిబంధకముఁగలుఁగదు. దానిం జేసి యతఁడు రక్షింపఁబడెను. జ్యేష్ఠభ్రాతయైన దారాజీవితుఁడై యున్నచో నతని యుద్దేశ్యసాధనమునకుఁ బ్రతిబంధకముఁగలుఁగవచ్చును, శిరచ్ఛేదకుఁడా! అతనినిదప్పించివైచి అలంగీరుచక్రవర్తిపథమును పరిష్కారముఁగావింపుము!

చక్రవర్తియొక్క కుతంత్రమువలననే నేఁడవశ్యముగ జయసింహుఁడు సైన్యసమేతముగ హతుఁడగును. అతఁడుత్తముఁడనిగాని లేక

గుటిలుఁడనికాని, విశ్వాసియనికాని, లేక విద్రోహియనిగాని యనుసంధానపూర్వకముగఁ నెఱుఁగనవశ్యకము లేదు. ససైన్యముగ నతఁడు మరణించును. ఈపరిచ్ఛేదవివృతసమయానంతరమున గతిపయమాసములలో జయసింహుఁడవమానితుఁడై యకృతార్థుఁడై ప్రాణత్యాగ మొనరించెనను వార్త ఢిల్లీనగరమును జేరెను. చక్రవర్తి యాదేశానుసారముగ జయసింహునకు విషప్రయోగ మొనరింపఁబడుటచే నతఁడు మృతుఁడయ్యెనని యానాఁటి యితిహాసలేఖకులు కొందఱు సందేహించిరి.

చాలసేపైన పిదప దీర్ఘనిశ్వాసమునుత్యజించి రామసింహుఁ డిట్లనెను.

శివాజీ ఢిల్లీ యేతెంచినపుడితని కెట్టి యాపదయు ఘటింపనేరదని మాజనకుఁడతనికి వాగ్దాన మొనరించెను.

ఔరంగజేబు— మీజనకుఁడట్లు మాకెఱింగించెను.

రామసింహ— రసపుత్త్రులందాడినమాటఁదప్పుట బహునిందనీయము. శివాజీయందెట్టి దోషమైననున్నచో సదయులై దేవరయతనిని మన్నించిబంపివేయ మాజనకుఁడును యీదాసుఁడును వేడుచుండిరి.

ఔరంగజేబు— క్రోధమును సంవరణ మొనరించుకొనియిట్లనెను. "చక్రవర్తి యేది యుచితమని దలఁచునో దానినతఁడు గావించును. ఆవిషయమందు మీరుచింతితులుగాకుఁడు."

శివాజీ యను మఱియొక కీటకము చక్రవర్తియొక్క విస్తీర్ణమంత్రణాజాలమునఁ బతితమయ్యెను, దానేశ్కంద్ రామసింహులాకీటకము నుద్ధార మొనరింపఁజాలరైరి.

జయసింహునిదోషమెట్టిదియో శివాజీదోషమును నట్టిదియే; శివాజీకూడ సంధిస్థాపనానంతరమునుండి శక్తివంచనలేక చక్రవర్తి కార్యములనొనరించుచు నిజసైనికులఁ దోడ్పాటున ననేకదుర్గములనుజ

యించి వానిని ఢిల్లీయధీనముఁగావించెను. ఆతఁడుకూడ విపులక్షమతా సంపన్నుఁడు; ఔరంగజేబెట్టిభృత్యునిపైనను విపులశక్తిని న్యస్తమొనరింపఁజాలఁడు. అతఁడేరిని విశ్వసింపఁడు.

ఏరువిశ్వసింపఁబడరో, క్రమక్రమముగ వార లవిశ్వాసయోగ్యులగుదురు; ఔరంగజేబుయొక్క జీవితకాలమందే మహారాష్ట్రరసపుత్రులు ఢిల్లీవిరుద్ధముగఁ బ్రజ్వలితమొనరించిన భీషణయుద్ధానలమందే మొగలుసామ్రాజ్యము దగ్ధమైపోయెను.

ఇరువదియేడవప్రకరణము.

పీడ.

మిగులబ్రబలమైనవ్యాధిచే శివాజీ బాధనొందుచుండెనని నేఁడు ఢిల్లీనగరవాసులందఱు చెప్పుకొనుచుండిరి; దివానిశలందు శివాజీయున్నగృహద్వారగవాక్షములు బంధింపఁబడియుండెను. అహర్నిశములు చికిత్సకు లతనికడకరుగుదెంచుచుండిరి. ఈభీషణరోగోపశమన మసంభవమనియు నేఁటివ్యాధివృద్ధిఁగాంచిన నెల్లిదనుక నతఁడుజీవించుట యసంభవమనియు భిషగ్వరులే పలుకుచుండిరి. శివాజీ యిఁకలేఁడని పౌరులప్పుడప్పుడు చెప్పుకొనుచుండిరి. రాజపథమునుండిఁబోవుబహుసంఖ్యాకలోకులు బంధింపఁబడి శివాజీనిలయగవాక్షములవైపుగ నంగులినిర్దేశ మొనరించుచుండిరి. సేనాపతులును యశ్వారోహకులును క్షణకాలము తమహయములనాపి ప్రహరులనడిగి శివాజీ వ్యాధివృత్తాంత మెఱుఁగుచుండిరి. శిబికారోహులైన తేఁడులును మన్సవదారులును శివాజీ యావాససమ్ముఖముగఁ బోవుచు నొకమాఱులేచి యావైపుగదృష్టిపాత మొనరించుచుండిరి. శివాజీయెట్లుండెను—అతఁడుద్ధారు

డగునా లేదా—అతఁడు మఱుచటిదినమువఱకు జీవించువాఁడగునా నానావిధవాక్యములచే నగరవాసులందఱు బజారులందును, పథఘట్టములందును సర్వసమయములందు నాందోళన మొనరించుచుండిరి. సర్వదా యౌరంగజేబు శివాజీ వ్యాధివృత్తాంతము నెఱుఁగుచుండెను. ఇట్టితఱిఁ గూడ శివాజీ యావాసమునకు నలువైపులందును యతఁడు సన్నివేశిత మొనరించిన రక్షకభటులను బూర్వమట్లెయుంచెను. శివాజీ సంకటవిషయమున నతఁడు లోకులనికటమున నక్షేపముఁ బ్రకాశించుచునీవ్యాధిచేనతఁడు మృతుఁడైనచో దనకెక్కుడు నిందలేకనే యనాయాసముగఁగంటకోద్ధారమగునని యౌరంగజేబు సంతసమొందుచుండెను.

సంధ్యాకాల సమాగతసమయమున నొకప్రాచీన సంభ్రాంత ముసల్మానుహాకీము శివాజీ గృహద్వారనికటమున కరుగుదెంచెను. ప్రహరు లతనినుద్దేశించి "యేయుద్దేశ్యమునఁ దాము శివాజీదర్శనమును వేఁడుచుంటి" రనిప్రశ్నించిరి. హాకీమిట్లనెను. "చక్రవర్తి యాదేశానుసారముగ రోగికిఁజికిత్సఁ గావింపవచ్చితిని." రక్షకభటులు ససమ్మానముగ నతనిని లోనికిఁబోనిచ్చిరి.

శివాజీ పర్యంకముపై శయనించియుండెను. అతనిభృత్యుఁడప్పుడటకువచ్చి చక్రవర్తి హాకీమొకనిని యతనికడకుఁబంపెనని యెఱింగించెను. ఏదియోవిధముగఁ దనకు విషప్రయోగ మొనరింప నౌరంగజేబు ప్రయత్నించుచుండెనని, తీక్ష్ణబుద్ధియైన శివాజీ తక్షణమేగ్రహించి యతఁడు భృత్యునకిట్లాదేశ మొసఁగెను. "హిందూకవిరాజులే నాకుఁ జికిత్సఁగావించుచుంటిరని హాకీమ్‌జీకినా సలాముల నెఱింగించి తెలుపుము; నేనుహిందువుఁడను; అన్యరూపచికిత్సను నేనిచ్చగింపను; చక్రవర్తిచూపిన యీయనుగ్రహమునకు నాకోటికోటిధన్యవాదముల నెఱింగింప నతనితోఁ జెప్పుము."

ఈయాదేశమునుగొని భృత్యుఁడుగృహమునుండి వెలుపలకుఁ బోకపూర్వమే యనాహూతుఁడై హకీమునిలయమునఁ బ్రవేశించెను. శివాజీ యతనినిఁగాంచి మిగులఁ గోపోద్దీపితుఁడయ్యెను; కానియతఁడు తనయాగ్రహమును సంకోచనమొనరించి యతిక్షీణమృదుస్వరమున హకీమున కభ్యర్థనమొనరించి శయ్యాపార్శ్వమున గూర్చుండఁగోరెను. హకీముపవిష్టుఁడై రోగిని వీక్షింపఁదొడంగెను.

ఆకృతిఁగాంచిన హకీమునుగుఱించి యెట్టిసందేహమును గలుఁగ నేరదు. అతఁడు వయోవృద్ధుఁడైయుండెను. అతనిమిగుల శుక్లమైన శ్మశ్రురాజి లంబితమై యతని యురస్థలమున నావృతమొనరించెను. అతనిమస్తకోపరిభాగమునఁ బ్రకాండమైన యుష్ణీషముఁగలదు. అతనిస్వరముధీరమై గంభీరముగనుండెను.

హకీము శివాజీనుద్దేశించి యిట్లనెను. "మహారాజా! మీరు మీభృత్యునకొసంగిన యాదేశమును వింటిని. మీరు నాచికిత్స నిచ్ఛగించుటలేదు. అయినను మానవజీవమును రక్షించుటేమాధర్మము, నేను స్వధర్మసాధనముఁ గావించుకొనెదను."

శివాజీలోలోన మఱింతగోపించి యీవిషాద మెచటనుండియేతెంచెనని భావించి యేమియుఁబలుకక నట్లేయుండెను.

హకీమ్—మిమ్ము బాధించువ్యాధియెట్టిది?

కాతరస్వరమున శివాజీయిట్లనెను. "ఇదెట్టిభీషణపీడయో నేనెఱుఁగలేకుంటిని. శరీరముసర్వదా అగ్నిచందమున జ్వాలించుచుండెను. హృదయమందువేదన—సర్వాంగములందును వేదన!"

గంభీరస్వరమున హకీమిట్లనెను. "పీడకంటె జఘంపచే శరీరమధికముగజ్వాలించును. హృదయావేదనమెక్కుడుగ మానసికక్లేశసంజాతము! మీవ్యాధి యట్టిదియాయేమి?"

విస్మితభయములు చిత్తమునుగలఁచివైచి శివాజీదిట్టరియైనయాభిషగ్వరుని వీక్షింపసాగెను. హకీముముఖమట్లే గంభీరమైయుండెను. ఎట్టిభావవైలక్షణ్యములక్షితముగాలేదు. శివాజీనిరుత్తరుఁడైయుండెను. హకీమతని శరీరముపైఁ జేయివైచి నాడిపరీక్షించెదననెను. శివాజీమఱింతభీతుఁడై చేయునదేమియులేనందున వైద్యునివైపుగ దనవామకరమును సారించెను.

చాలసేపటివఱకును బాగుగఁ నాడినిబరీక్షించి హకీమిట్లనెను. "మీవచనము లెట్లుక్షీణములుగనున్నవో నాడియట్లు క్షీణముగలేదు. రక్తనాళములందు రుధిరము వేగవంతముగ సంచాలితమగుచుండెను. కీళులుకూడఁ బూర్వమువగిదినే దృఢబద్ధములైయున్నవి. మీయాచర్యయంతయుఁ బ్రవంచనామాత్రమునితోఁచెడిని. ఇట్లునటించుటవలన మీయుద్దేశమేమి?"

మరలవిస్మితుఁడై శివాజీ యాయపూర్వభిషగ్వరునిఁ దదేకదృష్టితోఁ వీక్షింపసాగెను. చికిత్సకుని ముఖమండలము గంభీరమై యకంపితమైయుండెను. కపటభావమేమియు లక్షితమగుటలేదు. శివాజీశరీరమందుఁ గ్రమక్రమముగ యుష్ణశోణితముసంచారితము కాఁదొడంగెను; కానియతఁడు క్రోధసంవరణమొనరించుకొని మరల హీనస్వరముగనిట్లనియెను. మీరెట్లువచించుచుండిరో యన్యచికిత్సకులునుగూడ నట్లే పలుకుచుండిరి. ఈమహాత్పీడ బాహ్యలక్షణశూన్యమైనది. కాని దినదినమును క్రమక్రమముగ జీవననాశ మొనరించుచుండెను."

హకీముక్షణకాలము చింతించియిట్లనెను. "ఆలఫ్‌లాయలాలాయలున్" అనుచికిత్సాశాస్త్రమొకటి మాభాషయందుఁగలదు. అందు వేయిన్నొక్కవ్యాధులగుణములు లిఖింపఁబడియుండెను. తన్మధ్యమున బాహ్యలక్షణశూన్యవ్యాధులచికిత్సావిషయములుదెలుపఁబడెను. అట్టిపీడలలో నొకదానిచికిత్స "పకున్‌తనే ఆసిరీయిశారాత్ ఖుర్దా"

కారాగృహబద్ధులు కార్యమొనరింపకుండుటకై యేవ్యాధినిఁగల్పించుకొందురో దానిచికిత్సశిరచ్ఛేదనము. మఱియొకవ్యాధిపేరు "డిగ్ రానే దోజిఖ్ మొఖ్ తిఖార్ కునన్ద్" యువకులీయాపీడలను గల్పించుకొనినరకబాధగాములైనచో వారలకొసంగఁదగు నౌషధము పాదప్రహారము. బాహ్యలక్షణశూన్యమైన తృతీయవిధవ్యాధియొండుగలదు. దానిపేరు "ఆరొబిహావర్ గేరెప్ తా జెరెబగల్" ప్రవంచకులు నిజప్రవంచ నాగోపనార్థమై యీవ్యాధిని గల్పించుకొందురు. దానియౌషధముకూడనందు నిర్దేశింపఁబడియుండెను. నేనాయౌషధమును మీకొసఁగుచుంటిని."

శివాజీకి శాస్త్రవిషయము లేవియు బోధపడలేదు. కాని హకీము తీక్ష్ణబుద్ధియనియుఁ జతురుఁడనియు: దనుమనోభావమును గ్రహించెననియు నతఁడెఱింగెను. కాని యతఁడిక కర్తవ్యవిమూఢుఁడై వైద్యు నిట్లడిగెను, "ఆయౌషధమేమి?"

హకీము—అదొక యుత్కృష్టయౌ షధమగుట నిక్కము. ఉత్కటవిషమగుటకూడ నిశ్చయము.

'రబ్బుల్ ఆల్ మినార్' అనిభిషగ్వరులు దానినివాడుదురు. నేను దానినే మీకొసఁగెదను. మీవ్యాధి యథార్థమైనదైనచో నీయవ్యర్థయౌషధముచే నది తక్షణంబ యంతరించును. మీరారోగ్యలాభము నొందెదరు. లేకనది ప్రతారణమైనచోనది యవ్యర్థవిషమై వైశంబ మీకుఁ బ్రాణనాశ మొనరించును.

శివాజీహృదయము కంపింపఁదొడంగెను. అతనిలలాటమునుండి స్వేదబిందువులు పతితమగుచుండెను. ఔషధసేవనమును నిరాకరించినచో నతనిప్రతారణము ప్రచారితమైపోవును. దానిని సేవించినచో నతనికి మృత్యువాసన్నమగుట నిశ్చయము.

హకీమౌషధమునుకలిపి శివాజీ కొసఁగఁబోయెను. శివాజీయది గాంచి యిట్లనెను. "ముసల్మానులు తాకినపానీయమును నేను పుచ్చుకొనను."

కాని హకీమతనిపలుకులను లక్ష్యింపక యౌషధపాత్రను శివాజీ నోటికందఁ జేయనుంకించెను. అప్పుడతఁడొక యూపుననాపాత్రను దూరముగ విసరివైచెను. హకీమొకింతయైనను గోపింపక మెల్లగనిట్లనెను. "ఇట్టితీవ్రహస్తసంచాలనము క్షీణతాలక్షణము కాదు."

శివాజీ చాలసేపటివఱకును యతికష్టముచేఁ దనక్రోధమును సంవరణ మొనరించెను; కాని యిఁక నతఁడట్లొనరింపఁజాలక యకస్మాత్తుగ లేచిగూరుచుని "ఔషధమొసఁగ శ్రమతీసికొనుచున్నందులకు నీకిదియే పారితోషక"మని పలికి యాముదుసలివైద్యునకొక చపేటాఘాతమొసఁగి యతని దీర్ఘశ్మశ్రువులఁబట్టి ముందునకులాగెను. శివాజీ అంతలో విస్మితుఁడైపోయెను. ఆమిథ్యాశ్మశ్రువులుపూర్తిగ నూడిపోయినవి. చపేటాఘాతముచే నుష్ణీషము దూరమునఁ బడిపోయెను. శివాజీయొక్క బాల్యసుహృదుఁడైన తన్నజీమాలశ్రీ పకపక నవ్వుచుతేనిసమ్ముఖమున నిలువంబడెను.

చాలసేపైనపిదప హాసనసంవరణ మాచరించుకొని తన్నజీ గృహద్వారమును బంధించివైచి శివాజీపర్యంకమును జేరి యతనిపార్శ్వమున నుపవేశన మొనరించి యిట్లనెను. "దేవర యెపుడును చికిత్సకులకిట్టిపారితోషికమునే యొసఁగుచుంటిరాయేమి? అటులైనచో రోగిమృత్యువునకుఁబూర్వమే దేశమందలివైద్యులందఱుఁ గాలము చేయుదురు! వజ్రసమచపేటాఘాతముచే నిపుడుకూడ మస్తకము విఘూర్ణితమగుచుండెను!"

శివాజీనవ్వుచు నిట్లనెను. "మిత్రమా! బెబ్బులితో నాటలాఁడిన

చో నపుడపుడాహతుఁడవు గావలసివచ్చును. ఏమైననుఁగానిమ్ము, నిన్నుఁగాంచినతోడనే నాకెట్టియాహ్లాదముఁగలిఁగెనో నేఁబలుకఁజాలను. ఈనడుమనే నిన్నువీక్షింప నాశించుచుంటిని, ఇపుడు విశేషములేమియో చెప్పుము,"

తన్నజీ—ప్రభుయీదేశముల నన్నిటి నెఱవేర్చితిని. ఒక్కొక్కటియే యెఱింగించెదను. చక్రవర్తి యొసఁగిన యనుమతి పత్రము మూలమున మీయనుచరులందఱు నిరాపదముగ ఢిల్లీనుండి నిష్క్రాంతులైరి.

శివాజీ—అందుచే జగదీశ్వరునకు ధన్యవాదప్రదానమొనఁగుచుంటిని. ఇపుడు నామనము శాంతించెను. నేను నాపలాయనము కొఱకై యంతగ భావించుటలేదు. గగనవిహారియైన శకుంతము పంజరమున బద్ధమైయుండదు.

తన్నజీ—ఆయనుచరులందఱు ఢిల్లీనుండి వెడలిపోయి జడదారుల వేషములధరించి, మధురాబృందావనములందు వసించుచుండిరి మధురయందు దేవాలయపురోహితులందఱు గూడ ప్రత్యహమును మిమ్మును ప్రతీక్షించుచుండిరి. ఢిల్లీనుండి మధురకుఁ బోవుపథమును బాగుగఁ బరీక్షించి, యందే యేస్థానములందు భృత్యులను సన్నివేశితమొనరింప మీరాదేశమొసరించిరో యందందట్లు గావించితిని,

శివాజీ—చిరమిత్రమా ! నీకార్యదక్షతచే మనమవశ్యముగ, నిరాపదముగ స్వదేశమునకుఁ బోఁగలుఁగుదుము.

తన్నజీ—మీమూదల ననుసరించి ఢిల్లీప్రాచీరబాహ్యమున జవోపేతముగఁ బోవు తురగము నొకదాని నుంచితిని. ఏదినమును స్థిరపఱచెదరో, యాదినమే యన్నియుఁ దయారుగనుండును.

శివాజీ—బాగు.

తన్నజీ—జయసింహునిపుత్రుఁడైన రామసింహుని కడకుం బోయి యతని జనకుఁడు మీకొనరించిన వాగ్దానము నతని స్మరణకుఁ గొనివచ్చితిని. జనకుని వగిదినే రామసింహుఁ డుదారచేతస్కుఁడు. సత్యప్రియుఁడు. అతఁడు స్వయముగఁ జక్రవర్తి నికటమునకరిగి తమ కొఱకై సాశ్రునయనుఁడై యావేదమొనరించెనని వింటిని.

శివాజీ—చక్రవర్తి యేమనెను ?

తన్నజీ—తనకేమి కర్తవ్యమో దానినిఁ గావించెదననెనఁట.

శివాజీ—ఔరంగజేబూ ! విశ్వాసఘాతుకా ! కపటాచారీ ! యెప్పటికైనను శివాజీ నీకుఁ దగుప్రతిఫలమొసఁగునులే.

తన్నజీ—రామసింహుఁ డాప్రయత్నమున విఫలమనోరథుఁడయ్యెను. రసపుత్రుల వచనము లన్యథాగాలేవనియు, సైన్యార్థముల ద్వారా సాధ్యమైనంత దనుక మీకు సహాయమొనరించి యీప్రయత్నములందసువులఁ గోల్పోవవలసియున్నను భయరహితుఁడనై యట్లొనరింప సంసిద్ధుఁడనై యుంటిననియు సరోషముగ నాయువకుఁడు నాతోఁబలికెను.

శివాజీ—జనకునకుఁ దగుపుత్రుఁడే. కాని నేనతనిని విపద్గ్రస్తుఁజేయ నిచ్చగింపను. పలాయనార్థమై నేనూహించిన యుపాయమును నీవాతని కెఱింగించితివా ?

తన్నజీ—ఎఱింగించితిని. అదివిని యాతఁడు సంతుష్టుఁడై, మీకు సంపూర్ణసహాయతఁ గావింప స్వీకృతుఁడయ్యెను.

శివాజీ—బాగు.

తన్నజీ—ఇంతియేఁగాక దానేశ్మంద్ ప్రభృతియావతీయమొగలు సభ్యులను, మిష్టాలాపముల వలనను అర్థమూలముననను మీపక్షవర్తులుగ నొనరించితిని. ఢిల్లీయందు మీపక్షవర్తి కాని యున్నతవంశ

నుఁడైన ముసల్మానుగాని హిందువుగాని లేఁడు. కాని యౌరంగజేబీరి వచనములను పాటింపలేదు.

శివాజీ—అట్లైన నంతయు సంసిద్ధమై యుండెను. ఇఁక నేనారోగ్యవంతుఁడను గావచ్చునా ?

మందహాసవదనుఁడై తన్నజీ యిట్లనెను. "నావగిది విజ్ఞహాకీము ఘనవైద్యుఁడు మీవ్యాధిఁగుదుర్ప నుంకించినపు డేకనది నిలచియుండఁగలదా ? కాని మీరు ద్రావుటకై మధురమైన "షర్బత్" నుతయారొనరించితిని. అంతయుఁ జాఱఁబోసి వైచితిరి.

శివాజీ మఱియొకపాత్రి 'షర్బత్'ఁ ద్రావింపుమని గోరెను. తన్నజీ యట్లేగావించి తేనికొనఁగెను. శివాజీ దానినిఁ ద్రావి, మందస్మితముఖమండలుఁడై యిట్లనియెను. "భిషగ్వరవతంసమా! మీయౌషధమెంత మధురమైనదో యంతఫలదాయకమైనది. నావ్యాధియంతయు నుకేమాఱుగ నంతరించిపోయెను"

తదనంతరమునఁ దన్నజీ ప్రీతి పురస్సరముగ శివాజీ నాలింగనమాచరించుకొని మరల నుష్ణీషశ్మశ్రులను ధరించి, యానిలయము నుండి నిష్క్రమించెను.

ద్వారసమ్ముఖమందలి భృత్యులతనిఁగాంచి, "వ్యాధియెట్లున్నదని యడిగిరి.

హాకీము—అదిచాల సంకటజనకమైనది. కాని నాఘనౌషధముచే నదిచాలవఱకు ఉపశమించెను. కొలఁదిదినములలో శివాజీ క్లేశముక్తుఁడై సంపూర్ణారోగ్యముఁ బొందవచ్చును.

హాకీమ్‌జీ ద్వారసమ్ముఖమున నున్న శిబికము నెక్కి వెడలిపోయెను; ఆద్వారరక్షకులందొకఁడు, మఱియొకని నుద్దేశించి యిట్లనెను. "ఈహాకీముమిగుల ఘనుఁడు, ఎందఱెందఱు వైద్యులొవచ్చియీవ్యాధిఁగుదర్పఁజాలకపోయిరి. ఒకేదినములోనే హాకీమ్‌జీ దాని నెట్లు కుదిర్చెను"

"ఎట్లనెదవేల? ఇతఁడు రాజగృహహాకీమ్‌జీ యని యెఱుఁగవా యేమి?" యని ద్వితీయ ప్రహరి యుత్తరువొసఁగెను.

ఇరువది యెనిమిదవ ప్రకరణము.

ఆరోగ్యము

ఉపర్యుక్తఘటనకతిపయదినానంతరమున శివాజీ వ్యాధియొకించుక యుపశమించెనను వార్త ఢిల్లీయందుఁ బ్రచారితమయ్యెను. నగరమంతయు మరలధూమధామముచే నిండిపోయెను. అందఱు నావార్తనే చెప్పుకొనుచుండిరి. హిందువులందఱావిషయమెఱిఁగి పరమానందభరితులైరి. మహాశయులైనముసల్మానులా సంవాదమును విని సుఖులైరి. పథములందును ఘట్టములందును, యంగడులందును, మసీదులందును, నగరవాసులందఱీవార్తనే చెప్పుకొనుచుండిరి. ఔరంగజేబీవార్త విని యథోచితముగ దవసంతోషమును బ్రకాశమొనరించెను.

నగరమందలిఁ గలరవము శాంతినొందెను. శివాజీ విప్రవరులకు రాసిరాసులుగ నాణ్యములను దానమొనరించుచుండెను, దేవాలయములకుఁ బూజాసంభారముల నంపుచుండెను. భిషగ్వరులకర్థదానమొసఁగి వారలను సంతుష్టులఁజేయుచుండెను. బజారులందిఁక మిష్టాన్నములేదు. విక్కుటముగ మిఠాయినిఁ గ్రయమొనరించి శివాజీ ఢిల్లీయందలి ధనికులిండ్లకంపుచుండెను; పరిచితులైనవారలందఱికడకుఁ బారితోషికములనంపుచుండెను; వచింపనేల; ఫకీరులసేవార్థముకూడ శివాజీ ప్రచురపరిమాణమునఁ బ్రతిమసీదునకు మిష్టాన్నము నంపుచుండెను,

చక్రవర్తి మనమెటులుండనిండు—పౌరులందఱు శివాజీయొక్క వదన్యతాసదాచరణములఁగాంచి సంతుష్టులై యతనిని వేనోళులఁ బ్రశంసించుచుండిరి. "ఢిల్లీలడ్డులు" ఢిల్లీయందెల్లెడల వెదజల్లఁబడియెను. అపుడైనఁ బశ్చాత్తాపమొందిరో లేదో దెలుపఁజాలము కాని యౌరంగజేబతి శీఘ్రములోఁ బశ్చాత్తప్తహృదయుఁడయ్యెను.

శివాజీ మిష్టాన్నమునంపినమాత్రమున సంతుష్టుఁడగుటలేదు. మిఠాయి క్రయమైనపిదప దానిని నిజావాసమునకు రప్పించి, ప్రకాండయాధారములందు దానినమర్చి వెలుపలకంపుచుండెను. ఆయాధారములందుఁగొన్ని మూఁడు నాలుఁగుమూరల పొడవై పది పండ్రెండుగురు వాహకులచేఁగొనిపోఁబడుచుండెను. కతిపయదినములవఱకు నీవిధముగ మిష్టాన్నము వితరితముగాసాగెను.

ఒకనాటి సంధ్యాసమయమున నిడివియైన రెండు మిష్టాన్నాధారములు శివాజీ నిలయమునుండి వెలుపలకుఁ గొనిరాఁబడియెను. ప్రహరులు వాహకులనుద్దేశించి, "వీనిని యేరిగృహమునకుఁగొనిపోవుచుంటి"రని యడిగిరి.

"జయసింహుని సదనమునకుఁ గొనిపోవుచుంటి"మని వారలుత్తరువొసఁగిరి.

ప్రహరులు—మీప్రభు విఁక నెన్నిదినములవఱకు మిష్టాన్నము పంపును ?

వాహకులు—నేఁటితోఁ జాలించును.

మిష్టాన్నభారమునుగొని వాహకులు వెడలిపోయిరి.

చాలవఱకుఁ బథమునతిక్రమించినపిదప నొక సంగోపనస్థానమున సంధ్యాకాలాంధకారమున నావాహకులాధారములరెంటిని దింపివైచిరి. వారలు నలువైపులకుఁబరీక్షించిచూచిరి. అంతయుజనశూన్యమైయుండెను. సంధ్యావాయువుమాత్రము రివ్వురివ్వునవీచుచుండె

ను. వాహకులొక యింగితమొనర్చిన పిదప నాయాధారములందొకదాని నుండి శివాజీయు మఱియొకదానినుండి శంభాజీయు వెలుపలకు వచ్చిరి. పుత్రసమేతుఁడై మహారాష్ట్రనేతఁడు జగదీశ్వరునకు ధన్యవాదమొసఁగెను.

విలంబమాచరింపక వారలుభయులును ప్రచ్ఛన్నములనుదాల్చి ఢిల్లీ ప్రాచీరాభిముఖముగఁబోయిరి. సంధ్యాసమయమున జనసంచారమల్పమై యుండెను. అయినను రాజపథమునుండి యొకరిరువురు పథికులెదురగునపుడు శంభాజీ హృదయము భయోద్వేగములచేఁ గంపించుచుండెను.

శివాజీ జీవనమంతయు నిట్టి విషాదములతోనిండియేయుండెను; అతనికీ విషాదము నూతనము కాదు. అయినను అతని హృదయముద్వేగశూన్యమై యుండలేదు.

కంపితహృదయులై వారలిరువురును ప్రాచీరము నతిక్రమించిరి. రాజభటుఁడొకఁడు వారలఁగాంచి "ఆపోవునదెవ"రనియడిగెను.

శివాజీ—"జడదారి. హరినామస్మరణము; హరినామస్మరణము హరినామైవ కేవలమ్."

భృత్యుఁడు—ఎచటకుఁ బోవుచుంటివి ?

శివాజీ—మధురాతీర్థస్థానమునకు. కలౌనాస్త్యేవనాస్త్యేవనాస్త్యేవగతిరన్యథా

ఉభయులును ప్రాచీరమును గడచిపోయిరి.

ప్రాచీరబహిఃప్రదేశమునఁగూడ ననేకధనాఢ్యులును యుచ్ఛపదాభిషిక్తులును వసించుచుండిరి. శివాజీ శంభాజీ లిరువురు వారల నిలయములన్నిఁటినిఁ ద్వరితగతి నతిక్రమించిరి.

దూరమున నొకవృక్షతలమందొక యశ్వము బద్ధమైయుండెను. శివాజీ తనయ సహితుఁడై సతర్కభావమున నాయెడకుఁబోయి

జూచెను. అదినిక్కువముగఁ దన్నుజీవర్ణితహయమే. "భాయీ! నీపేరే" మని శివాజీ యశ్వరక్షకునడిగెను.

రక్షకుఁడు—జానికీనాథుఁడు.

శివాజీ—ఎచటకుఁబోయెదవు?

రక్షకుఁడు — మథుర.

శివాజీ—"అవును. నిక్కువముగనీయశ్వమే"

శివాజీ హయమునారోహించి తనయుని వెనుకఁ గూర్చుండఁజేసి మథురాభిముఖముగఁ బోసాగెను. అశ్వరక్షకుఁడు వెనుకనుండి బరువెత్తుకుని వచ్చుచుండెను.

అంధకారనిశీథమందుఁ ఢిల్లీ ప్రాంతముల నతిక్రమించుచు నిర్వాక్కుఁడై శివాజీ పలాయన మొనర్చుచుండెను. నభమందుఁ దారకలు మిణుకుమిణుకుమని వెలుఁగుచుండెను, చిన్న చిన్న మొయిళ్ళొక్కొక్కమాఱుగ గగనతలము నాచ్ఛాదిత మొనరించుచుండెను. వర్షాకాలమగుట సలిలముచేఁ బూర్ణమైయున్న యమునాస్రవంతి ప్రబలవేగమునఁ బ్రవహించుచుండెను. పథఘట్టములన్నియుఁ బంకిలమయములై జలపూర్ణములైయుండెను, అనుద్వేగపూర్ణహృదయుఁడై శివాజీపలాయన మొనరించుచుండెను.

ఇంతలో దూరమునుండి ఘోటకపదశబ్దము వినంబడియెను. శివాజీ యేమరుగుననైన దాఁగియుండయత్నించెను; కాని ఆతావున భూరుహముగాని కుటీరముగాని లేకుండుటంజేసి యతఁడుపూర్వము పగిదినే దనతురగము నుడాయించుచుఁబోవుచుండెను.

మువ్వురాశ్వికులు ఢిల్లీనగరాభిముఖముగఁబోవుచు శివాజీకెదురుగ వచ్చుచుండిరి. వారలుమువ్వురును కృపాణపాణులై యుండిరి. దూరమునుండి శివాజీతురగమునుగాంచి వారలు తమయశ్వముల నాదిక్కుగఁ బ్రధావిత మొనరించిరి. శివాజీహృదయముద్వేగముచేఁ గొట్టు

కొనుచుండెను. ఆయాశ్వికులలో నొకఁడు శివాజీనికటమునకువచ్చి, "పోవున దెవర"ని ప్రశ్నించెను.

శివాజీ—పరివ్రాజకుఁడు.

ఆశ్వికుఁడు—ఎచటనుండివచ్చుచుంటివి?

శివాజీ—ఢిల్లీనగరమునుండి.

ఆశ్వికుఁడు— మేము ఢిల్లీపోవుచుంటిమి, కాని మార్గమునుదప్పితిమి. మా వెనువెంటవచ్చి పథమునుజూపి పిమ్మట మథురకు బొమ్ము.

శివాజీమస్తకమున వజ్రాఘాతమైనట్లయ్యెను. ఢిల్లీపోవుటకిచ్చగింపనిచో సైనికులు దమబలమునుజూపుదురు ఆవిపత్సమయమున వారలు శివాజీ నొకవేళగుర్తింపవచ్చును. ఏలనన ఢిల్లీయందు శివాజీనిగాంచనిసైనికుఁడెవండును లేఁడు. మరల ఢిల్లీపోయినయెడల ననిర్వాచ్యములైన విషాదములాపాదించుటకేమియు సందియములేదు. ఇతికర్తవ్యతామూఢుఁడై శివాజీ చింతింపఁదొడంగెను.

ఆశ్వికుఁడొకఁడు శివాజీసమ్ముఖమునకరుదెంచి యతనితోఁ బ్రసంగింపసాగెను. తక్కంగల యిరువురాశ్వికులును యస్పష్టస్వరమునఁ బ్రసంగ మొనరించుకొనుచుండిరి. ఆప్రసంగమేమి?

ఒకఁడిట్లనెను. "ఈకంఠస్వరమును నేనెఱుంగుదును. నేనుదక్షిణదేశమునసయిస్తఖానుయధీనమునఁ జాలకాలము సైనికవృత్తిఁగావించితిని, ఈపథికుఁడు జడదారి కాఁడని నేనుఘంటాపథముగఁ జెప్పఁగలను."

రెండవవాఁడు—అటులైననితఁడెవరు?

మొదటివాఁడు—ఇతఁడు శివాజీయని నేనుసందేహించుచుంటిని. ఇరువురుమనుజుల కంఠస్వరము లిట్లుపోలియుండవు.

రెండవవాఁడు—ఛీ! మూర్ఖుఁడా! శివాజీ ఢిల్లీయందు బంధితుఁడైయుండెను.

మొదటివాఁడు—మేముకూడనట్లే శివాజీ సింహగరదుర్గమందుండెనని దలఁచితిమి. అకస్మాత్తుగ నొకనిశియందతఁడు పూనాను ధ్వంస మొనరించెను.

రెండవవాఁడు—బాగు. అతనియుత్తమాంగముపై నున్న వసనమునుదొలగించిచూచినచో సందేహనివారణమగును.

ప్రథమయాశ్వికుఁడు శివాజీనిసమీపించి యకస్మాత్తుగనతని యుష్ణీషమునులాగివైచెను. శివాజీ యతనినిగుర్తించెను. అతఁడు నయస్తఖానుయధీనమందున్న యొకప్రధానసేనాని.

అతనిహస్తముననపుడు కరవాలముండియున్నచో నేకాకియయ్యు వారలముప్పురనొక్కత్రుటిలో యమసదనమున కంపియుండును. రిక్తహస్తుఁడయ్యు శివాజీయాముప్పురిలోనొకనిని ముష్టియాఘాతముచే నచేతనమొనరించివైచెను. మిగిలినయిరువురుసైనికులును ఖడ్గపాణులై నికటమునకువచ్చి శివాజీనిబట్టి యతనిని భూతలశాయిగ నొనరించిరి. శివాజీయిష్టదేవతలనుస్మరించుచు దానుమరల బంధింపఁబడుననియు విషాదమందు మిత్రశూన్యుఁడనై యౌరంగజేబుచే హతమొనరింపఁబడుదుననియుఁ జింతించుచుండెను. అతఁడుతనదృక్కులను శంభాజీపైఁబఱపెను—శివా నయనము లశ్రుధారలచే నాప్లుతములయ్యెను.

అపుడకస్మాత్తుగ నేదియోశబ్దమయ్యెను. అశ్వికులలో నొకఁడు వాడియైనయొండుతూపుచే నాటఁబడి భూతలమునఁబడియెను. మఱియొకయమ్ముచే నింకొకసైనికుఁడు హతుఁడయ్యెను. శివాజీశత్రువులు ముప్పురుగూడ నొకయరనిముసములో భూతలశాయులైరి. ముప్పురును కృతాంతమందిరమునకుఁబోయిరి.

శివాజీ పరమేశ్వరునకు ధన్యవాద మొనరించిలేచి వెనుకనుండి యశ్వారోహకుఁడైన జానకీనాథుఁడమ్ములనేయుచుండుటఁ గాంచెను. విస్మితుఁడై యతఁడు జానకీనాథునినికటమునకుఁబిలచిదనకుఁ బ్రాణదానమొసఁగినయతనిని వేనోళులఁగొనియాడఁ దొడంగెను. జానకీనాథుఁడు శివాజీనిసమీపింపఁగనే శివాజీ మఱింతవిస్మితుఁడయ్యెను. జానకీనాథుఁ డశ్వారోహకుఁడుకాఁడు. అశ్వారోహకవేషమందున్న జానకీపతి సన్యాసి!

శివాజీయపుడనేకవిధముల సంయమిప్రవరుని దన్నుమన్నింపఁ బ్రార్థించియిట్లనెను. “బాలయోగీంద్రమా! ఆపత్సమయమున మీరుగాక శివాజీకి బ్రకృతమిత్రులెవరుగలరు? మీరశ్వారోహకులంచుదలంచి మిమ్ముఁదుచ్ఛముగఁ గాంచినందులకుఁ గరుణించి నన్నుమన్నింపుఁడు. నాకొఱకై మీరొనరించిన యీకార్యమునకు నేనెట్టియుపయుక్తపురస్కారమును దమకీయఁగలను?”

బాలయోగి యపుడు శివాజీ సమ్ముఖమున కరుదెంచి, నతజానువుఁడై కరములఁజోడించి యిట్లనెను. “రాజశేఖరా ! ప్రచ్ఛన్నవేషమందున్నందులకు నన్ను మన్నింపుఁడు. నేనుమీపురాతనభృత్యుఁడనైన రఘునాథుఁడను. జ్ఞానమొచ్చినదాదిగ మీసేవయొనరించితిని. ఆజీవనకాలము మీకు సేవయొనర్చెదను. ఇంతకుమిన్న నాకన్యకోరికయేదియు లేదు. నాకన్యపురస్కారమేమియు వలదు. తెలియమింఁజేసి ప్రభుసమ్ముఖమున నెపుడైన నెట్టిదోషమునైనఁ గావించియున్నచో సదయహృదయులై మన్నింపుఁడు.”

శివాజీ—చకితుఁడై బాలకుఁడైన రఘునాథుని వైపుగఁజూడ దొడంగెను. అతఁడు తనహృదయోద్వేగమును సంవరణమొనరించుకొనఁజాలక పోయెను; సాశ్రునయనుఁడై యతఁడు రఘునాథు నాలింగన మాచరించుకొని యిట్లనెను. “రఘునాథా ! రఘునాథా ! శివాజీ

నీకెన్నియో యపరాధముల నొనర్చితి. కాని నీవు మహదాచరణములచే నాకు యథేష్టదండన మొసంగితివి. నిన్ను నేను సందేహించితిని. నీకేనవమాన మొనరించితిని. ఆయాచరణమును స్మరించినంత నే నాహృదయము విదీర్ణమగుచుండెను. శివాజీ సజీవుఁడై యున్నంత కాలము నీవొనరించిన మహోపకారములను మఱువఁజాలఁడు. ప్రాణ ప్రయత్నములచే నీమహత్ ఋణమును దీర్పసాధ్యమగుచో దానిని దీర్పయత్నించెదను."

ఆశాంతనిస్తబ్ధనిశియందు వారలిరువురు పరస్పరాలింగన సుఖమున విముగ్ధులై పోయిరి. రఘునాథజీ యొక్క-పత్రము నేఁడు శేషించెను. శివాజీ యొక్క-హృదయవేదన నేఁడంతరించెను. బాలకులవడుపున వార లుభయులు నవారిగ నశ్రువర్షముఁ గురిపింపసాగిరి.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

ప్రాసాదమున,

నిశీధము లీజానకీపతి యోగియొద్దనుండి సెలవుఁగైకొని రసపుత్రబాలిక నిజాలయమునఁ బ్రవేశించెను. కాని ప్రియంవద హృదయము శూన్యమైయుండెను. వీరసపుత్రయోధుని ప్రథమదర్శనమాత్రముననే ప్రియంవద చకితయై యానందితయయ్యెనో, వీరశూరుని గతిపయమాసముల నుండి దనహృదయేశ్వరుఁడని యారసపుత్రబాల దలఁచుచుండెనో, వసుంధరునకు వృద్ధుఁడైన జనార్దనుఁడు దన్నిచ్చి పరిణయమొనర్చెదనని వాగ్దానమొనరించెనో, యాశూరప్రవరునియదర్శనకతమున నేఁడు ప్రియంవదహృదయము శూన్యమై పోయెను.

ఆదినము గడచిపోయెను. సప్తాహముగతమయ్యెను. మాసమతివాహితమయ్యెను. ప్రియంవద తనహృదయధనమును మరలఁబొందఁజాలకపోయెను. అంధకారసనిశీధములందపుడపుడాబాలిక యేకాకియై గవాక్షపార్శ్వమున సుపవిష్టయై, సంధ్యాసమయమునుండి నడిరేయివఱకును, నడిరేయినుండి ప్రాతఃకాలపర్యంతము చింతించుచుండును. దివసములందు ప్రభాతమునుండి సంధ్యాపర్యంతము నీరవయై యాగవాక్షమునుండి యామె రాజపథముపై తనదృక్కుల సారించునుఁ ఆపథమునుండి రఘునాథజీ మరల రాలేదు.

అపుడపుడపరాహ్ణములందేకాకియై యాసుందరినిలయపార్శ్వస్థితామోద్యానవనమున భ్రమణమొనరించుచుండును. భ్రమణమొనరించుచుండనా లావణ్యమయి యెదయందెన్నియో భావములుదయమగుచుండును. తోరణదుర్గవృత్తాంతము, కంఠమాలవిషయము, రాయగఢప్రయాణవిశేషము, రసపుత్రుని విదయవృత్తాంతము—ప్రియంవద హృదయమునఁ దోచుచుండెను. నీరవమైయుండు ప్రియంవద గండస్థలమునుండి యొక్కొక యశ్రుబిందువు రాలుచుండును. అపుడపుడు రాత్రులందకస్మాత్తుగ నామె హృదయద్వారము ఘాటితమగుచుండును. భాద్రమాసనదీ ప్రవాహమువడువున శోకవారి ప్రవహించుచుండును. అపుడామెను గాంచు వారెవరును యుండరు: ప్రియంవద చాల ప్రొద్దట్లే విలపించుచుండును—శ్రావణమాసధారలచాడ్పున నాబాలిక నయనపద్మములనుండి యజస్రయశ్రుధారలవారిగఁ గురియుచుండును. రాత్రులు గడచి ప్రభాతములగుచుండును, ప్రాతఃకాలరక్తిమచ్ఛటలు పూర్వదిక్కున గన్పట్టును. అపుడుకూడ నాబాల శోకవివశయై లుంఠితయై యుండును.

ప్రాతఃకాలములందుఁ బుష్పాపచయ మొనరింపఁ బ్రియంవద యుద్యానమునకుఁ బోవుచుండును. ప్రఫుల్లసురభిళకుసుమముల నొక్కొకటిగఁ ద్రుంచి, ఆసుందరాంగి వానినిఁ దనహృదయముపై స్థాపన మొనరించుకొనుచు నేదియో చింతించుచుండును. ఆచింత యెట్టిదియో యేతెఱుంగఁగలరు ? అట్లు చింతించి మరల నామె కుసుమములపై తనకటాక్షములఁ బఱపును. పుష్పదళగత ప్రాతఃశిశిరబిందువులతో నొకటి రెండు శుభ్రాశ్రుబిందువులు కలసి పోవుచుండును. అహా! ఆశోకగీతమును వినినంతనే శ్రోతలనయనముల నుండిగూడ బాష్పము లుదితమగుచుండును. ఇట్టిచింతచేఁ గ్రమక్రమముగఁ బ్రియంవద శరీరము శుష్కింపసాగెను. ఆమెముఖమండలము పాండువర్ణమై పోయెను. ఆబాలనేత్రములు కాలిమావేష్టితములై పోయెను. సరళస్వభావుఁడైన జనార్దనుఁ డిపుడు కూడ ప్రియంవద మనోరథము నెఱుఁగ లేకపోయెను. కాని ఆమె శరీరావస్థఁగాంచి మిగులఁ జింతించి యతఁడు కారణమరయఁదొడంగెను.

నారీనికటమున నారీమనోవృత్తాంతము గుప్తమైయుండ నేరదు. చాలయత్నముచేఁ బ్రియంవద తనశోకమును గోపన మొనరించినను, ఆమె సఖీమణులామె మనస్సంకటము నొకించుక యనుమానించి, ప్రసంగవశమున వృద్ధుఁడైన జనార్దనునకిట్లెఱింగించిరి. “ప్రియంవద ప్రాయవతియయ్యెను. ఆమె వివాహమును స్థిరపఱుపుఁడు.” ప్రియంవద యీవిషయమెఱిఁగి జనకున కిట్లువార్తనంపెను. “నాకు పరిణయమాడ నిచ్ఛ పొడముట లేదు. చిరకాలమవివాహితనై యుండి మీపదసేవఁ గావించెదను”

జనార్దనుఁ డావచనముల నేమియుఁ బాటింపలేదు. అతఁడు వరుని స్థిరపఱుపఁదొడఁగెను. రాజపురోహితునిచేఁ బాలింపఁబడు భద్రరసపుత్రికన్యకు వరుఁడు చేకూరుటం దేమియుఁ గష్టములేదు. అవశేష

మున జయసింహుని ప్రధానసేనాపతులలో నొకనికిఁ బ్రియంవద నొసఁగి పాణిగ్రహణ మొనరింప జనార్దనుఁడు నిశ్చయించెను. ప్రియంవద యీవిషయ మెఱిఁగెను. ఆమె శరీరము కంపించిపోయెను. కడులజ్జితయై యామె జనకున కిట్లువార్తనంపెను. “మీరు నన్నింతకుమున్నొక సేనానికొసఁగి పరిణయ మొనర్చెదనని వాగ్దాన మొనరించియుండిరి. అతఁడే నా వాగ్దత్తపతి. ఇతరునిపరిణయమాడినచో వ్యభిచారదోషము ఘటిల్లును.”

జనార్దనుఁ డీవార్త నెఱిఁగి రుష్టుఁడై ప్రియంవద నొకించుక తిరస్కరించెను. పిదప నతఁడు నిజాగారమునకుఁ బోయి మనోవేదనముచేఁ జాలసేపు దుఃఖించెను. అవశేషమున కన్యయొక్క యభ్యంతరమును పాటింపక యతఁడు వివాహదినమును స్థిర మొనరించి, యీవిషయమును జయసింహున కెఱింగించెను. ప్రియంవద దాని నెఱిఁగి, జనకుని పదతలమున లుంఠితయై యుచ్చైస్స్వరమున రోదన మొనరించుచు నిట్లనెను. “పితా! నన్ను మన్నింపుఁడు, ఈవిషయమున శాంతులై యుండుఁడు. లేకున్న మీచిరపాలితయైన యీయభాగిని బాలిక నీజన్మమున మరలఁ గాంచనేరరు” జనార్దనుఁడు తనయను నిజయూరువునందుఁ జేర్చి యామెను కౌఁగిలించుకొని యంగలార్పఁదొడంగెను.

కాని బాలికపలుకుల నేరు పాటించెదరు ?

పదిమంది పెద్దమనుష్యు లెట్లువచించెదరో సమాజమునందున్నపు డట్లాచరింపవలయును. వివాహదినము సమీపింపఁదొడంగెను. తనయకు జనార్దనుఁడు చాలఁగ బోధించెను; ఎంతయో విచారించెను; చాలఁగఁ దిరస్కరించెను. అవశేషమున నిఁక సహింపనేరక వివాహపూర్వదినమునఁ బ్రియంవదతో నిట్లనెను. “పాపీయసీ, నీకొఱకై నేనీవృద్ధవయసున నవమానితుఁడనగుదునా ? నీవు నీజనకుని నిష్కళంకకులమునకుఁ గళంకము దెచ్చెదవా ?”

అశ్రుపూర్ణనయనయై ప్రియంవద మెల్లగ నిట్లుత్తరమొసఁగెను. "పితా! నేనజ్ఞానను. మీనికటమున నేను దోషమొనరించి యుండినచో మన్నింపుఁడు. కాని, జగదీశ్వరుఁడు నాకుఁ దోడ్పడుఁగాక! నావలన మీకవమానము గలుగనేరదు"

ఈపలుకుల యర్థమప్పుడు జనార్దనుఁడు గ్రహింపఁజాలకపోయెను. ఈవచనముల భావము నావృద్ధుఁడు మఱుచటి దివసమున గ్రహించెను. వివాహదినమున రసపుత్రబాలిక నేరును గాంచఁజాలరైరి.

ముప్పదియవ ప్రకరణము.

కుటీరమున

శరత్కాలప్రభాతకమనీయాలోకమున నీరానది వేగముగఁ బ్రవహించుచుండెను. సూర్యకిరణములందు స్రవంతీహిల్లోలములు నగుచు నుప్పొంగుచుండెను. ఆశుభ్రదినకిరుపార్శ్వములందు సుందరసస్యక్షేత్రములు బహుదూరపర్యంతము విస్తృతములై యుండెను. హాళికుల పూజలనందిసంతుష్టయై మేదినీరమణి హరితపరిచ్ఛదమును ధరించి నగుచున్నట్లుండెను. ఉత్తరపూర్వదిక్కులందు శ్యామవర్ణక్షేత్రములును, దూరమున నొకటి రెండు గ్రామములును గన్పట్టుచుండెను. దక్షిణపశ్చిమములందు శైలశ్రేణులు బాలసూర్యకిరణశోభచేభాసమానములగుచుండెను.

ఆనదీ కూలమున శ్యామలక్షేత్రవేష్టితమై సుందరమైన గ్రామమొండు సన్నివేశితమైయుండెను. గ్రామమున కొకప్రాంతమున నొకకృషికకుటీరనికటమున నదీతీరమున నొకబాలిక యాడుకొ

నుచుండెను. ఆమె సమీపమున నొక పరిచారిక నిలువంబడి యుండెను. కృషకపత్ని గృహకార్యములందు వ్యస్తయైయుండెను.

ఆనిలయమును చూచినంతనే యాహాళికుఁడు సంభ్రాంతుఁడని తోఁచకమానదు. ఆగారప్రాంగణమందొకటి రెండు గాదులును, పార్శ్వమున నాలుఁగైదు గోవులును, గృహాభ్యంతరమున మూఁడు నాలుఁగు చిన్నమందిరములును, వెలుపల విశాలమైన వసారాయునుగలవు. ఆగృహస్వామి కృషికుఁడైనను ఆగ్రామమందుఁ జేరువడసినవాఁడనియు వాణిజ్యముకూడ నొకించుకఁ గావించియుండవచ్చుననియు నాయావాసమును గాంచినంతనేతోఁచును.

ఆబాలిక కేడేండ్ల ప్రాయముండును, ఆమె శ్యామవర్ణకాయయై యుండెను. ఆబాలికనయనములు చంచలములై ప్రఫుల్లములై యుజ్జ్వలములై యుండెను. ఒకమాఱు నదీకూలమున నిటునటు బరువెత్తుచు మఱొకమాఱు నిలయాభ్యంతరమున రంధనమొనరించు జననికడకు వేగముగఁబోవుచు, నింకొకమాఱు పరిచారికకడకరుదెంచి యామెకరములను బట్టుకొని యామెతోనేమియో ప్రసంగించుచుండెను.

బాలికయిట్లనెను. "అక్కా!,యిఁక నిచటనుండవద్దు, నిన్నటివలె రేవునకుపోయి బట్టతో మీనములను బట్టుకొందము.

దాసి—చెల్లీ! అట్లువలదు. రేవునకు వలదని అమ్మ వారించెను గదా!

బాలి—అమ్మకు తెలియకుండపోవుదము.

దాసి—ఛీ! అట్లు చేయవచ్చునా? జననివలదని చెప్పినదానిని చేయరాదు. తల్లిమాట నతిక్రమింపవచ్చునా?

బాలి—అయితేసరే! అక్కా! అమ్మ నీకుకూడ అమ్మయగునా?

దాసి—కాకేమి ?

బాలిక—కాదు నిజము చెప్పుము.

దాసి—నిజముగ నాకు తల్లియగును.

బాలిక—కాదు. అక్కా! నీవు రాజపుత్త్రబాలికవు. మేము రాజులము కాము.

దాసి బాలికను చుంబన మొనరించి యిట్లనెను. "అట్లైన నన్నడుగుచుంటి వేమి ?"

బాలిక—మేము రాజులము కాకపోయినను నీవు అమ్మను అమ్మాయని పిలుచుచుంటి వేమి ?

దాసి—ఎవరు నాకు కుడువఁ గూడును, కట్టఁబట్టను యిచ్చుచుండెనో, ఎవరు నేనుండుట కిచ్చట స్థానమొసఁగెనో, యెవరు నన్ను లాలనపాలనముఁ గావించుచుండెనో, యామెనమ్మాయని కాకనింకేమ్మని పిలువను? ఈజగతియందు నాకన్యస్థానమేదియు లేదు. తల్లి నాకు పృథివియందు స్థానమిచ్చెను.

బాలిక—ఛీ అక్కా! నీకు కంటతడియేమి? నీవు మాటమాటకు యేడ్చుచుందు వేమి అక్కా ?

దాసి—కాదు. చెల్లీ! యేడ్పెందులకు ?

బాలిక—నీకండ్ల నీరువచ్చినపుడు నాకండ్లనుండి కూడ నీరు వచ్చును.

దాసీ బాలికను మరల చుంబనమాచరించి యిట్లనెను. "నీవు నన్నుఁ బ్రేమించుచుంటివా?"

బాలిక—నీవు నన్ను బ్రేమించుచుంటివా ?

దాసి—తప్పక ప్రేమించుచుంటిని.

బాలిక—ఎల్లపుడుకూడ ప్రేమించెదవా ? ఎప్పుడును నన్ను మఱువవుకదా ?

దాసి—మఱువను. చెల్లీ! నీవు నన్ను ప్రేమించెదవా? ఎప్పుడును మఱువవుకదా ?

బాలిక—మఱువను.

దాసి—కాదు కాదు. నీవు నన్నొకనాఁడు మఱచెదవు.

బాలిక—ఎపుడు ?

దాసి—నీకు వరుఁడు వచ్చినపుడు.

బాలిక—అతఁడెపుడు వచ్చును.

దాసి—ఇఁక నొకటి రెండేండ్లలో.

బాలిక—కాదు. అక్కా! నిన్ను నేనెపుడును మఱువను. వరునికంటె నిన్ను యెక్కువగాఁ బ్రేమించెదను. అక్కా! నీకు వరుఁడు వచ్చినపుడు నీవు నన్ను మఱచెదవా ?

పరిచారిక నయనములు మరల బాష్పవారిచే నిండిపోయెను. ఆమె యిట్లనెను. "మరువను యెపుడును మఱువను."

బాలిక—నీవరునికంటె నన్ను అధికముగఁ బ్రేమించెదవా ?

పరిచారిక నవ్వి "సమానసమానముగ" ననియెను.

బాలిక—అక్కా! నీవరుఁడెపుడు వచ్చును?

దాసి—అది భగవానుఁడెఱుఁగును. ఇఁక నన్నువదలుము. వంటవేళయయ్యెను; నేనుపోయెదను.

అనాథయైన ప్రియంవద జగతియందు మఱెచటను స్థానము బొందక నొకవణిజుని గృహమందు దాసీవృత్తి చేయుచుండెనను విషయమును మేము మాపాఠకుల కెఱింగింపననావశ్యకము. కృషికున కించుక సంపత్తియుండెను. అతఁడు వాణిజ్యముకూడఁ జేయుచుండెను. అతని నామధేయము గోకర్ణనాథుఁడు. గోకర్ణుని యంతఃకరణము సరళమైనది—ప్రేమయుక్తమైనది. నిరాశ్రయరావపుత్త్రి బాలికకతఁడు విజా

లయమందాశ్రయ మొసఁగ స్వీకృతుఁడయ్యెను. గోకర్ణుని గృహిణికూడ పతివంటిదే. నిరాశ్రయభద్రసపుత్రికన్యను చూచినప్పటినుండియు నామెను నిజతనయచందమున లాలనపాలన మొనరింపుచుండెను. ప్రియంవదకూడ కృతజ్ఞయై గోకర్ణునకును, అతని పత్నికిని యథోచితముగ సమాదరమును జూపుచు రెండువేళలందును తానేయన్నమును వండుచు బాలికనాఁడించుచుండును. దానింజేసి కృషిక కృషిక పత్నుల కార్యములు చాలవఱకు లాఘవములయ్యెను. వారలుకూడ దినదినమును ప్రియంవదయందుఁ బ్రసన్నులై యుండసాగిరి.

రఘునాథుఁడు లేనితరి ప్రియంవద కెచటనైన సుఖము చేకూరు సంభావనమున్నచో, సుదారస్వభావులైన కృషిక కృషికపత్నుల గృహమందుండి యట పరమసుఖలాభమునొందెడిది. గోకర్ణునివయఃక్రమము నలువది యైదు వత్సరములుండును; కాని యతఁడు చిరకాలమునుండి నియమితముగఁ బరిశ్రమఁ గావించుటంజేసి యతని శరీరమింకను సుబద్ధమై బలిష్ఠమై యుండెను. గోకర్ణుని పుత్రుఁడు శివాజీకడ సైనికవృత్తిగావించుచుండువాఁడు. బహుదినములకుఁ బూర్వమతఁడు నిజావాసమును త్యజించెను. తదనంతరమున నతనికొక తనయ గలిఁగెను. పితృమాతృలిరువురా బాలికనల్లారు ముద్దుగఁ బ్రేమించుచుండిరి. ప్రాతఃకాలములందు గోకర్ణనాథుఁడు కృషికకార్యమునఁగాని లేక మఱొండు కార్యమందుగాని వెలుపలకుఁబోవుచుండును, ప్రియంవద గృహకార్యములన్నిఁటిని నిర్వహించుచుండును. గృహిణి చాలమాఱులు ప్రియంవద నుద్దేశించి యిట్లనుచుండును. "అమ్మా! నీవు గొప్పవారింటిబిడ్డవు. నీవిట్టి పరిశ్రమఁగావించినచో నీశరీరము పాడుకాదా? నీవీకార్యములనాచరింపకుము. నేనేవానినిఁగావించెదను." ప్రేమపూర్వకముగఁ బ్రియంవద యిట్లుత్తరువిచ్చుచుండును. "అమ్మా! నీవు నాకుజూపునవ్యాజవాత్సల్యకతమున నీకార్యములనాచరించుటయందు నాకేమియుఁ బరిశ్రమ

దోఁచదు. నేను జన్మజన్మములందు నీకు సేవఁగావించెదను. నీవు నాకిట్టి వాత్సల్యమునే చూపుచుండుము." ఆమె ప్రేమవాక్యములచే సరళస్వభావయైన యావృద్ధగృహిణీనయనములనుండి బాష్పవర్షము గురియుచుండును. ఆమె యశ్రుబిందువులను దుడిచివైచి యిట్లనును. "అమ్మా! నీవగిది బాలిక యొకర్తుక మాజాతియందు లభ్యమగుచో నామెను నాతనయునకొసఁగి పరిణయమాచరించెదను." పుత్రుఁడు చాలకాలమై యిల్లు విడచిపోవుట జ్ఞప్తికిరాగనే యామెఁ గొంతసేపు విలపించుచుండును.

ఈరీతిఁ గతిపయదినములతివాహితములైన పిదప నొకనాఁటి సాయంకాలమున గోకర్ణనాథుఁడు గృహిణీ నికటముపగూరుచుని, యొకప్రాంతమునఁ బ్రియంవద బాలికను యూరువులందుంచుకొని యుపవిష్టయైయుండ, పత్నితోనిట్లనెను. "గృహిణీ ! శాంతురాలవు గమ్ము. నేఁడు సువార్తయొండు కలదు."

గృహిణి—ఆహా! మీపలుకు లమోఘములగుఁగాక! మనకు మంగళము చేకూరుఁగాక! తనయుఁడైన భీమజీవార్తయేమైనఁ దెలియవచ్చునాయేమి ?

గోకర్ణుఁడు—శీఘ్రముగ నెఱుఁగఁగలవు. పుత్రుఁడు శివాజీననుసరించి ఢిల్లీపోయెను, శివాజీ దుష్టుఁడైన పాదుషా హస్తములనుండి పలాయన మొనరించి నిజసీమకరుదెంచుచుండెనని నేఁడువింటిని. మనభీమజీ యవశ్యముగ నతని వెనువెంటనే వచ్చుచుండును.

గృహిణి—ఆహా! భగవానుఁడట్లేయొనర్చుఁగాక! రమారమి వత్సరమునుండి బుడుతనిఁ జూడకుండుటచే నాచిత్తమెట్లు తత్తరపడుచుండెనో భగవానుఁడెఱుఁగును.

గోకర్ణుఁడు—భీమజీ నిశ్చయముగ వచ్చును. అతఁడె రఘు

నాథజీ యధీనమునఁ గార్య మొనరించుచుండువాఁడు. రఘునాథజీయొక్క వార్త కూడ నెఱిఁగితిని.

ప్రియంవద హృదయము పొంగిపోయెను. ఉద్వేగమున శ్వాసమును రుద్ధ మొనరించి యామె గోకర్ణుని వచనములను వినఁదొడంగెను. గోకర్ణుఁడు మరల నిట్లు పలుకసాగెను. "ఏదివసమున రఘునాథుఁడు విద్రోహియని తలఁచి యతనిని శివాజీ బహిర్గతుఁ గావించెనో, యాదివసమునఁ దనయుఁడు మనతో నేమివచించెనో నీకు జ్ఞాపకమున్నదా?"

గృహిణి—నేనాఁడుదానను. నాకట్టి జ్ఞాపకశక్తి యుండునా?

గోకర్ణుఁడు—తనయుఁడిట్లని పలికెను. "పితా! నేను రఘునాథుని బాగుగ నెఱుంగుదును. అతని పగిది శూరుఁడు శివాజీసైన్యమందు మఱియొకఁడు లేఁడు. ఎట్టి భ్రమయందుఁ బతితుఁడై తాఁడతని నవమానించెనో పిదప నెఱుంగఁగలఁడు. అపుడతఁడు రఘునాథునియొక్క గుణము నెఱుంగఁగలఁడు." తనయుని వచనములు నేఁటికి సత్యములయ్యెను.

ప్రియంవద హృదయముల్లాసపరిపూర్ణమైపోయెను. ఉద్వేగముచే నాబాల యెదగొట్టుకొనసాగెను. ఆమె యుత్తమాంగమునుండి స్వేదబిందువులు బహిర్గతములుగాఁ దొడఁగెను.

గోకర్ణనాథుఁడిట్లు వచింపసాగెను, "రఘునాథజీ ప్రచ్ఛన్నవేషమును దాల్చి తేనివెను వెంటనే ఢిల్లీపోయి, తనబుద్ధికౌశలముచే నృపునుద్ధరించి, తన నిర్దోషిత్వమును సంపూర్ణముగఁ బ్రమాణ మొనరించెనఁట. శివాజీ తానొనరించిన దోషమునకుఁ దన్ను మన్నింపుమని రఘునాథుని వేఁడెననియు, నతఁడాయువకుని సోదరునిచాడ్పున నాలింగనమాచరించుకొనెననియు, 'హవిల్దారు' పదమునుండి యొకేమాఱుగ నతనిని పంచసహస్రదళసేనానిగ నొనరించెననియు వింటిని. పురములందును, తీర్థములందును, గ్రామములందును నెందు విశేషమేమియు వినవచ్చుటలేదు. రఘునాథజీయొక్క వీరత్వవృత్తాంతమును విని యం

దఱు జయజయనాదములు సలుపుచు నతనికి ధన్యవాద మొసఁగుచుండిరి.

అత్యంతోల్లాసముచే, ననిర్వాచ్యానందముచేఁ బ్రియంవద తన్నుదా నుఱచి యుచ్చైస్స్వరమునఁ గ్రందన మొనరించి మూర్ఛితయై భూమీతలమునఁ బతితయైపోయెను.

ముప్పదియొకటవ ప్రకరణము.

స్వప్నదర్శనము.

ఆనాఁటినుండి ప్రియంవదయాకృతి మాఱెను. బహుకాలానంతరమున నామెహృదయమానందోల్లాసములకు మరల దావాసఁగెను. ఆమెనయనయుగము మరలఁ బ్రస్ఫుటితములయ్యెను. ఓష్ఠద్వయము మరలఁ బ్రఫుల్లపుష్పమువాడ్పున బరిమళవంతమయ్యెను; సుందరగండస్థలము లావణ్యవంతమాయెను. ముఖమండలము మధురమయమైపోయెను. ఆమె సునీలకేశములు మరల నాలవణ్యాంగివదనబింబముఁగొని యాటలాడుచుండెను. ప్రాతఃకాలమందర సమీరణము దూరమునుండు తరురాజములనుండి గొనివచ్చు కోకిలరవమును ప్రియంవద యాహ్లాదితమనస్కయై వినుచుండును; అపరాహ్ణసమయమున గృహకార్యములను నివర్తించుకొని నదీకూలమున నిలువంబడి సూర్యోత్తాపము దగులకుండ నయనములపొంతకరపల్లవముల నిడికొని ఆయజల నద్యపరపార్శ్వమునఁ జాలదూరమువఱకుఁ జూచుచుండును సంధ్యాసమయములందు దూరమునుండి వీణానాదము వినవచ్చినపుడామె గీతముగ్ధహారిణమువడువునఁ జమకితయైపోవును.

గోకర్ణుని పుత్త్రికకూడ ప్రియంవదయొక్క యీపరివర్తనమును గుర్తింపఁగలిగెను. ఒకనాఁటి సంధ్యాసమయమున నదీఘట్టమునకుఁ బోవుతఱి నాబాలిక ప్రియంవదనుద్దేశించి యిట్లని ప్రశ్నించెను. "అక్కా! దినదినమును నీలావణ్య మెట్లు వృద్ధియగుచున్నది?"

ప్రియంవద—ఎవరనిరి?

బాలిక—ఎవరనెదరు? నేను చూచుచుండలేదా యేమి?

ప్రియంవద—కాదు. నీవుచూచుటందుఁ బొరపాటున్నది.

బాలిక—అవును. పొరపాటుకాకేమి? ఇంతకుముం దెన్నఁడు ను నీతలయం దేమియు నుండెడిది కాదు. ఇపుడపుడపుడు నీకేశములన డుమఁ బూలుగన్పట్టుచుండెను. వానిని నేను చూచుచుండలేదనుకొంటివా?

ప్రియంవద—చాలునూరకొనుము.

బాలిక—వెలుపలకుఁ గనుపడకుండునట్లు నీవుకంఠమాలను ధరించుచుంటలేదా? నేనాసుందరముక్తాహారమును గాంచలేదనుకొంటివా?

ప్రియంవద—చాలు నూరకొనుము.

బాలిక—నదీతీరమునఁ జాలసేపునిలువంబడియుండి ముఖమండలము నిర్మలనీరములందుఁ బ్రతిఫలించుచుండ నీవు మురియుచుండుట నేనుగాంచలేదా?

ప్రియంవద—అసత్యములాడకుము.

బాలిక—పూలతోఁటకుఁబోయి యట నెరికిఁగనుపింపక హీనస్వరమున గానమొనరించుచుండుట నేను వినలేదా?

ప్రియంవద యపుడు బాలికనుసమీపించి తనకరపల్లవములచే నామెముఖమునుమూసివైచెను.

బాలిక కిలకిలనవ్వుచు "నేనీవిషయములన్నిఁటిని జననికిఁ జెప్పివైచెద"ననియెను.

ప్రియంవద—వలదు. చెల్లీ! నీపాదములపైఁబడెదను. అట్లు చెప్పకుము.

బాలిక—అట్లయినచో నిన్నొకటడిగెదను. జవాబుచెప్పెదవా?

ప్రియంవద—చెప్పెదను.

బాలిక—నీచర్యలయర్థమేమి? ఈపుష్పములును, యీకంఠమాలయు నీగీతములు నెరికొఱకు? నీనేత్రములు రెండును ప్రఫుల్లములయ్యెను. నీయోష్ఠద్వయము రుధిరపూర్ణములైయుండెను. నీశరీరమంతయు లావణ్యముచే మెఱయుచుండెను. ఈసుందరమంతయు నెరికొఱకు?

ప్రియంవద—నీజనని సుందరముగ నీకు శిఖలను చుట్టుచుండును, నిన్నెన్నియో యాభరణములతో నలంకరించుచుండును. అవన్నియు నెరికొఱకు?

బాలిక యీపర్యాయ మొకించుక లజ్జితయై యిట్లనెను. "రాఁబోవు వత్సరమున వరుఁడు వచ్చుననియు నాకు వివాహమగుననియు జననిచెప్పెను"

ప్రియంవద—నాకు కూడనట్లే యగును.

బాలిక—నిజమేనే?

ఈలోఁపున వారలిరువురు ప్రసంగించుకొనుచుండ నొకబాలయోగి "హరహర మహాదేవ" యని యుచ్చరించుచు నదీతీరమున నుపస్థితుఁడయ్యెను. సంధ్యాస్తమితాలోకమున నతని విభూతిభూషితదీర్ఘశరీరము సౌందర్యవంతమైగన్పట్టుచుండెను. ఆజడదారినిఁ గాంచి, బాలిక భయమొంది పరుగిడిపోయెను. ప్రియంవద తనతీక్ష్ణదృక్కుల నాసంయమిపై ప్రసరింపఁజేసెను.

వాని జానకీపతియని యామె గుర్తించెను.

ప్రియంవదహృదయ మకస్మాత్తుగఁ గంపితమైపోయెను. మనో యావేగముచే నామెశరీరమంతయుఁ గంపింపసాగెను. కాని యాబాల

తనదుఃఖావేగమునంతయు సంవరణ మొనరించి లజ్జాభయములనుత్యజించి మెల్లగమునినికటమునకరిగి యతనికిఁ బ్రణామమిడి స్థిరస్వరమునని ట్లనెను. "ప్రభూ! మీరొకనాఁడీయభాగినిని జనార్దనశర్మ ప్రాసాదమునఁగాంచియుండిరి; ఆమెనే, నేఁడీకుటీరమున దాసీకార్యమున నియుక్తయైయుండుటఁ గాంచుచుండిరి. కలంకిణినని పలికి జనకుఁడు నన్ను దూరీకృత మొనరించివైచెను. నేను వాగ్దత్తపతివ్రతనుచారిణిని. ఇంతకుమించి నాయందన్యదోష మేమియు లేదు. ఇందులకు భగవానుఁడే సాక్షి."

యోగీంద్రునినయనము లశ్రుపూరితములయ్యెను. "రఘునాథునికొఱకిట్టి యిడుములపాలైతివా" యని యతఁడనెను.

ప్రియంవద—ఎంతకాలము నారి పతినామమును జపించుచుండునో యంతకాలమామె యిడుములను యిడుములుగఁ దలఁపదు.

పరివ్రాజకుని వక్షస్థలము స్ఫీతముగాఁ దొడఁగెను.

ప్రియంవద మరల నిట్లనెను. "ప్రభువా! దేవపురుషుని దర్శన మొనరించితిరా ?"

బాలయోగి—దర్శన మొనరించితిని.

ప్రియంవద—ప్రభువువారికి దాసివచనములను దెలిపియుంటిరా ?

బాలయోగి—తెలిపియుంటిని.

ప్రియంవద—ఏమి తెలిపితిరి ?

బాలయోగి—నీవచనములందలి యొకయక్షరమునైన మఱవలేదు. ప్రియంవద రజపుత్రబాలికయనియు, జీవనముకంటె యశము నెక్కుడుగ దలఁచుననియుఁ దానుసజీవయై యుండునంతదనుక రఘునాథజీ కళంకశూన్య శూరుఁడనియే దలఁచుచు నతని యశోగీతము పాడుచుండుననియుఁ దెలిపియుంటిని.

ప్రియంవద—బాగు.

బాలయోగి—కర్తవ్యసాధనార్థమై యతనికి ప్రాణవియోగము సంభవించినచోఁ బ్రియంవద యతని యశోగీతములఁ బాడుచు యుల్లాసమనస్కయై నిజాసువులను విసర్జించివైచునని కూడ నేనతని కెఱిఁగించితిని.

ప్రియంవద—బాగు.

బాలయోగి—ప్రియంవద యతని యున్నతోద్దేశ్యమును ప్రతిరోధ మొనరింపదనియు, రఘునాథజీ యసిహస్తుఁడై యశపథపరిష్కారముఁ గావింప నిచ్ఛగించుచుండెననియు జగతి కెవండాదిపురుషుఁడో యతఁడతనికిఁ దోడ్పడఁగోరుచుండెననియుఁ గూడ నేనతని కెఱింగించితిని.

ఉద్వేగగద్గదస్వరమున ప్రియంవద యోగివరునిట్లు ప్రశ్నించెను. "వారేమి ప్రత్యుత్తర మొసఁగిరి?"

జ్వాలంతస్వరమున సన్యాసి యిట్లనెను; "రఘునాథుఁ డెట్టియుత్తరువును నొసఁగలేదు. నీవచనములను పూర్తిగ నాలించి వానిననుసరించి యసాధ్యసాధనము నొనరించెను; కృపాణపాణియై యశపథమును పరిష్కారము గావించెను."

ఆసంధ్యాంధకారమున యోగివరుని నయనములు ప్రజ్వలించుచుండెను. ఆనదీతీరమందా భూరుహాభ్యంతరమునఁ బరివ్రాజకుని జ్వాలంతవాక్యములు ప్రతిమాఱు ప్రతిధ్వనింపసాగెను.

"ఎవండు జగతికాదిపురుషుఁడో యతనికిఁ బ్రణామముఁ గావించెద"నని పలికి ప్రియంవద నభమును లక్షించి కరములను జోడించి ప్రణామ మొనరించెను. జడదారిగూడ పృథివియొక్క యాది పురుషుని లక్షించి ప్రణామ మొనరించెను.

చాలసేపటివఱకు వారలుభయులు నిస్తబ్ధులైయుండిరి. సంధ్యా

సుశీతల సమీరణమందు వారల శరీరములు శీతలములయ్యెను; నయనములందలి యశ్రుబిందువు లారిపోయెను.

చాలసేపైన పిదప పరివ్రాజకుఁ డిట్లనెను. "దేవతాప్రసాదకతమునఁ గార్యసిద్ధి కాగనే నిన్నడుగుమని రఘునాథుఁడు నాకొకప్రశ్నఁ దెలిపెను."

ఉత్కంఠితయై "అదే" మని ప్రియంవద యడిగెను.

జడదారి—ఇన్ని దినములు ప్రియంవద తనదాసుని జ్ఞప్తియం దుంచుకొనెనా యనియుఁ దానరుదెంచినఁ బ్రియంవద తన్ను గుర్తింపఁ గలదాయనియు నతఁడు ప్రశ్నించెను.

ప్రియంవద—నేనీజీవనమున వారిని మఱువఁగలనా ?

యోగి—నీప్రణయ మతఁ డెఱుంగును. కాని నారీమణుల మనములు సర్వదాచపలములు. దానిం జేసి నీవతనిని మఱచి యుండవచ్చును.

మానివరుని చపలతామందహాసములను గాంచి ప్రియంవద యొకించుక విరక్తయై యిట్లనెను. "నారీమణుల మనములు చపలములని నేనెఱుఁగను"

జడదారి—నేనుకూడ నెఱుఁగను; కాని నేఁడు గాంచుచుంటిని.

ప్రియంవద—ఎట్లు గాంచుచుండిరి ?

యోగిప్రవరుఁడు—ఎవతెనావాగ్దత్తవధువో, యామె నన్ను నేఁడె మఱచెను. చూచి కూడ నన్ను గుర్తింపఁజాలకపోయెను.

ప్రియంవద—ఆహతభాగిని యెవతె ?

మాని—ఎవతెను తోరణదుర్గమున జనార్దనశర్మ ప్రాసాదోపరిభాగమున బ్రథమమునఁ గాంచి నేను ముగ్ధుఁడనైతినో, ఆమెయే యాభాగ్యవతి; ఏసుందరాంగి కంఠమున ముక్తాహారమును వైచి నేను జీవనచరితార్థుఁడనైతినని తలంచితినో ఆమెయే యాభాగ్యవతి; ఏలా

వణ్యామయి, తోరణదుర్గమందును, జయసింహుని శిబిరమందును, యుద్ధసమయమందును, సంధివేళలందును, సర్వదా నానయనమణిచాద్భున నుండెనో, ఆమెయే యాభాగ్యవతి; ఏయందముల ప్రోవుదర్శనము నానయనములకు సూర్యాలోకమో, ఏమోహనాంగి పదశబ్దములు నాకర్ణములందలి సుమధురసంగీతమో, ఏముద్దుగుమ్మ స్పర్శము నాశరీరమునకుఁ జందనప్రలేపమో, ఏసౌందర్యతిలక ప్రీతి నాజీవనముయొక్క జీవనమో, ఆమెయే యాభాగ్యవతి ! ఏప్రణయస్వరూపిణి నామమును స్మరించి, యేయుదారచిత్తజ్వాలంత యుత్సాహవాక్యములను, హృదయమున నాటఁజేసి, ఢిల్లీపురమునకుఁ బోయి, యశపథమును పరిష్కృత మొనరించి, జ్వాలంతవిపత్సాగరమునుండి యుత్తీర్ణుఁడనైతినో ఆమెయే యాభాగ్యవతి. బహుదినానంతరమున ననేక యగచాట్ల నతిక్రమించి నేఁడాభాగ్యవతియొక్క చరణోపాంతమును సమీపించితిని; ఆమె నేఁడు నన్ను గుర్తింపఁగలుఁగునా?

ఆకోకిల వినిందితస్వరము ప్రియంవద హృదయమును మంథన మొనరించి వైచెను; తారకాలోకమునఁ బ్రచ్ఛన్నవేషుఁడైన యాపురుషసింహునిఁ బ్రియంవద గుర్తించెను, ప్రియంవద తనహృదయావేగము నిఁక సంవరణ మొనరింపఁజాలకపోయెను. ఆసుందరిమస్తకము తిరిగిపోవుచుండెను. ఆపద్మనేత్రినయనపద్మములు ముకుళించిపోయెను. "నాథా! మన్నింపు!! మనిమాత్రముపలికి ప్రియంవద రఘునాథజీవైపుగఁ దన కరపల్లవములనుసారించెను. పతనోన్ముఖప్రియతమకోమల శరీరమును రఘునాథుఁడు నిజాంకమున నిడికొని యామెయుద్వేగపూర్ణహృదయమును తనహృదయముపైస్థాపించెను."

క్షణకాలమైనపిదప చైతన్యమునొంది ప్రియంవదనయనములనున్మీలిత మొనరించెను. ఏమిగాంచెను? హృదయేశ్వరుఁడభాగినిని దన

వక్షమునఁ జేర్చెను; చిరప్రార్థితపతి నేఁడుప్రియంవదను గాఢాలింగన మాచరించుకొనెను.

ఆహాదివసానంతరమున నేఁడుప్రియంవద ప్రతప్తహృదయము రఘునాథుని ప్రశాంతహృదయస్పర్శచే శీతలమయ్యెను; ప్రియంవదఘనశ్వాసము రఘునాథునిశ్వాసమందు మిశ్రితమైపోయెను; ప్రియంవద కంపితరక్తవర్ణోష్ఠద్వయము జీవనమందు ప్రథమపర్యాయము రఘునాథునియోష్ఠమును స్పృశించెను.

ఆసుఖసంస్పర్శచే నాయందకత్తె మైమఱచిపోయెను. ఆప్రియ ప్రగాఢాలింగనముచే, నాపలుమారులసుమధురచుంబనముచే నామె పరవశయైపోయెను.

ఇదిప్రకృతమా లేక స్వప్నమా?

వాయుతాడితపత్రముపగిదిఁ గంపించుచుఁ బ్రియంవద యాత్మగతమున నిట్లనుకొనెను. "జగదీశ్వరా! యిదిస్వప్నమైనచో యీసుఖనిద్రనుండి యెన్నఁడును జాగరితను గాకుండునట్లు బ్రసాదింపుము."

ముప్పదిరెండవప్రకరణము.

జీవన నిర్వాణము

మహారాష్ట్రదేశమందు మహాసమారోహ మారంభమయ్యెను. శివాజీమగుడి చనుదెంచెననియు, నౌరంగజేబుతో మరల సమరము సలుపుననియు, మ్లేచ్ఛులను దేశమునుండి దూరీకృత మొనరించుననియు హిందూరాజ్యసంస్థాపన మొనరించుననియు, నగరములందును, గ్రామములందును పథములందును, ఘట్టములందును, ప్రజలు చెప్పుకొనుచుండిరి.

ఒకమాఱుజయసింహుఁడు విజయపురనగరము నాక్రమించియు నాస్థానమును హస్తగత మొనరించుకొనఁజాలకపోయెను. పలుమాఱులతఁడు సహాయార్థము ఢిల్లీశ్వరునికడకంపిన యావేదనములన్నియుఁ విఫలములయ్యెను, తాను సైన్యసమేతముగా మడియుటేగాని యన్యోద్దేశ్యము చక్రవర్తికి లేదనియతఁడెఱింగి విజయపురమును పరిత్యజించి యౌరంగబాదువైపుగఁ బ్రత్యావర్తన మొనరించెను.

తుదవఱకును యతఁడౌరంగజేబు విశ్వస్తయనుచరుని కరణి కార్య మొనరించుచు వచ్చెను; చక్రవర్తి తనకగౌరవముజూపెనని యొక ముహూర్తమాత్రమందైనన తఁ డౌరంగజేబు కార్యమందౌదాస్యమును బ్రకాశ మొనరింపలేదు. మహారాష్ట్రసీమనుత్యజించి యరుగవలెనని యతఁడు నిశ్చయించుదనుక సాధ్యమైనంతవఱకు చక్రవర్తి శక్తిరక్షణ మొనరింప శక్తివంచనలేక యత్నించెను. లోహగర సింహగర పురందర ప్రభృతిస్థానములందతఁడు చక్రవర్తి సేనలను సన్నివేశిత మొనరించి యేయేదుర్గములను దమయధికారమున నుంపనసంభవమో యందందు శత్రువులువిడియుటకు సాధ్యముకాకుండునట్లు వానినన్నిఁటిని నొకేమాఱుగఁ జీర్ణ మొనరించివైచెను.

కాని యీజగతియందిట్టి విశ్వస్త కార్యమునకుఁ బురస్కారము లేదు. జయసింహుఁడు కృతకృత్యుఁడుకాలేదని విని యౌరంగజేబు చాలసంతసించి యీరాజశేఖరునింకను యవమానితుఁ గావింపసమకట్టి యతనిని దక్షిణసీమ సేనాపతిపదమునుండి యపసృత మొనరించి యిఁక ఢిల్లీమగుడిరమ్మని ముదలనంపి యతనిస్థానము నాక్రమింప యశవంతసింహుని దక్షిణమునకంపెను.

వృద్ధుఁడైన యీసేనాపతి యాజీవనము శక్తివంచనలేక ఢిల్లీకార్యములనుసాధించి శేషదశయందిట్టియవమానముఁబొందుటచే నతని యుదారహృదయము విదీర్ణమైపోయెను, అతఁడుయశవంతుఁడు రాకమున్నే మృత్యుశయ్యయందు శాయితుఁడయ్యెను,

అవమానిత పీడితవృద్ధ జయసింహుఁడు మృత్యుపర్యంకముపై శాయితుఁడై యుండ దూతయొకఁ డతనికడకరిగి యతనితో నిట్లుని వేదన మొనరించెను. "మహారాజా! మహారాష్ట్రసేనానియొకండు మీదర్శన మునభిలషించుచుండెను. ఒకనాఁడతఁడు తమచరణోపాంతమున నుప విష్టుఁడై యుపదేశమును గ్రహించెను. మఱియొకమాఱుపదేశమును గ్రహింప నేఁడిటకరుదెంచెను."

జయసింహుఁడిట్లుత్తరువొసఁగెను. "సమ్మానపూర్వకముగ య తనిని లోనికిఁగొనిరమ్ము. ఆమహాపురుషుని నేను బాగుగ నెఱుఁగుదును. అతనిని లోనికిరానిమ్ము — నిర్భయముగ నతనికిసమ్మానమొసఁగెదను."

క్షణములో నొకమహారాష్ట్రుఁడు ప్రచ్ఛన్న వేషుఁడై యాగృహ మును ప్రవేశించెను. జయసింహుఁడతనిఁజూడక యేయిట్లనెను. "సుహృ ద్వరా! శివాజీ, మరణించుటకుఁబూర్వము మీదర్శన మొకమాఱు గలుఁగుటచే జరితార్థుఁడనైతిని. లేచియభ్యర్థన మొనరించుశక్తి లేదు. తామన్యథాతలఁపకుఁడు."

సజలనయనుఁడై శివాజీయిట్లనెను. "పితా! ఇదివఱలోఁ దమ యొద్దసెలవుఁగైకొనిపోయినపుడింత యచిరకాలములో మీరిట్టియవస్థ యందుండెదరని యొకించుకైనను దలఁచియుండలేదు."

జయసింహుఁడు — రాజేంద్రా! మనుష్యకాయములు క్షణభం గురములు; ఇందువిస్మయమేమున్నది? మిత్రప్రవరా! ఇదివఱలో మనము కలిసికొనినపుడు మీరు మొగలుసామ్రాజ్యగౌరవమును గాం చితిరి. ఇపుడేమిచూచుచుండిరి?

శివాజీ — విక్రమసింహులైనతామీవఱలో సామ్రాజ్యమునకుఁ బ్రధాన స్తంభస్వరూపులైయుండిరి. మీరిపుడీయవస్థలోనుండ నిఁక మొ గలు సామ్రాజ్యమున కేమియు నాశలేదు.

జయసింహుఁడు — వత్సా! అట్లుకాదు. రాజస్థానభూమి వీరప్ర సవిని. జయసింహుఁడు మరణించిన మఱియొక జయసింహుఁడుద్భవిల్లు ను. జయసింహునిభంగి యోధులింకను నూఱులకొలఁది యుండిరి. మాదృశ పురుషుని మృత్యువుకతమున సామ్రాజ్యమునకు క్షతివృద్ధు లు గలుఁగనేరవు.

శివాజీ — మీయమంగళముకంటె సామ్రాజ్యమున కధికయని ష్ట యేమికాఁగలదు?

జయసింహుఁడు — మిత్రశేఖరమా! యోధుఁడొకఁడు పోయిన చో మఱియొకయోధుఁడు కలుఁగును. కాని యత్నమొనరించు క్షయసా ధనమునకుఁ బునస్సంస్కారము లేదు. పాపకపటాచరణము లెచటనుం డునో యచట నవనతిమృత్యువులుండునని నేనుపూర్వమే మీకెఱింగించి తిని. దానినిమీరిపుడు ప్రత్యక్షముగ నవలోకింపుఁడు.

శివాజీ — నివేదన మొనరింపుఁడు.

జయసింహుఁడు — మిమ్మును నేను ఢిల్లీపురమున కంపినపుడు మీహృదయముకూడ ఢిల్లీశ్వరునివైపుగ నాకృష్టమైయుండెను; మీకు స్థిర సంకల్పమున్నది; చక్రవర్తి మిమ్మును విశ్వసించునంతకాలము మీ రువిశ్వాసఘాతుకతగావింపరు. మీయెడ నతఁడు సదాచరణముఁ జూపి యుండినచో దక్షిణసీమయందుఁ జక్రవర్తి కొక పరాక్రాంతమిత్రు లుండెడివారు. కపటాచరణవశతః నాస్థానమున నొకదుర్దమనీయశ త్రువు నిలచియుండెను.

శివాజీ — మహారాజా! మీరు బహుదూరదర్శులు. మీబుద్ధియ సాధారణము. జగతియందందఱు యథార్థముగ జయసింహుఁడు విజ్ఞుఁ డని యెఱుఁగుదురు.

జయసింహుఁడు — నేనౌరంగజేబుజనకునికాలము నుండియు ఢిల్లీకార్యములఁగావించుచుంటిని. విషాదములందును యుద్ధసమయంబ

దును సాధ్యమగునంతవఱకు ఢిల్లీశ్వరున కుపకారముఁగావించితిని. స్వజాతివిజాతి వివేచన మొనరింపలేదు; ఆత్మపరవివేచనఁగావింపలేదు; ఎవనికార్యమందు ప్రీతుఁడనైతినో, యొకించుకైనను వెనుదిరుగక శక్తివంచనలేక వానికార్యమును సాధించితిని. వృద్ధకాలమునఁ జక్రవర్తి నాయెడ ప్రథమమున నసదాచరణముఁజూపి నన్నవమానించెను. అటులైనను యీశ్వరేచ్ఛచే నాకార్యమందు వైలక్షణ్యము ఘటింపలేదు. మిత్రమా! ప్రధానదుర్గములందు నేనుంచిన సైనికులు ఖండన మొనరింపక మిమ్మును దుర్గములను హస్తగత మొనరించుకొననీయరు. కాని యీయాచరణములచేఁ జక్రవర్తి హానిగ్రస్తుఁడయ్యెను. ఢిల్లీశ్వరుని చిరవిశ్వస్తసహాయులైన యన్వరాధిపులు చక్రవర్తికి ప్రధానశత్రుల గుదురు.

శివాజీ—మీరు యథార్థమును వాక్రుచ్చితిరి. ఔరంగజేబు తనదురాచరణములచే మహారాష్ట్ర యన్వరాధిపులను తనశత్రులుగ నొనరించుకొనియెను.

జయసింహుఁడు—మహారాష్ట్ర యన్వరదేశముల యుదాహరణములు రెంటినే తెలిపితిని. భారతవర్షమంతయు నిట్లే. సుహృద్వరా! భారతవర్షమందలి విశ్వసనీయులైన యనుచరులనందఱిని యౌరంగజేబవమానించుచుండెను; మిత్రులను రిపులుగఁజేయుచుండెను. వారణాసి మందిరమును వినష్టమొనరించి యటమసీదును నిర్మించెను. రాజస్థానమందలి హిందువుల నవమానించుచుండెను; సర్వదేశములందును హిందువులపై జిజియాపన్నును విధించుచుండెను.

క్షణమైనపిదప నయనములను ముదితమొనరించిజయసింహుఁడతిగంభీరస్వరమున మరల వచింపసాగెను. మృత్యుశయ్యయందా మహాత్ముని దివ్యచక్షులున్మీలితములుగాఁ దచ్చక్షు ర్దృష్టిసామర్థ్యముచే భవిష్యమును గాంచిన రాజర్షి యిట్లు పలుకసాగెను “శూరాగ్రేసరా!

అతనికపటాచరణకలితమున నే నలువైపులను యుద్ధానలము ప్రజ్వలితమయ్యెను. రాజస్థానమున ననలముజ్జ్వలించెను; మహారాష్ట్రదేశమున నగ్ని ప్రజ్వలించెను; పూర్వదిక్కున దావానల ముద్భవిల్లెను. ఔరంగజేబిరువదివత్సరములు యత్నించి ఆయనలమును నిర్వాణమొనరింపఁజాలకపోయెను. అతనితీక్ష్ణబుద్ధియు, నతని యసామాన్య కౌశలము, నతని యసాధారణ సాహసమును వ్యర్థములయ్యెను; వృద్ధవయస్సునఁ బశ్చాత్తాపమొనరించి ఢిల్లీశ్వరుఁడు ప్రాణత్యాగమొనరించెను. పావకుఁడు మఱింత ప్రబలవేగమున జ్వలించుచుండెను; నలువైపులనుండియు దగ్ధశబ్దములు వినవచ్చుచుండెను; ఆయనలమున మొగలుసామ్రాజ్యము దగ్ధమైపోయెను. తదనంతరమున? తదనంతరమున మహారాష్ట్రజాతిన క్షాత్రమున్నతిశీలమయ్యెను; మహారాష్ట్రీయగణములారా! ముందంజవేయుఁడు; ఢిల్లీశూన్యసింహాసనమున నుపవేశమొనరింపుఁడు!”

రాజేంద్రునిపలుకులు గట్టువడియెను. భిషగ్వరులు పార్శ్వములనుండి యనేకరీతుల సందేహించుచు, గోపనమున నస్పష్టస్వరముల వ్యాధియొక్క ప్రకృతకారణము నరయసాగిరి.

చాలసేపైనపిదప మృదుస్వరమున “కపటాచారి తనకుఁదానే శాస్తిఁగావించుకొనును; సత్యమేవజయతి” యని జయసింహుఁడనెను,

శ్వాసము రోధమైపోయెను; శరీరమునుండి ప్రాణము బహిర్గతమైపోయెను.

ముప్పదిమూఁడవ ప్రకరణము.

మహారాష్ట్రజీవనప్రభాతము.

రాత్రి యొకయామము మాత్రముండెను. శివాజీయపుడు రసపుత్రశిబిరమునువిడచి ప్రాతఃకాలమునకుఁ బూర్వమే ప్రధానసేనానులను సమావేశ మొనరించి వార్లఁతోఁగూడి చేయఁదగువిషయముఁగూర్చియాలోచించెను. పిదపనతఁడు శిబిరమునుండి వెలుపలకరుదెంచి తనసైనికులనందఱి నాహ్వానించి యిట్లనెను. "మిత్రులారా! మనమౌరంగజేబుతోఁ సంధిఁగావించి రమారమి యొకవత్సరమయ్యెను; ఔరంగజేబు నిజదోషకపటాచరణములకతన నాసంధి ఖండనమైపోయెను. మనము నేఁడా కపటకృత్యమునకుఁ దగుప్రతిఫల మొసఁగవలయును; ముసల్మానులతోఁ మరల నాహవ మాచరింపవలయును.

ఏమహానీయుఁడౌరంగజేబు ప్రధానసేనాపతిగనుండెనో, భవానీదేవి యేపురుషసింహునితోఁ సమరము సలుపని షేధించెనో, యేకులోత్తముని నికటమున శివాజీ రణరహితముగఁ బరాజితుఁడయ్యెనో, నిన్నటినిశీథమున నామహాత్ముఁడు జయసింహుఁ డౌరంగజేబు దురాచరణకతమునఁ బ్రాణవిసర్జన మొనరించెను. సైనికులారా! ఢిల్లీయందు నన్ను కారాగారబద్ధుఁ గావించినందులకును హిందూప్రవరుఁడైన జయసింహునిమృత్యువునకుఁ గారకుఁడైనందులకును మనమీ ఋణమౌరంగజేబునకుఁ దగు ప్రతిఫల మొసఁగవలయును.

మృత్యుశయ్యయందు జయసింహుని దివ్యచక్షులున్మీలితములయ్యెను. మొగలాయీలభాగ్యనక్షత్రియవనతిశీలమును, మహారాష్ట్రులభాగ్యతారయున్నతిశీలమును, ఢిల్లీసింహాసన పత్వరశూన్యమును యతఁడుగాంచెను, మిత్రులారా! ముందంజవేయుఁడు. పృథురాయనిసింహాసనమును మన మాక్రమించుకొనెదము.

పూర్వదిక్కున రక్తిమచ్ఛటగన్పట్టుచుండెను. అది ప్రభాతశుభాలోకము. మనలకది సామాన్యప్రభాతము కాదు. మహారాష్ట్రులారా! నేఁడది మనజీవనప్రభాతము."

వాహినీపతులును సైనికులు నామహద్వాక్యములను వినియానందముట్టిపడ నుచ్చైస్స్వరమున నిట్లనిరి. "నేఁడు మనజీవన ప్రభాతము!"

ముప్పదినాలుఁగవ ప్రకరణము.

పాతకుని ప్రాయశ్చిత్తము.

ఆనాఁటిసంధ్యాసమయమున రఘునాథజీ యేకాకియై నదీకూలమునఁ బచారిచేయుచుండెను. తనపదోన్నతియుఁ బ్రియంవదతోఁ బునర్మిలనమును, ముసల్మానులతోఁ మరల భండనమును, హిందువుల భావిస్వాధీనతయు మొదలుగాఁగల నూతన విషయచింతతోఁ నతనిహృదయ ముత్ఫుల్లమగుచుండెను. అపుడకస్మాత్తుగ వెనుక నుండి యెవరో "రఘునాథా!" యని కేకవైచెను.

రఘునాథజీ వెనుకకుఁ దిరిగిజూచెను—చంద్రరావట నిలచియుండెను. రోషముచే రఘునాథుని శరీరముకంపింపఁదొడంగెను; కాని దుర్గమందిరమున నతఁడొనర్చిన ప్రతిజ్ఞను మఱువలేదు.

చంద్రరావపుడిట్లనెను. "రఘునాథా! ఈగజతియందు మన మిరువురముండుటకుఁ దావులేదు, మనలోనొకఁడు హతుఁడుకావలయును"

రఘునాథుఁడు రోషమును సంవరణ మొనర్చుకొని మెల్లగ నిట్లనెను "చంద్రరావూ! కపటాచారీ! మిత్రహంతా! నీయుపయుక్త

శాస్తి శిరచ్ఛేదనము. కాని రఘునాథుఁడు నిన్ను క్షమించెను; జగదీశ్వరుని నికటమున మన్నన వేఁడుకొనుము.

చంద్రారావు—బాలకుని మన్నింపవేఁడుట నాకభ్యాసము లేదు. నీవిఁక నధిక కాలము జీవించు టసంభవము. సావధానమనస్కుఁడవై నావచనముల నాలింపుము. జన్మావధి నీవు నాకు బరమశత్రుఁడవు, నేను నీపరమశత్రువను. బాల్యకాలమున నిన్ను నేను విమచతులతోఁ జూచెడివాఁడను. వేయిమాఱులు ప్రస్తరమువై నీమస్తకము నాఘాత మొనరింప సంకల్పము నాచిత్తమున నుదయమయ్యెను. అట్లొనర్ప లేదు; కాని! నీసంపదనాశ మొనరించితిని; నిన్ను దేశత్యాగిఁ గావించితిని; విద్రోహియని నీమీఁద దోషారోపణ మొనరించి, నిన్నవమానితుఁగావించి, దూరీకృతుఁ జేసితిని. చంద్రారావుయొక్క భీషణజిఘాంసయంతతో నొకించుక శాంతినొందెను. నీభాగ్యమింకను బాగుగనున్నది; మరల నున్నతపదము నలంకరించి సైన్యాభ్యంతరమున కరుదెంచితివి. చంద్రారావుయొక్క స్థిరప్రతిజ్ఞ జీవనమం దెపుడును నిష్ఫలముగా లేదు. ఇపుడు కూడగాఁదు. ఇతరోపాయములను త్యజించితిని ; ఈవాడియైననిడివికరవాలముచే నీహృదయమును చీల్చివైచెదను. నీహృదయశోణితమును బాన మొనరించి నాభీషణపిపాసమును నిర్వాణ మొనరించెదను. భీరుఁడా ! నేఁడీవు నాకరములనుండి దప్పించుకొని పోఁజాలవు.

రోషావేశముచే రఘునాథజీ నయనము లగ్నికణములకరణి జ్వలింపసాగెను. కంపితస్వరమున నతఁడిట్లనెను. "పామరుఁడా ! నాసమ్ముఖమునుండి తొలఁగిచనుము. లేకున్న నేను నాపవిత్రప్రతిజ్ఞను మఱచి నీకుఁ దగుదండన మొనరించెదను"

చంద్రారావు—భీరుఁడా ! ఇపుడుకూడ రణమున బరాఙ్ముఖుఁడవైయుంటివా ? అటులైనచో నింకను వినుము ! ఉజ్జయినీయుద్ధమున నేశిలీముఖము నీజనకుని హృదయమును విదీర్ణ మొనరించెనో యది శత్రునిక్షిప్తము కాదు. చంద్రారావే నీపితృహంతకుఁడు!

రఘునాథుఁ డికనయనములతో నేమియుఁ జూడఁజాలకఁ బోయెను; కర్ణములతో నేమియు వినఁజాలఁడయ్యెను; రోషముట్టిపడ నతఁడు తన యసిని నిష్కోషిత మొనరించి చంద్రారావుపై సింహకిశోరముచాడ్పున దుమికెను. చంద్రారావుకూడ క్షీణహస్తములతోఁ గృపాణధారణ మొనరింపలేదు. చాలసేపు వారలకు ద్వంద్వయుద్ధము జరిగెను. ఖడ్గాఘాతములచే నుభయులడాలులు ఖండితములయ్యెను. ఆవీరులశరీరములు క్షతవిక్షతములై పోయెను. గాయములతో నిండినవారల కాయములనుండి వర్షధారల వడువున రుధిరము గురియసాగెను. చంద్రారావు బలమున న్యూనుఁడు కాఁడు; కాని రఘునాథజీ ఢిల్లీయందుఁ జమత్కారయసి యుద్ధము నభ్యసించియుండెను. చాలసేపు పోరుజరగిన పిదప నతఁడు చంద్రారావును బరాజితుఁగావించి, భూతలమునఁ బడవైచి, యతని వక్షస్థలమున జానుస్థాపన మొనరించి గంభీరస్వరమున నిట్టులనెను "పామరుఁడా ! నేఁడు నీపాపరాశికిఁ దగు ప్రాయశ్చిత్తమయ్యెను. జనకుని హత మొనరించినందుల కిదె నిన్ను యమపురి కంపుచుంటిని."

మృత్యుసమయమందుఁగూడఁ జంద్రారావు నిర్భీకుఁడైయుండి వికటహాసన మొనరించి యిట్లనెను. "ఇఁక నీసోదరి విధవ కాఁగలదు. ఆవిషయమును జింతించుచు సుఖమునఁ బ్రాణవిసర్జన మొనరించెదను."

విద్యుత్పాతమువడువున సర్వవిషయములును రఘునాథునిమనంబున నుపలబ్ధిమొందెను. ఇందువలననే లక్ష్మీప్రియనినామము నుచ్చరింపలేదు ఇందువలననేఁ జంద్రారావున కనిష్టగావింపవలదని ప్రార్థించెను. ఆపితృహంతకుఁ డారక్తపిశాచమా చంద్రారావు బలపూర్వక

ముగఁ బ్రాణతుల్యయైన లక్ష్మినిఁ బరిణయమాడెను. రోషముచే రఘునాథుని నేత్రములనుండి యనలవిస్ఫులింగములు బహిర్గతములుగాఁ దొడంగెను; కాని యతని యున్నత కృపాణము చంద్రరావు యొక్క హృదయమందు స్థాపితముగాలేదు. అతఁడు మెల్ల మెల్లగాఁ జంద్రరావును వదలివైచి నిలువంబడియెను.

ఆయోధు లిరువురును నొకరిపై నొకరు స్థిరదృక్కులను బఱపుచు, రోషావేశులై ప్రజ్వలితహుతాశనుని చాడ్పున నిలువంబడియుండిరి. చంద్రరావసిరణమునఁ బరాజితుఁడై ధూళిపంకిలములచే ధూసరితుఁడై వికటయసురుని వడువున రుధిరరహితవదనుండై రఘునాథజీపై దీక్ష్ణకటాక్షములఁ బఱవఁదొడంగెను. రఘునాథుఁడు జనకుని హత్యను, సోదరి యవమానమును స్మరించుచు, రోషాభిమానజిఘాంసలచే విదగ్ధచేతస్కుఁడయ్యు వా పాపిని హతమొనరింప నపారగుఁడై చిత్రార్పితప్రతిహంతుని లీలనిలచియుండెను. అట్టె తరివరినర పాదపాభ్యంతరమునుండి యొకశూరుఁడు నిష్క్రాంతుఁడయ్యెను. సభయముననుభయులు నా యోధునిఁ దేరిజూచిరి—అతఁడు శివాజీ !

శివాజీ యేమియుఁ బలుకలేదు, ఏమియుఁ బ్రశ్నింపలేదు, తన సహచరులైన నలువురి సైనికుల బిలచి సంజ్ఞయొనరించెను. ఆనలువురు సైనికులును విస్తబ్ధముగఁ జంద్రరావు నికటమున కరుదెంచి యతని కరములనుండి కరవాలములను యొరనులాగివైచి, యతని ప్రక్కలను విఱిచికట్టి తమవెంట వానినిఁ గొనిపోయిరి. శివాజీ యదృశ్యుఁడయ్యెను. రఘునాథజీ చకితుఁడై యట్టులెనిలచి పోయెను.

మరుచటిదినము ప్రాతఃకాలమునఁ జంద్రరావు దోషము విచారింపఁబడును. అతఁడు రఘునాథునిజనకుని హతమొనరించిన దోషముయొక్క విచారము కాదు; నిన్నటి దినమున రఘునాథునిఁబట్టిన దోషముయొక్క విచారము కాదు. రుద్రమండలదుర్గాక్రమణము

నకుఁ బూర్వము శత్రువైనరహమత్ ఖానునకుఁ జంద్రరావే శివాజీ యాగమనముఁ గూర్చిన వార్తఁదెలిపెను. దాని ప్రమాణము దెలియవచ్చెను. ఎల్లియుదయమున నాదోషముయొక్క విచారము గావింపఁబడును.

అప్పను సేనాపతియైన రహమత్ ఖాను బంధితుఁడైన పిదప శివాజీ యతనిని భద్రాచరణపూర్వకముగ వదలివైచెననియు, రహమత్ఖాను స్వాధీనతాప్రాప్తినొంది తనప్రభువైన విజయపురసుల్తాను కడకరిగెననియు మేము మా పాఠకులకుఁ బూర్వమే దెలిపియుంటిమి. జయసింహుఁడు విజయపురము నాక్రమణముఁ గావించినపుడు రహమత్ఖాను తననైసర్గికసాహసమున భండనమొనరించెను; కాని యొక పోరున విశేషముగ నొప్పింపఁబడి, కృపాణక్షతగాత్రుండై యతఁడు జయసింహునిచేఁ బంధితుఁడు కాఁబడియెను. జయసింహుఁడా వీరుని తనశిబిరమునకుఁ గొనిపోయి యతనినిఁ జాలగ సమ్మానించెను. జయసింహుఁడు ఖానునకెన్ని శుశ్రూషలు గావించినను యతఁడు వ్యాధిముక్తుఁడు గాలేదు. రహమత్ఖాను జయసింహుని శిబిరమందే మృతుఁడయ్యెను.

ఖానుమరణించుటకుఁ బూర్వదినమున జయసింహుఁ డతనితో నిట్లనెను. "ఖానుసాహెబూ ! తమరింక నెక్కుడుకాలము జీవింపఁజాలరు. నా సర్వయత్నములును చికిత్సయు వృథలయ్యెను, యిప్పుడు మీ కెట్టియుద్దంకియు లేకున్నచో మిమ్మును నేనొక విశేషమడుగ నిచ్ఛగించుచుంటిని"

రహమత్ఖానిట్లనెను "మరణించెదనను విచారము నాకేమియు లేదు. కాని మీరు నాశత్రువులై యుండియు దయాపురస్సరముగ నాకొనరించిన సపర్యలకుఁదగుప్రత్యుపకారముఁ గావింపనేరనైతినని

మాత్రము విచారించుచుంటిని. మీరేమడుగ నిచ్ఛగించుచుండిరో యడుగుఁడు. మీకడ నేఁజెప్పరాని దేమియు లేదు"

జయసింహుఁడు—రుద్రమండల దుర్గాక్రమణమునకుఁ బూర్వము శివాజీయొక్క సైనికుఁడొకఁడు మీకతఁడు మహారాష్ట్రులయాగమన వార్తఁ దెలిపెను గదా. అతఁ డెవరో మే మెఱుఁగము. నిర్దోషియొకఁ డన్యాయముగ దండింపఁబడెనని తోఁచెడిని.

రహమత్ఖాను—నాగ్రీవమున నసువులున్నంతవఱకు నావ్యక్తి నామమును వ్యక్తీకరించనని ప్రతిజ్ఞఁగావించితిని. రసపుత్రవీరా మీరు నూపిన భద్రాచరణమునకు నేను మిగులఁ గృతజ్ఞుఁడనై యుండవలయు. కాని పఠానుఁడు ప్రతిజ్ఞను లంఘన మొనరింపనేరఁడు.

జయసింహుఁడు—యోధా ! ప్రతిజ్ఞా భంగముఁగావింపుఁడని నేను బలుకుచుంటలేదు. కాని యేమైన నిదర్శనమున్నచో దాని నాకొసఁగుట కేమైన నభ్యంతరమున్నదా ?

ఖాను—ఆనిదర్శనమును నామృత్యువునకుఁ బూర్వము జూడనని ప్రతిజ్ఞఁ గావింపుఁడు.

జయసింహుఁ డట్లే ప్రతిజ్ఞఁగావించెను. అపుడు రహమత్ ఖానతనికిఁ గొన్ని కాగితముల నొసఁగెను. ఖానుమరణించిన పిదప జయసింహుఁ డాపత్రములనన్నిఁటిఁ జదివి, విద్రోహిచంద్రారావని యెఱిఁగెను.

చంద్రారావు రహమత్ ఖానునకు స్వహస్తలిఖితపత్రముల నంపియుండెను. జయసింహుఁడు వానినన్నిఁటినిఁ జదివెను. ఆసంబంధమున నున్న యన్యాన్యపత్రములను కూడ నతఁడు గాంచెను. చంద్రారావు పఠానులనుండి పొందిన పారితోషికముల కతఁడు గావించిన ప్రాప్తిస్వీకారమును దెలుపు లేఖలనుకూడ జయసింహుఁడు జూచెను. జయసింహుఁడు మృతినొందిన దినమున నతని మంత్రి ఆపత్రముల నన్నిఁటిని శివాజీ కొసఁగెను.

విచార కార్యమున కధికసమయమవశ్యకము గాలేదు. శివాజీయొక్క చిరవిశ్వస్తమంత్రియైన రఘునాథన్యాయశాస్త్రి వరుసగ నాలేఖలన్నిఁటినిఁ జదువఁదొడంగెను. చదువుట ముగియగానే రోషముచే వాహినీపతులందఱు గర్జన మొనరింపసాగిరి. చంద్రారావే విద్రోహియనియు, స్వయముగ నతఁడు శత్రువులకు వార్తఁదెలిపి పారితోషికములను గ్రహించెననియు, నిర్దోషి నిష్కళంకశూరుఁడైన రఘునాథునకు మరణదండనవిధింపఁజేయ నతఁడు యత్నించెననియు నందఱు వినిరోషావేశులై హుంకార మొనరింపఁ దొడంగిరి.

కోపోద్దీపితుఁడై శివాజీ యపు డిట్లనెను "పాపచారీ ! విద్రోహీ ! నీమృత్యువు సన్నికటమయ్యెను. నీవు చెప్పుకొనవలయున దేమైన నున్నదా ?"

మృత్యుసమయమందుఁ గూడఁ జంద్రారావు నిర్భీకుఁడైయుండెను. అతని దుర్దమనీయ దర్పాభిమానము లిపుడు కూడఁ బూర్వమట్లే యుండెను. భయరహితుఁడై శివాజీ కతఁడిట్లుత్తరువొసఁగెను "నేనికఁ జెప్పవలయున దేమున్నది? మీవిచారశక్తి ప్రసిద్ధమైనది. ఒకప్పుడీదోషమువలననే రఘునాథుని దండించితిరి; నేఁడీదోషమును నాపైమోపుచుండిరి; నేను మరణించిన వెనుక మఱియొకదినమున మఱియొకపురుషు నిశిక్షించెదరు; అపుడీవిషయమునఁ జంద్రారావు బిందువిసర్గమైనను నెఱుఁగడని మీరెఱుఁగఁగలరు. ఇదంతయుఁ బ్రమాణజాలము"

ఈవిద్రూపముచే శివాజీ మర్మాంతిక క్రుద్ధుఁడై యిట్లాదేశ మొసఁగెను—"తలవరీ ! చంద్రారావుకరముల రెంటిని ఛేదించివైచుము. అటులొనర్చినచో నీకులట యిక లంచములనుఁ గొనఁజాలఁ

డు. పిమ్మట తప్తలోహముతో నతని లలాటమున "విశ్వాసఘాతుకుఁ"డని యంకిత మొనర్పుము. అటులఁ గావించినచో నీవంచకు నేరును విశ్వసింపరు.

ఉరితీయు తలవరి యీనృశంసయీ దేశమును పాలన మొనరింపఁ జంద్రారావుకు సమీపించెను. అట్టితరి రఘునాథజీ లేచి నిలువంబడి యిట్లనెను;—

"మహారాజా! నేనొనరింపవలయు నివేదన మొకటి యున్నది."

శివాజీ—రఘునాథా! ఈవిషయమున నీ నివేదనము మే మవశ్యముగ వినెదము; ఏలనన నీపామరుఁడే నిన్ను హత మొనరింప యత్నించెను; అందులకే వట్టి ప్రతిహింసఁ గావింప నిచ్ఛగించుచుంటివో నివేదన మొనరింపుము.

రఘునాథుఁడు—రాజేంద్రుని యంగీకార మలంఘ్యము. చంద్రారావుయొక్క కేశాగ్రమునైననే రును స్పృశింపకుండ నుండవలయునని యే నేఁగోరు ప్రతిహింస—అనుగ్రహించి యతనిని దండింపకయే విడిచిపుచ్చుఁడు.

సభాసదులందఱు విస్మితులైరి—ఎల్లరును స్తబ్ధులైపోయిరి.

శివాజీ క్రోధమును సంవరణ మొనరించుకొని యిట్లనెను. "నీ యెడ నతఁడు గావించిన దోషమునకు, నీకోరిక చొప్పున వానిని మన్నించితిని. రాజవిద్రోహాచరణశాస్తి నొసంగుయధికారి తేఁకు. ఆదోషకతమున నే నేనీ యాదేశ మొసఁగితిని. తలవరీ! నీపనిని నీవు గావింపుము"

రఘునాథుఁడు—దేవర విచార మనిందనీయము; కాని. ఈ దాసుఁడు ప్రభునికటమున భిక్షఁగోరుచుండెను, చంద్రారావును దండింపక విడచివైచుఁడు,

శివాజీ—ఈభిక్షా దాన మొసఁగ నేనసమర్థుఁడను. రఘునాథా! నిన్నీ మాఱు మన్నించితిని. అన్యులనిట్లు క్షమింపకుండుదును. శివాజీ యాదేశమునకుఁ బ్రతిఘటనముఁ జూపకుము.

రఘునాథుఁడు—ప్రభూ!! ఒకటి రెండు సమరములం దీదాసుఁడు ప్రభుకార్య మొసరింపసమర్థుఁడయ్యెను. దేవరకూడ దాసునకభిలాషిత పురస్కార మొసఁగ స్వీకృతులైరి. నేఁడా పురస్కారమునే యనురోధించుచుంటిని. వినాదండనమునఁ జంద్రారావును విడిచిపుచ్చుఁడు.

రోషముచే శివాజీ నయనములనుండి యగ్నికణములు బహిర్గతములగుచుండెను; మృగేంద్రునిక్రైవడి గర్జించి యతండిట్లనెను. "రఘునాథుఁడా! రఘునాథుఁడా! అప్పుడపుడు మాకుపకార మొనరించితివని నేఁడు మావిచారము నన్యథాఁ గావింపఁదలంచుచుంటివా? లేని యాదేశమన్యథా గానేరదు; నీవుకూడ నీవీరత్వ విశేషముల నీవేదెలువ నివృత్తుఁడవు కమ్ము"

ఈ తిరస్కారవచనములు వినఁగనే రఘునాథుని ముఖమరక్తమైపోయెను. అతఁడు కరములఁజోడించి కంపితస్వరమున మెల్లగ నిట్లనెను, "ప్రభూ! పురస్కారమును గోరుట యీదాసుని యభ్యాసము కాదు. నాజీవనమధ్యమున నేఁడే ప్రథమపర్యాయ పురస్కారమును వేఁడితిని. దేవర యీపురస్కారదాన మొసఁగ సమ్మతులైనచో యీదాసుఁడు ద్వితీయపర్యాయము దానిని కోరఁడు. ప్రభులు సదయులై యతనిని రక్షించెదరనియే యీదాసుఁడు వేఁడు భిక్ష, రఘునాథుఁడు సైనికవ్రతమునుత్యజించి, మరల జోగియై సీమసీమలందును. భిక్షాశన మొనరించుచుఁ గాలముఁ బుచ్చును"

శివాజీ క్షణకాలము నిస్తబ్ధుఁడై యుండెను—అతఁడు నిష్పందుఁడై యట్టులే నిలువంబడిపోయెను. అపు డమాత్యుఁడొకఁడు శివాజీని సమీపించి, చంద్రారావు రఘునాధుని భగినీపతియనియు, దానిం జేసియే యతఁడు భగనీపతి ప్రాణభిక్ష వేఁడుచుండెననియు మెల్లగ నతని కర్ణములందుఁ దెలిపెను.

శివాజీ యపుడు విస్మయపూర్ణుఁడై చంద్రారావును వదలివైమమని తలవరి కాదేశ మొసఁగి, చంద్రారావును విలోకించి వజ్రనాదమున నిట్లనెను. "చంద్రారావూ! యిటనుండి వెడలిపొమ్ము. శివాజీ రాష్ట్రమునుండి బహిష్కృతుఁడవు గమ్ము. అన్యదేశమునకుఁ బొమ్ము, అన్యాత్మీయకుటుంబుని వధింపుము; అన్యమిత్రుని సర్వనాశసాధన మొనరింపుము, శత్రునికటమున సుతోత్కోచముల గ్రహించుచు షడ్యంత్ర విద్రోహాచరణములను గావించుచు నీపాపజీవనావశిష్టభాగమును సమాప్త మొనరింపుము."

చంద్రారావు భీరుఁడు కాఁడు. క్రోధజర్జరిత శరీరుఁడై మెల్లగ నతఁడు రఘునాధజీ నికటమునకరిగి యిట్లనెను,—"బాలకా! నీకృపను నేఁగోరను, నీవొసఁగు జీవనమును నేను తుచ్ఛమని దలఁచెదను!" పరక్షణమందే యొరనుండి తన నిశితకరవాలములను వెరికి, దానిని నిజవక్షస్స్థలమున గ్రుచ్చుకొని, ఆయభిమాని యాభీషణ ప్రతిజ్ఞుఁడు—చంద్రారావు తన చిరనిష్కృతి సాధనమును గావించుకొనియెను! జీవశూన్యకాయము సభాస్థలమునఁ బతితమయ్యెను,

ముప్పది యైదవ ప్రకరణము.

భగినీభ్రాతలు

మన యాఖ్యాయిక శేషించెను; మాపొత్తమందు దెలిపిన వ్యక్తులఁగూర్చి యొకించుక దెలిపి మేము సెలవుఁగొనెదము.

వృద్ధుఁడైన జనార్దనుఁడు తనయునిఁగానక చాలకాలమువాత్తదుని చాడ్వానమండి మరలఁ బ్రియంవదను గాంచి, యానందబాష్పముల రాల్చుచుండెను. పులకితహృదయుఁడై యతఁడు రఘునాధునాహ్వానించి సానందమున నొక శుభదినమున నతనికిఁ గన్యాదాన మొనరించెను, ప్రియంవద సుఖము నేరువర్ణింపఁగలరు? విరామము లేక నాలుఁగు వత్సరము లేసుందరునిఁ గూర్చి తప మొనరించెనో, యతఁడామెను తన వక్షమునఁ జేర్చి యామె యోష్ఠమునఁ దనయుష్ణయోష్ఠమును స్థాపన మొనరించినపుడు, ప్రియంవద యున్మాదిని యైపోయెను.

ఇఁక రఘునాధుఁడో—రఘునాధుఁడు తోరణదుర్గమునఁ గాంచిన స్వప్నము సార్థకమయ్యెను. ఆప్రియకంఠమాలచే వలుమరతఁడు ప్రియంవద హృదయము నలంకరింపఁ జేసెను. ఆపుష్పవినిందితకాయమును తన హృదయమునఁ జేర్చి వైచెను; ఆవిశాలప్రేమపూర్ణనయనముల ననిమేషలోచనుఁడై గాంచి జగమును మఱచిపోయెను.

ప్రియంవద తన సప్తమవర్షీయ "సోదరిని" మఱువలేదు, రఘునాధజీయనురోధమున శివాజీ గోకర్ణునకొక జాగీరును దాన మొనరించి, అతని తనయుఁడైన భీమజీనున్నితుఁగావించి సేనానిపదమున నియుక్తుఁ జేసెను.

ప్రియంవద "చెల్లెలిని" సర్వదా తన నిలయమందే యుండఁ జేసి నాధునితో "సమానముగ" నామెను బ్రేమించుచు, గతిపయవ

త్సరానంతరమున నొక సద్వంశీయసుచారిత్రపాత్రిన కామె నెసఁగి పరిణయ మొనరించెను. వివాహదివసమునఁ బ్రియంవద రఘునాథులిరువురు గోకర్ణుని నిలయమం దుండిరి. ప్రియంవద తెఱవుఁజూచి పెండ్లికుమరిత కర్ణములందిట్లు మెల్లఁగ ననెను—"చూడు చెల్లీ! నీవు పలికినదానిని మఱువకుము. నీప్రియునికంటె నన్నెక్కుడుగఁ బ్రేమించవలెనుజుమీ!"

ఆఖ్యాయిక వివృతననుయానంతరమున పదమూఁడువత్సరములవఱకు రఘునాథజీ సుఖ్యాతిసమ్మానములసహితముగ శివాజీ యధీనమునఁ గార్యము సలిపెను. రఘునాథుఁడు తనప్రియానుచరుఁడైన గజపతిసింహునిపుత్రుఁడని యెఱిఁగి యశవంతసింహుఁడతనిని స్వసీమకాహ్వానించెను. కాని శివాజీ రఘునాథుని స్వప్రదేశమునకుఁ బోనీయక తాను సజీవుఁడై యున్నంతదనుక నతనిని తన నికటమందే యుంచుకొనియెను. తదనంతరమున 1680 సంవత్సరమునఁ జైత్రమాసమున శివాజీ కాల ధర్మము నొందఁగనే యతనియయోగ్యతనయుఁడు శంభుజీ జనకునిపురాతనభృత్యుల నొక్కరొక్కరి నవమానించి, గారారుద్ధులఁగావింపఁ దొడంగెను. ఇఁక మహారాష్ట్రమున నుండుప్రయోజనము లేదని యెఱిఁగి రఘునాథజీ ప్రియంవదజనార్దనుల వెంటఁగొని స్వదేశమునకు మగుడిచనియెను. సూర్యమహాలు పురాతనదుర్గమునఁ దిలకసింహుని ప్రపౌత్రుఁడు ప్రవేశించెను.

పాఠకులారా! ఇచటనుండియే మీయొద్ద సెలవుగైకొనిపోవ నిచ్ఛగించుచుంటిమి; కాని మఱియొకరి వృత్తాంతమును మీకెఱింగింపవలయును. శాంత, చిరసహిష్ణు, లక్ష్మీరూపిణిలక్ష్మీబాయినిఁ గూర్చి మీకించుక దెలుపవలయును.

ఏ దినమునఁ బంద్రారావాత్మహత్యఁగావించుకొనియెనో, యా దినమందే రఘునాథుఁడు సోదరిని వీక్షింప నామె నిలయమున కరిగె

ను. సహోదరిని చూడఁగనే యతని హృదయము స్తంభితమైపోయెను. ఆలులాయితకేశయై లక్ష్మీబాయి శవపార్శ్వమునఁబడి పొరలుచుఁ దన మోహాంపుపతి చిరనిద్రితుఁడై యున్నను యతనినిఁ బల్కరించుచు, హృదయవిదారకార్తనాదమున నిలయమును ముఖరిత మొనరించుచుండెను. పతిమరణించుతరిహిందూరమణు లనుభవించు భీషణయాతనము నెవరు వర్ణింపఁగలరు? నేఁడు లక్ష్మీబాయియొక్క నయనాలోకము నిర్వాణమైపోయెను; హృదయము శూన్యమైపోయెను; జగమంధకారమయమైపోయెను. శోకవిషాదనైరాశ్యపవవైధవ్యయసహ్యయాతనముచే నావితంతువు నుడువరాని తెఱంగున నార్తనాద మొనరించుచుండెను.

రఘునాథుఁడు సాంత్వన మొనరింపఁ బ్రయత్నించెను; సాంత్వనము నటుండనిండు, లక్ష్మీ తనయనుంగు సోదరుని గుర్తింపఁజాలకపోయెను. దుర్భరదుఃఖముచే నశ్రుధారల రాల్చుచు రఘునాథుఁడు గృహమునుండి నిష్క్రాంతుఁడయ్యెను.

సంధ్యాసమయమున మరల సోదరినిఁజూడ రఘునాథుఁడచటికరుదెంచెను. లక్ష్మీయొక్క భావపరివర్తనమును గాంచి యతఁడొకించుక విస్మితుఁడయ్యెను. ఆమె నయనములం దశ్రువులు లేవు. మెల్ల మెల్లగ నామె పతిమృతదేహమును సుందర సుగంధ పుష్పములతో నలంకరించుచుండెను. బాలిక యొకర్తుక యెట్లు మనోనివేశపురస్సరముగఁ దన పుత్తలిని (ఆటవస్తువును) యలంకరించునో, లక్ష్మీబాయి యట్లే భర్తృమృతకాయము నలంకరించుచుండెను.

రఘునాథుఁడు నిలయమందుఁ బ్రవేశించెను; లక్ష్మీ మెల్లమెల్లగ సోదరుని నికటమున కరుదెంచెను. శబ్దమైనచో నాథునకు నిద్రాభంగమగునని తలఁచి కాఁబోలు నామె

యతిమృదు విశేషమున నతనిని సమీపించెను. సోదరునుద్దేశించి యామె యిట్లనెను."సోదరా! రఘునాథా! నిన్ను మరల వీక్షింపఁగలిఁగి నేను పరమభాగ్యవతి నైతిని. ఇపుడిఁక నామనమున నెట్టికష్టమును లేదు.

సాశ్రునయనుండై రఘునాథుఁడిట్లనెను. "అనుంగుసోదరీ, లక్ష్మీ! ఈసమయమున నిన్ను నేను గాంచక నుండఁగలుఁగుదునా?"

అంచలిఁగో రఘునాథుని నయనములనుండి బాష్పవారినిమోచనమొనరించి లక్ష్మియిట్లనెను. "సోదరా! నీవు పలికినది నిజమే. నీవు దయామయుఁడవు; నీవు హృదయేశ్వరునినిమిత్తమై తేనినికటమునఁ గావించిన యావేదనవిషయమును వింటిని. నానొసట నెట్లులిఖించి యుండెనో యట్లేయయ్యెను. జగదీశ్వరుఁడు నీకు సుఖమొనర్పుఁగాక."

రఘునాథుఁడు—లక్ష్మీ! నీవుబుద్ధిమతివని నేనెపుడును యెఱుంగుదును; ఈ యసహ్యాశోకము నొకించుక సంవరణమొనరించియుంటఁజూచి నేనుతుష్టుఁడ నైతిని. మనుష్యజీవనము శోకమయమైనది. నీకపాలమందేమియుండెనో యదిఘటించెను. సహిష్ణురాలవై యాశోకమును వహింపుము. రమ్ము, నాగృహమునకురమ్ము. సోదరుని ప్రణయప్రయత్నములు సంతసమును జేయఁగలుఁగుచో లక్ష్మి నేనొకించుకైనను వెనుదీయను.

లక్ష్మిబాయి యొకించుకనవ్వెను. ఆహాసనమునుఁగాంచినత్రోడనేరఘునాథుని ప్రాణములు నిలువున నెగిరిపోయెను. ఆరమణి సోదరునుద్దేశించి యిట్లనెను. "అనుజా! నీవు కృపామయుఁడవు. కాని లక్ష్మిని జగదీశ్వరుఁడే స్వయముగ సాంత్వనమొనరించెను; శాంతిపథమును జూపెను; ఆపుణ్యమూర్తి జీవనదశయందీదాసీ నెక్కుడుగ ప్రేమించుచుండెడివారు. దాసీసదా యాయన ప్రణయినియై యుండెను. మరణమందుగూడ వారిసంగిణియైయుండును."

రఘునాథుని మస్తకమున వజ్రాఘాతమయ్యెను. అపుడతఁడు లక్ష్మియొక్క భావపరివర్తనకారణమును గ్రహించెను. సోదరియొక్క శాంతభావహేతువును గ్రహించెను. లక్ష్మిబాయి సహమరణమొనరింప స్థిరసంకల్పయయ్యెను.

అప్పుడురఘునాథుఁడు చాలసేపటివఱకు సోదరి ప్రతిజ్ఞనుభంగమొనరింపఁ బ్రయత్నించెను. ఆమెకెన్నియో నీతులబోధించెను; ఎంతయో వెట్టునఁగ్రిందనమొనరించెను; రాత్రి ఝామగుపర్యంత మతఁడు సోదరితో వాదించెను. ధీరశాంతలక్ష్మి యొక్కటియే యుత్తరువిచ్చుచుండెను. "హృదయేశ్వరుఁడు నన్నెక్కుడుగఁ బ్రేమించుచుండువారు. నేను వారిని విడచియుండఁజాలను."

సజలనయనుఁడై రఘునాథుఁ డవశేషమునసిట్లనెను; "లక్ష్మీ! ఒకప్పుడు నాజీవనము నైరాశ్యపూర్ణమై యుండెను. జీవనత్యాగమొనరింప నేనుసంకల్పించుకొంటిని. సోదరీ! నీప్రబోధకతమున, నీప్రేమమయపలుకులకతన నేనాసంకల్పమును వదలివైచి, మరలఁ గార్యజగతియందుఁ బ్రవేశించితిని; లక్ష్మీ! నీవు సోదరుని వచనములు పాటింపవా? నీవు నీయనుజుఁ బ్రేమింపవా?"

పూర్వమువగిదినే శాంతభావమున లక్ష్మిబాయి యిట్లుత్తరువొసగెను; "సోదరా! నేనావిషయమును మఱువలేదు, నీవు లక్ష్మిని బ్రేమించుచుంటివి, లక్ష్మిపలుకులనాలించితివి, నేను దానిని మఱచియుండలేదు, కాని భావించిచూడుము; పురుషునకనేకయాశలున్నవి; అనేకయుద్యమములు ననేకయవలంబనములున్నవి, ఒకటిపోయిన మఱియొకటినిలచును. ఒకయత్నము నిష్ఫలమైనచో రెండవది సఫలమగును. సోదరా! నీవాదినమున సోదరివచనముల నాలించితివి. నేఁడు నీకళంకము దూరీభూతమైపోయెను; తుమతవృద్ధియయ్యెను;సుయశము

దేశదేశాంతరములందు విస్తృతమయ్యెను. కానిఅభాగినినైన నా కేమున్నది? నేను నేఁడు గోల్పోయిన మణిని నాజీవనమున మరలఁబొందఁగలనా? ఏమహాత్ముఁడు దాసి నింత ప్రేమించెనో, యింతయనుగ్రహించెనో వారిని సజీవురాలనై యుండిమరలఁ బొంద నేర్తునా? సోదరా! నీవు లక్ష్మిని బాల్యకాలమునుండి యెక్కుడుగఁ బ్రేమించితివి. నేఁడు సదయుఁడవుగమ్ము. లక్ష్మియొక్క యొకేమాత్రపు సుఖపథమునఁ గంటకముగాకుము. ఏమహాపురుషుఁ డీదాసి నింత ప్రేమించెనో వారి వెంట నన్నుఁబోనిమ్ము."

రఘునాథుఁడు నిరస్తుఁడైపోయెను; ప్రేమమయి సోదరి యాంచలమున ముఖమును మూసివైచి, యతఁడు బాలునిచాడ్పున రోదనమొనరింపసాగెను; ఈయసారకపటసంసారమున భగినీభ్రాతల ప్రణయమువగిది పవిత్రస్నిగ్ధప్రణయ మింకేమున్నది? వాత్సల్యమయిభగినిభంగి యమూల్యరత్నమీ విస్తీర్ణజగతియందిఁక నెచటకరిగినఁ బొందఁగలుఁగుదుము?

రజనీద్విప్రహర సమయమునఁ జితిప్రస్తుతమయ్యెను; చంద్రారావుయొక్క మృతకాయము దానిపై నుంపఁబడెను. హాస్యవదనయైన లక్ష్మీబాయి సుందరపట్టువసనమును ధరించుకొని, విచిత్రభూషణాలంకృతయై యొకరివెనుక నొకరిచొప్పున నందఱియొద్దనుండి సెలవుఁగైకొనియెను.

లక్ష్మీబాయి చితిపార్శ్వమునకరుదెంచి దాసీజనులకలంకార రత్నముక్తాహారముల వితరణమొనరించి, స్వహస్తములతో వారలనయనజలమును మోచనమొనరించి, మధురవచనములతో వారలకూరటఁగలుఁగఁ జేయుచుండెను. జ్ఞాతికుటుంబినుల నికటమున సెలవుఁగొని గురుల పదరజమును నుత్తమాంగమునదాల్చెను. అందఱినయనముల నుండియు బాష్పవారిని నిజాంచలిచే మోచనమొనరించి మధుమయవచనములచే నందఱకుఁ బ్రబోధ మొనఁగెను.

శేషమున లక్ష్మి రఘునాథుని నికటమునకరుదెంచియిట్లనెను. 'అన్నా! బాల్యకాలమునుండియు నీవులక్ష్మి నెక్కుడుగఁ బ్రేమించుచుంటివి. నేఁడు లక్ష్మి భాగ్యవతియగును-చిరసుఖినియగును. నీకటాక్షమును యిపుడునాపైఁ బ్రసరింపఁజేయుము. వాత్సల్యపురస్సరముగ నీచెల్లెలకు సెలవొసంగుము. నీలక్ష్మికి సెలవిమ్ము."

రఘునాథుఁడిఁక సహింపఁజాలకపోయెను; అతఁడు సోదరి కరద్వయమును బట్టికొని బాలునివడువుననుచ్చైస్స్వరమున రోదనమొనరింపసాగెను. లక్ష్మినేత్రములనుండి బాష్పవారి బాఱఁజొచ్చెను.

ప్రేమపురస్సరముగ సోదరుని నయనములఁ దుడిచి లక్ష్మీబాయి యిట్లుపలుకఁదొడఁగెను; "ఛీఅన్నా! శుభకార్యసమయమున గంటతడిపెట్టెదవేల? నీవు సాహసమునందును, మహాంతఃకరణమునందును జనకునిఁబోలితివి. జగదీశ్వరుఁడు నీయశమునింకను వృద్ధిపఱచుఁగాక. జగమంతయునీకీర్తిచంద్రికలచే వెలుఁగుఁగాక! సర్వేశ్వరుఁడు రఘునాథుని చిరసుఖుఁగావింపవలెనని యే లక్ష్మి గోరుయంత్యకామనము! అన్నా! సెలవొసఁగుము; దాసికొఱకై పతియపేక్షించుచుండెను."

కాతరస్వరమున రఘునాథుఁడిట్లనియెను; లక్ష్మీ! నీవులేనిచో పృథివి తుచ్ఛమగును. జగమందిఁక రఘునాథునకేమున్నది? లక్ష్మీ' నాబహిఃప్రాణమా! నీకేనెట్లు సెలవొసంగను? నిన్ను విడిచి నేనెట్లు బ్రదుకఁగలను?" ఆర్తనాదమొనరించి రఘునాథుఁడు భూమీతలమునఁ బతితుఁడయ్యెను.

చాలయత్నమునలిపి లక్ష్మి యన్నను లేవఁదీసి మరల నతని యశ్రుతోయమును దుడిచివైచి, చాలపఱకతని కూరటఁ గొలిపి, యెన్నియోనీతుల నతనికి బోధించి యిట్లనెను, "భ్రాతా! నీవు వీరశ్రేష్ఠుఁడవు. పురుషునకేదిధర్మమో దానిని నీవుపాలించుచుంటివి. నీలక్ష్మిని

నారీధర్మమును పాలనఁగావింపుము. ఇఁక విలంబమాచరింపకుము. అభ్యంతరముఁ గలుగఁజేయకుము. అదేచూడుము. పూర్వదిక్కున నభము రుధిరరాగమును ధరించెను. నీచెల్లెలికి సెలవొసంగుము"

గద్గదస్వరమున రఘునాథజీ యిట్లనెను, లక్ష్మీ ! నాయనుంగు సోదరీ! ఈజగమందు నీకు సెలవొసంగితిని ; ఈ యాకసమందీ పుణ్యధామమందు మఱియొకమాఱు నిన్ను నేను గనఁగొనియెదను. అంతదనుక జీవన్మృతుఁడనై యుండెదను"

భ్రాతృచరణధూళిని శిరమునఁదాల్చి లక్ష్మీబాయి చితాపార్శ్వమునకరిగెను. తోడనే భర్తృపదద్వంద్వమును నిజోత్తమాంగమున నిడికొని యారసపుత్రిరమణి యిట్లనెను "హృదయేశ్వరా! జీవనమందీవు నన్నెంతయో ప్రేమించితివి. నీపదప్రాంతమున నుపవిష్టనై నీకొనువెంట నరుదెంచుట కిపుడు నన్ననుగ్రహింపుము. జన్మజన్మములంగ నీవేనన్ను వరింతువుగాక! నీవేనాకు జీవితేశ్వరుఁడ వగుదువుగాక. జన్మజన్మములందు లక్ష్మి నీపదసేవఁ గావింపఁగలుఁగుగాక!"

మెల్లమెల్లగ లక్ష్మీబాయి చితారోహణమొనరించి, పతిపదప్రాంతమున నుపవసించి, చరణద్వయమును భక్తిభావమున నిజాంకమున నిడికొని నేత్రముల ముద్రితమొనరించెను; ఆముహూర్తమందే యావీరరమణి యాత్మస్వర్గమును బ్రవేశించినట్లయ్యెను.

అగ్నిజ్వాలించెను, ఘృతమెక్కుడుగ నుంటంజేసి శీఘ్రమాయనలము ధూమాఘాశబ్దమొనరించుచు జాజ్వల్యమానమొనరించెను. ప్రథమమున హుతాశనజిహ్వ యాపరమపతివ్రత పవిత్రతనులతను లేహనమొనరింపసాగెను. నిమేషములో సతేజమున నదినలువైపులను వేష్టనమొనరించి లక్ష్మీబాయి మస్తకోపరిభాగమున నధిష్ఠించెను. నైశగగనమువైపుగ మహాశబ్దము ధావమానమయ్యెను. ఆతేజమయియుంగ మొకటియైనఁ గదలలేదు, కేశమొకటియైనఁ గంపితముగాలేదు.

సంపూర్ణము.

END OF
TITLE